
రామాయణం

# రామాయణ విశేషాలు



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్చంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్ధికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

**http://www.new.dli.ernet.in**



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# రామాయణ విశేషము

❖

రచయిత :

కీ. శే. శ్రీ సురవరం ప్రతాపరెడ్డిగారు

❖

ప్రచురణ :

ఆంధ్రరచయితల సంఘం, హైద్రాబాదు.

# విషయానుక్రమణిక

## ౧

పుటసంఖ్య

౧. రామాయణము–ఇలియడ్ పురాణము ... ౧
౨. చ్యవన రామాయణము ... ౪
౩. భృగు వెవ్వరు ... ౭
౪. వాల్మీకి యెవరు ... ౮
౫. రామాయణ ప్రాశస్త్యము ... ౧౨
౬. ఇలియడ్ పురాణము ... ౧౫
౭. హోమరు కాలము ... ౧౮
౮. దేశి విదేశీ పురాణాలు ... ౨౪

## ౨

౧. వివిధ రామాయణకథలు ... ౨౬
౨. జైన రామాయణము ... ౨౬
౩. జైనకథ–రాక్షసవానరోత్పత్తి ... ౨౭
౪. రావణుని దిగ్విజయము ... ౩౦
౫. హనుమంతుని జన్మకథ ... ౩౧
౬. శ్రీరాముని జననము ... ౩౩
౭. సీతాపహరణము ... ౩౫
౮. సీతాన్వేషణము ... ౩౬
౯. యుద్ధకాండము ... ౩౬
౧౦. ముగింపు ... ౩౭

| | | | పుట సంఖ్య |
|---|---|---|---|
| ౧౧. | లఘువిమర్శ | ... | ౩౭ |
| ౧౨. | బౌద్ధజాతక రామకథ | ... | ౪౦ |
| ౧౩. | ఇతర రామకథలు | ... | ౪౩ |
| ౧౪. | కథాసరిత్సాగరము | ... | ౪౪ |

## ౩

| | | | |
|---|---|---|---|
| ౧. | రామవాల్మీకులకాలము | ... | ౪౬ |
| ౨. | మహాభారతకాలము | ... | ౫౧ |
| ౩. | ఇంద్రపూజా ప్రాముఖ్యము | ... | ౫౪ |
| ౪. | ఋగ్వేదములో రాముడు | ... | ౫౯ |
| ౫. | వాల్మీకి కాలము | ... | ౬౭ |
| ౬. | మార్గవిధానము | ... | ౬౮ |

## ౪

| | | | | |
|---|---|---|---|---|
| ౧. | ప్రక్షిప్తములు | — ౧ | ... | ౬౯ |
| ౨. | ,, | — ౨ | ... | ౭౦ |
| ౩. | ,, | — ౩ | ... | ౭౧ |
| ౪. | ,, | — ౪ | ... | ౭౩ |
| ౫. | ,, | — ౫ | ... | ౭౬ |
| ౬. | ప్రక్షిప్తములు | — ౬ | ... | ౭౮ |
| ౭. | ,, | — ౭ | ... | ౮౨ |
| ౮. | ,, | — ౮ | ... | ౮౩ |
| ౯. | ,, | — ౯ | ... | ౮౫ |
| ౧౦. | ,, | — ౧౦ | ... | ౮౭ |

పుట సంఖ్య

౫

| | | | |
|---|---|---|---|
| ౧. | ముఖ్య సంఘటనల కాలచర్చ | ... | ౮౯ |
| ౨. | రామ పట్టాభిషేకము | ... | ౯౩ |
| ౩. | సీతారాముల వివాహకాలము | ... | ౯౬ |
| ౪. | రాముని ప్రవాసకాలము | ... | ౧౦౨ |

౬

| | | | |
|---|---|---|---|
| ౧. | సాంఘికాచారములు | ... | ౧౦౯ |
| ౨. | వర్ణ వ్యవస్థ | ... | ౧౧౦ |
| ౩. | అనార్యులు | ... | ౧౧౨ |
| ౪. | నరమేధము | ... | ౧౧౬ |
| ౫. | అశ్వమేధము | ... | ౧౨౦ |
| ౬. | చండాలురు | ... | ౧౨౧ |
| ౭. | మాంసభోజనము | ... | ౧౨౩ |
| ౮. | ఇతరపాకములు | ... | ౧౩౨ |
| ౯. | స్త్రీల స్థానము | ... | ౧౩౩ |
| ౧౦. | కైకేయి | ... | ౧౩౫ |
| ౧౧. | బహుభార్యాత్వము | ... | ౧౪౦ |
| ౧౨. | అంతఃపురవాసము | ... | ౧౪౧ |
| ౧౩. | స్త్రీల వేదాధికారము | ... | ౧౪౩ |
| ౧౪. | స్త్రీల యితర సమస్యలు | ... | ౧౪౫ |
| ౧౫. | నావలు | ... | ౧౪౭ |
| ౧౬. | ఇతర విశ్వాసాలు | ... | ౧౪౯ |
| ౧౭. | నాస్తికులు | ... | ౧౫౮ |

| | | | |
|---|---|---|---|
| | | | పుట సంఖ్య |
| ౧౮. | ఏకవేణి | ... | ౧౬౧ |
| ౧౯. | వర్ణవ్యవస్థ | ... | ౧౬౧ |
| ౨౦. | యుద్ధతంత్రము | ... | ౧౬౨ |
| ౨౧. | ఆర్యుల సంస్కృతి | ... | ౧౭౧ |
| | **౭** | | |
| ౧. | రాజనీతి | ... | ౧౯౦ |
| | **౮** | | |
| ౧. | కవిత—గుణపోషణము | ... | ౨౧౨ |
| ౨. | గుణపోషణము | ... | ౨౨౨ |
| ౩. | శ్రీరాముడు | ... | ౨౨౩ |
| ౪. | లక్ష్మణుడు | ... | ౨౨౮ |
| ౫. | భరతుడు | ... | ౨౩౧ |
| ౬. | శత్రుఘ్నుడు | ... | ౨౩౨ |
| ౭. | కైకేయి | ... | ౨౩౨ |
| ౮. | సీత | ... | ౨౩౩ |
| ౯. | హనుమంతుడు | ... | ౨౩౪ |
| ౧౦. | విభీషణుడు | ... | ౨౩౬ |
| ౧౧. | దశరథుడు | ... | ౨౩౬ |
| ౧౨. | వసిష్ఠుడు | ... | ౨౩౭ |
| | **౯** | | |
| ౧. | వాల్మీకి భూగోళము | ... | ౨౪౧ |
| ౨. | పంచవటి యెచ్చటిది | ... | ౨౪౮ |

| | | పుట సంఖ్య |
|---|---|---|
| ౩. తూర్పుదిక్కు | ... | ౨౫౦ |
| ౪. దక్షిణ దిక్కు | ... | ౨౫౧ |
| ౫. పడమటి దిక్కు | ... | ౨౫౧ |
| ౬. ఉత్తర దిక్కు | ... | ౨౫౨ |
| ౭. విమర్శ | ... | ౨౫౩ |
| ౮. కిష్కింధ ఎచ్చట నున్నది | ... | ౨౬౫ |
| ౯. లంక యెచ్చట | ... | ౨౬౭ |
| ౧౦. ఆర్యావర్తమేది | ... | ౨౭౩ |
| **౧౦** | | |
| ౧. వానర రాక్షస తత్త్వము | ... | ౨౯౪ |
| ౨. వానరులెవరు | ... | ౨౯౬ |
| ౩. హనుమంతుని పెండ్లి | ... | ౩౦౨ |
| ౪. రాక్షసులెవరు | ... | ౩౦౭ |
| ౫. రావణుడు | ... | ౩౧౪ |
| ౬. రాక్షస వర్గములు | ... | ౩౧౬ |
| ౭. రాక్షసుల నాగరకత | ... | ౩౩౯ |
| **౧౧** | | |
| ౧. పరిశిష్టము | ... | ౩౪౩ |
| ౨. ముగింపు | ... | ౩౪౯ |

## ౧

రామాయణము-

ఇలియడ్ పురాణము

"వాల్మీకే ర్మునిసింహస్య కవితావనచారిణః
శృణ్వన్ రామకథానాదం కోనయాతి పరాంగతిమ్?"

శ్రీ మద్రామాయణ మహాకావ్యమును గురించినావంటి వాడు వ్రాయుట మహాసాహసమే! ఎందరో ప్రాచ్యపాశ్చాత్య పండితులు వాల్మీకి రచిత రామాయణ మహాకావ్యమును గురించి విపులముగా చర్చించియున్నారు. హిందువు లందరికిని శ్రీ మద్రామాయణముపై నుండునంతటిభక్తి ప్రేమాదరములు ప్రపంచములోని మరే గ్రంథముపైనను లేవు. వాల్మీకి రచితమగు గ్రంథము ఆదికావ్యము. రాముడన్ననో, సాక్షాద్విష్ణ్వవతార పురుషుడుగా హిందువులచే పూజింపబడునట్టి దేవుడు. హిందూ పండితులు నేటివరకును రామాయణములో అవతార తత్త్వమును, ఆధ్యాత్మికవిషయమును విశేషముగా చర్చించిరి. కాని యితరాంశములుకూడ తెలుసుకొనదగినవై యున్నవి.

రామాయణమును గురించి యాధ్యాత్మికపరముగాను, చారిత్రికముగాను రెండువిధములగు విమర్శన పద్ధతులు కన బడుచున్నవి. ఆధ్యాత్మికముగా పరిశీలించు మొదటి వర్గము వారికి రాముడు అవతార పురుషుడు, పురుషోత్తముడు. ఆత నిలో ఏలోపమునులేదు. అతడు సాక్షాద్విష్ణుభగవానుడే. సీతాదేవి అపరలక్ష్మీదేవియే. రామునిబంటు అయిన హను మంతుడును దేవుడే. అతని నెందరోకులదైవతముగాపూజించు చున్నారు. రామాయణము భక్తిప్రధానగ్రంథము. అందు వేదాంతరహస్యములున్నవని పండితులు పెద్ద పెద్ద వ్యాఖ్యలు వ్రాసినారు. ఇట్టిభావపరంపరలచే హిందువులు, అందుముఖ్య ముగా వైష్ణవులు, శ్రీమద్రామాయణమును పూజించువారై యున్నారు. రెండవ వర్గమువారు శ్రీరామచంద్రుని ఆదర్శ మహాపురుషునిగా స్వీకరించుచున్నారు. కేవలము చారిత్రిక దృష్టితోనే విమర్శించుచున్నారు. ఈ దృష్టితో చూచు వారు ఒకొక్కప్పుడు అస్తినాస్తి విచికిత్సలో తటపటా యించుచున్నారు. యథార్థముగా శ్రీరాముడు చారిత్రిక పురుషుడేనాయని సంశయించుచున్నారు. రామాయణమును ఒక ఆదర్శనీతిదాయకమగు కథగా కల్పించి యుండరాదా? అని వాదింతురు. కొందరు పాశ్చాత్య విమర్శకులు రామా యణకథ కల్పిత కథయని యభిప్రాయపడినారు. వెబర్ అను వాడిట్లు వ్రాసెను. "ఆర్యులు దక్షిణాపథమునుసింహళమును ఆక్రమించుకొన్న నిరూపకగాథ రామాయణము. రామా యణ పాత్రలన్నియుకల్పితములే. సీతయన నాగటిచాలు. నాగటిచాలు పూజను తెలుపునట్టిదీకథ."

జాకోబీ యిట్లు వ్రాసెను. "వేదములలోని వృత్రవధయే రామాయణమునకు మూలము. రాముడింద్రుడు. వృత్రుడు రావణుడు. వేదాలలో మరుత్తులు (గాడ్పులు) ఇంద్రుని మిత్రులు. ఇచ్చట గాడ్పుకొడుకు—హనుమంతుడు—రామునికి ముఖ్యుడు. సీత నాగటిచాలు. వృత్రుని చంపి మేఘాలనునాగటిచాళ్ళకు విడిపించినవాడు ఇంద్రుడు లేక రాముడు."

పర్గిటర్ రామాయణము యథార్థగాథ యని యభిప్రాయపడెను. "ప్రాచీనపు ఇతిహాసములను శ్రద్ధతో పరికించి శోధించిన తర్వాత వాటిని నిరాకరించు నాలోచన చేయరాదు. రాముని చరిత్ర దక్షిణాపథమందలి యార్యవిజృంభణమని చెప్పి అవలీలగా త్రోసివేయరాదు" అని యతడనెను.

నా అభిప్రాయములో శ్రీరాముడు కల్పిత పురుషుడనుటకు ప్రబలాధారములు కానరావు. రామాయణములోని ప్రధానఘట్టములు జరిగినవనియే విశ్వసింప వీలుకలదు. రాముని ఉత్తమోత్తమ గుణసంపదనుబట్టి హిందువులతనిని దేవునిగా పూజించుచున్నారు. అందుచేత అతని చరిత్రకు సంబంధించిన విషయాలను మానవాతీతములైనవిగా వర్ణించి పెంచి వ్రాసినారు. చారిత్రిక పద్ధతిపై విపులముగా విమర్శ చేసిన గ్రంథాలు తక్కువగానున్నవి. అందుచేత ఈ గ్రంథరచన అవసరమయ్యెను.

ప్రధాన విషయములోనికి ప్రవేశించుటకు పూర్వమొక్క యంశాన్ని గూర్చి చెప్పవలసియున్నది. రామాయణములు చాలా యున్నవి. సంస్కృతములో వాల్మీకి రామాయణము తర్వాత రామచరిత్రమును మహాభారతములోను, భాగవతములోను, విష్ణుపురాణములోను, వాయు పురాణములోను వ్రాసియున్నారు. కాళిదాసాదులు శ్రీరాముని గురించిన కావ్యనాటకములను వ్రాసిరి. భారతీయ భాషలలో అనేక రామాయణములు రచింపబడెను. తులసీదాసు రామాయణము హిందీభాషకు మకుటాయమానము. కంబ రామాయణము అరవములో అగ్రస్థానముహించినట్టిది. తెలుగులో భాస్కరుడు, గోనబుద్ధుడు, మొల్ల, గోపీనాథమువారు, వావిలికొలనువారు మున్నగు పలువురు వ్రాసిరి. నేటికిని ప్రతిభాషలో రామాయణమునుభక్తులుతమశక్తికొలది వచనములోనుపాటలలోను పద్యాలలోను నానావిధాలుగా రచించుచున్నారు. వీనికన్నిటికిని మూలము వాల్మీకి రామాయణమే. అయితే వాల్మీకికంటెముందుగా మరొకరెవరైనా రామచరిత్రమును వ్రాసితా? అని విచారించిన చ్యవనుడు అనునతడు రచించియుండెనని నందార్గికర్ పండితుడు క్రీ.శ.౧౮౯౭లో వ్రాసెను. దానికి మూలాధారము అశ్వఘోషుని బుద్ధచరితములోని యొకశ్లోకభాగము. అశ్వఘోషుడు కాళిదాసుకంటె పూర్వుడనియు, కొంచెము తర్వాతి వాడనియు, క్రీస్తుశకారంభము వాడనియు క్రీస్తుశకములో ఆరవశతాబ్దమువాడనియుచర్చలు

కలవు. అవి మనకిప్పుడు ప్రధానములు కావు. అశ్వఘోషు డిట్లు వ్రాసెను.

> వాల్మీకినాదశ్చ ససర్జ కావ్యం, జగ్రంథ యన్న చ్యవనో మహర్షిః
> చికిత్సితం యచ్చ చకార నాత్రిః, పశ్చాత్త దాత్రేయ ఋషి ర్జగాద.
>
> బుద్ధచరిత, ౧-౪౭.

"చ్యవనమహర్షి యేది రచింపజాలకపోయెనో అట్టి కావ్యాన్ని వాల్మీకి రచించెను. అత్రి యేవైద్యమును చేయ జాలకపోయెనో దానిని అతని కుమారుడగు ఆత్రేయుడు పూర్తిచేసెను." అని పై శ్లోకముయొక్క అర్థము. దీనిని బట్టి చ్యవనమహర్షి రామాయణమును బాగా రచింపజాలక యేదో యొక రీతిగా వ్రాసినదానిని వాల్మీకి సమగ్రముగా పెంచి వ్రాసినాడని కొందరు వాదింపవచ్చును. కాని యట్టి యర్థాని కవకాశములేదు. అశ్వఘోషు డీ శ్లోకాన్ని రచించిన పూర్వాపర సందర్భాలను గమనింపవలెను. బుద్ధుని తండ్రి చేయనిపనిని బుద్ధుడుచేసెను అను సంశాన్ని వర్ణించుచు అత్రిచేయలేని పనిని అతని కుమారుడగు ఆత్రేయుడు చేసెను. అట్లే చ్యవనుడు చేయనిపనిని వాల్మీకిచేసెనని యుపమాన వాక్యములచే నిరూపించెను. అయితే రామాయణానికేమియు సంబంధములేకుండిన చ్యవనుని పేరెందుకెత్తుకొన్నాడు? అని ప్రశ్నింపవచ్చును. చ్యవనుడు భృగువంశమువాడు. వాల్మీకి యుభృగువంశమువాడు. * బుద్ధఘోషుడు తండ్రి

* ఋక్షోఽభూ ద్భార్గవస్తస్మా ద్వాల్మీకి ర్యోఽభిధీయతే.-విష్ణు పురాణము ౩, ౩.

కొడుకుల ఉపమానములనే ఇచ్చియున్నాడు. అట్టి యితరోప మానములనుబట్టి బహుశా చ్యవనుడు వాల్మీకి తండ్రియై యుండెనేమో అని ప్రబలమగు సంశయము కలుగుచున్నది. చ్యవనుడు కవిత్వవేదిగా నుండియుండును. ఆ కవితయే వాల్మీకిలో పరిణతిపొందినది.

చ్యవనుడును, వాల్మీకియు భృగువంశములోనివారని కొన్ని నిదర్శనములు కలవు. వాల్మీకియే తన రామాయణ ములో నిట్లు వ్రాసినాడు.

"భార్గవ శ్చ్యవనోనామ హిమవంత ముపాశ్రితః"

-బాల. స ౭౦. శ్లో ౨౯.

అయితే ఈ శ్లోకసందర్భము వేరుగా కనబడు చున్నది. ఇక్ష్వాకువంశములో భరతుని కుమారుడు అసితు డను వాడుండెను. అతడు రామునికన్న ౨౧ తరములు ముందువాడు. అతడు రాజ్యమును పోగొట్టుకొని హిమవంత మందుండగా అచ్చటికి చ్యవనుడు వెళ్ళియుండెనను సందర్భ ములో నుదాహరింపబడినాడు. రామునికన్న ౨౧ తరముల పూర్వమందుండిన రాజుయొక్క సమకాలికుడగు చ్యవనుడు బుద్ధఘోషోదాహృతచ్యవనుడు కానేరడు. ఆపేరే వహించి వాల్మీకి కాలములో నున్నవాడింకొకడై యుండును.

ఈ సందర్భములో మరొక యంశము చర్చనీయమగు చున్నది.

భృగువెవ్వరు?

"భృగువే శుక్రుడు † శుక్రుడు రాక్షసులకు గురువు. రాక్షసుల కింకొక పేరు అసురులు. వీరినే పారసీకులు అహు రులు అనిరి. సంస్కృత సకారము ఫార్సీలో హాకారముగా మారును. ఫార్సీవారి భాషలో "అహుర" మంచి దేవత. "దేవ" దుష్ట దేవత. దీనినిబట్టి అహురుల గురువగు భృగువుపారసీకు లకు ముఖ్యగురువై యుండెను" అని జతీంద్రమోహన ఛటర్జీ గారు "గాథా" జరథుస్త్ర మతగ్రంథ పీఠికలో వ్రాయుచు మరల ఇట్లు తెలిపినారు. అథర్వవేదమునకు "భృగ్వాంగిరసి" అను పేరుకలదు. అథర్వవేదమందొక భాగమునకు భృగువు ద్రష్ట. ఇంకొక భాగానికిఅంగిరసుడు ద్రష్ట. భృగువు లేక శుక్రుడు అసురుల గురువు. అంగిరసుడు లేక బృహస్పతిసురల గురువు" అథర్వ వేదములోని భృగుసంహితాభాగము ఖిల మైనదని ఆర్యులందురనియు, ఆ భృగుసంహితయే "గాథా" "అవెస్తా" అనురూపమున జరథుస్త్రునిచే ఈరాన్ దేశ మందు వ్యాప్తినొందింపబడెననియు ఈ ఛటర్జీగారి వాదము. పాశ్చాత్య పరిశోధకులు కొందఱిట్టి అభిప్రాయమునే వెల్ల డించియున్నారు. అథర్వవేద కాలములో దేవాసురపూజా పద్ధతిలో ఆర్యులలో భిన్నాభిప్రాయము లేర్పడెననియు అసురపూజాభిమానులు ఈరానులోనికి వెళ్ళిరనియు వారికి జరథుస్త్రుడు మతకర్త యయ్యెననియు పాశ్చాత్యపండితుల

---

† శుక్రుడు భృగువంశపు "భార్గవుడు" అనిమన పురాణాలు చెప్పు చున్నవి.

యభిప్రాయము. 'గాథా' గ్రంథములోని భాషయు వేద తుల్యముగా నుండుట ఆశ్చర్యజనకముగా నున్నది. ఉదాహరణార్థముగా "గాథ" లోని మొట్టమొదటి సూక్తము నుదాహరించుచున్నాను. 'యూ నీం మనోయూనీం వచో యూనీంస్య ఓథనేం అషఓనో జరథుస్త్రహే.' దానికిసంస్కృత సామ్యమును ఘటర్జీపండితుడీవిధముగా చూపించినాడు.

జినంమనః జినంవచః జినం స్యోదనం అషవనః జరథుస్త్రస్య.

ఈ విధముగా భృగువంశమువాడు చ్యవనుడు. చ్యవనుని కుమారుడు వాల్మీకియై యుండినచో వీరు ఈరాన్ సంబంధముకూడ కలవారని యూహింపవలసి వచ్చును.

## వాల్మీకియెవరు?

వాల్మీకినిగురించి యించుమించు మనకేమియు తెలియదు. అతడు వ్యాధుడుగా నుండెననియు, అడవులలోదొంగల గుంపు పెద్దయై బాటసారులను దోచి జీవించు చుండెననియు, నారదాదు లొకనాడు అతనిబారి పడిరనియు, వారు 'ఓయీ! నీవు చేయు పాపకర్మలను నీవే యనుభవింతువా అందు భాగస్వాములున్నారా?' యని యడుగగానే, నేనెవ్వరిని పోషించుచున్నానో వారందరు భాగస్థు లగుదురని చెప్పెననియు ఆ సంగతి నీ భార్యాపుత్రుల విచారించి చూడుమని చెప్పగా చూతముగాక యని తనవారి నడుగగా వారికి పాపములో భాగముండదని రనియు, అప్పుడతడు విరక్తుడై మునుల యుపదేశము నొంది తపస్సు చేసెననియు అట్టి యాచరణలో అతనిపై వల్మీకము(పుట్ట) పెరిగెననియు అందు

చేత వాల్మీకి పదవాచ్యుడయ్యెననియు, తపశ్శక్తిచే మహర్షియైన తర్వాత రామాయణమును రచించెననియు ఒక గాథ కలదు. దాని కాధారము సరియైనది కానరాదు. వల్మీకము పెరిగిన తర్వాత వాల్మీకియైనచో అంతకుముందతని పేరేమై యుండెనో ఎవ్వరును తెలుపలేదు.

వాల్మీకి రాముని సమకాలికుడనియు తమసానదీతీరమున శిష్యులతో కూడ ఆశ్రమము స్థాపించి యందుండెననియు, అతడే యాదికవి యనియు శ్రీమద్రామాయణమందు కాన వచ్చుచున్నది. శ్రీమద్రామాయణములో ఉత్తరకాండనువిమర్శకులు ప్రాచీనముగా నంగీకరింపలేదు. రామాయణములోని మొట్టమొదటి సర్గలోనే రామాయణకథాసంగ్రహమునారద వాక్యముగా వ్రాయబడినది. అందు అన్నిటిని చెప్పినారు. కాని ఉత్తరకాండలోని విషయాలేమియు తెలుపలేదు. ఉత్తర కాండలో అపవాదభీరువై యుండిన శ్రీరాముడు సీతను పరిత్యజించినప్పుడు ఆమెగర్భవతిగా నుండెననియు, ఆమెకువాల్మీక్యాశ్రమములో ఆశ్రయము లభించెననియు వ్రాసినారు.

వాల్మీకి యాదికవి యని యందరును ఒప్పుకొనుచున్నారు. అతడు శ్లోకమును కనిపెట్టిన కథ అందరకును తెలిసినదే. కాళిదాసమహాకవి వాల్మీకిని 'కవి' యనియే సంబోధించెను. పరిత్యక్తయయిన సీత అరణ్యములో వాల్మీక్యాశ్రమ ప్రాంతములో విలపించుచుండగా వాల్మీకి ఆమెను కాంచెనని కాళిదాసిట్లు వర్ణించినాడు.

తా మభ్యగచ్ఛ ద్రుదితానుసారీ కవిః కుశేధ్మాహరణాయ యాతః
నిషాదవిద్ధాండజదర్శనోత్థః శ్లోకత్వ మాపద్యత యస్య శోకః.
—రఘువంశము. ౧౪ సర్గ. ౭౦ శ్లో॥

రామాయణములోనే బాలకాండ ద్వితీయసర్గమందు క్రౌంచవధ కథ కలదు.

"ఋక్షోభూత్ భార్గవస్తస్మాద్వాల్మీకిర్యోభిధీయతే"

అని విష్ణుపురాణములో కలదు. దీనినిబట్టి వాల్మీకికిఋక్షుడను పేరుండెననవలెను. ఈ విషయమునుగురించి శ్రీ మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారు తమ సంస్కృత వాఙ్మయ చరిత్రలోనిట్లువ్రాసిరి "ఇరువదినాల్గవవ్యాసుడు ఋక్షుడనియు ౨౮ వ వ్యాసుడు ద్వైపాయనుడనియు వాయుపురాణము చెప్పినది ... ఈ పురాణ సంప్రదాయమునుబట్టియు "భృగు ర్వైవారుణిః" అను తైత్తిరీయోపనిషద్వాక్యమును బట్టియు వరుణవంశమువాడును భృగువంశమువాడునైన వాల్మీకి యొకడేయనియు, అతడు వేదవ్యాసుడు కూడనై యుండె ననియు తెలియుచున్నది."

వెబర్ భారతీయ వాఙ్మయ చరిత్రను వ్రాయుచు నందు తైత్తిరీయ ప్రాతిశాఖ్యలో ప్రాచీనాచార్యుల పట్టికలో వాల్మీకి పేరు కలదని వ్రాసెను.

పర్గిటర్ ప్రాచీన ఋషుల పట్టికను సిద్ధముచేసి అందు వాల్మీకి దశరథునికి రెండు తరముల తర్వాత నుండినట్లు తెలిపినాడు. సంగ్రహముగా పాటపాడి కథ చెప్పుటకు

తగినట్లుగా రామాయణమును వాల్మీకి వ్రాసియుండుననియు తర్వాత యది పెరుగుచు వచ్చెననియు నతడు తలచెను.

బ్రహ్మాండ పురాణములో అధ్యాత్మ రామాయణము చేరియున్నది. అందు వాల్మీకి మొదట గజదొంగగా నుండె ననియు రామమంత్రోపదేశముచే మహాత్ముడయ్యెననియు వర్ణించినారు. ఈ పురాణము క్రీ. శ. ౮౦౦ ఏండ్ల తర్వాతిదై యుండును. వాల్మీకి బోయయనియు, దొంగయనియు వర్ణించుకథలకంతయు నిదియేమూలమైయుండును. బ్రహ్మాండ పురాణ రచయితలు వాల్మీకి రామాయణములో లేని కల్పనలు చేసివేసిరి.

రామాయణములో "చక్రే ప్రచేతసః పుత్రః" అనుట చేతను వాల్మీకికి ప్రాచేతసుడను పేరుండుట చేతను వాల్మీకి ప్రచేతసుని కుమారుడని తెలిసెను. వాల్మీకి "తపస్వి" అని "తపస్స్వాధ్యాయ నిరతంతపస్వీ వాగ్విదాంవరం" అని రామాయణములోని మొట్టమొదటి పంక్తియే తెలుపుచున్నది. వాల్మీకి తమసా నదీ తీర మందాశ్రమమును స్థాపించుకొని యుండెను.(బాల ౨-3)అతనికి శిష్యులుండిరి.(బాల ౨-౧;ర) ఒకశిష్యుని పేరు భరద్వాజుడు (బాల ౧-౫)వాల్మీకి బోయవాడను కథ కల్లయని యీపంక్తి తెలుపుతున్నది."మచ్ఛందాదేవ తే బ్రహ్మన్ ప్రవృత్తేయం సరస్వతీ" (బాల ౨-3౧) బ్రహ్మన్ అనిన బ్రహ్మజ్ఞానము కలవాడనియు బ్రాహ్మణుడనియు, పూజ్యుడనియు నర్థము లగును. వాల్మీకి ఋషిగా వర్ణితుడు. "రఘువంశస్య చరితం చకార భగవాన్ ఋషిః"

(బాల 3-౯)భగవంతుడును ఋషియునునైన వాల్మీకి రఘు
వంశ చరితమును వ్రాసెను, అని యన్నాడు. బాలకాండ
మొదటి మూడు సర్గలలో వాల్మీకి తనకుతానే భగవాన్,
ఋషిః, ఋషిపుంగవ, తపస్వి, మహాముని యనియు. మహర్షి
వ్రాసెను. ఋషిపుంగవు డిట్లనెను అనియు, వ్రాసియుండునా?
ఈ మూడు సర్గలన్యరచితములో యేమో? నాల్గవసర్గ మొదటి
శ్లోకములో "వాల్మీకిర్భగవాన్ ఋషిః" అని యుండుటచే
అదియు వాల్మీకిది కాదేమో. వాల్మీకి రాముని సమకాలి
కుడో కాడో సంశయాస్పదమే. "చిరనిర్వృత్తమప్యేత త్ప్రి
త్యక్షమివదర్శితం" (బా. ౪-౧౮) చాలాకాలము క్రిందటి
సంఘటనలైనను వాటిని ప్రత్యక్షముగా చూచినట్లు వాల్మీకి
వ్రాసెనని వర్ణించినారు. ఇక బాలకాండలోని అయిదవసర్గ
మునుగనుడు. "తదిదం వర్తయిష్యామి సర్వం" (బా. ౫-౪)
అని ప్రారంభించుచున్నాడు. "ఇక ఈ రామాయణ కథ ను
పూర్తిగా వివరిస్తానువినండి" అంటున్నాడు వాల్మీకి. వాల్మీకి
రచన బాలకాండఅయిదవ సర్గతో ప్రారంభమగుననితలతును.
కథా ప్రారంభము చక్కగా మొదలై సూటిగాసాగినది.

## రామాయణ ప్రాశస్త్యము

హిందువులకు రామాయణమన్న నెంత గౌరవము
న్నదో అంతగౌరవము మరే గ్రంథానికిని లేదని తెలిపినాను.
భారతదేశమందలి సర్వభాషలను మాట్లాడు హిందూకవు
లందరును మొదట వాల్మీకికి నమస్కారము చేయనిది కవిత్వ
మారంభించినవారు కారు. కేవల సంస్కృత సాహిత్యము

నందే కాక దేశభాషలలోని కవితలందును వాల్మీకిస్మరణ అగ్రస్థానము వహించినట్టిదై యున్నది. సంస్కృత మహాకవు లందరును వాల్మీకిరామాయణమును చదువనిది తమసాహిత్య విద్య పూర్తికాదని పూర్వకాలములో భావించుచుండినట్లు కనబడుచున్నది. పూర్వకాలములో వాల్మీకి రామాయణము లోని కొన్ని భాగాలను శిష్యులకు చదువు చెప్పిన తర్వాత తక్కిన పంచకావ్యాదులను చెప్పుచుండిరని ప్రతీతి. ఇప్పుడైనను వాల్మీకి రామాయణములోని కొన్ని ముఖ్యభాగములను విద్యార్థులకు చెప్పి తర్వాత రఘువంశాదులను ప్రారంభించిన బాగుండును. కాళిదాసాది మహాకవు లందరును వాల్మీకి కవితను ఆదర్శముగా పెట్టుకొని తమ గ్రంథాలను రచించినట్లు అనేక నిదర్శనాలు కలవు.

ఇంచుమించు ౨౦౦ సంవత్సరాలనుండి ముఖ్యమగు యూరోపు భాషలలో ఇంగ్లీషుద్వారా రామాయణకథ పరివర్తనమునుపొంది పాశ్చాత్యులకు పరిచితమైపోయినది. కాని మొదటి భాషాంతరీకరణములు సంగ్రహమైన వగుటచేతను సంస్కృతభాషలోని రమ్యత తెలియనివారిచే వ్రాయబడి అట్టివారిచే చదువబడినవగుటచేతను పాశ్చాత్యులకు రామాయణ ప్రాశస్త్యము కానరాకపోయెను. పైగా చాలామంది పాశ్చాత్యులు మొదటినుండియు సంకుచితదుర్భిమను లోనైనట్టివారు. తమ సాహిత్యము, సంస్కృతి, గ్రీకు, లాటిను భాషలనుండియే వచ్చినవని వారి భావనమైయుండెను. గ్రీకు లాటినులలో వ్రాయబడినవాటికన్న మించిన ప్రాచీనగ్రంథాలు ఏ యితర ప్రపంచ భాషలలోను లేవను సిద్ధాంతము

వారిలో దృఢపడిపోయి యుండెను. హోమర్ అను గ్రీక్ ప్రాచీనకవి వ్రాసిన ఇలియడ్, ఒడెస్సీ అను పురాణాలే ఉత్తమపురాణాలని వారు భావించిరి. కాని హోమరు గ్రంథము కన్న మూడురెట్లకన్న అధికమయిన రామాయణము, ఇంచు మించు ౧౫ రెట్లకన్న అధికమయిన మహాభారతము ఉన్న వని వారికి తెలిసినపుడు వారు దిగ్భ్రమచెందిరి. * కాని తమ పూర్వాభిమానములను చంపుకొనలేక ఆర్యు లీ పురాణాలను గ్రీకులనుండియే సంగ్రహించి యుందురని వాదించిరి. హోమరు వ్రాసిన ఇలియడ్ కథకును రామాయణ కథకును చాలా పోలికలున్నవి. అందుచేత రామాయణము హోమరు యొక్క ఇలియడ్ నుండి దొంగిలించిన పురాణమే అని పలువురు వ్రాసిరి. ఎవరు దొంగలో ఎవరు దొరలో ఇప్పుడే నిర్ణయించుకొందము. ఇంతలో ఈ రామాయణ ప్రాశస్త్య ప్రశంసాసూచనను ముగించి తర్వాత ఆ చర్చకు వత్తును.

రామాయణము ఆర్యుల కాదర్శగ్రంథము. అందలి యుత్తమపాత్ర లన్నియు మన కాదర్శపాత్రములే. రాముని వంటి రాజు, సీతవంటి భార్య, హనుమంతునివంటి బంటు, లక్ష్మణునివంటి సోదరుడు, భరతునివంటి భక్తుడు, సుగ్రీవుని వంటి స్నేహితుడు, దశరథునివంటి కరుణామయమూర్తి, ప్రపంచ వాఙ్మయములో నెందును సృష్టికాలేదు. వెయ్యేండ్ల నుండియు పరాధీనతయే సంప్రాప్తమైనను హిందువులలో నేటి కిని విశేషముగా ధార్మికగుణాలు వ్యక్తమగుచున్నవంటే

* మహాభారతములో ౨,౨౦,౦౦౦ పంక్తులున్ను, రామాయణములో ౪౮,౦౦౦ పంక్తులున్ను, ఇలియడ్ లో ౧౫,౬౯౩ పంక్తులున్ను కలవు.

దానికికారణము శ్రీమద్రామాయణమే ! చదువురానివారికిని, స్త్రీలకును, అస్పృశ్యులకును, తక్కువకులాలనబడు వారికిని, బోధచేయు దిక్కులేని సంప్రదాయములో నీతివర్తనము పట్టుకొనివచ్చినదంటే అది శ్రీమద్రామాయణమాహాత్మ్యమే. సీతపేరు, సీతకథను వినని హిందూ దౌర్భాగ్యులు లేనేలేరు. రామాయణములో హిందువులకు పైవిశేషాలే కానవచ్చుచుండును. కాని దానినర్థముచేసుకోలేని కొందరిపాశ్చాత్యులకందు కోతులు, భూతాలు, తిక్కకథలు, నమ్మరానివిముచ్చటలు—ఇట్టివే కనబడుచుండును. తమ హోమరులో ఇంతకుమించినవి ఎన్నియున్నను అవివారికి కానరావు.

## ఇలియడ్ పురాణము

హోమరువ్రాసిన ఇలియడు పురాణమును మన రామాయణముతో లంకెపెట్టినందున ఇలియడ్ పురాణకథను కట్టె, కొట్టె, తెచ్చెనన్నమాదిరి సంగ్రహముగా వ్రాయుచున్నాను.

పూర్వకాలములో ట్రాయి అను ఒకగొప్ప నగరముండెను. దానిరాజుపేరు ప్రియం. అతనికి హెక్టరుఅను కొడుకును, ప్యారిసు అనువాడును మరికొందరు కుమారులును కలిగిరి. ప్యారిస్‌మూలాన ముందుకాలంలో దేశానికి ప్రమాదమున్నదని జ్యోతిష్కులు చెప్పినందున వాడు పుట్టిన కొంతకాలానికి వానిని ఇళా అను పర్వతాలలో వదలివేసిరి. వానిని గొల్లలు పెంచిరి. ప్యారిస్ పసుల మేపుచు పెద్దవాడై మంచి తగవుతీర్పరి యని యనిపించుకొనెను. ఇట్లుండ గ్రీసులోని భాగమగు థెసలీ దేశముయొక్క రాజు పెండ్లాడెను. ఆ

పెండ్లికి దేవతలుకూడ ఆహూతులైరి. కాని కలహాదేవతను మాత్రము పిలువలేదు. ఆమె పెండ్లిసందడిలో కల్పించుకొని సభలో ఒక బంగారు సేపుఫలమును పారవేసి "అందరిలో సుందరియైన స్త్రీయే దీని కర్హురాలు" అని చెప్పిపోయెను. ఇంకేమున్నది? నేనే సుందరిని నేనే జగదేకమోహినిని అని దేవతలంతా తగవులాడిరి. తుది పరీక్షలో ముగ్గురు దేవతలే నిలిచిరి. ఆ ముగ్గురును అసమాన సుందరాంగులే. తుదకు వీరు ప్యారిసువద్దకువెళ్ళి తీర్పు చెప్పుమనిరి. ప్యారిసు వారిని ఎగ దిగ చూచుచు పరీక్షించుచు ఏ నిర్ణయము చేయజాలక తర్కసాగరములో మునకలు కొట్టదొడగెను. అప్పుడు ఒక దేవత నన్నే నీవు మెచ్చుకొంటివా నీకు సామ్రాజ్యమిప్పింతు ననెను. ఇంకొకతె విద్య నిత్తుననెను. వీనసు అను దేవత "నీకు భువనమోహినియగు చక్కరబొమ్మ నిప్పింతు"ననెను. ప్యారిసుకు నోరూరెను. వీనసే అందరిలో సుందరాంగి యని వెంటనే నిర్ణయము చేసివేసెను. కొంతకాలానికి ప్యారిసు యొక్క యస్తిత్వ మాతని తండ్రికి తెలిసి వానిని ట్రాయికి పిలిపించుకొనెను. ప్యారిసు అచ్చటినుండి వీనసు ప్రేరితుడై స్పార్టా అను గ్రీకుదేశ భాగముయొక్క రాజైన మెనిలాస్ అనువాని నగరానికిపోయెను. మెనిలాస్ చాలా ప్రేమతో అతని కాతిథ్య మిచ్చెను. మెనిలాస్ భార్యపేరు హెలెన్ (హేలీ). ఆమెయే భువనమోహిని. హెలెనున్నూ ప్యారిసున్నూ పరస్పరము గాఢముగా ప్రేమించుకొనిరి. ఇంతలో మెనిలాసు పనిబడి దేశాంతరము వెళ్లెను. అతడు వచ్చులోపల ప్యారిసు హెలెనును ఒప్పించి మెప్పించి తనవెంట లేవ

దీసుకొని వెళ్లెను. ట్రాయిలో ఇరువురును భార్యాభర్తలవలె సుఖముగా ఆనందాలలో ఓలలాడుచుండిరి.

మెనిలాసు తిరిగివచ్చి తనభార్య లేచిపోయిన వార్త విని తన కపచారముచేసిన ప్యారిసుపై పగ సాధించుటకును తన హెలెనును మరల తెచ్చుకొనుటకును ఇతర గ్రీకురాజులకు జాబులు వ్రాసి పిలిపించుకొనెను. వారిలో ముఖ్యులు యులిసిస్, అకిల్లీ అనువారు. ఈ సైన్యానికి నాయకుడు మెనిలాస్ అన్నయగు అగమెమ్నాన్ (గ్రీకుభాషలో అగమెమ్నాన్ అంటే మనుష్యులలో ఉత్తముడు "అనగా అగ్ర మానవ" అను పదమును పోలిన నామము.) వీరందరును ఓడలలో పోయి ట్రాయిని ముట్టడివేసిరి. పదియేండ్లపాటు యుద్ధముజరిగెను. ఉభయత్ర మహావీరులుచాలామంది చనిపోయిరి. ఈ యుద్ధములో ప్యారిసు అన్నయగు హెక్టరునకున్న గ్రీకులలో మహావీరుడయిన అకిల్లీసునకున్నూ జరిగినయుద్ధము ముఖ్యమైనది. ఎట్లయితే నేమి ఉభయులును చచ్చిరి. ఈ పదేండ్లకాలములో ప్యారిసు ఎడతెగకుండా హెలెనుతో భోగా లనుభవించుచు తుదకు తానును యుద్ధముచేసి రణరంగమందు మరణించెను. కాని ఇంతకునూ ట్రాయి గ్రీకుల వశము కాకపోయెను. గ్రీకులు ఒక యుక్తిని పన్నిరి. ఒక గొప్ప కట్టెగుర్రాన్ని చేసిరి. దాని కడుపులో మహావీరులు దాగియుండిరి. దాన్ని దిగతుడుపుగా అచ్చట వదలి తమ ఓడలలో ఎక్కి వెళ్ళిపోయిరి. ట్రాయివారు గ్రీకులు పారిపోయిరని కోటబయటకువచ్చి ఆ కట్టెగుర్రాన్ని ఊరిలో ఊరేగింపుతో ఉత్సవాలుచేసి రాత్రి మైమరచి నిద్రించిరి. తర్వాత

గుఱ్రములోనివారు బయటకువచ్చి కోటతలుపులు తెరిచిరి. పోయినట్లు నటించి ఆ రాత్రియే తిరిగివచ్చిన గ్రీకులు లోపలికి ప్రవేశించి నగరాన్ని దగ్ధముచేసి జనులను చంపిరి. హెలెనును మెనిలాసు తీసుకొనిపోయెను.

ఇది హోమరువ్రాసిన ఇలియడు కథ. హోమరుపాత్రలలో ఉత్తమత్వము లేదు. హెలెను పరకీయ. ప్యారిసు అతిథి సత్కారాన్ని పొందినవాడు. దాని కుపకృతిగా హెలెనును లేవనెత్తుకొనిపోవును. బలవంతముగా ఆ పనిచేయలేదు. హెలెనే వానివెంబడిపోయెను. అట్టిదానికై పదేండ్లయుద్ధము జరిగెను. అట్టి వ్యభిచారిణికై చాలామందివీరులు చావగా హెలెనును మెనిలాసు ప్రేమతో తనయింటికి తెచ్చుకొని తృప్తిపడెను.

హోమరుయొక్క పాత్రల హైన్యత వ్యక్త మగుచున్నది. హెలెను ఎక్కడ? సీత ఎక్కడ? నక్క ఏడ? నాకలోక మేడ? హోమరుయొక్క ఇలియడులో రామునివంటి నాయకుడు ఎంత వెదికినను కానరాడు. ఇలియడు పురాణాని కేమియు ఆదర్శములేదు. హిందువులు ఆదర్శరహితమైన కథలను స్వీకరించినవారు కారు. పైగా హోమ రెప్పటివాడు?

## హో మ రు కా ల ము

క్రీ. పూ. ౬౮౫ నుండి క్రీ. పూ. ౧౧౫౯ సంవత్సరాలమధ్య హోమరుండి యుండవచ్చును అని విమర్శకులూహాలు చేసినారు. హెరొడోటస్ అను ప్రాచీన చారిత్రకుని అభిప్రాయప్రకారము హోమరు హెరొడోటసుకంటె ౪౦౦

సంవత్సరములకుపూర్వ ముండినవాడు. అనగా క్రీ. పూ. ౮30లో ఉండెను. అరిస్టార్కుసు అభిప్రాయములో అతడు క్రీ. పూ. ౧౦౪౪లో ఉండెనట. ఇదంతయు ఊహాయే. హోమరు అనువాడే లేకుండెనని పలువురు పాశ్చాత్య పండితులు వ్రాసినారు. ట్రాయి యుద్ధము అనగా ఇలియడ్ కథ జరిగిన కాలము క్రీ. పూ. ౧౨౦౦ ఏండ్లనాడు. హోమరు వ్రాసిన గ్రంథములో నీతిబాహ్యమైన విషయములు చాలా యుండినందున క్రీ. పూ. ౧౫౦లో ఇలియడును కొందరు పండితులు తీర్చిదిద్ది యిప్పటి రూపానికి తెచ్చి ప్రపంచాని కర్పించిరి. ప్లేటో అను గ్రీకు నైయాయికుడు ఇలియడుపురాణములోని అసభ్యతను గర్హించెను. జెనొడోటస్ కవి దానిలో చాలా మార్పులు చేసెను. అట్లు దిద్దినను అసభ్యదూషణలు, అన్న చెల్లెండ్ల వివాహములు, శవాల వస్త్రాపహారణములు, విషదిగ్ధమగు బాణాల ప్రయోగము, ఇఫిజీనియా వంటి నరబలులు - ఇట్టి వెన్నియో యింకను ఇలియడులో నిలిచిపోయినవి. హోమరు కవియే రామాయణగాథను అడ్డాదిడ్డిగా విని దానివంటి ఘట్టాలుకలిగినట్లు కనిపించిన ట్రాయి యుద్ధాన్ని పురాణముగా వ్రాసినట్లు కనబడుచున్నది. అయితే రామాయణగాథ క్రీ. పూ. ౮౦౦ లేక ౯౦౦ ఏండ్లక్రిందట గ్రీసువంటి దూరదేశమువరకు వ్యాపించిపోయెనా? అని శంకింపవచ్చును.

ఒక్క రామాయణమేమిటి? హిందువులగాథలు, వారి కళలు, అశ్వశాస్త్రిలవంటి శాస్త్రములు, వైదిక దేవతలు ఇవన్నియు గ్రీసువరకు క్రీస్తునకు పూర్వము రెండు మూడు

వేల యేండ్లక్రిందటనే వ్యాపించియుండెను. ఎట్లనగా గ్రీకు దీవులకు సమీపమందే సిరియా అను దేశమున్నది. పూర్వము లో అచ్చటనుండిన మండలాన్ని హట్టిదేశమనిరి. అచ్చట బోఘాజ్ క్వీ (Boghazkuei) అను నగర ముండెను. దానికి తూర్పున టైగ్రస్ యూఫ్రటీసు నదులమధ్య మిటన్నీ అను దేశముండెను. అది యిప్పటి మెసపొటోమియాలోని మండలము. హట్టిరాజు మిటన్నిరాజుతో క్రీ. పూర్వము ౧౩౮౦లో ఒక సంధిచేసుకొనెను. దానిని శాసనముగా చెక్కించిరి. ఆ సంధికి సాక్షులుగా మిత్ర, వరుణ ఇంద్ర, నా సత్య దేవతలు పేర్కొనబడినారు. బోఘాజ్ క్వీలోని దిబ్బలలో కొన్ని శాసనాలు దొరికినవి. వాటిపై అశ్వశాస్త్రసూత్రములను వ్రాసినారు. ఐకవర్తన, తిర(త్రి)వర్తన, పంజ (పంచ)వర్తన, షట్ట (షష్ఠ) వర్తన, అను నడకలను గుర్రాలకు నేర్పించవలెనని అందు వ్రాసినారు. ఈ పదాలు సంస్కృతభాషలోనివి. సిరియా పాలస్తీనా ప్రాచీనరాజుల పేరులు సంస్కృత నామములతో కూడియుండెను. అర్తతమ (ఋతతమ) తుష్రత, సుబంధు అనునవి కొన్ని పేరులు. ఈ నిదర్శనాలనుబట్టి సిరియాప్రాంతాలకు హిందువులు క్రీస్తునకుపూర్వము ౩౦౦౦ ఏండ్లకిందటనే వెళ్ళియుండిరని పాశ్చాత్యులే వ్రాసియున్నారు. క్రీ. పూ. ౨౬౩౫లో అక్కడ్ (సిరియా ప్రాంతములోని దేశము) రాజగు సర్గాం అనువాడు ఏషియామైనరులోని "పురుషఖండము" రాజైన నూర్‌దగన్ అను వానిపై దాడివెడలెను. నేటికి ఇంచుమించు ౪౬౦౦ ఏండ్లక్రిందట సిరియా ప్రాంతములో పురుషఖండ రాజ్యముండెను.

§ దీనినిబట్టి రామాయణగాథను గ్రీకుకవి క్రీ. పూ. ౮౦౦ లేక ౯౦౦ ఏండ్లనాడు వినియుండుట ఆశ్చర్యకరము కాదు. పైగా ఇంచుమించు పదేనిమిది నూర్ల ఏండ్లకాలములో అనగా క్రీస్తుపూర్వము ౧౫౦ నాటివరకు ఇలియడును దిద్దుచునే వచ్చినారు. కావున దాని తుది స్వరూపము క్రీ. పూ ౧౫౦లో ఏర్పడెను.

ఇంతేకాక గ్రీసు దేశానికిసమీపములోఉండే ఖాల్డియా దేశములో క్రీస్తునకు పూర్వము 3000 ఏండ్ల క్రిందట పంపబడిన ఇండియా టేకుదూలములు కనబడినవి. టేకుకట్టె ఇండియాలో తప్ప మరెచ్చటను లేకుండెను అని మిస్ రగోజన్ (Vedic Indiaలో) వ్రాసెను. ఆమె యింకను ఇట్లు వ్రాసెను. "బాబిలోనియాలో హిందువులు నేసిన బట్టలను "సింధు" అను పేరుతో వ్యవహరించిరి. "సాలమన్ కాలములో ఇండియానుండి ఎగుమతి యయిన చందనము, దంతము, కోతులు, నెమళ్ళు మున్నగు భారతీయ వస్తువులకు హీబ్రూ భాషలో పేరులు లేనందున భారతీయ నామములతోనే వ్యవహరించిరి. ఇట్టి ప్రమాణాలనుబట్టి హోమరుకంటే ఎన్నియో శతాబ్దములకు పూర్వమే హిందూవ్యాపారులు, వైదిక మతబోధకులు, గ్రీసు దేశమువరకుకూడా వెళ్ళివచ్చుచుండిరని స్పష్టమగుచున్నది.

కొందరు పాశ్చాత్య పండితుల అభిప్రాయప్రకారము హోమరే రామాయణమునుండి తన కథావస్తువును గ్రహిం

---

§ హట్టి (Hithite)ని గుఱించి ఇంకను వివరాలు తెలుసుకొనగోరువారు ఎన్ సైక్లోపీడియాబ్రిటానికాలో పై ఇంగ్లీషుపదమువద్ద చూచుకొనగలరు.

చెను. "హోమరు వ్రాసిన ఇలియడ్ పురాణము రామాయణముయొక్క ప్రతిధ్వనియే. మరియు దానియొక్క అస్పష్టమగు అనుకరణము. ఈ అనుకరణము ప్రతి చిన్నవిషయములోకూడా స్పష్టముగాను నిరాకరింపరానిదిగాను కనపడుచున్నది" అని యం. జల్లికోట్ పండితుడు వ్రాసినాడు. §

హిప్పోలిట్ ఫాష్ (Hippolyte Fauche) ఇట్లనెను. "రామాయణము నుండియే ఇలియడ్ ఏర్పడినదని నేను పూర్తిగా విశ్వసించుచున్నాను †

ఎమిల్ బుమాఫ్ (Emile Bumouf) క్రీ. శ. ౧౮౮౮ లో ఇట్లు వ్రాసెను. "ఈ ౧౯వ శతాబ్దములో రెండు ఆశ్చర్యాలు సంభవించెను. (౧) క్రైస్తవమతమునకు సంబంధించిన చాలా విషయాలు హిందువులనుండి వచ్చినవనియు (౨) గ్రీకు పురాణాలు స్వతస్సిద్ధములు కావనియు తెలిసెను. గ్రీకు దేవతలును శూరులును కలిసి యొక సుందరాంగి మానభంగమునకై పగతీర్చుకొనుటకు గుమికూడు కథ అంతకు పూర్వమే గంగాతీరములో రచితమైయుండెను. ‡

---

§ The Iliad of Homer is nothing but an echo an enfeebled souvenir of the Ramayana.........The imitation is flagrant, undeniable, met with even in details. – M. Jellicot in Bible in India P. 32.

† Rama & Homer-Lille P. 175.

‡ "The 19th century had experienced two great surprises. (1) The Indian origin of much that is called "Christianity," (2) and that the Greek epics

వెబర్ అను నతడు రామాయణము క్రీ. శ. ౪౦౦లో రచింపబడెనని వ్రాసినాడు. ఎందుకనగా బౌద్ధజాతక కథలలోని ఒక కథలో సీతారాముల ముచ్చట కలదట. జాతక కథలు బౌద్ధుని పూర్వజన్మ కథలు. అవి కల్పితములైనవి. అయినను ఏడవ అవతార పురుషుడయిన రాముడు తొమ్మిదవ అవతారపురుషుడయిన బుద్ధునితర్వాత నుండినట్లు వెబరు వాదించుట హాస్యాస్పదమని విల్లీ పండితుడు ఖండించినాడు. జకోబీ అను పండితుడు రామాయణములో "యవన" అను పదము మూడుమారులు వచ్చినందున రామాయణము అలెగ్జాండరు దండయాత్రకు తర్వాతికాలపు రచనయై యుండునను సూచనను చేసినాడు. "యవన" పదము అలెగ్జాండరుతో మన దేశములోనికి వచ్చినదని పాశ్చాత్యులెప్పుడును ఒక తప్పుడు వాదము చేయుచుందురు. అలెగ్జాండరుగాని అతని పెద్దలుకాని పుట్టుటకు ౨౦౦౦ ఏండ్లకు పూర్వమే హిందువులు సిరియా, గ్రీకు దేశాలవరకు తమ మతవ్యాప్తి చేసి యుండినట్టివారని ఇదివరకే చూపినాము. కావున పదేపదే అలెగ్జాండరుతో "యవన" పదముయొక్క దిగుమతిని ఆధారము చేసుకొని అపక్వసిద్ధాంతాలను చేయుట అజ్ఞాన విలసనముగా నుండును. ఇట్టి కారణాలనుబట్టి దొంగ యెవరో దొర యెవరో మనకు విశదమగుచున్నది.

---

were not original, and even the great hordes of Gods & men and their muster to avenge the rape of a pretty woman had been previously made into a great epic on the banks of the Ganges."

Ibid p. 175.

వాల్మీకి రామాయణములో విదేశీయ వస్తుప్రభావము యొక్క జాడలేవియు కానరావు. భావములలో, సాంఘికాచారములలో, భూగోళవర్ణనలలో, పాత్రలపేరులలో, ప్రకృతి వర్ణనలలో ఏవియు వైదేశిక లక్షణములు కానరావు. కావున వాల్మీకినుండియే హోమరు తన పురాణమును సృష్టించియుండును. లేదా పరస్పర సంబంధ ముభయులకును లేకుండును.

## దేశి విదేశి పురాణాలు

ఈ చర్చను ముగించుటకు పూర్వ మొక సూచనను చేయదలచినాను. జైన బౌద్ధమత వ్యాప్త్యనంతరము ఇంచుమించు ఒక వెయ్యి సంవత్సరములవరకు స్వార్థపరులు తమ తమ భావాలను ప్రచారము చేయుటకై పురాణములలో కల్పిత కథలను, భావాలను నీతులను దూర్చి పెంచుచువచ్చిరని పలువు రభిప్రాయపడినారు. అందుచేత మనకాలములో పురాణాలకు విలువ తగ్గెను. పురాణాలలో అతి పురాతన చారిత్రికాంశములిమిడియున్నవి. మన పరిశోధకులు–ఇంగ్లీషు సంస్కృతము బాగా నేర్చినవారు–కేవలము మన సంస్కృత పురాణాలనే కాక విదేశీయ పురాణాలనుగూడా తారతమ్య దృష్టితో (Comparative Study) చదువవలెను. ఆర్యావర్తమందు ఆర్యుల సంస్కృతి, నాగరికత, విజ్ఞానము ఒక దిక్కు విజృంభించుచుండగా ఇంచుమించు అదే విధముగా కొంతకాలముతర్వాత ఈరాన్, బాబిలోనియా, హట్టి, అసీరియా, ఖాల్డియా, ఫినీషియా, సిరియా, గ్రీసు, ఈజిప్టు, (మిశ్రదేశమునందలి నీలనదీప్రాంతములో) రోముదేశములలో నాగ

రికత పెంపొందుచు వచ్చెను. పై దేశాలలోను పురాణాలు రచింపబడెను. వాటిలో విశేషభాగము ఇంగ్లీషులో లభించుచున్నవి. వాటిని మన పురాణాలతో సరిపోల్చు దృష్టితో చూచుచు వచ్చిన, మన పురాణాలలోని విశ్వామిత్రుడు, భృగువు, పరశురాముడు, బలరాముడు, వాల్మీకి మున్నగు వారికి ఆ దేశాలతో ఏమైన సంబంధముండెనో యేమో తెలియరాగలదు. ఆ దేశాల చర్చ మన పురాణాలలో కన బడవచ్చును.

# వివిధ రామాయణ కథలు

## జైన రామాయణము

ప్రపంచానికంతయు వాల్మీకి రామాయణము పరిచిత మయిపోయినది. భారతీయ భాషలలో అనువదింపబడిన రామాయణములలో బహువిధములైన మార్పులు చేసినారు. తులసీదాసు తన కిష్టమువచ్చినట్లు మార్చెను. గోనబుద్ధుడు చాలా మార్పులుచేసెను. వాల్మీకి రామాయణములో లేని ఇంద్రజిత్తు భార్యయగు సులోచనను గోనబుద్ధుడు సృష్టించి సులోచనా సహగమనము అను భాగమును గొప్పగా పెంచి వర్ణించి వ్రాసెను.‡ శతకంఠ రామాయణమని ఒకడు వ్రాయగా అంతకు మించిన శక్తిని చూపింతు నన్నట్లుగా సహస్రకంఠ రామాయణమును మరొకడు వ్రాసెను. ఆధ్యాత్మ రామాయణము, అద్భుత రామాయణము, విచిత్ర రామాయణము ఇట్టివెన్నైనను సృష్టియై కొద్దిగనో గొప్పగనో ప్రజాదరమునుగూడ బొందినవి.

అన్ని రామాయణముల ముచ్చట యేమోకాని జైన రామాయణమును గురించిమాత్రము ప్రత్యేకముగా చెప్పవలసియున్నది. ''జైనరామాయణము''అను పేరుతో ఏ గ్రంథమున్నూ లేదు. హేమచంద్రుడను జైనుడు ''త్రిషష్టిశలాక (శ్లోక) పురుష చరిత'' అను పేరుతో ఒక గ్రంథాన్ని రచిం

‡ నా కడనుండిన తాళపత్రప్రతిని ఆంధ్ర విద్యాపీఠమువారు ప్రచురణార్థము తీసుకొనియుండిరి. అందలి సులోచనా సహగమన భాగమును వారు అనుబంధములో విపులముగా ప్రకటించినారు.

చెను. అది ఇప్పుడు ముద్రితమై లభ్యమగుచున్నది. మూల మును నేను చూడలేదు. అందలి రామాయణకథను ఇంగ్లీషు వ్యాసరూపముగా నున్నదానిని చూచినాను. దానినుండియే యీ క్రింది కథ నుదాహరించుచున్నాను. జైన హేమచం ద్రుడు పై గ్రంథములో రామాయణకథ నిచ్చినాడు. ఆ కథ వాల్మీకి రామాయణముతో ముఖ్యవిషయాలలో భిన్నిం చుచున్నది. అందుచేత భిన్నించిన విషయాలను చేర్చి దాని నిచ్చుట వ్రాయుచున్నాను. భిన్నించని విషయాలు వ్రాయ లేదు. అవి రెంటను ఒకటేరీతిగా నున్నవని గ్రహింపనగును.

## జైనకథ - రాక్షస వానరోత్పత్తి (౧)

భరతఖండ మందలి వినీత పట్టణమున ఇక్ష్వాకువంశీ యుడయిన సగర చక్రవర్తి రాజ్యము చేయుచుండెను. అత డొకనాడు వేట కరిగి బాటతప్పి యలసియుండెను. అప్పు డరణ్యమందత డొక సుందరిని సుకేశయనుదానిని జూచెను. ఇరువురు పరస్పరము మోహించిరి. అప్పుడొకడు వచ్చి యీ సగరునితో నిట్లు చెప్పెను. "అయ్యా! విద్యాధరులలో నొకడయిన సులోచనుడను రాజు గగనవల్లభా పట్టణము నేలుచుండెను. అతనికి సహస్రనేత్రు డను కుమారుడును, సుకేశ యను కూతురును కలరు. రదనపురాధీశ్వరుడైన పూర్ణమేఘు డనువాడు సుకేశనుగోరియు నభీష్టము నెరవేర నందున సులోచనుని జంపి రాజ్య మపహరించెను. ఇప్పుడు సహస్రనేత్రుడును తన చెల్లెలగు సుకేశయు నీ యరణ్యమున దాగియున్నారు. తాము సుకేశను పరిగ్రహించ నర్హులు."

అదే ప్రకారము సగరుడు సుకేశను పెండ్లియాడి సైన్యయుక్తుడై పూర్ణమేఘుని పారద్రోలి తన మఱదిని రదన పురమునేల నియోగించెను. కొంతకాలమునకీ బావమఱదులు తీర్థయాత్రచేయుచుండ పూర్ణమేఘుడు వీరికెదురుకాగా సహస్రనేత్రుడతని జంపెను. పూర్ణమేఘుని కొడుకు ఘనవాహనుడు. భీముడను రాక్షసరాజతని జూచి "అయ్యా! నీవు నాకు పూర్వజన్మమున పుత్రుడవు, నా కాలము సమీపించినది. కావున నీకు నా నవ వజ్రముల హారమును నిచ్చితిని. నీవు రాక్షసద్వీపమందలి నా లంకాపట్టణమగు పాతాళలంకకు పరిపాలకుడవు కమ్ము" అని యతనికి పట్టము కట్టెను. ఇతనికి మహారాక్షసుడు, అతనికి దేవరాక్షసుడు, అతనికి కీర్తిధవళుడును, అతనికి తటిత్కేశుడును బుట్టిరి.

ఇక వానరోత్పత్తి యెట్లనగా రత్నపురమున తొల్లి పుష్పోత్తరుడను విద్యాధరుడు రాజ్యము చేయుచుండెను. అతనికి పద్మోత్తరుడను కుమారుడును, పద్మయను కూతురును గలిగిరి. శ్రీకంఠుడను రాజు పద్మను వివాహమాడఁదలచి తన విమానముపై నెత్తుకొనిపోయెను. పుష్పోత్తరుడు కోపించి శ్రీకంఠుని చంప నుద్యుక్తుడయ్యెను. అప్పుడు పైన చెప్పబడిన కీర్తిధవళుడను రాక్షసుడు వారికి సంధి సమకూర్చెను. కొంతకాలమునకు శ్రీకంఠుడు వానరద్వీపమునకు రాజయ్యెను. ఇతనికి వజ్రకంఠుడు, అతనికి దశరథుడు పుట్టిరి.

పైజెప్పిన రాక్షసరాజుకు తటిత్కేశు డొకనాడు వానరద్వీపమందు భార్యాసహితుడై యిచ్ఛావిహారముచేయు

చుండ నతని భార్యయొక్క ముఖము నొక్క వానరుడు బరికి పెట్ట భర్త కోపించి వానినిజంపెను. పిమ్మట పశ్చాత్తప్తుడై వైరాగ్యమును బొంది తన కొమరుడగు సుకేశునికి బట్టము గట్టెను. అచ్చట వానరద్వీప రాజగు దశరథునకు కిష్కింధుడు పుట్టెను. ఇతనిని స్వయంవరమందు మందిరమాలియను రాజు కూతురు వరింపగా అశనివేగు రాజు కోపాద్దీపితుడై వానరద్వీపమును జయించి యచటినుండి కిష్కింధుని బారదోలి రాక్షసద్వీపముపై తన సైన్యమును నడుపగా సుకేశుడును పారిపోయెను. ఈ సుకేశుడును కిష్కింధుడును పాతాళ లంకలో దాగుకొనిరి. అచ్చట సుకేశునికి మాలి, సుమాలి మాల్యవంతులను ముగ్గురు కుమారులు పుట్టిరి. మాలి పెద్దవాడైన పిమ్మట తనతండ్రి కపచారముచేసిన రాజును, అతని రాజ్యమును జయింపగోరి బయలుదేరెను. కాని యతడు యుద్ధమందు మరణించెను. అతని తమ్ముడగు సుమాలి కేకసి యనుదాని బెండ్లియాడి రత్నశ్రవసుడు, భానుకర్ణుడు విభీషణుడను కుమారులను చంద్రనఖ యను కూతును కనెను. వీరి పూర్వీకు డిచ్చిన నవరత్నముల హారము సుమాలిదగ్గఱనుండెను. దాని నెవ్వరు నెత్తజాలకుండిరి. దానిని వేయి సర్పములు కావలి కాచియుండెను. అట్టి వజ్రహారమును రత్నశ్రవసు డవలీలగా ధరించెను. ఆ నవరత్నములందీ బాలుని ముఖప్రతిబింబమును చూచి తండ్రి సంతసించి యతనికి "దశముఖ" యను బిరుద మిచ్చెను. భానుకర్ణునికి కుంభకర్ణుడని పేరువచ్చెను. మరియు చంద్రనఖకు శూర్పణఖ యను పేరు వచ్చెను.

దశముఖుడు పెద్దవాడై తపస్సుచేసి యనేక శక్తుల సంపాదించి మండోదరి యనుదాని బెండ్లియాడి యింద్రజిత్తను కొడుకును బడసెను.

## రావణుని దిగ్విజయము (౨)

పిమ్మట లంకాపురమునుసాధించి దానికధీశుడయ్యెను. వానరరాజైన కిష్కింధుని కుమారులగు ఆదిత్యరజస్సు, ఋక్షరజస్సు అనువారు నరకములో బడినారని విని యమరాజును పారదోలి వారినివానరద్వీపమందు రాజులనుగాజేసెను. ఆదిత్యరజస్సునకు ఇందువతివలన వాలి,సుగ్రీవులుపుట్టిరి. ఋక్షరజస్సునకు నలుడు, నీలుడు పుట్టిరి. వాలి కిష్కింధ నేలెను. దశముఖుడు లంక నేలుచుండెను. అతడు వాలి పరాక్రమము వినినవాడై రోషావేశ యతనిపై యుద్ధమునకు బయలుదేరి యోడిపోయి బంధింపబడెను. పిమ్మట వాలి యతనిని విడిచి పెట్టి మేరుపర్వతముపై తపస్సు చేయబోయెను. సుగ్రీవుడు తన కూతురగు సుభద్రను దశముఖున కిచ్చి పెండ్లిచేసెను. దశముఖు డంతటితో నూరకుండక రత్నావళియను నందకత్తె సత్యలోకమున నున్నదని దానిని తెచ్చుకొనదలచి పోవుచు మార్గమధ్యమందు వాలిని జూచి మేరువుక్రింద చేయిపెట్టి పర్వతముతోగూడ నతనిని గూల్పజూచెను. కాని వాలి తన బొటనవ్రేలితో పర్వతము నదుమగా క్రిందనుండిన దశముఖుడు పీడితుడై యనేక సంవత్సరములు రోదనముచేసెను. అందుచే నితనికి రావణుడను పేరువచ్చెను. రావణుడెట్లకేలకు ముక్తినొంది మారుతరాయడు యజ్ఞముచేయుచు జీవ

హింస చేసినందులకు కుపితుడై యా యజ్ఞమును ధ్వంసము చేసెను. పిమ్మట నలకూబరుడను రాజు ప్రజాపీడకుడని విని వానిని శిక్షింప రావణుడు బయలుదేరెను. కాని నలకూబరుని భార్యయగు ఉపరంభ తన భర్తను సన్మార్గమునకు ద్రిప్పెదనని వేడుకొనగా రావణుడు క్షమించి వెడలిపోయెను. పిమ్మట రదనపుర రాజగు ఇంద్రుని జయించెను. ఇంద్రుడింతవర కజేయుడుగానుండి యిప్పు డోడిపోయి దుఃఖించుచుండ నొకముని యిట్లు చెప్పెను. "నీవు ఆనందమాలిభార్యయగు అహల్య నవమానించియుంటివికాన నీ కిప్పుడీ యవమానము కలిగినది." ఇట్లు దిగ్విజయోన్మత్తుడై రావణుడు తన రాజధాని కరుగుచుండ అనంతవీర్యుడనుముని యతనితో నిట్లనెను. "ఓయీ! నీవు పరదారాసక్తుడవగుటంజేసి నీ వింతలో వాసుదేవుని యంశసంభూతుడగు వాని భార్యను చెరపట్టుదువు, దానివలన నీకు మరణముతప్పదు. ఈ మాటలను విని రావణుడు కటకటబడి తన్ను తానై కోరని స్త్రీని ఇకముందు పొందనని శపథముచేసిపోయెను.

## హనుమంతుని జన్మకథ (౩)

మహేంద్రపురమునకు మహేంద్రుడను రాజుండెను. అతనికి హృదయసుందరివలన అంజనాసుందరి యను కూతురుద్భవించెను. అనేక రాజు లీమెను వివాహమాడగోరిరి. అందు ఇద్దఱుమాత్రము మహేంద్రుని కిష్టులైరి. అందొకడు విద్యుత్ప్రభ యను నతడు. అతడు ధనవంతుడు, రూపవంతుడు కాని అల్పాయుష్మంతుడని విశదమయ్యెను. రెండవ

వాడు పవనాంజయుడు. అతడు విద్యలలో తక్కువవాడై నను దీర్ఘాయుష్మంతుడగుటచే అంజనాసుందరి నాతనికే వివాహముచేయ నిశ్చయించెను. బంధువులందఱు విచ్చేసిరి. వివాహదివసమున అంజనాదేవి చెలికత్తె యామెతో నిట్లనెను. "అమ్మా! మన రాజెంత పొరపాటొనరించినాడో గమనించితివా? ఉత్తమనాయకుని వదలి ఒక సాధారణజనుని నీ కంటగట్టెను. అమృతమొక దినమైన త్రాగిన మేలు. యావజ్జీవము విషము త్రాగుట పొసగునే" ఈ మాటలువిని అంజనాసుందరి యేమియు ననలేదు. ఈ సంభాషణము పవనాంజయుని చెవినిబడెను. పెండ్లియైన వెంటనే భార్య నొకగదియందుంచి యామెను పలుకరింపకపోయెను. అంత కొంతకాలమునకు రావణుడు వరుణునితో యుద్ధముచేయువాడై పవనాంజయుని సాయముకోరెను. పవనాంజయుడు ప్రయాణమై పోవుచు మార్గమధ్యమం దొక పెంటియంచ విభుని ప్రవాసమునకు వగచుచు విరహతాపమొందుట గాంచి తన భార్య జ్ఞాపకమునకువచ్చి వెంటనే రహస్యముగా తన నగరు చేరి అంజనాసుందరితో భోగించెను. పిమ్మట యదేరాత్రి తాను మరలిపోవునపుడు తన ముద్రాంగుళీయకము నామెకు గుఱుతుగానిచ్చి పోయెను. కొన్ని మాసాలతర్వాత ఆమెలో గర్భచిహ్నములనుజూచి అత్తమామలు ఆశ్చర్యాత్ములై యామె వ్యభిచరించెనని భావించి యెన్ని చెప్పినను వినక యామెను వెడలనడచిరి. ఆమె హనుపురమను పట్టణమందు నివసించుచుండ ఆమెకు కుమారు డుద్భవించెను. ఆ కుఱ్ఱనికి హనుమంతుడను జన్మస్థానపుపేరును బెట్టెను. భర్త యుద్ధమునుండి

మరలి వచ్చి తన భార్యకు కావింపబడిన అపచారమును విని చింతించి యామెను వెదకి మరల తన యింటికి బిలిచికొని వచ్చెను. హనుమంతుడు పెద్దవాడై తన తండ్రివలెనే రావణునికి యుద్ధములందు చాల సహాయముచేసెను. రావణుడు ప్రీతుడై సత్యవతియను తనకూతు నతనికిచ్చెను. శూర్పణఖ కూడ తనకూతురగు అనంతకుసుమ యనుదాని నతనికిచ్చెను. ఈ ఇద్దరి భార్యలతో హనుమంతుడు తన దేశమునకు మరలి వచ్చినప్పుడు సుగ్రీవుడును, నలుడును, తమ మిత్రుడగు రావణునికి సాయపడినందున హనుమంతునికి తమ కూతులగు పద్మరాగ, హరిమాలిని, అను వారినిచ్చి పెండ్లిచేసిరి.

## శ్రీరాముని జననము (౪)

హిమచూడాదేవి భర్తయు వజ్రబాహు పురందరుల తండ్రియు నగు విజయుడు అయోధ్య నేలుచుండెను. వజ్రబాహునకు కీర్తిధరుడు, అతనికి కోసల, అతనికి హిరణ్యగర్భుడును బుట్టిరి. అతని తర్వాత ౨౭గురు రాజులు రాజ్యము చేసిరి. కడపటివాడగు అనరణ్యుడు రఘురాముని కుమారుడు. అతనికి దశరథుడు పుట్టెను. ఇట్లుండ నొకనాడు రావణుడు వినోదార్థముగా నారదమునితో నిట్లనెను. "ఓయి నారదా! నేనెప్పుడు మరణింతునో చెప్పగలవా?" నారదుడు గుణించి యిట్లు చెప్పెను. "దశరథుని కొడుకును జనకుని కూతురును నీకు మరణమును ప్రసాదింతురు." రావణుడులికి పడెను. కాని విభీషణుడతని భయముపోనార్చి వారికి సంతా

నము కలుగకపూర్వమే వారియుద్ధరుని సమయింతును చూడు డని చెప్పి బయలుదేరెను. నారదు డంతకుమున్నే యీ యిద్దరికీ వార్త నంపెను. దశరథుడును జనకుడును భీతిచే తమ సింహాసనములపై తమ విగ్రహముల నునిచి యిద్దఱును గలసి యెటకో పోయిరి. తెలివిదప్పిన విభీషణుడు వారి విగ్రహముల పగులగొట్టి తృప్తిఁబొంది తిరిగిపోయెను. దశరథుడు తన నలుగురు భార్యలతో మగధదేశము చేరెను. ఈ నలుగురి పేర్లు అపరాజిత, సుమిత్ర, కైకేయి, సుప్రభ, అందు కైకేయి యను నామె భర్తకు ప్రవాసమందొక యుద్ధమందు సాయపడుటచే భర్త ప్రీతుడై రెండు వరముల కోరుకొమ్మనెను. కైకేయి వలయునపుడు కోరుకొందునని చెప్పెను. పిమ్మట దశరథునికి నలుగురు కుమారులు పుట్టిరి. అపరాజితకు పద్ముడు పుట్టెను. ఇతడే రాముడు. సుమిత్రకు లక్ష్మణుడు పుట్టెను. ఇతడు నీలవర్ణుడు. విష్ణ్వవతారుడు. కాన నారాయణుడను పేరుపొందెను. కైకేయికి భరతుడును, సుప్రభకు శత్రుఘ్నుడును పుట్టిరి. ఇక్కాలమున జనకునకు విదేహవలన సీతయను కూతురుద్భవించెను. ఒకనాడు బర్బర దేశమందలి మయూరమాలకు రాజైన అంతరంగమ యను మ్లేచ్ఛుడు మిథిలపై దాడివచ్చెను. జనకుడు దశరథుని సాయము వేడ రాముడుపోయి యతని నోడించెను. జనకుడు ప్రీతుడై సీత నిత్తునని మాట యిచ్చెను. తంటాల తాకట్ల నారదుడొకనాడు సీతను చూడవచ్చెను. నారదునిగడ్డము జడలు మున్నగునట్టి భయంకర చిహ్నములజూచి సీత బెదరి యింటిలో దాగుకొనగా నా కలహాభోజనుడు సందుదొరకె

నని భామంశీలుడను రాజునకు సీతను బలాత్కారముగా నెత్తుకొనిపొమ్మని పురికొల్పెను. అతడట్టులచేయక తనయొద్ద నుండిన ధనుస్సును జనకునకు బంపి దానిని రాము డెత్తి బాణము సంధింపగలిగెనేని పెండ్లిచేయుమని చెప్పెను. రాము డా ధనుస్సు నవలీలగా నెత్తి సంధించెను. సీతను పెండ్లియా డెను. లక్ష్మణుడు విద్యాధరులలోని పదునెనమండ్రు స్త్రీలను పెండ్లియాడెను. దశరథుడు వృద్ధుడై తన రామునకు రాజ్య మప్పగింపగోర కైకేయి తన వరముల జ్ఞాపకముచేసి రాము నడవికంపెను. సీతారామ లక్ష్మణులు అడవిలోతిరిగి తిరిగి చిత్రకూటమును చేరిరి.

## సీతాపహరణము (౫)

అచ్చటినుండి విజయపురమును చేరిరి. అచ్చట నొక సుందరి లక్ష్మణునివరించి యాతనిమెప్పింపలేక యురివేసుకొన దొడగెను. అప్పుడు రాముడు వారిరువురకు పెండ్లిచేసెను. క్షేమాంజలి యనురాజ్యములో జితపద్మయను రాకన్నియను లక్ష్మణుడుపెండ్లియాడెను. రామాదులు పిమ్మటదండకారణ్య మును ప్రవేశించిరి. అచ్చట శూర్పణఖకుమారుడు శంబూ కుడు తపస్సుచేయుచుండ లక్ష్మణుడు చంద్రహాసముతో నతని జంపెను. శూర్పణఖ శ్రీరామునితో మొరపెట్టుకొనబోయి వచ్చినపనినివదలి యతనిని మోహించెను. మోహము విఫలమ య్యెను. అందుపై ఆమెభర్తయగు ఖరుడు యుద్ధముచేయ వచ్చి రామునిచే చచ్చెను. రావణుడు తనచెల్లెలిని తృప్తి పరుపదలచి లక్ష్మణుడు లేనిసమయములో దూరమునుండి

లక్ష్మణునివలెనే యార్తనాదముచేసెను. సీత రాముని లక్ష్మణ సహాయార్థమంపెను. అంత రావణుడు సీతనెత్తుకొని విమాన ములో నెడలిపోయెను.

## సీతాన్వేషణము (౬)

సీతకై రాముడు వెదకి వెదకి విఫలుడయ్యెను. అంత నొక సంఘటనము జరిగెను. సహజజాతి అనువాడు సుగ్రీవుని భార్యయగు తారను ప్రేమించి మాయచే సుగ్రీవుని వేషమున నామెతో క్రీడించెను. నిజమైన సుగ్రీవుడు వచ్చి చూచి మాయా సుగ్రీవునితో తగవులాడి యోడిపోయి రాముని నాశ్రయింప నతడు యథార్థమునెఱిగి దొంగమగనిజంపి సుగ్రీ వునకు తారను, రాజ్యము నిప్పించెను.

పిమ్మట హనుమంతుడు లంకజేరి సీతనుచూచి రావ ణుని కిరీటమునుతన్ని లంకనుదహించి తిరిగివచ్చెను. రాముడు సుగ్రీవ హనుమదాదుల సైన్యములతో లంకనుముట్టడించి రావణునితో యుద్ధముచేసెను.

## యుద్ధకాండము (౭)

రావణుడు ఇంద్రజిన్నాగములతో రామసైన్యమును గట్టెను. లక్ష్మణుడు తన గరుడవాహనమును పిలిచి నాగ ముల నాశనముచేసెను. రావణుడు లక్ష్మణునిపై శక్త్యాయు ధము ప్రయోగింప అతడుచచ్చినట్లు క్రిందపడెను. భామండ లుడు 'ద్రోణఘుము'నుండి అమృతము తెచ్చి లక్ష్మణుని బాగు చేసెను. లక్ష్మణుడు అప్పుడు గరుడారూఢుడై తనచక్రముతో రావణుని తల దునిమెను.

ముగింపు (౮)

విభీషణుడు లంకకురాజయ్యెను. కుంభకర్ణుడును ఇంద్ర జిత్తును చిన్న చిన్న రాజ్యములకు రాజులయిరి. రాముడు పుష్ప విమానములో అయోధ్య చేరెను. రాముడు పట్టాభిషిక్తు డయ్యెను. సీతతోడను, ప్రభావతి, రతినిభ, శ్రీదమ, యను తన తక్కిన మువ్వురుభార్యలతోడను శ్రీరాముడు సుఖముగా నుండెను. లక్ష్మణుడు తన యెనమండుగురు భార్యలగు విశల్య, రూపావతి, వనమాల, కల్యమాలిక, రత్నమాలిక, జితపద్మ, భయవతి, మనోరమ యను వారితోడను వారి ౨౫౦ మంది పుత్రులతోడను, పైగా తన ౧౬ వేల యెక్కుడు భార్యల తోడను సుఖముగా నుండెను.

లఘువిమర్శ

ఇది జైనరామాయణ కథాసారము. స్థలసంకోచముచే ఇంకను కొన్నివిషయములు పరిత్యక్తములయ్యెను. దీనివలన తెలిసికొనదగిన విషయములు కొన్నిగలవు. మనము జైన గ్రంథముల నవలోకనచేయుట అవసరము. మన మతమునకు విరుద్ధములయిన బౌద్ధ జైన చార్వాక లోకాయత సిద్ధాంత ములను మనము పాషండమతముల పట్టీలోజేర్చి తదనుయా యులను నాస్తికులనియు, వేదవిరుద్ధులనియు వేదబాహ్యు లనియు నిందించి యుపేక్షాభావమును చూపినారము. అటు కాక వారివాఙ్మయమును వారిజాతక కథలనుగూడా చదువ వలెను.

ఈజైనకథ వాల్మీకిరామాయణమునకు చాలభిన్నమై యున్నది. రాక్షసులకును, వానరులకును సంబంధ ముండెనని తెలియుచున్నది. సీత అయోనిజకాదు. ఆమె తల్లి పేరు "విదేహ". విదేహ కూతుగు అయోనిజయని మనవారు వర్ణించిరి. రాము డేకపత్నీ వ్రతుడు కాడు. రాముడు ప్రేమించి నది అంతరంగమ యను మ్లేచ్ఛరాజును. అనగా అతడే పరశు రాముడు. అతడు పర్యాయవాడు. హనుమంతుడు నిత్యబ్రహ్మ చారి కాడు. రావణుడొక్క స్త్రీలోలత్వమున దక్క-తక్కిన విషయములం దాదర్శప్రాయుడే. బహురాజులకు స్త్రీ సంగతి నాటికిని నేటికిని మిక్కుటము. కాని రావణుడెన్ని చేసినను సీతాపచారకుడు కాకుండిన నిప్పటియనేక విటరాజులవలె, రాజవిటులవలె నిందాస్పదుడు కాకుండెడివాడు. అతడహింసాప్రియుడు. యజ్ఞములయందు హింస యుండుటచే యజ్ఞ ధ్వంసియయ్యెను. కాని యతడు వేదమతద్వేషియనియు,ముని హింసకుడనియు వాల్మీకి తన కలముయొక్క మసిచే రావణుని ముఖమును నల్లగాచిత్రించెను. లక్ష్మణునకు ఎనమండ్రుపట్టపు భార్యలట, ౧౬ వేలు పై పెండ్లాలట ! ఈ గుంపునంతయు భాగవతమునందు శ్రీకృష్ణులవారి కంటగట్టినారు. ఈ బేర సారమేపౌరాణికునివలన జరిగెనో దురూహ్యము. ఇచ్చట లక్ష్మణుడే గరుడవాహనుడు. చక్రి, రావణాంతకుడు. మఱియు నారాయణాపరావతారుడు. ఇందు మారీచుడు లేడు. బంగారు జింక మొదలేలేదు. ఇందలి వంశావళులు వాల్మీకులవారి వంశావళులతో భిన్నించుచున్నవి. శంబూకుడు శూర్పణఖ యొక్క పుత్రుడనియు నతనిని లక్ష్మణుడు వధించెననియు

నిందున్నది. శంబూకుడను శూద్రతపస్విని రాముడు ఖండించె నని యుత్తర రామాయణమున నున్నది. శూద్రుల తపస్సు అంత యోగ్యరానిదై యుండెనేమో? "దశముఖ" యను పదమున కుత్పత్తి హేతు విందు సమంజసముగా గనబడుచు న్నది. జైన రామాయణ మందు కుంభకర్ణుడును, ఇంద్ర జిత్తును మరణించలేదు. మరియు సంజీవిపర్వతమును హను మంతుడు తెచ్చెనన్న దిచటకల్ల. భామండలుడు (ఇత డెవడో?) అమృతమును దెచ్చెననియున్నది. రావణుడు మహేశ్వరునిగూర్చి తపస్సుచేసెననియు అతని చేతులదురద వదలునట్లు కైలాసముపై బొటన వ్రేలితో శివుడే యదిమె ననియు మనము వినినసంగతి. ఇందు వాలిచే నదుమబడెనని యున్నది. మఱియు నీ జైనరామాయణములో నహింసా విష యమును, రావణుని యజ్ఞ ధ్వంసకత్వమును తెలుపుట జైన సిద్ధాంత ప్రచారమునకై చేసినమార్పని స్పష్టమగుచున్నది. మహేశ్వరునకు మారుగా నిచ్చట ప్రతిఘట్టమందు జిన నాథుని పేర్కొనియున్నారు. ఇదియు మతప్రచారార్థమేమై యుండనోపు. ఈ రామాయణములో విశ్వసనీయ విషయము లనేకములున్నవి. వాల్మీకి రామాయణమందు రాముడాదర్శ పురుషుడు. ఏకపత్నీవ్రతుడు. రావణుడు పరమదుర్మార్గుడు. ఇది హిందూపౌరాణిక సంప్రదాయమే. విద్వద్వరేణ్యులు ఈ జైన రామాయణము అంతర్భాగముగా కలిగిన త్రిషష్టి శలాకపురుష చరితనుచదివి తమ పరిశోధన ఫలితమును ఆం ధ్రులకు ప్రసాదింతురుగాక !

## బౌద్ధజాతక రామకథ

వెబర్ అను పాశ్చాత్య పండితుడు జాతక కథలలోని "దశరథ జాతకము" అను కథను ఆధారముగాచేసికొని ఒక పిచ్చి సిద్ధాంతమునుచేసి రామాయణము క్రీ. శ. ౧౦౦లో వ్రాయబడినట్టిదని చాలా అవస్థపడి వాదించినాడు. బౌద్ధ జాతక కథలలోని విశేషమేమో దాని సారాంశ మిచ్చుట వ్రాయుచున్నాను.

పూర్వకాలమందు వారణాసిలో దశరథుడను రాజుండెను. అతని భార్యకు ౧౬౦౦౦ దాసీజన ముండెను. ఆ దంపతులకు ఇద్దరు కుమారులు ఒక కూతురును కలిగిరి. కుమారుల పేరులు రామ లక్ష్మణులు. బిడ్డపేరు సీత. రాణి చనిపోయెను. రాజు మరొకతెను పెండ్లాడెను. ఆమెకు భరతుడనువాడు పుట్టెను. వాడు ఎనిమిదేండ్లవాడు కాగా రాణి భర్తతో ఇట్లనెను. "రాజా! పూర్వము నాకొక వరమిచ్చియుంటివి. ఇప్పుడు దానిని పూర్తిచేయుము. నా కుమారునికి రాజ్య మిమ్ము." తన మొదటిభార్య సంతానాని కపాయ మగునని రాజు భయపడి వారిని ౧౨ ఏండ్లవరకు వేరుచోట నుండుటకై నియోగించెను. జ్యోతిష్కులు దశరథునితో తానింక ౧౨ ఏండ్లవరకు బ్రదుకునని చెప్పినందున పై విధముగా వారికి చెప్పెను. సీతారామ లక్ష్మణులు హిమాలయానికి వెళ్ళి అచ్చట నివసించిరి. తొమ్మి దేండ్లు గడచిన తర్వాత జ్యోతిష్కుల లెక్కలను తప్పుజేయువాడై దశరథుడు చనిపోయెను. రాణి తన కుమారునికి పట్టము గట్ట

జూచెను. కాని భరతుడు రామాదులను తెత్తునని బయలుదేరి రాముని కాంచెను. రాముడు రాజ్యము స్వీకరింప నిరాకరించెను. "నా తండ్రి ౧౨ పండ్లవరకు నన్ను రాజ్యములోనికి రావలదన్నాడు. అతని యాజ్ఞ నుల్లంఘించను" అని యనెను. మరెట్లు? "నా పాదుక లిత్తును తీసుకొనిపొమ్ము" అనెను. అట్లే భరతుడు పాదుకలను సింహాసనముపై నుంచి రామునిపక్షముగా పాలించెను. ౧౨ పండ్లు పూర్తి అయిన తర్వాత రాముడు తిరిగివచ్చి పట్టాభిషిక్తుడై ౧౬,౦౦౦పండ్లు పరిపాలించెను.

బుద్ధుని పూర్వజన్మలో ఈ కథ జరిగెను. శుద్ధోదనుడే దశరథుడు. రాముని తల్లియే మాయాదేవి. సీతయే రాహులుని తల్లి. ఆనందుడే భరతుడు. శారిపుత్రుడే లక్ష్మణుడు. బుద్ధుడే రాముడు.

ఇది దశరథ జాతకము అను పేరుగల కథ. బుద్ధుని మతవ్యాప్త్యనంతరము అతని గొప్పతనాన్ని నిరూపించుటకు భక్తులచేత ఇట్టి "జాతక కథలు" కొల్లలుగా అల్లబడెను. దీని నాధారముగా చేసుకొని విమర్శించుట చాలా దుర్బలమగు వాదము. సుప్రసిద్ధమగు రామాయణ కథను బౌద్ధులు తమ జాతక కథలోనికి తమ కవసరమగు మార్పులతో స్వీకరించినారని స్పష్టముగా వ్యక్తమగుచున్నది.

ఇందులో ఇంకొక విశేషమున్నది. ఈ బౌద్ధరామాయణములో రాముడును సీతయు అన్న చెల్లెండ్రుగా నిరూ

పింపబడినారు. వీరిరువురికిని పెండ్లియైనట్లు యీ జాతక కథ తెలిపినది. ఇదేమి చిత్రమనగా శక (Scythian) జాతిలో ఈ యాచారముండెనని పీకాక్ గారు తెలిపినారు. † అయితే యీ యాచారము ఆర్యహిందువులలో ఏనాడును ఎందును లేకుండెను. ప్రధానాదర్శమందే భిన్నించిన యీ విధానమునుబట్టి బౌద్ధులు సుప్రసిద్ధ రామాయణమును అనుసరించి ఒక జాతక కథను కల్పించినారని వెల్లడి యగుచున్నది.

† Peacocke—India in Greece be PP 191-195

# ఇతర రామ కథలు

కాళిదాసు రఘువంశములో శ్రీరామునికథ నెత్తుకొన్నాడు. కాళిదాసునికాలము క్రీ. పూ. ౫౫ నుండి క్రీ. శ. ౪౫౦ మధ్యన అని విమర్శకులు రెండుమేరలకు వచ్చినారు.

జైనరామాయణ మొకటికలదు. అదియు క్రీస్తుశకాదియందు రచితమైయుండును. రామాయణము జైనమతవ్యాప్తికాలమందు జనాదరణమందిన సుప్రసిద్ధ కథయగుటచేత జైనులును దానిని తమమతవ్యాప్తి కనుకూల పరచుకొన్నట్లున్నది.

పాణినికిని, అశ్వలాయనునికిని పూర్వము మహాభారత కథామూల ముండెననియు, రామాయణ మపుడున్నది లేనిది నిర్ణయించుటకు వీలులేదనియు ఆర్. జీ. భండార్కరుగారు దక్కన్ ప్రాచీన చరిత్రలో వ్రాసిరి. పాణినిలో కృష్ణాదుల పేరులుకలవు కాని యెచ్చటను శ్రీరాముని పేరు కానరాదనియు విమర్శకులందురు. పాణిని క్రీ. పూ. ౬౦౦ లో అని కొందరు ౫౦౦ లో నుండెనని మరికొందరందురు.

కథా సరిత్సాగరమును గుణాఢ్యుడు శాలివాహనుని కాలమందు అనగా క్రీ.పూ. ౨౦౦ ప్రాంతమందు రచించెను. అందు రామాయణకథా సారమున్నది. అయితే గుణాఢ్యుని పైశాచీకథ లుత్పన్నములై మనకిప్పుడు లభ్యముకావు. సోమదేవుడు కథా సరిత్సాగరమును సంస్కృతములో రచించెను. కాళిదాసు, సోమదేవుడు, మున్నగువారికి తెలిసినరామకథ

యెట్టిదో ఆ కథలు మనకిప్పుడులభ్యమగు వాల్మీకిరామాయణ కథతో నెందెందు భిన్నించినవో తెలుసుకొనుటకు వాటిని సంగ్రహముగా నిందుదాహరింతును.

శ్రీరాముని కథలు భారతాది పురాణాలలోను, ఇతర గీర్వాణ గ్రంథములందును కలవు. అందు కొన్నింటిలో నుండు విశేషములనుమాత్రము సంగ్రహముగా సూచింతును.

౧ కథాసరిత్సాగరము

దీనిని పైశాచీభాషలో గుణాఢ్యుడు రచించెనందురు. అదిప్పుడు లభించుటలేదు. క్రీ. శ. ౧౧౦౦ ప్రాంతమందు కాశ్మీరమును హర్షదేవుడను రాజు పాలించెను. ఆ కాలమందచ్చటనుండిన సోమదేవుడను నాతడు దీనిని సంస్కృతములో రచించెను. అతడా గ్రంథాదిలో నిట్లు ప్రతిజ్ఞ చేసెను. "ఇది మూలమైన పైశాచీ బృహత్కథకు సరిగా నుండును. ఇంచుకైనను అతిక్రమింపదు." మూలగ్రంథము క్రీ. పూ. ౨౦౦ ఏండ్ల ప్రాంతమందు రచితమని తెలిపినాను. కావున క్రీస్తు శకాది కాలమందో అంతకు పూర్వమో రామాయణకథ జనులందెట్టిరూపమున వ్యాపించెనో కొంత తెలుసుకొనవచ్చును. అందుచేత శ్రీ వేదం వెంకటరాయశాస్త్రిగారి తెనుగునుండి యీ క్రిందివి ఉదాహరించుచున్నాను.

"తొల్లి అయోధ్యాపతియైన దశరథుని కొమరుడు భరత శత్రుఘ్న లక్ష్మణుల యన్న శ్రీరాముడు ఉండెను. ఆయన రావణునిపరిమార్చుటకు అవతరించిన విష్ణువు. తండ్రి విధివియోగమున సీతా లక్ష్మణులతో అడవికిబంపెను, అచట

రావణుడు మాయచే సీతను హరించి, దారిలో జటాయువును సంహరించి ఆమెను లంకకు గొనిపోయెను. రాముడు వాలి వధచే సుగ్రీవుని వశపరుచుకొని యాంజనేయునిబంపి యామె వృత్తాంతమును తెలిసికొని పోయి సముద్రమున కానకట్టగట్టి రావణుని సంహరించి లంకారాజ్యము విభీషణునికిచ్చి సీతను గైకొనిపోయెను."

"సీతపై జనులు నిందమోపిరని గర్భవతియగు సీతను కానకుబంపెను. ఆమె వాల్మీకి ఆశ్రమమున జేరెను. అచ్చటి మునులును సీతను సందేహించిరి. అప్పుడు సీతను పరీక్షించుటకై ముని లిట్లనిరి. "ఇచట టీటిభసరస్సు కలదు. పూర్వ మొక టీటిభిని భర్త శంకించి దూషణచేసెను. టీటిభి ఆక్రందించెను. ఆ సరస్సును దేవతలామె శుద్ధ్యర్థమై నిర్మించిరి. అందు సీత తన పారిశుద్ధ్యమును రుజువు చేయుగాక !" సీత ఆ సరస్సులో దిగి అవతలి గట్టుచేర భూదేవిని ప్రార్థించెను. ఆమె సీతను ఒడిలో నుంచుకొని అవతలిగట్టు చేరెను... ...

# 3

## రామ వాల్మీకుల కాలము

శ్రీరామచంద్రుఁడు ఈ భరతఖండములో ఎప్పు డుండెనో నిర్ణయించుట మహాకష్టము. అట్టి నిర్ణయ మంతయు ఊహా ప్రపంచములో నుండునట్టిది. ఈ విషయములో మన పురాణాలు అంతగా సహాయపడవు. ప్రాచీన మహాపురుషులు, మహర్షులు, మానవాతీతులనియు, అద్భుత కార్యముల జేసిరనియు, వేనవేలయేండ్లు జీవించిరనియు పురాణాలలో వ్రాసినారు. శ్రీరాముడు త్రేతాయుగములో నుండెననియు, శ్రీకృష్ణుఁడు ద్వాపరయుగములో నుండెననియు కొందఱు వ్రాసిరి. ఒక్కొక్క యుగము లక్షల సంవత్సరాల కాలముతో కూడియుండునని పురాణకారులే నిర్ణయించినారు. త్రేతాయుగము ౧౨ లక్షల ౯౬ వేలేండ్ల వరకుండెను. ద్వాపరము ౮ లక్షల ౬౪ వేల యేండ్లుండెను. కావున శ్రీరాముడు పౌరాణికుల లెక్కల ప్రకారము కలియుగ సంవత్సరాలు కలుపుకొని, వారు జీవించిన ౧౧ వేల యేండ్లను కలుపుకొని, త్రేతాయుగము తుదిలోనె యుండెనని తలచినచో ఇప్పటికి కనిష్ఠము ౨౧,౮౬,౦౦౦ యేండ్లకు పూర్వుఁడుగా నుండి

యుండవలెను. శ్రీరాముడు పదకొండువేల యేండ్లు జీవించె ననుటకు ప్రమాణము.

శ్లో. హత్వా క్రూరం దురాత్మానం దేవర్షీణాం భయావహం
దశవర్ష సహస్రాణి దశవర్షశతానిచ. బాల ౧౫ స. ౨౯ శ్లో.

రామునికిన్ని వేల యేండ్లు బ్రతికినది ఇన్నిలక్షల యేండ్లకు ముందుండినదియు విశ్వసనీయముకాదు. అతడు శ్రీకృష్ణునికన్న పూర్వీకుడని మాత్రము తెలియ వచ్చుచున్నది. చారిత్రక దృష్టితో వీలయినంతవరకు అతని కాలము నిర్ణయించు ప్రయత్నము చేయుదము.

మొదట పాశ్చాత్య సాంస్కృతిక పరిశోధకుల యభిప్రాయము కనుగొందము. "కెప్టన్ ట్రాయర్" ఇట్లు వ్రాసెను. "హిందువుల గొప్పరాజ్యాలు మా క్రీస్తుశకమున కంటె కనిష్ఠము 3,000 యేండ్లకు ముందే చాల నాగరికత పొంది యుండెనని విశ్వసింతుము. అంతకు పూర్వమే రామాయణ కథానాయకుడైన రాముడు ఉండెనని చెప్పవలసియున్నది." † పాశ్చాత్య పండితులలో రామునికి ఇంతటి ప్రాచీన కాలమును నిర్ణయించినవారు ఈ ట్రాయర్ పండితులొక్కరే. ప్రొ. హీరెన్‌గారు ఇట్లు వ్రాసినారు.

---

† I cannot refuge credence to this fact Viz. that the great states highly advanced in civilization, existed at least 3,000 years before our era. It is beyond that limit that I look for Rama, the hero of the Ramayana.

"అయోధ్యానగరము క్రీ.పూ. ౧౫౦౦ నుండి ౨౦౦౦ ప్రాంతములో నిర్మింపబడినదని చెప్పినచో అదెన్నటికిని అతిశయోక్తి కానేరదు. †

ఫాష్ (Fauche) అను ఫ్రెంచి పండితుడు క్రీ. పూ. ౧౩౨౦ లో రామాయణము రచింపబడెనని వ్రాసెను. ఇటలీ భాషలోనికి రామాయణమును భాషాంతరీకరించిన గొర్రెసియో (Gorresio) అను నతడు క్రీ. పూ. ౧౨౦౦లో రామాయణము రచింపబడినట్లు అభిప్రాయపడెను. ఆర్థర్ లిల్లీ అనువాడు ఇట్లువ్రాసెను. "ప్రపంచములో రచితములయిన గాథలలో రామాయణము ఉత్తమస్థానము వహించుచున్నది. అది ౩౦ లేక ౪౦ శతాబ్దములనుండి ప్రచారమందున్నది." మొత్తముపై చాలామంది పాశ్చాత్య పండితుల అభిప్రాయములో క్రీ. పూ. ౧౪౦౦ ఏండ్లకన్న పూర్వములో రామాయణము లేకుండెను. మరొక పాశ్చాత్య పరిశోధక వర్గమువారి అభిప్రాయములో రామాయణ మూలకథ క్రీ. పూ. ౫౦౦ కంటె ముందుగానే రచింపబడెను. అటుతర్వాత క్రీ. పూ. ౨౦౦ నుండి దానిలో చాల్గా భాగాలను పెంచుచు వచ్చిరి. ఈ అభిప్రాయమును "మెక్డానెల్"గారు తమ "సంస్కృత వాఙ్మయ చరిత్ర" అను ఆంగ్ల గ్రంథములో వెలిబుచ్చిరి.

రమేశచంద్రదత్తుగారు ఇట్లభిప్రాయ పడినారు. "రామాయణ మూలరూపగ్రంథము ఎప్పుడు రచింపబడెనో చెప్పుటకు వీలులేదు. సూత్రవాఙ్మయములో మహాభారత

† Prof. Heeren—Historical researches Vol. II Page 227.

సూచనలున్నవిగాని రామాయణమును గురించి యేమియు కానరాదు. క్రీ. పూ. ౫౦౦ ప్రాంతములో విజయుడను వంగ రాజు సింహళద్వీపమును జయించెను. అయితే సింహళము ఆర్యులకు అంతకంటె చాలాకాలానికి పూర్వమే విదితమై యుండెను. వింధ్యకు దక్షిణమున ఆటవికు లుండిరి. కోతులే విశేషముగా నుండెను. ఈ దక్షిణభాగములో ఆర్యనాగరికత వ్యాపించినట్లు రామాయణములో తెలుపలేదు. ఈ కారణాలచేత రామాయణము పౌరాణిక యుగముయొక్క తుదిభాగములో రచింపబడియుండును. ‡ పౌరాణికయుగము ర-చ-దత్తుగారి యభిప్రాయ ప్రకారము క్రీ. పూ. ౧౪౦౦ నుండి క్రీ. పూ. ౧౦౦౦ వఱకు వ్యాపించియుండెను.

రమేశచంద్రదత్తుగారు ఒక్క యంశాన్ని బాగా కని పెట్టినారని తోచుచున్నది. రామాయణములో శ్రీరాముని విష్ణ్వవతారముగా వర్ణించినారు. కాని దత్తుగారి అభిప్రాయములో విష్ణువప్పటికి పౌరాణికులలో ప్రాధాన్యమునకురాలేదు. ఇంకను ఇంద్రునకే ఆధిపత్య ముండెను. అట్టి యాధిపత్యమును శ్రీకృష్ణుడు తొలగించెను అని దత్తుగారు వ్రాసి దానికి సహాకారముగా పారస్కరగృహ్యాసూత్రములలో (౨-౧౭-౯) నాగేటిచాలు దేవత అనగా "సీత" ఇంద్రుని భార్యగా వర్ణింపబడినదని వ్రాసినారు.

---

‡ Early civilization of India by R. C. Dutt, Vol. II.

"జనకుడు సీతయొక్క తండ్రి. అతడు యాజ్ఞ్యవల్క్య, శ్వేతకేతు, ఆరుణేయాదులకు బ్రహ్మవిద్యను బోధించెనని శతపథబ్రాహ్మణములో వర్ణించినారు. యాజ్ఞ్యవల్క్య వాజసనేయి అను నతడు జనకుని ఆస్థాన పురోహితుడు. అతడు యజుర్వేదపృథక్కరణమును చేసెను. శుక్ల యజుర్వేదము, శతపథబ్రాహ్మణము అను భాగాలుగా చేసెను." అని దత్తు గారు వ్రాసినారు. దీనినిబట్టి శతపథబ్రాహ్మణ రచనాకాలములో రామాయణము రచింపబడెనని వారి యభిప్రాయము.

సాధారణముగా పాశ్చాత్యుల జాడలలోనే మన హిందూస్థాన పండితులును నడతురు. పాశ్చాత్యులు కొన్ని చారిత్రకపు మైలురాళ్ళను స్థాపించుకొన్నారు. "యవన" అనేది ఒక రాయి. అది క్రీ.పూ. 326లో అలెగ్జాండరుతో మనదేశానికి దిగుమతి అయినది. ఆ కాలములోను అంతకు ముందు 300 సంవత్సరాలలోను సూత్రాలు వ్రాయబడినవి. అది రెండవ మైలురాయి. అంతకంటె 600 పండ్లకుముందు బ్రాహ్మణారణ్యకోపనిషత్తులు వెలసినవి. (అనగా-క్రీ. పూ. 1200 ప్రాంతములో) అది మూడవ మైలురాయి. బ్రాహ్మణములకు సూత్రములకు మధ్యకాలములో ముఖ్యపురాణాలు ప్రకాశమానమైనవి. అంతకంటే మరి అయిదారు నూర్ల పండ్లకు ముందుకు వెళ్ళితే వేదాలకాలములో పడిపోతాము. అనగా క్రీ. పూ. 2000 పండ్ల కంటే ముందుకాలములో వేదాలు లేకుండెను. అది నాల్గవ మైలురాయి. ఈ విధముగా పాశ్చాత్య విమర్శకులు విమర్శించుచుతూ వచ్చినారు. ఇటీవల మోహంజో దారోలోను హరప్పాలోను బయలు

దేరిన శిల్పాలను వివిధ వస్తువులనుబట్టి అచ్చటి నాగరికత క్రీ. పూ. 3000 సంవత్సరములకన్న పూర్వమునదని అంచనాలు వేయుటచేత పూర్వసిద్ధాంతాలు తారుమారు అగుచున్నవి. పైగా డాక్టరు ప్రాణనాథగారు క్రీ. పూ. 4000 ప్రాంతమందే మోహాంజోదారో నిర్మాణాలు జరిగినవని వాదించుచున్నారు. వారు "ఋగ్వేద దశమమండలానికి ఆ ఇష్టులోని అతి పురాతన పిరమిడ్లనాటి రాజులకును ముడిపెట్టుచున్నారు. ఈచర్చ మనకు సంబంధించినది కాదు. చెప్పబోయిన దేమనగా రామాయణ మూలగ్రంథ రచనయు, రాముని యునికియు, వాల్మీకి కాలమును క్రీ. పూ. 1400కంటె పూర్వమునదనియు బహుశా క్రీ.పూ. 2400 సంవత్సరములనాటిదనియు నేను అభిప్రాయపడుచున్నాను. రామాయణము భారతముకన్నను పూర్వమునదనుటలో సందేహములేదు. ఒకరిద్దరు అది తర్వాతి రచనయనినను అది రామాయణమందలి ప్రక్షిప్తభాగానికిమాత్రమే వర్తించును. మహాభారతములో రామాయణ కథాసంగ్రహము వ్రాయబడినది. మరియు కొన్ని నీతులు రామాయణములోనివని చెప్పి యుదాహరించినారు. కావున మహాభారతము రామాయణముకన్న తర్వాతిదే.

## మహాభారతకాలము

మహాభారతవీరు లుండిన కాలమును గురించి మహాభారతయుద్ధము జరిగిన కాలమునుగురించి వివిధ పరిశోధకులు వివిధరీతిగా అభిప్రాయము లిచ్చినారు. శ్రీ పెండ్యాల వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రిగారు తమ మహాభారత చరిత్రములో ఇట్లు వ్రాసినారు.

"మహాభారత యుద్ధకాలమునుగురించి ప్రాక్పశ్చిమ దేశస్థ గ్రంథకర్తల అభిప్రాయములు క్రింద నిచ్చుచున్నాను.

| | | | |
|---|---|---|---|
| పంచాంగకర్తలు, | క్రీస్తునకు పూర్వము | ౩౧౦౦ | పండ్లు |
| కల్హణుడు | ,, | ౨౪౪౮ | ,, |
| సుధాకరుఁడు | ,, | ౨౪౪౮ | ,, |
| భాగవతము | ,, | ౧౫౬౫ | ,, |
| మత్స్య పురాణము | ,, | ,, | ,, |
| వాయు పురాణము | ,, | ,, | ,, |
| విష్ణు పురాణము | ,, | ౧౫౩౦ | ,, |
| ధీరేంద్రనాథపాలు | ,, | ౧౫౨౦ | ,, |
| బంకించంద్ర | ,, | ,, | ,, |
| బాలగంగాధరతిలకు | ,, | ౧౪౦౦ | ,, |
| కోల్బ్రూకు | ,, | ,, | ,, |
| విల్సన్ | ,, | ,, | ,, |
| ఎలిఫిన్స్టన్ | ,, | ,, | ,, |
| విల్ఫర్డు | ,, | ౧౩౮౦ | ,, |
| జకానన్ | ,, | ౧౩౦౦ | ,, |
| ప్రాట్ | ,, | ౧౩౦౦ | ,,'' |

శ్రీ పెండ్యాల వెంకటసుబ్రహ్మణ్యశాస్త్రిగారు తాము స్వయముగా "భారతయుద్ధము క్రీస్తునకు పూర్వము ౧౬ శతాబ్దమందు జరిగిన" దని వ్రాసినారు. మోహన్‌జోదారో పరికరాలనుబట్టి పరిశోధకుల అభిప్రాయములో ఆర్యుల నాగరికత క్రీ. పూ. 3000 పండ్లకు పూర్వమునుండియే వచ్చినదని

వ్రాసినది సమంజసముగా కనబడుచున్నది. దానినిబట్టి రామాయణము ౨౫౦౦ ప్రాంతములోనిదని ఊహింపవచ్చును. మహాభారత రచనాకాల నిర్ణయము నీ చర్చలో ప్రధానముగా పెట్టుకొనుట అప్రస్తుత మగును. టూకీగా ఇంతమాత్రము చెప్పవచ్చును.

భాగవత, మత్స్య, వాయు పురాణములలో మహాభారత కాలము క్రీస్తునకు పూర్వము ౧౫౬౫ అని నిర్ణయింపబడినది. విష్ణుపురాణములో క్రీ. పూ. ౧౫౩౦ అని చూపబడినది. అదంతవ్యత్యాసహేతువుకాదు. ఈ నాలుగు పురాణాలలోని రాజవంశావళి కాలాలను అబద్ధమని త్రోసివేయ వీలులేదు. కావున మహాభారత యుద్ధకాలము క్రీ. పూ. ౧౫౬౫ గా గ్రహింపవచ్చును. రామాయణ కాలములో వింధ్యకు దక్షిణమునసుండిన దేశాలు అరణ్య ప్రదేశాలై యుండెను. మహాభారత రచనాకాలమునాటికి అచ్చట నానానగరాలు, మండలాలు, ప్రభుత్వాలేర్పడెను. కురు పాండవుల పక్షముగా దక్షిణదేశమునుండి, ఆంధ్రపాండ్యాది ప్రభుత్వాలవారు గొప్ప సేనలతో సహాయార్థమై వెళ్ళిరి. అటవీప్రదేశము నాగరకతచెందిన దేశముగామారుటకు ౮౦౦ పండ్లయినను పట్టియుండును. ఈ విధముగా చూచినను రాముని కాలము క్రీ. పూ. ౨౫౦౦ నాటిదై యుండును. (Count Bjornstjerna) జోరిన్సు జార్నాగారు మహాభారతము క్రీ. పూ. ౨౦౦౦ కన్న పూర్వమున్నదని అభిప్రాయపడినారు. ఈ కారణముచేతను రామాయణము క్రీ. పూ. ౨౫౦౦ నాటి దనవలసియుండును.

## ఇంద్రపూజాప్రాముఖ్యము

రమేశచంద్రదత్తుగారు ఒక అంశాన్ని స్పృశించి విడిచినారు. అది యింద్రపూజను గురించినచర్చ. వైదిక పౌరాణిక యుగాలను నిర్ణయించుటకు ఇంద్రపూజ ఒకమంచిమైలురాయి. ఇంద్రపూజ విశేషముగా నుండెనా అది వేదకాలానికి సంబంధించినది. వైష్ణవప్రాముఖ్య మెక్కువగా నుండెనా అది భారతకాలము తర్వాతిదిఅని నిర్ణయింపవలసియుండును. మహాభారతములో శ్రీకృష్ణుడు గోవర్ధనధారిగా వర్ణింపబడినాడు. శ్రీకృష్ణుడు తనకాలములో వర్తించుచుండిన ఇంద్రపూజను తొలగించి విష్ణుపూజను ప్రచారములోనికి తెచ్చెను. ఈ మార్పుచేత ఇంద్రునికి కోపము వచ్చుననియు అతనివల్ల అందరికిన్ని మహాబాధ కలుగుననియు జనులు భయపడిరి. అందులకు తగినట్లుగా అప్పుడు వానగండ్ల వర్షమున్నూ ధారావర్షమున్నూ విపరీతముగా దినాలపేరట కురిసెను. జనులు భయభ్రాంతులైరి. కృష్ణుడు వారికిధైర్యము చెప్పెను. ఇదే గోవర్ధనగిరి గాథా విశేషమైయుండును. కృష్ణుని జీవితములో ఒకటిరెండుమార్లు ఇంద్రునితో కలహాము కలిగినట్లు కనపడుచున్నది. పారిజాతముకొరకై ఒకతడవ యుద్ధముజరిగెను. దీనినిబట్టిచూడ ఇంద్రాధిపత్యము శ్రీకృష్ణుని కాలములో తొలగింపబడెను. వైష్ణవతత్త్వమునకు ప్రాముఖ్యమియ్యబడెను. అయినప్పటికినీ ఇంద్రుడు పెద్దవాడుగను విష్ణువు తమ్ముడుగను (ఉపేంద్రుడుగను) చాలాకాలము చిత్రింపబడుచు వచ్చినారు. పూర్వవాసన త్వరగా పోనందున ఈ సమాధానము పౌరాణికులచే కల్పింపబడినట్లున్నది.

రామాయణములో అయినాను తావులలో ఇంద్ర పూజను గురించిన ముచ్చట వ్రాయబడియున్నది.

> ఇంద్రధ్వజ ఇవోద్ధూతః పౌర్ణమాస్యాం మహీతలే
> ఆశ్వయుక్సమయే మాసి గతశ్రీకో విచేతనః. కిష్కి౦౬. ౧౬-౩౭
> అపేక్షితః శోణితతోయ విస్రవైః సుపుష్పితాశోక ఇవానిలోద్ధతః.
> విచేతనో వాసవసూను రాహవే విభ్రంసితేంద్రధ్వజవత్ క్షితింగతః.
> కిష్కిం. ౧౬-౩౮.

రాముడు వాలిపై బాణము విడిచినప్పుడు అతడు పూజానంతరము క్రింద పడద్రోయబడిన ఇంద్రధ్వజమువలె విగతచేతనుడై పడిపోయెనని వర్ణించు సందర్భములో పై శ్లోకములు కానవచ్చుచున్నవి. "గౌడదేశమందు ఆశ్వయుజ పూర్ణిమనాడు ఇంద్రునుద్దేశించి ఒక పెద్దగడకు ధ్వజముకట్టి పూజించి యుత్సవానంతరము దానిని పడద్రోయుట సంప్రదాయమైయుండెను" అని వ్యాఖ్యాతలు వ్రాసినారు. రామాయణకాలములో దేశమంతటను ఆ యాచార ముండెనని మూలములో నుండుటచే గౌడదేశమందే యుండెననుట సరి కానేరదు. ఈ వర్ణనను బట్టి రాముని కాలములో ఇంద్రపూజకై ఆశ్వయుజ పూర్ణిమ నిర్ణయింపబడెననియు దేశమంతటను ఇంద్రపూజలు జరుగుచుండెననియు ఊహించు నవకాశమున్నది. ఇంద్రపూజలు కేవలము భారతీయార్యులలోనే కాక ఏషియా మైనరులోని హాట్టిదేశములోను క్రీ. పూ. ౧౪౦౦ ప్రాంతములోనుండెను. ఈ కారణముచే రామాయణము క్రీ. పూ. ౧౪౦౦ కంటె చాలా పూర్వముదగును. మహాభారతకాలము కలియుగాదిలో అనగా కలియుగమందు

ఇంచుమించు ౬౫౩ సంవత్సరాలుగడచిన తర్వాతిదని కల్హణ పండితుడు అభిప్రాయమిచ్చినాడు. దుర్యోధనుని తొడలను భీముడు విరుగగొట్టినప్పుడు శ్రీకృష్ణుడు బలరామునితో కలి యుగము ప్రవేశించినదికదాయని సమాధానమిచ్చెను. శ్రీరాముడు భారతకాలముకన్న పూర్వుడు కాన అతడు క్రీ. పూ. ౨౫౦౦ లో నుండియుండవలెను.

ఒకవిధముగా శ్రీరామునికిని శ్రీకృష్ణునికిని అంతగా అంతరము లేకుండెనని నేను అనుకొనియుంటిని. ఈ విషయమునే నా హిందువుల పండుగలు అను గ్రంథములో పరశురామజయంతి చర్చలో ఇట్లు వ్రాసినాను.—

పరశురాముడెట్లు రామాయణ భారతకాలములందు రెండు యుగాంతరములందు జీవించెను? దీనివలన శ్రీరామ శ్రీకృష్ణులకాలములందు చాలవ్యత్యాసము లేదనియు ఇంచుమించు వీరు సమకాలికు లనియు చెప్పవచ్చును. పరశురాముడు రామాయణ భారతకాలములో నుండుటను సమన్వయించుటకై పౌరాణికులతనికి చిరంజీవిత్వసిద్ధి నియ్యవలసి వచ్చెను. యథార్థమేమన శ్రీరాముని వార్ధక్యదశలో శ్రీకృష్ణుడు బాలుడుగా నుండియుండును. రామాయణ భారతములందు కనబడు వీరులలో పరశురాము డొక్కడే కాడు—ఇంకను కలరు. ఎట్లనగా—హనుమంతుడు—భారతములో సౌగంధికాపహరణ సందర్భములో వృద్ధుడుగా కానవచ్చుచున్నాడు. (౨) బభ్రువాహనుడు—ఇతడు జాంబవంతుని మనుమడు. ఇతడు భారతవీరులలో నొకడు. (3) విభీషణుడు—నలుడు

దక్షిణదిగ్విజయానికి వెళ్లినప్పు డితడు లంకలో వృద్ధుడై రాజ్యము చేయుచుండెను.

(౮) పరశురాముడు—ఇతడు వసిష్ఠుని మనుమడు.

(౯) సుగ్రీవుడు—సహదేవుని దిగ్విజయములో కన బడుచున్నాడు. †

ఈ విధముగాచూచిన రాముడు శ్రీకృష్ణునికన్న ౫౦ ఏండ్లు లేక ౭౦ ఏండ్లకు పూర్వుడై యుండి యుండును. కాని రామాయణములోని దేశకాల భౌగోళిక పరిస్థితులను బట్టి యాలోచించిన ఈ నిర్ణయమును నిరాకరించవలసియుండును. రాముడు వింధ్యను సమీపించగా అచ్చటినుండి దేశమం తయు అరణ్యముగాను, నిర్జనప్రదేశముగాను అందందు ఆట వికులతో గూడినదియునై యుండెను. వింధ్యాద్రి దక్షిణ ప్రాంతాన్ని దండకారణ్యమనిరి. దండుడు, లేక దాండక్యుడు భార్గవునిబిడ్డను బలవంతముగా ఎత్తుకొని పోయెననియు భార్గ వుని శాపముచే అతని దేశమంతయు పాడుపడి పోయెననియు రామాయణమందే వ్రాసినారు. ‡ ఈ యంశమునే పురస్క రించుకొని చాణక్యుడును, వాత్స్యాయనుడును ఇట్లువ్రాసిరి.

సూ॥ యథా దాండక్యోనామ భోజః, కామాత్ బ్రాహ్మణకన్యా మభిగమ్య మానః సబన్ధురాష్ట్రో వినవాశ.

---

† హిందువుల పండుగలు, పుట. ౧౯౩-౧౯౬.

‡ రామాయణము, ఉత్తరకాండము, ౮౦-౮౧ సర్గలు.

పై యంశాన్నిబట్టి దాండక్యుడు భార్గవుని సమకాలికుడని స్పష్టమగుచున్నది. రాముని కాలములో ఇంచుమించు ఆర్యులకు ప్రవేశములేని దండకారణ్యము శ్రీకృష్ణుని కాలములో రాజ్యాలతోను అభివృద్ధినొందిన ప్రాంతాలతోను నిండినట్లు మహాభారతమునుండి విశదమగుచున్నది. కావున సుగ్రీవ, హనుమంత, పరశురామ, విభీషణాదుల చిరంజీవితమును భారతకాలములోకూడ వారుండిరను విషయమ్ము ప్రక్షిప్తము లనవలెను. రామునికిని కృష్ణునికిని మధ్య ఇంచుమించు ౧౦౦ సంవత్సరములు గతించియుండును. సి. చు వైద్యాగారు రామాయణ విమర్శనమును గురించి వ్రాసివి. ఆంగ్ల గ్రంథములో ఇట్లు వ్రాసినారు. "అభ్యంకరుగాన. విష్ణుపురాణమందలి వంశావళులను లెక్కించి రామునికిరు కృష్ణునికిని మధ్య ౩౫గురు రాజులు గతించిరని వ్రాసినారుని దానినిబట్టి ఉభయులకు మధ్య ౭౧౦ సంవత్సరాలైనను అంతరాయము ఉండెనని అత డభిప్రాయపడినాడు."

ఇంతకుముందు చూపిన ఇంద్రపూజా ప్రాముఖ్యమును గురించి రామాయణమందు చాలా నిదర్శనములు కలవు. అగస్త్యాశ్రమములో ఒక్కొక్క వైదిక దేవతకు ఒక్కొక్క పూజావేదిక యుండెను. బ్రహ్మ, అగ్ని, విష్ణు, ఇంద్ర, సూర్య, చంద్ర, భగ, కుబేర, ధాతృ, విధాతృ, వాయు, నాగరాజ, అనంత, గాయత్రీ, వసు, వరుణ, కార్తికేయ, ధర్మ, దేవతలకు వేదికాస్థానములుండెను.

(అరణ్య-౧౨ సర్గ-౧౭ నుండి ౨౦ శ్లో॥ వఱకు)

ఇందు విష్ణు, అనంత, నాగ, కార్తికేయ, ధర్మ, అను పౌరాణిక దేవతలుకూడా చేరినారు. అయినను వైదిక దేవతా ప్రాముఖ్యము చాలా వ్యక్తమగుచున్నది.

సాలమన్ కాలములో ద్రావిడ దేశమునుండి నెమిళ్ళు, కోతులు, చందనము మున్నగునవి యెగుమతి యగుచుండెనని తెలిపినాను. నెమిలికి "తుకి"అని తమిళములో అందురనియు ఆ పదమునే హీబ్రూవారు వాడిరనియు ఇతర దక్షిణ భారతీయ వస్తువులకును అట్టి తమిళనామములనే వాడిరనియు పరిశోధకులు నిరూపించినారు. సాలమన్ క్రీ. పూ. ౧౦౦౦ ప్రాంతపు హీబ్రూరాజు. అట్టి కాలములో దక్షిణాపథము మహానాగరిక దేశమై యుండుటయు సముద్రప్రయాణమును మధ్యధరా సముద్రమువరకు ఓడలలో సాగించుటయు మన దేశమందు సిద్ధముచేసిన వస్తువులను అక్కడ అమ్ముచుండిరనిన దాండకర్ణ్యాని కాలములోని నిర్జనారణ్యమింతటి నాగరక స్థితికి రావలెననిన ఎన్నియో శతాబ్దములు పట్టియుండును. కావున సాలమన్ కాలానికి ౧౦౦౦ లేక ౧౫౦౦ ఏండ్లముందు ఈ దక్షిణాపథము నిర్జనారణ్యమై యుండియుండును.

ఋగ్వేదములో రాముడు

శ్రీ పెండ్యాల వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రిగారు తమ "రామోపాఖ్యానము—తద్విమర్శనము" అను గ్రంథపీఠికలో నిట్లు వ్రాసినారు.

"రామ రావణుల యస్తిత్వము కల్పితముకాక సత్యమే యనుటకు ఋగ్వేదమున నీక్రిందిరీతిని సూచింపబడియుండెను.

"ప్రతద్దుశ్శీమే పృథనానే వేనౌ ప్రరామేఽవోచ మసురే మఘవత్సు
యే యుక్త్వాయ పంచ శతాస్మయుపథా విశ్రామ్యేషాం"

ఋగ్వేదము ౧౦-౯౩-౧౪

అనగా "ఏ దేవత లైదువందలరథముల నశ్వములతో గూర్చుకొని మాయందు ప్రేమగలవారై యజ్ఞమార్గముచే వచ్చుచున్నారో ఆ స్తోత్రము, పృథవానునియందును, వేనుని యందును, అసురుడు బలవంతుడగుచుండగా రామునియందును, ధనవంతులయందును జెప్పుచున్నాము."

శాస్త్రిగారిచ్చిన యర్థము బోధయగుటలేదు. బలవంతుడగు అసురుడంటే రావణుడనియు అతని వధను రాముడు చేసెనను సూచన పై మంత్రములో నున్నదని శ్రీ శాస్త్రి గారి యభిప్రాయమై యున్నది.

జతీంద్రమోహన్ ఛటర్జీగారు తమ "పృశ్నిగాథ" యను గ్రంథపీఠికలో ఇదే మంత్రము నుదాహరించి దాని కిట్లు అర్థము వ్రాసినారు. "మఘవంతుల (Magians ఈరాను దేశజాతి) సంఘమును గురించియు అసురను గురించియు (అహుర అను రూపముతో ఈరానులో పూజింపబడుచుండిన దేవత) ఇప్పుడు నేను అసాధ్యుడైనట్టియు (దుస్సీమ – Indomitable) బలవంతుడైనట్టియు, (పృథువాన్–Redoubtable) రామునితో (అనగా) వేనునితో మాట్లాడుచున్నాను". ఛటర్జీగారి అభిప్రాయములో రాముడు వేనుడు ఉభయులును ఒక్కరే అయితే యీ వేను డెవడు ?

"యజ్ఞై రథర్వా ప్రథమః పథస్ తతే తతో సూర్యో ప్రతపావేన అజని"

ఋగ్వేద ౧,౮,౩,౫.

మొదట అథర్వానుడు (జరథుస్త్రుడు) యజ్ఞపథమును ఏర్పాటుచేసెను. తర్వాత సూర్యవంశమువాడును సత్యవంతుడును (ప్రతపా) అయిన వేనుడువచ్చెను అని జతీంద్రుడు పృశ్నిగాథాపీఠికలో వ్రాసెను. అతని సిద్ధాంతము తృతీయ పంథగాఉన్నది. దానిని కొన్నిమాటలలో తెలుపుచున్నాను.

ఋగ్వేదములో అసురులు మంచివారే, దేవతలకు అసురులకు భేదము లేకుండెను.

"సమిద్యే అగ్నౌ కృతమిద్ వదేమ మహద్ దేవానాం అసురత్వ మేకం"

ఋగ్వే ౩-౫౫-౧.

అసురులకు ముఖ్యదేవుడు వరుణుడు.

"అహం రాజా వరుణ మహ్యంతాని అసుర్యాణి ప్రథమా ధారయంతే"

ఋగ్వే ౪-౪౨-౨.

అసురులే పితృదేవతలు.

పితాయజ్ఞానాం అసురోవిపశ్చితాం. ఋగ్వేద ౩-౩-౪.

పారశీకుల (ప్రాచీన ఈరానీల)కు మతకర్త జరథుస్త్రుడు. అతడు ప్రకాశింపజేసిన "అహురమజధా" అను గ్రంథములో అహురమజధాకు (అసురమేధ) పర్యాయపదాలలో వరుణుడు అనునదొక్కటియై అతని శతనామావళిలో ౧౧౨ వ పేరుగా పేర్కొనబడినది. మజధా (Mazda) మేధా అను వైదిక పదమనుటకు ప్రమాణము—

"సుయుగ్ వహంతి ప్రతివాంబుతేన, ఊర్ధ్వాభవంతి పితరేవ మేధాః"

ఋగ్వేద ౩-౬౫-౨.

భార్గవులు వారుణపూజకులు.

"భార్గవా వారుణా స్సర్వే యేషాం వంశామహానపి"

శా.తి ౮౫-౧౨౬.

అథర్వవేదానికి భృగ్వాంగిరస అను పేరుకలదు' గోపథబ్రాహ్మణములో ఇట్లున్నది.

"వితద్వై భూయదిష్టం బ్రహ్మయద్ భృగ్వంగిరసః.

౧-౩-౪ మరియు ౧-౨-౧౮.

అథర్వవేదములో భృగుసంహితకు సంబంధించిన ఖిల భాగమునకు అథర్వానుడు ద్రష్ట, (భృగు, అథర్వ అను పేరు లోకలే అనుట) అందుకు ప్రమాణము—

"అథర్వాంగిరసో నామవేదేస్మిన్వై భవిష్యతి"—ఉద్యోగ-౧౮,౭

ఈ విధముగా అథర్వానుడే జరథుస్త్రుడు. వేనుడే రామచంద్రుడు. అథర్వానుడు లేక జరథుస్త్రుడు అసురులకు ముఖ్యుడు. వేనుడు లేక రాముడు దేవతలకు ముఖ్యుడు. జరథుస్త్రుడు మొదటివాడు. అతడే పరశురాముడు. రాముడు తర్వాతివాడు. అధర్వవేదమునకు బ్రహ్మవేద మనియు, క్షత్రవేద మనియు పూర్వము వ్యవహరించు చుండిరి. అందుచేతనే రామాయణ ఆదిపర్వములో (౬౫-3) ఇట్లు వ్రాసిరి.

"క్షత్రవేదవిదాం శ్రేష్ఠ బ్రహ్మవేదవిదామపి
బ్రహ్మపుత్రో వసిష్ఠో మామేవంవదతు దేవతాః"

అథర్వవేదము క్రీ. పూ. ౨౦౦౦ నాడు రచింపబడి యుండును. కావున జరథుస్త్రుడు ఆ కాలమువాడు. రాముడు అతని కించుక తర్వాతివాడు.

ఇది జతీంద్రమోహన్ చటర్జీగారి వాద సారాంశము. అతని తర్కము భావకశ్మలము (Confusion) తో కూడియున్నది. భావప్రకోపము (thought provoking) కలిగించు భావాలను వెదజల్లినాడు. ఇప్పుడతని తర్కము సరియగునా కాదా అను వాదమును పెంచుకోనవసరములేదు. అతని అభిప్రాయములో శ్రీరాముని కాలము ఇంచుమించు క్రీ. పూ. ౨౦౦౦ ఏండ్లనాటిది అనుట గమనింపదగినది. ఋగ్వేదములోని "రామ" "అసుర" పదాలతో కూడిన మంత్రము మాత్రము (శ్రీ పెండ్యాల వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి గారును, ఛటర్జిగారును పరస్పర విరుద్ధార్థముల నిచ్చినను) నా కేమియు నర్థము కాలేదనియే చెప్పుకోనవలసి యున్నది.

అయితే మరొక విషయము గమనించదగినదై యున్నది. హారవిలాస శారదాగారు తమ హిందూ సుపీరియారిటీ అను ఆంగ్లగ్రంథములో ఇట్లు వ్రాసినారు.

"వ్యాసు డొకమారు జరథుస్త్రునితో తుర్కిస్థానములోని బల్ఖ్‌లో వాదించెను. లిడియాదేశపు జాంథస్ అనువాడు క్రీ. పూ. ౪౭౦ లో ఉండెను. జరథుస్త్రుడు ట్రాయి యుద్ధానికి ౬౦౦ ఏండ్లకు పూర్వముండెను. అనగా క్రీస్తుకు పూర్వము ౧౮౦౦ లో ఉండెనని అతడు వ్రాసెను. బాబిలోనియా చరిత్రకారుడైన బెరోసస్ అనువాడు జరథుస్త్రుడు

బాబిలోనియా రాజుగా నుండెననియు క్రీ.పూ. ౨౨౦౦ నుండి ౨౦౦౦ వరకు బాబిలోనియాను రాజ్యముచేసిన రాజులసంతతి కర్తయయ్యెననియు వ్రాసెను

ఈ నిర్ణయము ప్రకారము జరుథుస్త్రుడు వ్యాసుని కాలము వాడైతే అప్పుడు వాల్మీకికాలము ఇంకాముందుకు అనగా క్రీ. పూ. ౨౫౦౦ వరకై ననుపోవును. అనగా నావాద మును బలపరచుచున్నది.

ఛటర్జీ వాదాన్ని అవలీలగా త్రోసివేసే వీలులేదు. పారసీకుల అవెస్థా, గాథా గ్రంథాలభాష నూటికి ౮౦ పాళ్లు సంస్కృతముతో కూడినది. వారు అసురపూజకులై యుండిరి. ప్రాచీన ఈరాను దేశమును "ఫరసు" అని పిలిచిరి. మన "పరశు" రాముడు "ఫరస్" రాముడేమో! రామాయణములో పరశురామునికి రామునికి సంఘర్షణము జరిగెననియు, వృద్ధపరశురాము డోడిపోయెననియు, అతని నోడించిన శ్రీరాముడు నవయౌవనుడుగా నుండెననియు రామాయణములో వ్రాసినారు. ఈ కారణములనుబట్టికూడ ఛటర్జీ వాదాన్ని పరిశీలించవలసి యుండును. మన పరిశోధక పండితులు ఈరానులో వ్యాప్తినొందిన (ఖిలమగు భృగుసంహితను) గాథా అవెస్తాలు బోధించిన జరథుస్త్రమతమును ఛటర్జీగారి విమర్శతోచదివి ఇంకను మనకు క్రొత్తసంగతులు తెలుపగలరను దృష్టితో అతని భావములను ఉదాహరించినాను.

వేనుడును రాముడును ఒకరే అను భట్టర్జీవాదము సరియైనదనుటకు వారే సరియగు ప్రమాణమేదియు చూపించలేదు. వేనుడు అనువతడెవ్వడో తెలియరాదు. అతడు ఇంద్రుడని కొందరి అభిప్రాయము. సూత్రకాలములోను, పురాణకాలములోను ఒక వేనరాజు ప్రసిద్ధిపొందినాడు. స్త్రీ లందరును స్వేచ్ఛాచారిణులుగా నుండవలెననియు ఏ స్త్రీనైనను ఏ పురుషుడైనా పొందినట్లైన అది ప్రకృతిధర్మమేగాని తప్పు లేదనియు వేనరాజు శాసించియుండెను. ఈ పశుధర్మము మనుస్మృతిలో నిట్లు గర్హింపబడినది.

అయం ద్విజైర్హి విద్వద్భిః పశుధర్మో విగర్హితః
మనుష్యాణా మపి ప్రోక్తో వేనే రాజ్యం ప్రశాసతి.

మనుస్మృతి ౯ అధ్యా శ్లో ౬౬.

స్త్రీలకు పశుధర్మమే సరియైనదని శాసించిన వేనుడు రాముడగునా? వేదోదాహృత వేనుడు వేరు, స్మృత్యుదాహృత వేనుడు వేరు అనుటకు సందేహములేదు. వేదమందలి వేనుడు మంచివాడుగా గొప్పవాడుగా వర్ణింపబడినాడు. స్మృతి పురాణాలలోని వేనుడు దుష్టరాజుగా వర్ణింపబడినాడు. అయితే ఋగ్వేద వేనుడును రాముడును ఒకరే అనుటకు నిస్సందేహమగు ఆధారాలు కానరాలేదు.

రాముడు కల్పిత పురుషుడనియు, ఋగ్వేదములోని ఇంద్రుడు వర్షాధిపతిగాను, సీత భూమికిసంబంధించిన నాగేటిచాలుగాను వర్ణించినందున దానినే ఒక కథగా పెంచినారని

కొందరు పాశ్చాత్య విమర్శకులు వ్రాసినారు. ఈ విధముగా శబ్దముల నానార్థములనుబట్టి చారిత్రక విషయాలను చాలా వరకు కల్పితములుగా నిర్ణయింపవచ్చును. మహాభారతమును గురించికూడా ఇదే విధముగా సద్గుణ దుర్గుణముల సంఘర్షణ మునే ఒక మానవకథగా పెంచినారని వాదించువారును కలరు.

రాముని దివ్యచరిత్రమును మహాభారతకాలమువరకే వేల కొలది మైళ్ళదూరములో సముద్రాంతరమందుండు ఖండాం తరములలోని జనులు గానముచేయ మొదలిడిరి. అర్జునుడు పాతాళఖండమను పేరుపొందిన దక్షిణ అమెరికాకు వెళ్ళి అచ్చట ఉలూపియను నామెను పెండ్లియాడెనని చెప్పుదురు. దక్షిణ అమెరికాలోని పెరూ, మెక్సికో అను మండలాలలోని జనులు హిందువులను పోలియున్నారనియు వారి ఆచారములు హిందువులవంటివే యనియు వారి దేవతలలో బహుపురాతన కాలమందే గణేశుడు, ఇంద్రుడు ముఖ్యులైన దేవతలై యుండిరనియు, అచ్చటి ప్రాచీనస్థలఖననములనుండి గణే శుని విగ్రహాలు లభించినవనియు మెక్సికో పరిశోధక పండి తులే వ్రాసియున్నారు. దక్షిణ అమెరికాలోని పెరూమండ లములోని రాజులు తాము ఇనకులమువారమని చెప్పుకొనిరి. వారి భాషలో ఇనకులమునకు ఇనకా అని పేర్కొనిరి. వారి పండుగ లన్నిటిలో గొప్ప పండుగ "రామసీత్వా" ఉత్సవము అనగా రామ సీత అను దేవతల పూజ. ప్రాచీనకాలములో హిందువులు సముద్రప్రయాణముచేసి అమెరికావరకు పోయి వచ్చియుండిరనియు చెప్పుకొనియుండిరి. ఈ కారణాలచేత

రామాయణ మెంతటి ప్రాచీనమైన ఇతిహాసమో విశదము కాగలదు. ‡

## వాల్మీకి కాలము

వాల్మీకి రామునికి సమకాలికుడు అగునో కాదో ఉత్తరకాండలోని కథయే మన కాధారమగుచున్నది. అతని ఆశ్రమములో కుశలవులు జన్మించిరనియు వారు బాలురుగా పెరిగిన తర్వాత వాల్మీకి రచిత రామకథను సుందరముగా గానము చేసిరనియు రామాయణ బాలకాండములో నిట్లు వర్ణించినారు.

> తతస్తు తౌ రామవచఃప్రచోదితౌ, అగాయతాం మార్గవిధానసంపదా
> సచపి రామః పరిషద్గతశ్శనైః, బుభూషయా సక్తమనా బభూవహ.
>
> బాల ౪ సర్గ. ౩౬. శ్లో.

మార్గపద్ధతిపై కుశలవులు వాల్మీకి రచిత రామాయణమును రాముని యెదుట గానము చేసిరని పై శ్లోకమందు తెలుపబడినది. ఉత్తరకాండములో కుశుడు, లవుడు అను ఇద్దరు అమడలు సీతకు వాల్మీక్యాశ్రమములో పుట్టిరని వ్రాసినారు. కుశలవపదాలను జంటగా చేర్చినపుడు ద్వంద్వసమాసములో కుశీలవ అని యగునని పండితులు సమర్థించినారు.

---

‡ వివరములకుగాను, చూడుడు హరవిలాస శారదాగారి Hindu Superiority పుటలు ౧౨౦-౧౨౪. మరియు "హిందూ అమెరికా" అను ఆంగ్ల గ్రంథమును చమనలాల్ అనువారు వ్రాసినారు. అందు రామసీతల్వాను గురించి ౧౧౧ పుటలో వ్రాసినారు.

కాని కుశీలవ పదాని కింకొక అర్థమున్నది. శబ్దకల్పద్రుమ ములో నిట్లు వ్రాసినారు. "కుశీలవ—చారణః-నటవిశేషః-కథకాదిః - దేశాంతరే కీర్తిం ప్రచారతి యో నటః" అని వ్రాసినారు. వాల్మీకి వ్రాసిన రామాయణమును కుశలవులు, కుశీలవులు-అనగా గానముచేసి కథ చెప్పుటలో నేర్పరులైన కొందరు శిష్యులు అయోధ్యాపురములో తందాన కథగా చెప్పినారని తోచుచున్నది. మార్గమనెడి పద్ధతిలో గానము చేసినారనుటలో విశేషమున్నది.

## మార్గ విధానము

ప్రాచీనములో గానమందు మార్గపద్ధతి దేశపద్ధతి అను రెండు విధానము లుండెను. పై శ్లోకానికి గోవిందరాజిట్లు వ్యాఖ్యవ్రాసెను. "దేశీ మార్గశ్చేతి ద్వాగానప్రకారౌ, తత్రమార్గ స్సార్వత్రికః, దేశిఃక్వాచిత్కః తయోర్మధ్యే మార్గనిర్వాహ సామగ్ర్యా అగాయతాం" గానములో దేశీ గానమనియు, మార్గగానమనియు రెండు విధాలుగలవు. మార్గ విధానము భరతఖండములో అంతటను (సార్వత్రికమై) వ్యాపించినట్టిది. దేశీగానము మండల భేదాలనుబట్టి (క్వాచిత్కముగా) భిన్నభిన్న ప్రదేశాలలో భిన్నభిన్నముగా వర్తించుచుండెను. సంగీత శాస్త్రమందును దేశిమార్గభేదములచే గానద్వైవిధ్యము నిరూపింపబడినది.

౪

# ప్రక్షిప్తములు

౧

రామాయణమును అనేక శతాబ్దములలో క్రమక్రమముగా అభిమానులు పెంచుచు వచ్చినారనుటలో ఏ మాత్రమును సందేహములేదు. పెంచినవారు తమ హస్తక్షేపములను గుర్తించకుండా బాగుగా ప్రయత్నముచేసినవారు కారు. పరస్పర విరుద్ధములగు నంశములను వ్రాయుట, బౌద్ధ, క్రీస్తు శకానంతర విషయములను తమతమ కాలపు మత సాంఘిక స్థితులనుగురించి వ్రాయుట, చరిత్రగా నుండదగిన దానిని అద్భుతములతోను, మానవాతీతములతోను, వర్ణించి పెంచుట, ఇట్టి వన్నియు ప్రక్షిప్తములని భావింతును.

శబ్దముల అర్థముల నాశ్రయించి కొన్ని విడ్డూరపు కల్పనలు చేసిరి. వాలి అన తోక కలవాడని యర్థమగును. కావున అతడొక కోతి తోకపైననే పుట్టెనని వ్రాసిరి. సుగ్రీవుడన మంచి గ్రీవము కలవాడు కావున అతడు వాలిని తోకపైకన్న కోతిమెడమీదనే పుట్టెనని వర్ణించిరి. ఇట్టివి పురాణములందంతటను సర్వసాధారణముగా కనిపించు విశిష్టతలు. ఇవన్నియు ప్రక్షిప్తములే యగును.

౨

బాలకాండలోని రావణ వధోపాయ సర్గము (౧౫), పాయసోత్పత్తి సర్గము (౧౬), ఋక్ష వానరోత్పత్తి సర్గము (౧౭)స్పష్టముగా తర్వాతి కల్పనలే! రావణవధార్థము పుట్టిన వానరులలో వాలికూడ చేరినవాడు. "వానరేంద్రం మహేంద్రాభ మింద్రో వాలినమాత్మజం" ఇంద్రుడు తనతో సమానుడగు వానరేంద్రుని వాలిని పుట్టించెనని కలదు. (బాల. ౧౭–౧౦) అట్టి కారణజన్ముని శ్రీరాము డేల చంపెను ?

శ్రీరాముడు "శైక్ష్యం శాస్త్రసమూహేషు ప్రాప్తో వ్యా మిశ్రకేషుచ" శాస్త్రములందు వ్యామిశ్రకావ్యములందు ప్రవీణు డని వర్ణించినారు (అయో. ౧–౨౭) రాముని కాలమందు ప్రాకృత భాషలు వ్యామిశ్రికము లుండెనా ? ప్రాకృతోత్పత్తి పాణిన్యనంతరమై యుండును. కావున ఈ శ్లోకము ప్రక్షిప్తమగును.

"ప్రాకృతవ్యాకరణ సంప్రదాయములు రెండు. మొదటిది హిందూదేశ ప్రాగ్భాగమునకును రెండవది పడమటి భాగమునకును సంబంధించినవి. శాకల్య భరత కోహాలాదుల ననుసరించి వరరుచి వ్రాసిన ప్రాకృత ప్రకాశము తూర్పు సంప్రదాయమునకు చేరినది. పడమటి సంప్రదాయమునకు చేరిన సూత్రాత్మకమైన ప్రాకృత వ్యాకరణము మరియొకటి. దానిని వాల్మీకి రచించెనని తన్మతానుసారులైన త్రివిక్రమ హేమచంద్ర సింహారాజ లక్ష్మీధర ప్రభృతులు చెప్పు

చున్నారు. ఈ విషయము వివాదగ్రస్తమై యున్నది" అని శ్రీ మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారు వ్రాసిరి. ౧

## 3

బాలకాండలోని మొదటి సర్గలో రామాయణ సంగ్రహము తెలుపబడినది. అందు లేనివి విపులమగు రామాయణములో నుండుట అన్నిటగాకున్నను కొన్నిట ప్రక్షిప్తములనియు తర్వాత పెంచినవనియు సందేహము కలుగుట కవకాశము కలదు.

౧ నుండి ౧౯ శ్లోకాలు రాముని యుత్తమత్వ వర్ణన కలవి. ౨౦లో రాముని పట్టాభిషేకాలోచన కలదు. ఇందు తాటకావధ లేదు.

శ్లో. ౨౯లో "పౌరైరనుగతో దూరం పిత్రా దశరథేనచ" అనుటచే రాముడు వనవాసమునకు వెళ్లునపుడు తండ్రి కూడ పౌరులతోపాటు చాలాదూరము వెంటవెళ్లెనని కలదు. కాని అయోధ్యకాండలో ఇది లేదు.

శ్లో॥ ౫౨లో బంగారు జింక ముచ్చట లేదు. రామలక్ష్మణుల నొకేమారు మోసగించి దూరముగా మారీచుడు తీసుకొనిపోయెనట !

బాలకాండ మూడవసర్గలో ౯వ శ్లోకమునుండి సర్గ తుదివరకు రామాయణ సంగ్రహము చెప్పినారు. అందు మరి

---

౧. సంస్కృత వాఙ్మయ చరిత్ర—భాగము ౧. పుటలు ౬౫-౬౬.

కొన్ని విశేషాలు కలవు. పుష్పకమును రాముడు చూచెను అని కలదు (శ్లో. ౩౬) అది రావణ భవనమని స్ఫురించును. సర్గతుదిలో "నైదేహ్యాశ్చ విసర్జనం" అని ఉత్తరకాండ సూచితము. శ్లో. ౩౭లోను అటులే సూచితము. ఉత్తర కాండ వాల్మీకి రచితముకాదని వ్యాఖ్యాత లొప్పకొన్నారు. ఈ సంగ్రహములో దాని సూచన వచ్చుటచే ఇదియు తర్వాతివారిచే వ్రాయబడెనేమో? బాలకాండ నాల్గవసర్గలో ౪, ౫ శ్లోకాలలో కుశలవ అను శబ్దమున్నది. దానికి కథ చెప్పువారని అర్థమగును.

"వాచో విధేయం తత్సర్వం కృత్వాకావ్య మనిందితా"

(శ్లో. ౧౨)

అనుటచే వారు రామకథను (వాచోవిధేయం) కంఠ పాఠము చేసిరి. ౨౪,౦౦౦ శ్లోకాలను కంఠపాఠము చేయగలిగిరా? రామాయణము పురాణముకాదు. "కావ్యము" అని పై శ్లోకమే తెలుపుచున్నది. దానిని వారు "పాడిరి" (జగతుః. బాల. ౪-౧౩). ఆ రామాయణమును ఎవరు ప్రదర్శింపగలరు. (ప్రయుంజీయాత్. బా. ౪-౩) అని వాల్మీకి తలపోసెనటుచే తందాన కథవలె అభినయముతో గానముతో కథ చెప్పబడెననుట స్పష్టము.

శ్రీ.ఓ. వెంకటరంగయ్యగారు ఇట్లు తెలుపుచున్నారు. "వాల్మీకి ౫౦౦ సర్గలు రచించుననెను. కాని ఇప్పటి షట్కాండములందు ౬౩౭ సర్గలున్నవి. ప్రక్షిప్తములు కొన్నిచోట్ల స్పష్టముగ తెలియును. పూర్వవ్యాఖ్యాతలే బాలకాండలోని

మహామైథున సంకల్పము, యుద్ధకాండములోని ఆదిత్య హృదయమును ప్రక్షిప్తములుగ గణించిరి. సుందరకాండలో సీత హనుమంతునితో చెప్పిన కాకాసుర వృత్తాంతమునకు కొన్ని ప్రతులలో అయోధ్యకాండలో నొక సర్గమంతయు కల్పింపబడినది. యుద్ధకాండ సర్గలు ౧౨౦, ౧౨౧, ౧౨౨ ప్రక్షిప్తములుగ నగపడుచున్నవి. అందు "కృష్ణః ప్రజాపతిః" అని రాముడు స్తుతింపబడినాడు. అది భవిష్యత్కృష్ణావతార సూచనయని గోవిందరాజ వ్యాఖ్య. ప్రక్షిప్తముల విడదీసి వాల్మీకి ప్రోక్తమగు భాగమునుమాత్ర మెవ్వరైన నిర్ణయింపగలుగుదురేని గొప్ప భాషాసేవగ నుండును.†

౪

"కృత్స్నం రామాయణం కావ్య మీదృశైః
కర వాణ్యహం" (బాల.. ౨-౪౧)

అని రామాయణమంతయు అనుష్టుప్పు శ్లోకాలతో రచించుతున్నానని వాల్మీకి ప్రవచించెను కదా. తక్కిన శ్లోకాలన్నియు ప్రక్షిప్తాలనవలెనా లేదా? బాలకాండ మొదటి నాలుగు సర్గలలో వాల్మీకి అను మహర్షి రామాయణము రచించెను అని పలుమారులితరులు చెప్పినట్లుగా వర్ణించుటచేత ఆనాలుగు సర్గములును ప్రక్షిప్తములే యనిపించును.

---

† శ్రీ ఒంగోలు వెంకట రంగయ్య, బి. ఏ., బి. ఎల్.గారు (నెల్లూరు) ఈ రామాయణ విశేషముల మొదటి ముద్రణమును చదివి నాకు విపులముగా ౩ జాబులువ్రాసిరి. వారి పరిశోధక విజ్ఞానము అతివిపులము. వారు నా భావములతో చాలావరకేకీభవించి నాకు మంచి ప్రోత్సాహము కలిగించినారు.

బాలకాండలోని నాల్గవసర్గలో

"చతుర్వింశ త్సహస్రాణి శ్లోకానా ముక్తవాన్ ఋషిః
శతాని పంచ సర్గాణాం షట్కాండాని తథోత్తరం."

౫౦౦ సర్గలు, ౬ కాండలు, పైగా ఒక ఉత్తరకాండ వ్రాయబడెననియు, ౫౦౦ సర్గలలో ౨౪,౦౦౦ శ్లోకాలుండె ననియు పై శ్లోకములో చెప్పినారు. కాని యిప్పుడు ముద్రితమైన రామాయణములో ౬ కాండలలో ౫౩౭ సర్గలున్నవి. ఉత్తరకాండలో ౧౧౧ సర్గలున్నవి. అవికూడా కలిపితే ౬౪౮ సర్గలగును. ఇక శ్లోకాలసంఖ్య యెట్టిదనగా యుద్ధకాండములో ౧౧౨ వ సర్గాంతములోని—

"మరణాన్తాని వైరాణి నిర్వృత్తం నః ప్రయోజనమ్"

అను పంక్తిలో "నః" గాయత్రియొక్క ౧౯ వ అక్షరము. అందుచేత అక్కడికి ౧౯,౦౦౦ శ్లోకాలు పరిపూర్తి అయ్యెను. అటుతర్వాత యుద్ధకాండములోని శ్లోకాలు ౮౩౦ కావున యుద్ధకాండముతో ౧౯,౮౩౦ శ్లోకాలగును. ౨౪౦౦౦శ్లోకాలసంఖ్య పూర్తిచేసుకొనుటకుగాను ఉత్తరకాండనుగూడ చేర్చుకోవలెను. ఉత్తరకాండలో ౩౪౫౬ శ్లోకాలున్నవి. ఈ విధముగా ౭ కాండలలో ౨౩,౨౮౮ శ్లోకాలున్నవి. అనగా అప్పటికిన్ని ౨౪,౦౦౦ సంఖ్య పూర్తి కాలేదు. కొన్ని ప్రక్షిప్త భాగాలని వ్యాఖ్యాతలే వ్యాఖ్యానించినవారు కారు. ఉత్తరకాండను గోవిందరాజు మహేశ్వరతీర్థాదులు వ్యాఖ్యానించనేలేదు. ఎటుచూచినను సర్గభేదాలు శ్లోకభేదాలు కనపడుచునే యున్నవి. రామాయణ

ములో కొన్ని ఘట్టాలను తర్వాతి వారు చేర్చినారు. రాముని విష్ణ్వవతారముగా వర్ణించు భాగాలన్నియు తర్వాత చేర్చబడినవే.

ఇంద్రుని ప్రాబల్యము తక్కువై శ్రీకృష్ణుని కాలములో విష్ణుదేవుని పూజ ప్రాధాన్యము వహించెను. కృష్ణుని యనంతరము దశావతార సిద్ధాంతము కల్పితమయ్యెను. ఇంకను ఏవేవి దశావతారాలో స్పష్టపడలేదు. అందుచేత వివిధ పురాణాలలో వివిధ పద్ధతులపై వ్రాయుచు వచ్చిరి.

"మత్స్యః కూర్మో వరాహశ్చ నృసింహో వామన స్తథా
భార్గవో రాఘవః కృష్ణః బుద్ధః కలికిరేవచ."

ఈ శ్లోకము మహాభారతము ౧౨-౩౪౮-౨ అనుచోట ఉన్నదని జ. మో. చటర్జీగారు పృశ్నిగాథా పీఠికలో వ్రాసిరి. అది యందు కానరాలేదు. పైగా ఈ క్రింది శ్లోకము మాత్రము మహాభారతమందు కనబడుచున్నది.

హంసః కూర్మశ్చ మత్స్యశ్చ ప్రాదుర్భావా ద్విజోత్తమ
వారాహో నరసింహశ్చ వామనో రామ ఏవచ
రామో దాశరథిశ్చైవ సాత్వతః కల్కి రేవచ

మహాభారతము — శాంతి, ౩౩౯-౧౦౨

ఇందు బుద్ధుని పేరు లేదు. రాబోవు కల్కి పేరున్నది. సాత్వతుడనగా బలరాముడా కృష్ణుడా అను సంశయానికి తావు లేకుండా పై భాగమందు శిశుపాల కంసాదులవధ చేయు దున్నందున కృష్ణుడే యని స్పష్టమగుచున్నది. ఈ యవతార పట్టికలో హంసావతార మెక్కుడుగా ఉన్నది. వామన పూజలో ఈ క్రింది శ్లోకము కనబడుచున్నది.

మత్స్యం కూర్మంచ వారాహం నారసింహంచ వామనం
రామం రామం రామకృష్ణం బౌద్ధం కల్కిం నమామ్యహం.

ఇచ్చట ముగ్గురు రాములు–పరశురాముడు, రఘురాముడు, బలరాముడు చేరినారు. కృష్ణుడును చేరినాడు. ఈ విధముగా అవతారాల నిర్ణయము ఇంకను ఏకరూపము దాల్చియుండలేదు.

౫

గుప్తరాజుల కాలమువరకు (క్రీ. శ. ౫౦౦) శ్రీరామపూజకు స్థానము లేకుండెననియు, రామ దేవాలయములు లేకుండెననియు రామభక్తులని యేరాజులును తెలుపుకొన్న జాడల్లులేననియు క్రీ. శ. ౫౦౦ అనంతరమే రామపూజా ప్రాముఖ్యమ్ము వ్యాప్తిచెననియు (New history of the Indian people Vol. VI లో) తెలియవచ్చినది. దశావతారములు క్రీస్తుశకము నాల్గవ శతాబ్దము తర్వాతనే ఒక రూపానికివచ్చి స్థిరపడేను. బుద్ధుని మతవ్యాపకమును గమనించి హిందూమత పునస్థాపకులు బుద్ధుని తొమ్మిదవ అవతారముగా అంగీకరించిరి. అమరసింహుడు క్రీస్తుశకము 300 ప్రాంతకాలములో నుండినట్లూహింప బడుచున్నది. అతని కాలమువరకు దశావతార స్వరూపమేర్పడలేదు. ఏర్పడియుండిన ఎన్నియో యల్పవిషయాలను తెలిపి యతడీ మహద్విషయము నెగురగొట్టెననుటకు వీలులేదు. అతడు బౌద్ధుడైయుండును. అతని మొదటిశ్లోకము "దయాసింధు

వును" గూర్చినది. దేవతల పేర్లపట్టికలో మొదట బుద్ధుని పేర్లుచెప్పి తర్వాత విష్ణువుపేర్లు తెలిపినాడు. జైనుడై యుండిన మహావీరునికాని తీర్థంకరులనుగాని జైనమత ప్రతిపాదకుల నెవ్వరినిగాని పేర్కొనకుండా యుండునా? అతడు విష్ణువు పర్యాయపదములలో కృష్ణుని "దేవకీనందనుని" "బలిధ్వంసి" యగు "త్రివిక్రముని" మాత్రమే పేర్కొన్నాడు. దశరథరాముని పేరెత్తుకొననేలేదు! బలరాముని విష్ణునామములలోచేర్చక వేరుగా తెలిపెను. అంతమాత్రమైనను శ్రీరామచంద్రునిగూర్చి తెలుపలేదు. అదేవిధముగా ఋషులలో "నారదాదులు" అన్నాడు. కాని అచ్చటగాని ధీవర్గమందుకాని, వాగ్వర్గమందుకాని, మెచ్చటకాని ఆదికవియగు వాల్మీకిని పేర్కొనలేదు. దీనినిబట్టి అమరసింహుని కాలమువరకు శ్రీరామ ప్రాముఖ్యముకాని అవతారత్వముకాని స్థిరపడలేదని తలపవచ్చును. కాని కాళిదాసు మాత్రము శ్రీరాముని స్పష్టముగా అవతారపురుషునిగా వర్ణించినాడు. రఘువంశ దశమసర్గలో విష్ణువు ఋషులతో తాను దురాత్మవధార్థమై దశరథుని కుమారుడుగా పుట్టుదునని చెప్పెనని తెలిపెను. పదమూడవ సర్గములోని మొదటి శ్లోకమందే "రామాభిధానో హరిః" రాముని పేరుతో వర్తిస్తున్న హరి (విష్ణువు) అని వర్ణించెను. కాళిదాసు రామాయణకథలో నంతటను శ్రీరాముని అవతార పురుషునిగానే వర్ణించెను. అయితే కాళిదాసెప్పటివాడు, భాససౌమిల్లకుల తర్వాతివాడనని తానేతన మాళవికాగ్నిమిత్రములో తెలుపుకొనెను. ఈ నాటకములోని అగ్నిమిత్రుడు మగధరాజగునేని (అవునని పలువు

రన్నారు) కాళిదాసు క్రీస్తునకు పూర్వము ౧౫౦ ప్రాంతము వాడగును. మరికొందరు గుప్తరాజులలో చంద్రగుప్తుడను వాడు విక్రమార్క బిరుదమును వహించెననియు కావున కాళిదాసప్పటివాడనియు అనగా ఇంచుమించు క్రీ. శ. ౪౫౦ ప్రాంతమువాడనియు నందురు. కావున రాముని అవతార తత్వము క్రీ. పూ. ౧౫౦ ముందు లేకుండెననియు క్రీస్తుశకము 3౫౦ లోపల నేర్పడెననియు అనవచ్చును.

౬

శ్రీమద్రామాయణములో రాముడు తాను విష్ణ్వవతారమను మాటను మరచిపోయి యుండెను. రావణునితో యుద్ధముచేయు సందర్భములో అతనికి దేవతలు ఈ విషయాన్ని జ్ఞాపకముచేసిపోయిరి. రామలక్ష్మణులు నాగపాశబద్ధులైనప్పుడు గరుత్మంతుడు దివ్యజ్ఞానముతో నీ సంగతిని గ్రహించి వెంటనే రణభూమికి వెళ్లి నాగపాశములనుండి రామలక్ష్మణసోదరులను విడిపించగా రాముడు తెలివినొంది "ఓయీ నీ వెవ్వరు"? అని ప్రశ్నింపగా "నేను మీకు స్నేహితుడను" అని గరుత్మంతుడు చెప్పెను. రాముడు తన స్నేహితు నెట్లుమరచిపోయెను?

అప్పుడప్పుడు రాముడు మనిషివలెనే ఆచరించుటను వ్యాఖ్యాతలు సమన్వయించినారు. ఆవిధముగా అతడు నటన చేసెనట! అక్కడక్కడ రామాయణములో కొన్ని శ్లోకాలు అవతార నిరూపణకై చేర్చినారు. ఆదిలోనే బాలకాండలో

విష్ణువు దేవతలతో నిట్లన్నాడు. "నేను రావణునిజంపి భూలోకములో ౧౧,౦౦౦ ఏండ్లుందును. రావణునివధకై వచ్చిన యవతారము ఆపనిపూర్తియైన తర్వాత ౧౧,౦౦౦ ఏండ్లుండి ఏమిసాధించెను? దానికి కారణమేమియు తెలుపలేదు. శ్రీకృష్ణుడు ౧౧౬ ఏండ్లే జీవించెనని భారతమునుండియు ఛాందోగ్యోపనిషత్తునుండియు తెలియవచ్చుచున్నది. కాని రాముడు ౧౧,౦౦౦ ఏండ్లు కారణములేకుండా ఎందుకు జీవించెను? ఇట్టి యంశాలన్నియు తర్వాత చేర్పబడినట్టివే.

రామాయణమందు అందందు చైత్యములను గురించి వ్రాసినారు. అవి బౌద్ధాలయములే యని చెప్పజాలము. కాని సందేహానికి తావులేనట్లుగా జాబాలి అనువాడు రామునితో శ్రాద్ధము పెట్టవలసిన అవసరములేదని వాదింపగా శ్రీరాము డాగ్రహించి యిట్లు పరుషోక్తులనాడెను.

యథాహి చోర స్సతథాహి బుద్ధః, తథాగతం నాస్తిక మత్ర విద్ధి
తస్మాద్ధి యశ్శంక్యతమః ప్రజానాం, న నాస్తికే నాభిముఖో బుధ స్స్యాత్.
అయోధ్య. ౧౧౦-౩౪.

బుద్ధుడు (లేక తథాగతుడు) చోరుడు. అతనిమతము గర్హ్యము అని రాముడు తొమ్మిదవ అవతారాన్ని నిందించెను. బుద్ధుడు క్రీ. పూ. ౫౫౦ ప్రాంతమందలివాడు. అతని వేదవిరుద్ధమైన బౌద్ధమతము వ్యాప్తినొందిన తర్వాత దాని సిద్ధాంతములలోని శ్రాద్ధప్రాతికూల్యమును రామునిద్వారా పౌరాణికులు ఖండింపజేసినారు. మరొకచోట,

"ధ్యాయతే మనసా గీతా......కిష్కింధ ౧౮-౩౧ నుండి ౩౩ వరకు.

అని రెండు మనుస్మృతి శ్లోకాల నుదాహరించినారు. రాముని వంశమం దాదిపురుషుడు మనువను నాడుండెను. ఈ యుదాహృతు డతడుకాడు. రాజభిర్ధృతదండాస్తు— అనుశ్లోకము. మనుస్మృతి VIII, 318 లోనున్నది. శాసనాద్వా విమోక్షాద్వా—అనుశ్లోకము మనుస్మృతి VIII, 316 లో నున్నది. మనుస్మృతిలో ఈ యుదాహృత శ్లోకాలలో నొకటి కానవచ్చుచున్నది. కాన యీ మనువు స్మృతి కర్తయై యున్నాడు.

మరొకచోట—

పంచపంచనఖా భక్ష్యా బ్రహ్మక్షత్రేణ రాఘవ-కిష్కింధ ౧౭-౩౭

అను వాక్యము కలదు.

గౌతమ ధర్మ సూత్రములలో "పంచ పంచ నఖా భక్ష్యాః" అను సూత్రముకలదు. ఎవరు ముందు వ్రాసిరో తెలియదు. అభక్ష్యపంచనఖులను గూర్చి మహాభాష్యమందును పశ్పశమందు చర్చించినారు. యుద్ధకాండములో రావణుని అమాత్యాదులు చనిపోగా కుంభకర్ణుని లేపుటకుముందు రావణుడు తన సభ్యులతో ఇట్లనెను.

"ఇక్ష్వాకుకులనాథేన అనరణ్యేన యత్పురా" యుద్ధ ౬౦-౮.

రావణుడు ఇక్ష్వాకు వంశమందు పూర్వికుడైన అనరణ్యుడను రాజును జంపెను. అతడు చనిపోవుచు "ఓరీ, నా వంశమందు నిన్ను జంపువాడు పుట్టగలడు" అని శపించి పోయెనని అందు చెప్పబడినది. ఇది క్రొత్తవిషయము. ఇంత

వరకు ఈ ముచ్చట ఎందును రాలేదు. ఈ అనరణ్యుడెవ్వడు? రామాయణ బాలకాండలో ౭౦ వ సర్గలో ఇక్ష్వాకువంశ వృత్తమియ్యబడినది. అందు త్రిశంకుని తాత అనరణ్యుడని పేర్కొనబడినాడు. అట్టి అనరణ్యుడు రాముని కన్న ౨౧ తరాలకు ముందుండినవాడు. తరమునకు ౩౫ సం॥లు లెక్క ప్రకారముచూచిన అనరణ్యుడు రామునికంటె ౭౩౫ సం॥లకు ముందుండినవాడు. అయితే యీలెక్క కలికాలపులెక్క. కృతయుగములో దశరథుడే ౬౦,౦౦౦ సం॥లు జీవించెను. మరి అతని పూర్వీకులు ఒక్కరొక్క రెన్నివేలయేండ్లు జీవించిరో యేమో? ఆ లెక్కప్రకారము చూచిన మనకేమియు అర్థము కానేరదు. రామునికన్న ౨౧ తరములకు ముందుండిన అనరణ్యుని రావణుడు చంపినాడన్న రావణుని వయస్సెంత యుండవలయునో గణిత శాస్త్రజ్ఞులును, జ్యోతిష్కులును, పౌరాణికులును, కలిసి లెక్కలు వేయుచుండవలసినదే!

జైన రామాయణములో ఇట్లు వ్రాసినారు. "విజయుడు అయోధ్య నేలుచుండెను, అతని తర్వాత ౨౭ గురు రాజ్యముచేసిరి. కడపటివాడగు అనరణ్యుడు రఘుమహారాజు కుమారుడు. అతనికి దశరథుడు పుట్టెను. దశరథునికి రామాదులు పుట్టిరి." దీనినిబట్టి అనరణ్యుడే అజమహారాజని తేలును. ఇది రామాయణ కథకన్న ఎక్కువగా విశ్వసనీయమై యున్నది.

రాముడు చిన్నవాడుగా ఉండినప్పుడు రావణుడు రాముని తాతకాలమువాడుగా నుండెనని దీనివలన అర్థమగును. అయినను వృద్ధరావణునికి పరకాంతాకాంక్ష యెట్లు కలుగును? మొత్తానికీ విషయము ప్రక్షిప్తమని తోచుచున్నది.

దశరథుడు అశ్వమేధమును చేయించుటకు ఋశ్యశృంగుని పిలిపించెను. అతడెవరైనది దశరథునికి తెలియదు. అందుచేత తనమంత్రి అతనికథను తానుగూడా ఎవరో పూర్వంలో చెప్పగావిని దశరథుని కెరింగించెను. ఋశ్యశృంగుడు తుదకు దశరథుని అల్లుడే! అల్లునిసంగతి మామకే తెలియకపోయెను పాపము! శాంత అను కూతురు దశరథునికి ఉండెనట. ఆమె ఏ దేవేరికిపుట్టెనో యేమో జాడయే కానరాదు. దశరథుని కంతవరకు కుమారులు జనింపలేదు. అట్టిస్థితిలోఉన్న యొక్కకూతురును ఎవడో అంగరాజట, అతనికి దత్తుగా ఇచ్చివేసెను. ఈ కథయంతయు కల్పితమే యని. స్పష్టము.

౭

రాముడు వనవాసమునకు వెళ్ళుచు కైకతో ఇట్లు శపథము చేసెను.

చతుర్దశహివర్షాణి వత్స్యామివిజనేవనే, మధుమూల ఫలైర్జీవన్
హిత్వామునివ దామిషం. అయోధ్య ౨౦-౨౯.

నేను ఈ ౧౪ ఏండ్లు మాంసముతినకుండ మునివలె అరణ్యంలో ఉంటానుఅని మాటయిచ్చి నాలుగైదు దినాలకే అరణ్యానికి పోయిన ఆదిలోనే ఆ శపథాన్ని మరచిపోయెనా? గంగనుదాటి మొదటిదినమే అరణ్యావాసము చేసిననాడు నాలుగు పెద్ద మృగాలను చంపి తానును సీతయు లక్ష్మణుడును తినినారు.

"తౌ తత్ర హత్వా చతురో మహామృగాన్, వరాహ మృశ్యం పృషతం మహారురుం
ఆదాయ మేధ్యం త్వరితం బుభుక్షితౌ, వాసాయ కాలే యయతు ర్వనస్పతిం.
అయోధ్య ౫౦-౧౦౨.

ఇంతేకాక ఇంచుమించు పది యిరువదితావులందు రామాదులు మాంసమును తిన్నట్లు వర్ణించినారు. హనుమంతుడు సీతతో ఇట్లన్నాడు. "రాముడు మీవియోగదుఃఖముచే మద్యమాంసములను వదలివేసినాడు" (సుం. ౩౬-౪౧)

దీనినిబట్టి రామాదుల మాంసభక్షణమో లేక తద్వర్జనమో ఏదోయొక భాగము ప్రక్షిప్తమైనదనుట స్పష్టము.

౮

లక్ష్మణునికి పెండ్లి అయ్యెనా ?

లక్ష్మణునికి పెండ్లి అయినట్లు అతని భార్యపేరు ఊర్మిళ అయినట్లు బాలకాండలో ఇట్లు కలదు.

అబ్రవీత్ జనకోరాజా హర్షేణాభి పరిప్లుత:
లక్ష్మణాగచ్ఛ భద్రంతే ఊర్మిళా ముద్యతాంమయా.
బాల. ౭౩స. శ్లో ౭౦ నుండి

ఈ శ్లోకాలు ప్రక్షిప్తములనియు లక్ష్మణునికి వివాహము కాలేదనియు అనుమానము కలుగుచున్నది. ఈ అనుమానమును వాల్మీకిరామాయణములోని ఇతర భాగాలు బలపరచుచున్నవి. ఎట్లనగా—

లక్ష్మణుడు ౧౪ ఏండ్లు రామునితో వనవాసమునకై వెళ్లినప్పుడు ఊర్మిళతో ఒక్కమాట అయినా చెప్పిపోయినట్టి జాడలేదు. రామాయణములో ఊర్మిళజాడ మరెందును స్పష్టముగా కానరాదు.

అరణ్యావాస కాలమందు శూర్పణఖ రాముని కామించి తనమనోరథమును ప్రకటించుకొనగా రామభద్రుడిట్లనెను.

> అనుజస్త్వేష మేభ్రాతా శీలవాన్ ప్రియదర్శనః
> శ్రీమాన కృతదారశ్చ లక్ష్మణోనామ వీర్యవాన్.
>
> అరణ్య స. ౧౮ శ్లో. ౩.

ఓ శూర్పణఖా ఈనాతమ్ముడగు లక్ష్మణుని లక్షణవంతుని శ్రీమంతుని చక్కనివాని వరింపుము. అతడు పెండ్లికానివాడు. వీర్యవంతుడు అని రాముడనెను. రాముడు శూర్పణఖతో సరసాలాడుచు తమాషాగా అన్నముచ్చట అని యెవ్వరైనా అందురేమో? శ్రీరాముడు ఛలోక్తులలో సహితము అబద్ధమాడని వాడని వర్ణించినారు కదా! అప్పుడు రామునికి అనృతదోష మంటగట్టినవారగుదురు.

సీతను ఎత్తుకొనిపోవుటకై బ్రాహ్మణ వేషముతో వెళ్లిన రావణునితో సీత ఇట్లనెను.

సభ్రాతా లక్ష్మణోనామ
ధర్మచారీ దృఢవ్రతః. అరణ్య. స. ౪౭ శ్లో. ౪౯.

ఇచ్చట ధర్మచారీ అను పదానికి మారుగా "బ్రహ్మచారీ" అని కొన్ని రామాయణ ప్రతులలోనున్నదని పలువురు వ్రాసినారు. "బ్రహ్మచారీ" అనుపదము సరియగుచో ఊర్మిళయొక్క అస్తిత్వమే యెగిరిపోవును.

మొత్తముపై ఊర్మిళాలక్ష్మణ వివాహము సంశయాస్పదము. "అకృతదారుడు" అనగా ఇప్పుడు వెంటభార్యలేనివాడని వ్యాఖ్యాతలు సరిపెట్టజూచినారు. కాని యది తృప్తిపరుపజాలని డొంకతిరుగుడు ద్రావిడ ప్రాణాయామముగా నున్నది.

౯

హిందూస్థానములో లభ్యమైన వివిధప్రాంతాలలోని రామాయణ ప్రతులనుబట్టికూడా మధ్యమధ్య యెవరికి తోచినట్లు వారు తమతమ హస్తలాఘవమును చూపినారు. "పశ్చిమహిందూస్థానములోను, బెంగాలులోను, బొంబాయిలోను, లభ్యమైన రామాయణ ప్రతులలో సరాసరి మూడవభాగము వరకు ఒకదానిలో నున్నట్లుగా ఇంకొకదానిలో లేదు" అని మెక్డానెల్‌గారు వ్రాసినారు. రామాయణమును ఒక మహా

కావ్యము క్రింద లెక్కపెట్టి దానిలో కావ్యరీతులను, వర్ణనలను సరిగా ఉండునట్లు తీర్చి, భాషనుకూడా చాలాసవరించి తర్వాత క్రమక్రమముగా పెంచుచు ఇప్పటి రూపానికి తెచ్చినట్లు కనబడుచున్నది. జెకోబీగారు రామాయణాంత రంగిక పరీక్షను బాగుగాచేసి బాలకాండ యుత్తరకాండయు మొదట లేకుండెననియు, 2 నుండి 6 కాండలవఱకే మొదట నుండె ననియు తర్వాత బాలోత్తర కాండలను చేర్చి రామునికి విష్ణ్వవతార తత్త్వమును సిద్ధింపజేసిరనియు అభిప్రాయ మిచ్చి నారు. ఈ విధముగా రామాయణము పెరుగుతూవచ్చిన దనుటకు ఏమిన్ని సందేహములేదు.

శ్రీరాముని కాలమందే రామాయణము సంస్కృత భాషలోనే మార్గవిధానముతో తందానకథగా తంత్రీ మర్ద లాది పరికరాల సహాయముతో గానము చేయబడుచుండెను. అట్టి కథాగానమును విశేషమైతే రెండు మూడు రాత్రులలో చేసియుందురు. సంస్కృతములో కథచెప్పిన పామరులు దాని నర్థముచేసికొని యుండవలయును. మరియు వారును సంస్కృతమునే మాట్లాడి యుండవలయును. పాణినికన్న పూర్వము జనులందరు సంస్కృతమునే మాట్లాడుచుండిరి. అతనికాలము వరకు ప్రాకృతభాషలు సంస్కృత జన్యములై వ్యాప్తిలోనికి వచ్చుచుండెను. సంస్కృతము పామరవ్యవహారముచే అప భ్రంశమై దుష్టము కాకుండా రక్షింపవలసి యుండెను. పాణిని కన్న పూర్వమే శాకల్యుడు, శాకటాయనుడు, మున్నగువారు సంస్కృత వ్యాకరణములను వ్రాసిరి. పాణిని క్రీ. పూ. 600

తర్వాతిమాట. రామాయణములోని భాషకూడా చాలా ప్రాచీనమైనదిగా ఉండెను. అనగా రామాయణమందంతటను ఇప్పుడుండు భాష పాణినికన్న పూర్వముదిగా కనబడును. పాణిని సూత్రాలకు భిన్నమైన భాష అందందు కనబడు చున్నది. దానిని తప్పనుటకు వీలులేక ఆర్షము అని పెద్దలు నిర్ణయించిరి. ఇట్టి ఆర్షమును చాలావరకు దిద్దియుందురు. అక్కడికిని వీలులేని పదాలను అట్లేయుంచి వాటిని ఆర్ష ప్రయోగముల క్రింద లెక్కకట్టివేసిరి. ఈ ఆర్షాలే రామాయణ ప్రాచీనతను పట్టిచ్చుచున్నవి.

౧౦

ముందు ప్రకరణములో సీతారాముల వివాహము బాలవివాహమా ప్రౌఢవివాహమా అను విషయమును ఉభయత్ర అన్వయమగునటుల వర్ణించివేసినారు. సీతా రామాదుల వివాహములు ప్రౌఢవయస్సుననే జరిగియుండును. క్రీస్తు శకానంతరము బాల్యవివాహములు ప్రబలెను. సీతారాములకును బాల్యమందే పెండ్లియయ్యెనని యేబాల్యవివాహాభిమానియో ఆధారముకల్పింప జూచియుండును. అందేదైన ఒక పక్షము ప్రక్షిప్తమనక తప్పదు. అట్టి విషయములచర్చ ముందు చేయుచున్నాను.

అరణ్యకాండలో ౫౬ సర్గ తర్వాత సీత కింద్రుడు ప్రత్యక్షమై పాయసమునిచ్చెనని ౨౬ శ్లోకాల వర్ణనకలదు. ఆ భాగమంతయు ప్రక్షిప్తమేయని పలువురంగీకరించినారు.

హనుమంతుడు సంస్కృతములో పారమందిన పండిత ప్రకాండుడుగా వర్ణింపబడినాడు. అదంతయు ప్రక్షిప్తభాగమే యని నేనుముందు "సాంఘికాచారములు" అను ప్రకరణములో చర్చించినాను. ఇంకను ఇట్టి సంఘటనల నాయాతావులందు విమర్శింపగలను.

సి. వై. వైద్య అనువారు Riddle of the Ramayana అను ఆంగ్ల గ్రంథములో రామాయణములోని ప్రక్షిప్తముల చర్చ అతివిపులముగా చేసినారు. అందుచేత నేనెక్కువగా దీనినిగురించి చర్చింపగోరలేదు. ఇందు నేను నాకుతోచినవెత్తి చూపినాను.

## ౫

# ముఖ్య సంఘటనల కాలచర్చ

శ్రీమద్రామాయణములో ముఖ్య సంఘటనలు ఎప్పు డెప్పుడు సంభవించెనో తెలుసుకొందము. మొట్టమొదట శ్రీరామచంద్ర సోదరుల జననకాలమును గురించి రామాయణ మేమి తెలుపుచున్నదో కనుగొందము. దశరథమహారాజు వృద్ధుడగుచు వచ్చెను. ముగ్గురుభార్యల పెండ్లాడియుండెను. వారు పట్టపురాణులు. పైగా ౩౫౦ మంది స్త్రీలను వివాహమాడియుండెను. అయితే వారు స్వజాతిస్త్రీలుగా ఉండినట్లు కానరాదు.

'అర్ధసప్తశతాస్తాస్తు ప్రమదాస్తామ్రలోచనాః' అయో. ౩౪-౧౩

ఇంతమంది భార్యలున్నను అతనికి సంతానము లేక పోయెను. సంతానార్థియై పుత్రకామేష్టి యొనరించెను. అటుతర్వాతనే ఆతని పట్టపురాణులైన కౌసల్య, సుమిత్ర, కైకేయీలకు రామలక్ష్మణ భరత శత్రుఘ్నులు పుట్టిరి. వారి జనన కాలమును గురించి రామాయణ మందిట్లు తెలిపినారు.

తతశ్చ ద్వాదశే మాసే చైత్రే నావమికే తిథౌ
నక్షత్రేఽదితి దైవత్యే స్వోచ్చసంస్థేషు పంచసు
గ్రహేషు కర్కటే లగ్నే వాక్పతా విందునా సహ
ప్రోద్యమానే జగన్నాథం సర్వలోకనమస్కృతం
కౌసల్యా జనయ ద్రామం సర్వలక్షణ సంయుతం.

బాల. ౧౮-౮, ౯, ౧౦.

పుత్రకామేష్టియైన ౧౨ నెలల యనంతరము చైత్ర మాసమునందు (శుద్ధ) నవమీ తిథియందు పునర్వసూ నక్షత్రమందు సూర్యాంగారక శని బృహస్పతి శుక్రు లైదుగురును తమతమ యుచ్ఛస్థానములగు మేష మకర తులా కర్కాట మీనములందుండగా అందు బృహస్పతి చంద్రునితో చేరియుండగా కర్కాటలగ్నమందు ఇక్ష్వాకువంశ వర్ధనుడగు రాముని కౌసల్యాదేవి కనెను అని వ్యాఖ్యాతలు వ్యాఖ్యానించినారు.

ఈ యంశమును గురించి శ్రీ పెంజ్యాల వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రిగారు ఇట్లు వ్రాసినారు.

"క్రీ. పూ. ౧౭౬౧ ఫిబ్రవరి ౬వ తేదీనాడు రాముడు పుట్టినటుల రామాయణ జాతకముచే నిశ్చయించితినని ఇలియట్ అనువాడు వ్రాసెను. రామాయణ మందలి పై "తతశ్చ ద్వాదశేమాసే ఇత్యాది శ్లోకములు——పై పద్ధతి ప్రకారము ఎప్పుడును నేటి సిద్ధాంతముచే చైత్ర శు ౯ నాడు ఐదు గ్రహములుచ్ఛస్థితియం దుండవు. అట్లయిదు గ్రహము లుచ్ఛస్థితియందుండిన యెడల నవమినాడు పునర్వసూ నక్షత్రము రాదు. ఫాల్గుణ బ ౩౦ నాటికి సూర్యుడు రేవతీ నక్షత్రాంత్యకలయందుండి చైత్ర శు ౧ నాడు మేషరాశి (అశ్వినీ నక్షత్రములో) లో ప్రవేశించినయెడల అమావాస్యనాడు రేవతీ నక్షత్రమగును. శుద్ధ ౯ నాడు ఆశ్లేషా నక్షత్రముకాని పునర్వసూనక్షత్రము రాదు. ............ చైత్ర శు ౯ ప్రాంతమున బుధు డెప్పుడును కుంభ మీన మేష వృషభ

రాసుల మధ్యమందే సూర్యునికి వెనుకటి రాశిలోనో ముందటి రాశిలోనో యుండును. కాని స్వోచ్చస్థానమగు కన్యారాశిలో నుండడు†"

రామాయణమందు వాల్మీకిపలుతావుల జ్యోతిశ్శాస్త్ర విషయముల నుదాహరించినాడు. మరి యచ్చట ఇంత విపులముగా వర్ణించి ఏల తప్పిపోయెను? ఇది ప్రక్షిప్తమేనా? ఆధునిక జ్యోతిష్కులు నిర్ణయింతురుగాక!

ఏది యెట్లున్నను పై శ్లోకాధారమును బట్టియే భరత ఖండమందంతటను హిందువులు చైత్ర శు ౯ నాడు శ్రీరామ జయంతిని ఆచరించుచున్నారు.

ఇది రాముని జన్మతిథిని గురించిన సంగతి. ఇక తక్కిన ముగ్గురి జన్మకాలములను గురించి కనుగొందము.

పుష్యే జాతస్తు భరతో మీనలగ్నే ప్రసన్నధీః
సార్పే జాతౌతు సౌమిత్రీ కుళీరేఽభ్యుదితే రవౌ. (బాల. ౧౮-౧౪)

భరతుడు పుష్యమీనక్షత్రమందు మీనలగ్నమందు పుట్టెను. లక్ష్మణ శత్రుఘ్నులు ఆశ్లేషానక్షత్రమందు కర్కటక లగ్నమందు మధ్యాహ్నకాలములో పుట్టిరి.

అతీత్యైకాదశాహంతు నామకర్మ తథాకరోత్. (బాల. ౧౮-౨౦)

క్షత్రియులకు ౧౩ వ దివసమునాడు నామకరణము చేయవలసినదని శాస్త్రములు చెప్పుచుండగా రామాయణములో ౧౧ వ దివసమునాడు నామకరణము చేసిరని పై శ్లో

---

† ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక. సంపుటము ౧౨, సంచిక ౨-౩.

కము తెలుపుచున్నది. ఈ విరోధమును సమన్వయించుటకై వ్యాఖ్యాత యిట్లభిప్రాయ మిచ్చినారు. "రాముడు పుట్టిన మరునాడు లక్ష్మణుడు పుట్టెను. కావున లక్ష్మణుడు పుట్టిన తర్వాత ౧౧ దినాలకు నామకరణమయ్యెనని అర్థము చేసు కొనవలెను." దీనినిబట్టి రాముడు జన్మించిననాడే ఇంచుక తర్వాతగా భరతుడు పుట్టెననియు, మరునాడు లక్ష్మణ శత్రుఘ్నులు జన్మించిరనియు గ్రహించుకొనవలెను. అయితే లక్ష్మణ శత్రుఘ్నులు కవలపిల్లలగుదురా కాదా? ఒకే దిన మున, ఒకే నక్షత్రములో, ఒకే లగ్నములో జన్మించినవారు అమడలుకాక మరేమగుదురు? మహాభారతమందలి నకుల సహదేవులవలె ఈ లక్ష్మణ శత్రుఘ్నులు కవలలుగా ప్రసి ద్ధులు కాలేదు. ఉభయుల ప్రకృతులందును గుణములందును చాలభేదము కానవచ్చుచున్నది. లక్ష్మణుడు ఉగ్రుడు. ధర్మా గ్రహుడు. మహావీరుడు. శత్రుఘ్నుడు సాత్వికుడు. చెప్పినంత చేయువాడు. అప్రసిద్ధుడు.

రాముడు పునర్వసూ నక్షత్రమందే జన్మించెననుటకు రామాయణములోనే మరొక నిదర్శనము కలదు.

ఉత్తరాఫల్గునీహ్యద్య శ్వస్తు హస్తేన యోక్ష్యతే
అభిప్రాయామ సుగ్రీవ సర్వానీక సమావృతాః. (యుద్ధ. ४-౬)

రాముడు లంకపై దండయాత్రచేయుటకై కిష్కింధ నుండి బయలుదేరుచు సుగ్రీవునితో నిట్లనుచున్నాడు. "సుగ్రీవా! ఈ దినము ఉత్తరఫల్గునీ నక్షత్రము. నా జన్మ నక్షత్రము పునర్వసు. అందుచేత ఈ ఉత్తర నాకు సాధన

తార యగును. ఇది విజయముకూర్చే మంచినక్షత్రము. రేపు హస్తానక్షత్రము. అది నాకు నైధనతార కావున ఈనాడే ప్రయాణము ప్రారంభింతము."

రామ పట్టాభిషేకము

శ్రీరామ నవరాత్రులు అను పేరుతో చైత్రశుద్ధ ప్రతిపత్తునుండి శుద్ధ నవమివరకు హిందువులు ఉత్సవాలు చేయుచుందురు. శ్రీరాముడు శు ౯ నాడు పుట్టితే అంతకు పూర్వపు ౮ దినాలలో ఉత్సవా లెందుకు చేయుదురు ? కారణము తెలియరాదు.

శ్రీరామునికి మొదట దశరథుడు యౌవరాజ్యపట్టాభిషేకమును తలపెట్టినది చైత్రమందే.

చైత్ర శ్రీమా నయం మాసః పుణ్యః పుష్పితకాననః
యౌవరాజ్యాయ రామస్య సర్వమేవోపకల్ప్యతాం. (అయో. ౩-౪)

అయితే యిది చైత్రమాసమం దేదినమందో తెలియరాదు కాని శు ౫కి పూర్వమే అని చెప్పగలము. ఏలననగా రామాయణాంతములో ఇట్లున్నది.

పూర్ణే చతుర్దశే వర్షే పంచమ్యాం లక్ష్మణాగ్రజః
భరద్వాజాశ్రమం ప్రాప్య వవందే నియతం మునిం.
యుద్ధ (౧౨౪-౧)

దీనిపై గోవిందరాజిట్లు వ్యాఖ్యానించెను. "రాముడు చైత్రశుద్ధ పంచమినాడు అయోధ్యనుండి నిర్వాసితుడయ్యెను... ... ... ...మరల ౧౪ ఏండ్లు ముగియునప్పుడు

చైత్ర శు 3 లంకనుండి వెళ్లెను. చతుర్థినాడు కిష్కింధలో నుండి పంచమినాడు భరద్వాజాశ్రమము చేరెను." దీనివలన చైత్ర ప్రతిపత్తునుండి శుక్ల పంచమిలోగా పుష్యనక్షత్రమందు కర్కటకలగ్నమందు (అయో. ౧౪-3) రాముని యౌవ రాజ్య పట్టాభిషేకము నిర్ణయింపబడియుండె నని మాత్రము తెలియవచ్చుచున్నది. అయినను ఈ పట్టాభిషేకము భగ్న మైనందున ఇది లెక్కకు వచ్చునదికాదు.

రావణ వధానంతరము చైత్ర శు౪నాడు భరద్వాజా శ్రమమునుండి బయలుదేరి చైత్రశుద్ధ షష్ఠినాడు అయోధ్య చేరెను. చైత్రశుద్ధ సప్తమినాడు అతని పట్టాభిషేకము జరి గెను. "సప్తమ్యాం పుష్యనక్షత్రే శ్రీరామచంద్ర పట్టాభి షేకః"అని మహేశ్వరతీర్థులు వ్యాఖ్యానించినారు. రాముడు అయోధ్యను చేరినతర్వాత భరతుని కోరికపై సుగ్రీవుడు వానర ప్రముఖులచే తెల్లవారువరకు సముద్రజలముల తెప్పిం చెను. ఆ జలములచే రాముని పట్టాభిషేకము జరిపింపబడెను. యుద్ధ. (౧3౧-౪౦) ఈ కారణముచేత రాముని పట్టాభిషే కము చైత్రశుద్ధ 2 నాడు జరిగినదనుట స్పష్టము. విషయ మిట్లుండ వారి పట్టాభిషేకము శుద్ధ ౯ నాడు జరిగినదని చాల మంది విశ్వసించుట కాధారమేమియు కానరాదు. శ్రీరామ నవరాత్రులను గురించి యింతకుమించిన విశేషములు రామా యణమందు కానరావు.

శ్రీరాముని వివాహముకూడ చైత్రశుద్ధ ౯నాడు జరిగె నని యందురు. కాని దాని కాధారము వాల్మీకి రామాయణ మందు లేదు. ఉత్తరఫల్గునీ నక్షత్రమందు వివాహము జరిగె

సని మాత్రము తెలియవచ్చుచున్నది. (బాల. ౭౧–౨౮) మరియు (బాల. ౭౨—౧౨, ౧౩)

దశరథునకు శాంత అను ఔరసపుత్రి యుండెననియు ఆమెను అంగరాజగు రోమపాదునకు దత్తతగా ఇచ్చెననియు తెలిపినారు. (బాల. ౬-౧౯, బాల. ౧౧-౧౭) శాంత దశరథుని కే భార్యయందు పుట్టెనో తెలుపలేదు. ఆ కాలములో కన్యకలను గూడా దత్తతగా ఇచ్చుచుండిరని చెప్పవలసి వచ్చును. దశరథునికి శాంత ఔరసపుత్రియని స్పష్టముగా లేదు. "సఖ్యం సంబంధకం చైవ" (బాల. ౧౧, ౧౭) అను దానికి వ్యాఖ్యాతలు స్నేహ సంబంధమో దూర బాంధవ్యమో అను సామాన్యార్థము చెప్పక శాంత దశరథుని పుత్రియని వ్యాఖ్యానించినారు. "శాంతా తవసుతా" (బాల. ౧౭-౧౬) అని దశరథుడే స్వయముగా అంగరాజుతో అనెను. కావున శాంత దశరథుని పుత్రికయని చెప్పుటకు వీలులేదు.

రామాదుల జననానంతరము వారు పసివారుగా నుండగానే వారికి విశ్వామిత్రుడు స్వయంగురువుగా ఏర్పడెను. దశరథుడు రాముని విశ్వామిత్రుని కప్పజెప్పినప్పుడు—

ఊనషోడశవర్షో మే రామో రాజీవలోచనః. బాల. ౨౦-౨.

నా రాముడు ౧౬ ఏండ్లలోపలివాడు అని అన్నాడు. అంటే అతడు ౧౫ ఏండ్లవాడని స్పష్టమగుచున్నది. కాని ముందు అరణ్యకాండలో.

బాలో ద్వాదశవర్షోఽయ మకృతాస్త్రశ్చ రాఘవః

అని మారీచుడు చెప్పినందున ఇచ్చట రామునికి శస్త్రాభ్యాస ప్రారంభకాలమునాడు ౧౨ ఏండ్ల వయస్సుండె

నని సమాధాన పడవలెను. రాముడు ౧౨ ఏండ్ల వయసు లోనో ౧౫ ఏండ్ల వయసులోనో విశ్వామిత్రుని సిద్ధాశ్రమము నకుపోయి అచ్చట వేదములను శాస్త్రములను ధనుర్వేద మును, శస్త్రవిద్యను అభ్యసించెను. అభ్యాసము పూర్తి కా గానే జనకరాజుయొక్క మిథిలకుపోయి వివాహమాడెను. వివాహకాలమందతనికి ౨౫ ఏండ్ల వయస్సని సీత చెప్పెను. అందుచేత రాముడు తన ౧౨వ లేక ౧౫వ సంవత్సరమునుండి ౨౫వ సంవత్సరవయఃకాలమువరకు విశ్వామిత్రునివద్ద విద్యా భ్యాసము చేసెనని చెప్పవలెను. ప్రాచీనకాలమందు బ్రాహ్మ ణులు రాజపుత్రులు కనిష్ఠము ౧౨ ఏండ్లైన గురుకులవాసము చేసి బ్రహ్మచర్యాశ్రమ మందుండి విద్యాభ్యాసము చేయు చుండిరి. కాన రాముడును లక్ష్మణునితోసహా అటులే చేసిరని గ్రహింపవచ్చును. అయితే తక్కిన యిద్దరు సోదరు లేయా శ్రమమందు విద్య నభ్యసించిరో ఆ ముచ్చట చెప్పలేదు. బహుశా వారు నగరమందే యుండి వసిష్ఠునివద్ద నభ్యసించి యుందురు.

### సీతారాముల వివాహకాలము

రామాది సోదరులకు చిన్నతనమందే వివాహ మయ్యెనా, లేక పెద్దవారైన తర్వాతనా? సీతకు బాల్య వివాహ మయ్యెనా? లేక రజస్వలానంతర వివాహ మయ్యెనా? అను సమస్య లాధునికులకు కొంత ముచ్చట కలిగించును. రామాయణములో సీతారామాదులకు బాల్య మందే వివాహమైనట్లు ఎక్కువ నిదర్శనము లియ్య ప్రయ త్నించినారు. అవి ప్రక్షిప్తములనియు తర్వాతివారిచే చేర్చ

బడినవనియు సంశయము కలుగుచున్నది. ఎట్లనగా జనకుని వద్దకు విశ్వామిత్రుడు రామలక్ష్మణులను తీసికొని వెళ్ళినప్పుడు వారినిగురించి జనకు డిట్లనెను.

అశ్వినా వివ రూపేణ సముపస్థితయౌవనౌ (బాల. ౫౦-౨౨)

"రామలక్ష్మణులు అశ్వినులవలె యౌవనము పొందిన వారైయున్నారు" యౌవనారంభ దశలో నున్నారనగా ఏమి అర్థము? జనకుని నగరానికి వెళ్ళిన కొన్ని దినాలలోపలనే రామసోదరులకు వివాహమయ్యెను. వెనువెంటనే వారు తమతమ భార్యలతో అయోధ్యానగరానికి వెళ్ళిరి. ఆభార్యలు—

రేమిరే ముదితా స్సర్వా భర్తృభి స్సహితా రహః (బాల. ౭౭ ౧౪)

"రహస్యమందు తమతమ భర్తలతో ఆనందముతో రమించిరి"

రాముడైతే

రామస్తు సీతయాసార్థం విజహార బహూ నృతూన్

(బాల. ౭౭-౨౫)

సీతతో పెక్కు ఋతువులందు క్రీడించెను. ఈ విధముగా వర్ణించుటచేత రామాదులు౨౦ఏండ్లుదాటిన వయస్సు వారుగా నైనను నుండియుందురని తలపవలసియుండును. సీతాదులును వ్యక్తురాండ్రై యువతులుగా నుండిరని అర్థమగుచున్నది.

సీతతో రమించుచు ఆనందించుచున్న రాముడు ఇంకను ఎట్టివాడో వాల్మీకి స్పష్టపరచినాడు.

అరోగ స్తరుణో వాగ్మీ వపుష్మాన్ దేశకాలవిత్ [అయో. ౧-౨౮]

"అతడు రోగరహితుడు, ఆరోగ్యవంతుడు, మంచి వాక్చాతుర్య మెరిగిన అనుభవశాలి. కాయపుష్టి కలిగిన ఆజానుబాహువు. యౌవనవంతుడు. దేశకాలములను బాగుగా ఎరిగినవాడు." రాముని యౌవరాజ్య పట్టాభిషేక సన్నాహములు వివాహమైన కొలదికాలములోపలనే జరిగెను. వివాహమైన వెంటనే భరతుడు తన మేనమామ యింటికి వెళ్లెను. అతడు మరల రాముడు వనవాసము వెళ్ళినతర్వాతనే అయోధ్యకు వచ్చెను. కావున భరతుడు బహుశః ఒక సంవత్సరము కన్న ఎక్కువకాలము తన మేనమామగారి ఇంటిలో నుండెను.

ఈ విధముగా తమ వివాహకాలమందు సీతారాములు ఇతర సోదర దంపతులు యువతీయువకులుగా నుండినారని పైన తెలిసినప్పటికిని ఈ క్రింద నుదాహరించుచున్న ఆధారములనుబట్టి వారికి బాల్యమందే పెండ్లి యయ్యెనని వాదింపవలసి యుండును. ఎట్లనగా,

దశ సప్తచ వర్షాణి తవ జాతస్య రాఘవ; (అయో. ౨౦-౪౫)

అరణ్యమునకు పోవునప్పుడు కౌసల్య రామునితో "రామా నీవు పుట్టి ౧౭ ఏండ్లయ్యెనుకదా" అని యన్నది. సీతను రావణు డెత్తుకొనిపోవుటకై బ్రాహ్మణవేషముతో వచ్చి నీచరిత్ర యేమి అని సీతను విచారించగా ఆమె యిట్లన్నది.

ఉషిత్వా ద్వాదశ సమా ఇక్ష్వాకూణాం నివేశనే
భుంజానా మానుషాన్ భోగాన్ సర్వకామసమృద్ధినీ

తత స్త్రయోదశే వర్షే రాజా మంత్రయత: ప్రభు:
అభిషేచయితుం రామం సమేతో రాజమంత్రిభి:
మమ భర్తా మహాతేజా వయసా పంచవింశక:
అష్టాదశహి వర్షాణి మమ జన్మని గణ్యతే.

(అరణ్య. ౪౭-౪, ౫, ౧౦).

అనగా—"నేను పెండ్లి అయినతర్వాత ౧౨ ఏండ్లు నా భర్త యింటిలో నుంటిని. అరణ్యానికి వచ్చేకాలములో రామునికి ౨౫ ఏండ్లు, నాకు ౧౮ ఏండ్లు" అని సీత అన్నది. దీనినిబట్టి సీతకు పెండ్లికాలములో ౬ ఏండ్ల వయస్సనియు, రామునికి ౧౩ ఏండ్ల వయస్సనియు తేలుతుంది. మరి రాముడు అరణ్యానికి పోయిననాడు ౨౫ఏండ్లవాడని సీత చెప్పుచున్నది. అయితే కన్నతల్లి కౌసల్య రామునికి అరణ్యానికి వెళ్లేకాలములో ౧౭ ఏండ్ల వయస్సే అని చెప్పియుండెను కదా! రాముని వయస్సువిషయములో తల్లి కెక్కువ తెలియునా? భార్య కెక్కుడుగా తెలియునా? తల్లిమాటయే ప్రధానమగును. అరణ్యానికి పోవుటకు ౧౨ ఏండ్లకుముందు రాముని వివాహమైనందున ఈ లెక్కప్రకారము రామునికి వివాహకాలములో ౫ ఏండ్ల వయస్సే యుండెను? అట్లైనచో "ఊనషోడశవర్షుడు" నా రాముడు అన్న తండ్రి దశరథునివాక్కు అబద్ధమగును. రామునికే వివాహకాలమందు ౫ ఏండ్లుండిన సీత కెన్ని ఏండ్లు? అత్తకోడండ్ర లెక్కలభేదమును వ్యాఖ్యాతలు సమన్వయింపవలసివచ్చెను. వా రిట్లన్నారు. కౌసల్య అనిన ౧౭ ఏండ్లు సరిగానే ఉన్నవి. సీత తెలిపిన ౨౫ ఏండ్లు కూడ సరియైన లెక్కయే. ఎట్లనగా రాముడు పుట్టిననాటి నుండి వయస్సులు లెక్కించవలసిన పనిలేదు. అతని ఉపన

యనము క్షత్రియధర్మము ప్రకారము ఎనిమిదవయేట జరిగి
నందున ఆనాటినుండియే లెక్కించుకొని ౧౭ అని సరిపెట్టు
కుంటే చిక్కువదలిపోవును అని వ్యాఖ్యాతలన్నారు. అయితే
సీత ఆ విధముగా ఎందుకు లెక్కపెట్టకపోయెనో తెలుపక
పోయిరి!! సమన్వయము ఎటుపట్టితే అటు చేయవచ్చును!!
బుద్ధిచాకచక్యము కొలది సమన్వయము చేయవచ్చును కాని
ఒక విషయమును మాత్రము వ్యాఖ్యాతలు సరిపెట్టుటకు
మఱచిపోయినారు. అదేమనగా రామాదుల వివాహకాల
ములో కైకేయితండ్రి తన మనుమడగు భరతుని చూడ
గోరినవాడై పిలుచుకొని వచ్చుటకు భరతుని మేనమామను
నంపి యుండెను. అతడు అయోధ్యకు వచ్చి అచ్చట వారిని
కానక మిథిలకు వెళ్లి అచ్చటనే పెండ్లి సందడిలో ఉండి
పోయెను. పెండ్లి అయిన తర్వాత అయోధ్య చేరిన వెంటనే
భరత శత్రుఘ్నులను కైకేయి తండ్రియొక్క దేశానికి పం
పిరి. వారు మరల దశరథుడు చనిపోయిన తర్వాతనే తిరిగి
వచ్చిరి. సీతావాక్యము ప్రకారము భరతుడు ౧౨ ఏండ్లు
ఏకధాటిగా కేకయరాజ భవనమందుండినాడనవలెను.
లేదా సీతాదేవి రావణునితో చెప్పిన మాటలు ప్రక్షిప్తము
లనియు తర్వాతివారి కల్పన యనియు చెప్పవలెను!

సీత రామునింట ౧౨ ఏండ్లుండిన ముచ్చటను బలపరు
చుటకై ఆమె హనుమంతునితో ఇట్లన్నది—

సమా ద్వాదశ తత్రాహం రాఘవస్య నివేశనే, (సుంద. ౩౩-౧౭)

రావణుడు మాయారాముని శిరస్సు సీతకు పంపిన ప్పుడు ఆమె రాము నుద్దేశించి యిట్లు విలపించెను.

కిం మాం నప్రేక్షసే రాజన్ కిం మాం న ప్రతిభాషసే
బాలాం బాలేన సంప్రాప్తాం భార్యాం మాం సహచారిణీం.

(యుద్ధ. ౩౨-౨౦)

బాలికనైన నన్ను బాలుడనైన నీవు వివాహమై యుంటివికదా అని శోక సందర్భములో పలికెను.

రావణ వధానంతరము సీతను అగ్ని ప్రవేశము చేయు మని ఆజ్ఞాపించినప్పుడు సీత రామునితో ఇట్లన్నది.

నప్రమాణీకృతః పాణి ర్బాల్యే బాలేన పీడితః. (యుద్ధ. ౧౧౯-౧౬)

బాలుడవగు నీవు బాలికను వివాహమాడి యుంటివి, అప్పటి మాటలు ప్రమాణములు కావేమో కదా అని యన్నది. ఈ యంశములు సీతారాముల బాల్యవివాహమును స్పష్టవాక్యములతో సమర్థించుచున్నవి. అయితే ఈ క్రింది ప్రమాణములు పై వాక్యములను ఖండించుచున్నవి. ఎట్లనగా:—అనసూయాదేవితో సీత యిట్లనుచున్నది.

"పతిసంయోగసులభం వయో దృష్ట్వాతు మే పితా
చింతా మభ్యగమ ద్దీనో విత్తనాశా దివాధనః
తస్య బుద్ధి రియం జాతా చింతమానస్య సంతతం
స్వయంవరం తనూజాయాః కరిష్యామీతి ధీమతః
సుదీర్ఘ స్యాథ కాలస్య రాఘవోయం మహాద్యుతిః
విశ్వామిత్రేణ సహితో యజ్ఞం ద్రష్టుం సమాగతః"

(అయో. ౧౧౮-౩౪, ౩౮, ౪౪.)

"పతితో సంయోగమగుటకు తగిన వయస్సు నాకు నిండినది చూచి నా తండ్రియగు జనకునికి చింతముదిరెను. నాకుస్వయంవరము చాటించవలెనని సంకల్పించెను. ఎందరో రాజులువచ్చి శివధనుస్సును కదిలింపలేక వ్యర్థులై పోవుచుండిరి. తుదకు ఈ రాముడు బహుకాలానికి వచ్చెను" అని సీత పలికిన మాటలను బట్టి ఆమె వ్యక్తురాలై పతిసంయోగ సులభమై యుండెననియు పెద్దది కావుననే ఆమెయే స్వయముగా వరుని వరించు ఏర్పాటు చేయదలచి యుండిరనియు ఆమె పతిసంయోగసులభమైన తర్వాతకూడ సుదీర్ఘ (ఉత్త దీర్ఘ కాదు) కాలానికిగాని రాముడు రాలేదనియు సందేహానికి తావులేకుండా ఆమెపెండ్లినాటికి ౧౬ ఏండ్లుదాటిన వయస్సు కలదిగా ఉండియుండునని ద్యోతకమగు చున్నది.

ఎట్లైతేనేమి సీతారాముల వివాహవయశ్చర్చ రామాయణములో పరస్పర విరుద్ధ ప్రమాణాలతో కూడినదై నేటి సనాతనులకుగాని సంస్కర్తలకు గాని ఆధార హేతువు కానిదై యున్నది.

రాముని ప్రవాసకాలము

రాముడు అయోధ్యనుండి చైత్రశుద్ధ ౫నాడు నిర్వాసితుడయ్యెను. అటు తర్వాత వనవాసకాలమును గురించి గోవిందరాజు ఈ విధముగా వ్యాఖ్యానించినాడు. "రాముడు చైత్రశుద్ధ ౫ అయోధ్యను వదిలెను. అదేరాత్రి తమసాతీరమందు నిద్రించెను. షష్ఠినాడు శృంగిబేరపురమందును, సప్తమి

నాడు వృక్షమూలమునను శయనము. అష్టమినాడు భరద్వాజాశ్రమములో, నవమినాడు యమునాతీరమందు. దశమినాడు చిత్రకూటము చేరెను. ఆదేరాత్రి అయోధ్యలో దశరథుడు చనిపోయెను. ఏకాదశినాడు దశరథశవాన్ని నూనెదోనెలో నుంచిరి. ద్వాదశినాడు భరతుని పిలుచుటకై దూతలువెళ్ళి పౌర్ణమినాడు భరతునికాంచిరి. చైత్రబహుళ ప్రతిపత్తునాడు భరతుని ప్రయాణము. చైత్ర బ ౯ నాడు అయోధ్యను చేరెను. ఆనాడే దశరథుని సంస్కారము. ఆ నాటినుండి ౧3వ దినమందు అనగా వైశాఖ శుద్ధ ౫ నాడు భరతుడు శ్రాద్ధకర్మలను చేసెను. శుద్ధ ౬నాడు దహనదేశశోధనము. సప్తమినాడు బాటలు బాగుచేయించును. నాలుగుదినాల తర్వాత ౧౧నాడు భరతుడు రామునివద్దకు ప్రయాణమగును. ద్వాదశినాడు భరద్వాజాశ్రమ మందు; త్రయోదశినాడు రామ దర్శనము. మూడు దినాలు చిత్రకూటమందేయుండి వైశాఖ బహుళ విదియనాడు పాదుకలతో తిరిగిపోవును. చతుర్థినాడు అయోధ్య చేరును. ఈ విధముగా ఒకటిన్నర నెల గడచినతర్వాత రాముడు చిత్రకూటమునువదలి అత్ర్యాశ్రమమునుచేరును. వివిధ ఋష్యాశ్రమములందు నివసించుచు ౧౦ సంవత్సరాల కాలమును గడిపెను. మొత్తముపై ౧౦ సంవత్సరాలపై ఒకటిన్నరమాసము గడిచినది. అప్పటినుండి ౧3 ఏండ్లు పూర్తియగువరకు పంచవటీతీర్థమందు నివసించెను. ౧౪వ సంవత్సరారంభమందు చైత్రమాసములో రావణుడు సీతను అపహరించెను. వైశాఖమందు రాముడు సుగ్రీవుని కలియును. ఆషాఢమందు వాలి వధ. ఆశ్వయుజమందు

సైన్యముల సమకూర్పు. ఫాల్గునమందు రాముని ప్రాయోపవేశము. ఫాల్గున శు ౧౪ నాడు లంకాదహనము. ఫాల్గున అమావాస్యనాడు రావణ వధ. చైత్ర శు ౧ నాడు రావణ సంస్కారము. విదియనాడు విభీషణాభిషేకము. తృతీయనాడు లంకనుండి ప్రయాణము. చతుర్థి కిష్కింధలో, పంచమి భరద్వాజాశ్రమములో. చైత్ర శు ౭ పుష్యనక్షత్రములో శ్రీరాముని పట్టాభిషేకము."

ఈ వ్యాఖ్య చాలావరకు సరిగానేయున్నది కాని తుదిలోపమాత్రము కొన్ని తిథులు సరిగాలేవు. పై విషయాలనే కొద్దిగా వివరించిన స్పష్టము కాగలదు.

రాముడు అయోధ్యనుండి తమసానదిని చేరెను, మరునాడు ఉత్తరకోసల చేరెను. (అయో. ౪౯–౨) కోసలకావల వేదశ్రుతీనదిని దాటెను. (౪౯–౯) అచ్చటినుండి "అగస్త్యునిచే అధిష్ఠింపబడిన 'దక్షిణదిక్కున కభిముఖు డయ్యెను. (౪౯–౧౦) [వేదవతి ఆర్యావర్తానికి రాముని కాలములో హద్దుగా కనబడుచున్నది. రామాయణమందలి భౌగోళిక విజ్ఞానమును గురించి ప్రత్యేకముగా ముందు వ్రాయుదును. అందిట్టి విషయాలను చర్చింతును.] తర్వాత గోమతిని దాటెను. (శ్లో ౧౧) పిమ్మట స్యందికను దాటెను. (౧౨) అచ్చటినుండి శృంగిబేరపురమును చేరి యచ్చట గంగను దాటెను. (౨౫) గుహునితో కలిసెను. (33) గంగనుదాటి వత్సదేశములోనికి వెళ్ళెను. (౫౨–౧౦౧) తర్వాత ప్రయాగను చేరెను. అదియే భరద్వాజాశ్రమము. (అయో ౫౪–౫)

ప్రయాగకు ౧౦ కోసుల దూరమందు చిత్రకూట మున్నది. (౫౪-౨౮) యమునను దాటెను. (౫౫-౧౩) వాల్మీకిని సందర్శించుకొనిరి. (౫౬-౧౬) భరతుడువచ్చువరకు రాముడు చిత్రకూటమందే యుండెను. (స ౯౬) తర్వాత పాదుకా ప్రదానము. (స ౧౧౨) రాముడు అత్రిని సందర్శించెను. (స ౧౧౭) అచ్చటినుండి దండకారణ్యము ప్రవేశించెను. (స ౧౧౯) అచ్చట వివిధాశ్రమాలలో ౧౦ ఏండ్లకాలము గడిపెను. (అర ౧౧-౨౪ నుండి ౨౮) అచ్చటినుండి పంచవటికి వెళ్లెను. (అర ౧౩ స) అందు ౧౩వ ఏడు పూర్తియగు వరకుండెను. ౧౪వ ఏట చైత్రాదియందు సీతాపహరణము. తర్వాత సుగ్రీవ సఖ్యము. వాలివధ. కిష్కింధలో ఆశ్వయుజారంభమువరకుందురు. ఆశ్వయుజ శు ౧౦నాడు వానరులు సీతాన్వేషణానికి దిక్కుదిక్కులందు బయలుదేరుదురు. (కి ౩౭-౧౨) కార్తిక శు ౧౦ వరకు ఒక మాసములోపల సీత జాడను కనిపెట్టవలెనని సుగ్రీవాజ్ఞ. (కి ౪౦-౬౯) హనుమదాదులు గడవు దాటిరి. పుష్యమాసములోకూడ వెదకుచునేయుండిరి. అప్పుడు వసంతర్తువు ప్రారంభమయ్యెను. (కి ౫౩-౧౭ నుండి ౨౨) గోవిందరాజాది వ్యాఖ్యాతలు [౨౨నకు] వ్యాఖ్యానించుచు పుష్యమాఘమాసములు గతించిపోయెను అని వ్రాసినారు. అట్లైన హనుమంతుడు లంకకు ఫాల్గుణములో వెళ్లెననవలెను. కాని హనుమంతుడు అశోకవనములో నుండగా రావణుడు సీతతో నిట్లనెను. "నేను నీకు పెట్టిన సంవత్సరపు గడువులో ఇక రెండు నెలలు మిగిలినవి"

[సుం. ౨౨-౮] వ్యాఖ్యాతల లెక్క ప్రకారము శ్రీరాముడు రావణుని ఫాల్గుణ అమావాస్యనాడు చంపెను. సీత చైత్రాదిలో అపహరింపబడి యుండెను? కావున హనుమంతుడు లంకకు పోయినది మాఘమాసాదిలో. వ్యాఖ్యాన కర్తలు హనుమంతుడు ఫాల్గుణాదిలో లంకకు వెళ్లెనని వ్రాయుట మూలవిరుద్ధ మగును.

రాముని దండయాత్ర ఫాల్గుణ పౌర్ణమినాడు ప్రారంభమగును. [యు ౪-౬] ఈ తిథులనుండి వ్యాఖ్యాత లిచ్చిన తిథులు మూలమునకు విరుద్ధముగా నున్నవి. ఎట్లనగా—వ్యాఖ్యాతలు ఫాల్గుణ కృష్ణ ప్రతిపత్తునాడు యుద్ధము ప్రారంభమైన దన్నారు. అది సరికాదు. ఫాల్గుణ పౌర్ణమినాడు రాముడు కిష్కింధనుండి దండయాత్రచేయును. [యు౪-౬] [అత్ర ఉత్తరఫల్గునీత్యనేన సదివసః ఫాల్గుణపౌర్ణిమాసీత్యవగమ్యతే-గోవిందరాజు] సైన్యము దివారాత్రము లొకేదినము ప్రయాణముచేసి సముద్రమునుచేరును. [యు౪-౭౦] ఫాల్గుణ కృష్ణ ప్రతిపత్తునాడు రాముడు సముద్రతీరమును చేరెను. అచ్చట ౩ దినాలు ప్రాయోపవేశము చేసెను. [యు ౨౧-౧౦] చతుర్థినాడు సేతుబంధము. అది ౫ దినాలు జరిగెను. [యు ౨౨-౬౬నుండి ౭౧ వరకు] అష్టమినాడు సేతువు ముగిసెను. కావున ఫాల్గుణ బహుళ ౯ నాడు యుద్ధ మారంభమైనది. అమావాస్యనాడు రావణవధ జరిగెను. కావున ౬ దినాలే యుద్ధము జరిగెను. ఫాల్గుణ కృష్ణ ౧౪ నాడు రావణుని స్వయంయుద్ధోద్యమము. అమావాస్యనాడును యుద్ధము చేయును. [యు ౯౩-౬౫] ఆనాడే చచ్చును. ౧౪ వేలమ్లు

గడువు తీసు పూర్తియగుననగా చైత్ర శు ౫నాడు రాముడు అయోధ్య కొక్క దిన ప్రయాణదూరములోనున్న భరద్వాజాశ్రమమును చేరును. [యు ౧౨౭-౧] చైత్ర శు ౬ నాడు అయోధ్యా ప్రవేశము. శు ౭ నాడు పట్టాభిషేకము.

ఇవి రామాయణములోని ముఖ్యవిశేషములు. అయితే ఇందు కొన్ని దురవగాహముగా కనబడుచున్నవి. అయోధ్యనుండి లంకకు రెండుదినాలలో విమానమందు ప్రయాణము చేసినది ఆధునికులు విశ్వసింపరు. ఆ కాలములో విమానము లుండెనా? క్రీ. శ. ౧౨వ శతాబ్దములో భోజుడను రాజు విమాన యంత్రములను చేసి నడిపించినట్లు "సమరాంగణము" అను గ్రంథములో (బరోడాలో ముద్రితము) వ్రాసినాడు. కాని రామాయణ కాలములోకూడ ఒక పుష్పక విమానము పేరు తప్పితే వేరేవిమానాల చర్చయే కానరాదు.

కిష్కింధకు లంకకు ఒకేదిన ప్రయాణమని రామాయణములో తెలిపినారు. మన మిప్పుడనుకొను బళ్లారిలోని హంపియే కిష్కింధయైనచో, ఇప్పటి సింహళమే లంకయైనచో ఒక దినములో ప్రయాణము అసంభవము. అయిన లంక యెక్కడ యుండెను? అను ప్రశ్న బయలుదేరును. ఈ లెక్కనుబట్టి మనము సరిగా నిర్ణయించజాలము. ఈ చర్చ ముందు భౌగోళిక ప్రకరణములో చేయుదును.

ఈ కాలనిర్ణయ చర్చను ప్రత్యేకముగా చేయవలసి వచ్చెను. ఎందుకనగా హిందువు లాచరించుకొను పండుగలలో కొన్ని రామునికి సంబంధించినవై యున్నవి, ఎవరికి

తోచినట్లు నాకు కొన్ని సంశయాలను రామాయణానికి ముడి పెట్టుచున్నారు. చైత్ర శు ౯ నాడు రాముని జననము వివాహము పట్టాభిషేకము మూడును జరిగిన వందురు. విజయ దశమి రావణుని చంపిన దినమని కొందరందురు. దీపావళి నాడు రావణుడు చచ్చెనని మరికొందరందురు. హోలీనాడే రావణుడు చచ్చెనని ఇంకాకొందరు, వాదింతురు. సీతా రాముల వివాహము బాల్యమందయ్యెనని కొందరును యౌవ నమందే జరిగెనని కొందరును వాదులాడుదురు. ఈ అపోహ ములను నివారించుటకై పై చర్చ చేయవలసి వచ్చినది. సారాంశ మేమనగా

[౧] చైత్ర శు ౫ నాడు శ్రీరాముని యౌవరాజ్య పట్టాభిషేక నిర్ణయము.

[౨] చైత్ర శు ౭ నాడు శ్రీరాముని పట్టాభిషేకము [రావణవధానంతరము]

[౩] శ్రీరాముడు చైత్ర శు ౯ నాడు జన్మించెను.

[౪] సీతారాములు బాల్యమందును యౌవనమం దును వివాహితులైనట్లు రెండు విధాల ప్రమాణము లుండు టచే ఉభయ ప్రమాణములును ప్రక్షిప్త వర్గములో చేరును.

[౫] సీతాన్వేషణమునకు వానరసైన్యమును ఆశ్వ యుజ శు ౧౦ నాడు అనగా దసరాదినమునాడు సుగ్రీవు డంపెను.

[౬] ఫాల్గుణ అమావాస్యనాడు రావణుడు వధింప బడెను,

౯

# సాంఘికాచారములు

రామాయణ మూలగ్రంథ రచన క్రీ. పూ. ౨౫౦౦ ఏండ్లనాడు జరిగెనని తెలిపినాను. మరియు క్రీస్తుశకారంభము వరకు దానిని పెంచుచూ వచ్చిరనియు తెలిపినాను. ఈ కారణముచేత రామాయణమందు వర్ణింపబడిన సందర్భములను బట్టి ఆనాటి సాంఘికాచారము లెట్టివిగా నుండెనో తెలుసుకొన వీలున్నను ఆ యాచారములు క్రీ. పూ. ౨౫౦౦ నుండి క్రీస్తుశకారంభ మధ్యకాలములోని వనియే చెప్పవలెను. కాని అవి ఒక నిర్ణయమగు కాలమందే వర్తించుచుండెనని చెప్పుటకు వీలులేదు. రామాయణములో అందందు సందర్భానుసారముగా వర్ణించిన భాగములనుండి జనుల యాచారవ్యవహారములు, నాగరికత, విజ్ఞానము, దేశస్థితి, జనుల విశ్వాసములు, మున్నగు సంశములు ఊహించుకొన వీలు కలుగుచున్నది. శ్రీరాముడు త్రేతాయుగములో నుండెనని పౌరాణికులు విశ్వసింతురు. ఆ యుగములో సత్యము మూడు కాళ్లపై నడిచెననియు, రామరాజ్యములో అంతయు ధర్మబద్ధముగా నుండెననియు చెప్పుదురు. అది నమ్ముటకు వీలు లేదు. కైకేయీవర్తన మూలమున రామునికి వనవాసము తప్పదయ్యెను. ఆనాడు జాబాలివంటి నాస్తికులుండిరి. వానరులలో నీతివర్తన సరిగా లేకుండెను. రాక్షసుల బాధ భరింపరానిదై యుండెను. మాంసభోజనము అన్ని జాతులలోను ఉండెను. మద్యపానము తప్పుగా భావింపబడినట్లు కానరాదు.

జూదమును జనులు ఆడుచుండిరి. భోగము సానులుండిరి. ఇట్టివెన్నైనను చూపింప వచ్చును. ఇవన్నియు కృతయుగ సత్యధర్మమునకు భంగము కలిగించు నట్టివే.

పౌరాణికముగా గాక చారిత్రకముగా వీలైనంతవరకు రామాయణ కాలమందలి జనుల సాంఘికాద్యాచార వ్యవహార విశ్వాసములను గురించి తెలుసుకొందము. మొట్ట మొదట ఆకాలమందలి వర్ణవ్యవస్థను గురించి విచారింతము.

వర్ణవ్యవస్థ

చాతుర్వర్ణ్యవ్యవస్థ అప్పటికే స్థిరపడియుండెను. కాని తర్వాతి కాలములోవలె ఆనాడు కులాల కట్టుబాట్లు కఠినముగా లేకుండెను. వర్ణాంతర వివాహములు తప్పుకాకుండెను. అంగరాజు కుమార్తెను బ్రాహ్మణుడైన ఋశ్యశృంగుడు వివాహమాడెను. [బాల. ౧౦–౩౦] నానావిధ వృత్తులచే జీవించు కార్మికజీవులుండిరి. వడ్రంగులు [బాల. ౧౩–౯] తాళములుచేసి అమ్ముకొనువారు [అయో. ౩–౧౨] చెంబెడివారు [అయో. ౫౮–౮] మణులను సానబెట్టువారు, కుమ్మరులు, సాలెవారు, ఆయుధములను చేయువారు, నెమలి పింఛములతో వీవనలు చేయువారు, కట్టెపలకలు కోయువారు, దంతము పనిచేయువారు, సున్నపుగచ్చు పనిచేయువారు, అత్తరు పన్నీరు సుగంధద్రవ్యములను సిద్ధముచేసి అమ్మువారు, కమసాలులు, కంబళ్లు నేయువారు, పైకము తీసుకొని తలంటిస్నానము చేయించు పరిచారకులు, ఒడలుపిసికి నలుగులుపెట్టువారు, వైద్యులు, మద్యములను సిద్ధముచేయువారు,

చాకలివారు, కుట్టుపనివారు [దర్జీలు], జోగముస్త్రీలు, ఇంకను నానావిధ వృత్తులవారు అయోధ్యా నగరమందుండిరి. [అయో. ౮౩-శ్లో. ౧౨ నుండి ౧౬ వరకు] వెట్టిపనిచేయువారుకూడా యుండిరి. [అయో. ౮౧-౨౦] వసిష్ఠుని కుమారులను "ముష్టికులు" అగునట్లు విశ్వామిత్రుడు శపించెను. [బాల. ౫౯-౧౭] ఈ ముష్టికులు నేటి తెనుగునాటి ముష్టివారుకారు. ముష్టివారిసంగతి అనుమానమేకాని రామాయణ కాలములో మున్నూర్ వారు మాత్రము లేకుండిరి. ఈ విషయమెందులకు స్పష్టము చేయవలసి వచ్చినదనగా సుప్రసిద్ధ చరిత్ర చతురాననులగు కీ. శే. చిలుకూరు వీరభద్రరావుగారు శ్రీరాముడు త్రుంచిన శివధనుస్సును 'ఒక మున్నూరు కదల్చి తెచ్చిరి' అను పోతనామాత్యుని భాగవత వాక్యము నాధారముచేసుకొని "మున్నూరు కాపులు ఆ ధనుస్సును మోసికొని తెచ్చిరి, చూడుడు. అందుచేత రామాయణ కాలములో మున్నూరు వారుండిరి. వారిని సంస్కృతీకరించి 'త్రిశతివంశము' వారు అని యందుము" అని ఒక పెద్ద వాదమును లేవదీసిరి. వాల్మీకి రామాయణములో శివధనుస్సును ౫౦౦౦ మంది మోసికొనివచ్చిరి.

నృణాం శతాని పంచాశద్వ్యాయతానాం మహాత్మనాం
మంజూషా మష్ట చక్రాంతాం సమూహుస్తే కథంచన

(బాల. ౬౭-౪)

కావున వాల్మీకి రామాయణమే మనకు ప్రధానము కాని బమ్మెరపోతన భాగవతము మనకు ప్రమాణము కానేరదు. పైగా ఒక మున్నూరు అంటే ఒకే ఒక మున్నూటి

జాతి మనిషి శివధనుస్సును మోసుకొని వచ్చెనని కానేరదు. మున్నూరు మంది మోసుకొని వచ్చిరని యర్థమగును. ఆ మున్నూరు మంది యీనాటికి మున్నూరు జాతికి మూల పురుషులనుట హాస్యాస్పదము. పైగా మోసుకొని వచ్చిన వారు సేవకులు. అట్టివారి సంతతియని చెప్పుకొనుటయు ప్రశస్తము కానేరదు. ఈ చర్చ ఇచ్చట యింతకన్న విపులముగా చేయుట అప్రస్తుతమగును.

ఆ కాలములో వంటల వారుండిరి. వారికి ప్రత్యేక లక్షణముగా పోగులుంటూ ఉండెనేమో ?

"యస్త్వత్వాహారసమయే సూదాః కుండలధారిణః" +(అయో. ౧౨-౯౮)

సౌనికులు-అనగా పశువులను చంపి మాంస మమ్ము కటికవారుండిరి. [అయో. ౪౮-౨౮] రాజుల అంతఃపురముల వద్ద కావలి గాయుటకుగాను నపుంసకులు నియుక్తులై యుండిరి. [అయో. ౬౫-౭]

అనార్యులు

రామాయణ కాలపు భారతదేశమందు ఆర్యులకన్న అనార్యులే ఎక్కువగా నివసించినట్లు చాలా నిదర్శనములు కలవు. ఈ అనార్యుల యుత్పత్తిని గూర్చి వినోదకరమగు కథలను గూడా కల్పించిరి. విశ్వామిత్రుని సైన్యము నెదుర్కొనుటకు గాను వసిష్ఠుని కామధేనువు తన హుంభారవము చేత పహ్లవులను, మ్లేచ్ఛులను పుట్టించెనట. తర్వాత యవనులను, శకులను, కాంభోజులను సృష్టించెనట. వీరందరును

విశ్వామిత్రునిచేత హతులుకాగా మరల కామధేనువు హుంభారవముచేత కాంభోజులను, స్తనములనుండి పహ్లవులను, యోనినుండి యవనులను, శకృత్తునుండి శకులను, రోమములనుండి మ్లేచ్ఛులను, కిరాతులను, హారీతులను పుట్టించెనట. (బా. ౫౪, ౫౫ సర్గలు) దీనినిబట్టి పై అనార్యజాతులు రామాయణకాలములో మనవారికి పరిచితులై యుండిరనిమాత్రము చెప్పవచ్చును. ఒకచోట పహ్లవులను కామధేనువుయొక్క హుంభారవమునుండి పుట్టిరనిచెప్పి వెంటనే వారు స్తనముల నుండి పుట్టిరని చెప్పినారు. ఇది కల్పనయని నిరూపించుచున్నది. ఈ కామధేను సంతానముతో యుద్ధముచేసిన విశ్వామిత్రుని కుమారులలో ఒకడుతప్ప తక్కినవారందరును చనిపోయిరని చెప్పినారు. అటు తర్వాత మరొకచోట అతనికి నూర్గురు కొడుకులుండిరని తెలిపినారు.

కామధేను సంతానమైన పై జాతులు భారతదేశములోనివారుకారు. వారు హిందూస్థానమునకు పడమటిదిక్కునను న్న ఈరాన్, అసీరియా, ఖాల్డియా, అయోనియా, ఫినీషియా దేశములందలి అతి ప్రాచీన నివాసులు. పహ్లవులు పహ్లావులను ఈరాణ జాతివారు. యవనులు గ్రీకు లేక అయోనియా ద్వీపములందలి జనులు. శకులను సిథియనులని చరిత్రకారులన్నారు. మ్లేచ్ఛులు పఠాన్ జాతిభేదము. "నమ్లేచ్ఛితవై నాపభాషితవై" అని పతంజలి వ్రాసెను. మ్లేచ్ఛులు అపశబ్దములు మాట్లాడేవారని తలచిరి. మాక్సుమూలర్ గారు బెలూచిస్థానము జనులనే ఆర్యులు మ్లేచ్ఛులనిరని వ్రాసినారు.

కాశ్మీరు సంస్థానమునకును సరిహద్దు సూశాకనుమధ్య హజారా అను జిల్లా కలదు. అందు మలచ్ (Malach) మరియు లోరా అను సాంతాలు కలవు. ఈ మలచ్ మండలమునే ఆర్యులు మ్లేచ్ఛదేశమనిరి. అందలి కొండలలోనుండు క్రూరజనులనే మ్లేచ్ఛులనియందురు.

పైన తెలిపిన జాతులన్నింటితో ఆర్యులకు ప్రాచీనమందు వ్యాపారము విరివిగా జరుగుచుండెను. మరియు ఆర్యులతో సంబంధములు చాలా యుండెను. కాంభోజులు కాబూల్‌నదీ ప్రాంతమందుండినట్లు కొందరు చరిత్రకారుల అభిప్రాయము. కాంభోజులు ఈరానివారని గ్రీర్సన్ అన్నాడు. గచ్ఛతి అనుటకు మారుగ "శవతి" (శవము అను అశ్లీలార్థము వచ్చు) ప్రాచీన రూపమును కాంభోజులింకా వాడుచున్నారని యాస్కుడు నిరుక్తమందు వ్రాసెను. రఘువంశములో రఘుమహారాజు దిగ్విజయములో వలక్షు (ఆక్సస్)నదీ తీరమందు హూణుల నోడించి తర్వాత రఘువు కాంభోజుల నోడించెనని వర్ణితము. దీన్నిబట్టి కాంభోజులు అఫ్గనిస్థాన ప్రాంతమువారని తేలును. అఫ్గన్ సరిహద్దున "కంబు" నది కలదు. దాని నిప్పుడు కాబూల్‌నది యందురు. తత్ప్రాంత వాసులే కంబుజులు—కాంభోజులు!

కొన్ని జాతులు అనార్యులుగా పరిగణింపబడినను అవి నీచముగా చూడబడుచుండెను. వసిష్ఠకుమారులు త్రిశంకుని యాగమునకు రానందున "శ్వామాంస నియతాహారులైన ముష్టికులు కండు" అని వారిని విశ్వామిత్రుడు శపించెను.

ఇంకొకని నిషాదుడగునట్లు శపించెను. మరొకమారు శునశ్శే ఫునికి మారుగా అంబరీషుని నరమేధములో తన కుమారులను యజ్ఞపశువులై ప్రాణము లర్పించుటకు విశ్వామిత్రు డాజ్ఞా పించెను. ఆ కుమారు లందులకు సమ్మతింపనందున క్రుద్ధుడై వారిని వసిష్ఠ కుమారులవలెనే కుక్కమాంసము తిని బ్రదుకు నట్టి ముష్టికు లగునట్లుగా శపించెను. ఇక్కడ గమనింపదగిన విషయమేమనగా ఇదే శునశ్శేపుని కథ ఐతరేయబ్రాహ్మణ ములో భిన్నించినదిగా కనబడుచున్నది. అచ్చట హారిశ్చం ద్రుడు యజ్ఞకర్త. అచ్చట విశ్వామిత్రుని కుమారులు ఆంధ్రాద్యనార్యజాతులలో చేరిపోవునట్లు శప్తులైరి. ఇచ్చట ఆ ముచ్చటయే లేదు. ఐతరేయబ్రాహ్మణము మార్పులు చేయుటకు వీలులేని వైదికగ్రంథమగుటచేత అదియే ఎక్కువ విశ్వసనీయము. అచ్చటి యాంధ్రులును రామాయణము లోని ముష్టికులును ఇంచుమించు ఒకే జాతిగానుండిరా? చెప్ప జాలము. ఆంధ్రనిషాద ముష్టికాదిజాతులవారు భారతదేశ మందుండిన అనార్యజాతివారు. వీరుకాక వానరులు, రాక్ష సులు, దక్షిణాపథమందును, జనపదమను దండకారణ్యపరిసర ప్రదేశములందును నివసించినట్లు కానవచ్చుచున్నది. వానర రాక్షసు లెవరు? అను విషయమును ప్రత్యేకముగా వ్రాయు చున్నందున ఇక్కడ ఆ చర్చను వదలుకొన్నాను.

రామాయణకాలమందు దాక్షిణాత్యులు నెత్తినిండుగా వెంట్రుకలు పెంచుకొని పూలను ధరించుచుండిరట. ఈ వర్ణన స్త్రీలనుగురించి చేసినదికాదు. ఇది పురుషులను గురిం

చినో చెప్పినమాట. (అయో.౯3-౧3) నేటికిని అరవవారిలో ఈ లక్షణాలు కానవచ్చుచున్నవి.

## నరమేధము

వైదికేతరులైన అనార్యజాతుల యుత్పత్తి సందర్భములో నరమేధ ప్రసక్తియు వచ్చినది. అందుచేత దానిని గురించి యిచ్చటనే కొంత చర్చింతును. ఆర్యులలో దేవతలకు మనుష్యులను బలియిచ్చు ఆచారము విరివిగా ఉండినట్లు కానరాదు. శునశ్శేపుని కథవంటివి అరుదుగా కనబడుచున్నవి. కథాసరిత్సాగరములో అలంకారవతీలంబకములో శ్రీరాముడు నరమేధమును చేసినట్లు వ్రాసినాడు. అది కల్పితకథల సంకలనముకాన ప్రమాణము కానేరదు. నరబలియొక్క యాచారము సెమిటిక్‌జాతివారిలో విశేషముగా నుండెను. ఆ ప్రాంతమునందే యూదు (యహూదీ) జాతివా రుద్భవించిరి. వారిలోను ఈ దురాచారముండెను. అసీరియా బాబిలోనియాలోను ఈ దురాచారముండెను. బైబిల్‌లోని పూర్వభాగములో (Old Testament) ఇట్లు తెలిపినారు. దేవుడు ఒక భక్తునితో ఇట్లనెను. "నీ సంతానములోని మొదటివానిని నీవు నాకు బలి యియ్యవలెను. అదేవిధముగా నీ యెద్దులలోను, మేకల లోను మొదట పుట్టినవాటిని నాకుసమర్పింపవలెను" (ఎక్సోడస్ ౨౨-౨౯.) ఇట్టి విషయమే కింగ్సు (3 – ౨౮ నుండి ౨౭లో) తెలుపబడినది. అబ్రహాం [జ్యూ] తన జ్యేష్ఠకుమారుడగు ఈసాక్‌ను తన దేవునికి బలి యిచ్చెను. తుదకు ఈ అబ్రహాంతో దేవుడొక నిర్ణయము చేసుకొనెను. ఇకముందు పుత్రులను బలి యియ్యనక్కరలేదు. దానికి మారుగా వారి

లింగచర్మకర్తనము [ఖత్నా-circumcision] చేసిన చాలును. యూదులలోను ముసల్మానులలోను నేటికిని ఈ "చర్మకర్తనము" వర్తించుచున్నది.

ఫినీకియాలో టైర్ అను పట్టణము గొప్ప ప్రసిద్ధమగు ఓడరేవు. అచ్చట మోలచ్ దేవునికి మేల్‌కార్తు అని, బాల్ మేల్కార్త్ అనియు పేరుపెట్టి అతనికి నరబలు లిచ్చుచుండిరి. దేశారిష్టములు, యుద్ధములో ఓటమి కలిగినప్పుడు ఈ నరబలులు అధికముగా చేయబడుచుండెను. ఈ ఫినీకులు ఉత్తర ఆఫ్రికాతీరములో కార్తేజ్ అను మహానగరమును క్రీ. పూ. ౭౦౦ లో నిర్మించిరి. అందు మోలచ్ విగ్రహాన్ని స్థాపించిరి. ఆ విగ్రహము మహాభయంకరముగాను అత్యున్నతముగాను వుండెడిది. దానిని ఇత్తడితో చేసియుండిరి. లోపల అంతయు రంధ్రమయము. దానికి ఎద్దుతల యుండెను. దాని చేతులలో బలిగానియ్యబడిన వానిని ఉంచుచుండిరి. చేతులను యంత్రములతో లాగుచుండిరి. విగ్రహము చేతులెత్తి నరుని తన నోటిలో వేసుకొనుచుండెను. విగ్రహము అడుగు భాగములో మహాజ్వాలగా మంటలు మండుచుండెను. ఆ నరుడు విగ్రహము కడుపులోబడి జ్వాలలో భస్మమగుచుండెను.

బైబిల్‌లో మరొకతావున (జడ్జెస్ ౧౧-౩౦-౩౧) జప్తాహ్ అనువాడు తన కుమార్తెను బలియిచ్చినట్లు తెలిపినారు. ఈ విధముగా ప్రాచీనమందు కొన్నిజాతులలో నర

బలు లుండెను. ఆ యాచారమునే కొందరార్యులు అనుసరించినట్లున్నది. తర్వాత యీ యాచారమును నిషేధించినట్లు-

'నరాశ్వమేధౌ మద్యంచ కలౌ వర్జ్యౌ ద్విజాతిభిః (తిథ్యాదితత్త్వం)

అనుదానిచే గ్రహింపవచ్చును.

హస్తినాపురి రాజులలో మహాభౌముడను రాజుండెను. అతడు ౧౦౦౦౦ నరమేధ యజ్ఞములు చేసెనట! "యః పురుషమేధే పురుషాణామయుత మానయత్ తత్తస్య అయుతానాయిత్వం" [మహాభారతం ఆది. ౧, ౬3,౨౦] అతనికి ఆకారణముచే అయుతానాయి అను పేరుకలిగెను. జనమేజయుడు సర్పయాగము చేసెను. అనగా నాగులనెడు అనార్యజాతివారు దుర్బలుడైన పరీక్షిత్తును చంపి రాజ్యమాక్రమించుకొనగా అతని కుమారుడు జనమేజయుడు మరల బలిష్ఠుడై వారినోడించి సంహారము చేసెనని యర్థము. అయుతానాయి కథయు నట్టిదై యుండును. జనమేజయుని యనంతరము ౨౧ తరముల తర్వాత చండప్రద్యోతుడను రాజు తమ్ముడు కుమారసేనుడు ఉజ్జయినిని పాలించి నరమేధమును నిషేధించెనని ఒకరు వ్రాసినారు. హర్ష చరితలో [అయిదవ అధ్యాయము] హర్షవర్ధనుని కాలమందు నరమాంస క్రయవిక్రయముండినట్లు కలదు! ఇది కథయో కల్లయో తెలియదు! మహాభారతారణ్య పర్వమందొక విచిత్రకథ కలదు. సోమక సహదేవుడనురాజు కొకే కొడుకు బహుభార్యలును నుండిరి. అతని కొక్క కొడుకు తృప్తిని కలిగింపలేదు. యజ్ఞరహస్యవేత్తల బోధలనమ్మి ఆ ఏకైకపుత్రునిచంపి హోమములోవేసి దుఃఖించుభార్యల నా ధూమమును నాఘ్రాణింపజేసెను. వారికి

నూర్గురు పుత్రులు జన్మించిరట! [అరణ్యా. ౧౩౯ అధ్యాయము]. ఇది హేయమగు కల్పన!

నరమేధమును గురించి శ్రీ మల్లాది సూర్యనారాయణ శాస్త్రిగారు తమ సంస్కృత వాఙ్మయచరిత్ర (భాగము ౧ పుట ౧౯౯) లో ఇట్లు వ్రాసినది సంగ్రహముగా నిందు తెలుపుతున్నాను.

"ఋక్సామ యజుస్సంహితలు నరమేధమును విధింపకున్నను యజుస్సంహితలో పురుషమేధ ప్రసంగము కనిపించుచున్నది. తైత్తిరీయ బ్రాహ్మణములో పురుషాలంభ విధియు గనిపించుచున్నది. ప్రాజాపత్య హవిర్నిష్పాదనమునకై "ఏకవింశత్యా మాషైః పురుషశీర్ష౦" ఇత్యాది మంత్రములందు పురుష శిరస్సంపాదన విధానమున్నది. 'బ్రహ్మణే బ్రాహ్మణమాలభతే"—ఇత్యాదిగా 'ప్రతీక్షాయై కుమారీం' అనునంతవరకు (తై. బ్రా. 3-౪; ౧-౧౯) ౧౮౬ మనుష్యరూపపశువులు చెప్పబడినవి. దీనిని బట్టి నరమేధ మొకానొక కాలమున నుండెననుట విశ్వసనీయ మగుచున్నది. నరమేధము అయిదుదినములు చేయునట్టి సోమయాగము. దీనివలన గొప్ప తేజస్సు మహావీర్యము పొందుట యీ యాగఫలమని నారు ... ... ... ... వాజసనేయ సంహిత [30-3౧ అధ్యాయములలో] పురుష వేధవిధి కనబడుచున్నది ... ... ఏమయినన ీ దుష్టాచారముపుట్టినవెంటనే అణగిపోయినదనుట నిజము."

ఈ చర్చవలన నింతమాత్రము గ్రహింపవచ్చును. కృష్ణ యజుర్వేదమును, తైత్తిరీయము ఆర్యకుమారజము

వారు అంగీకరింపరు. అవి తర్వాత సృష్టియుండును. నరాశ్వ గోమేధకా యజ్ఞములు ఆర్యులవి కావేమో. అవి [సితియన్] శక జాతివారివి. వారి దురాచారములను కొంతకాలము కొందరార్యులు స్వీకరించి యుండును. కాని నరమేధమును శిష్టులంగీకరింపనందున అది తొందరగా రూపుమాసినట్లున్నది. పైగా శైవశాఖలో నొక తాంత్రిక వర్గమువారు శక్తికొరకు శివునిపేర నరబలులు రహస్యముగా నిచ్చినట్లు చెప్పుదురు. అట్టివారి కల్పన యీ నరమేధమై యుండును. ఒకవేళ ఆర్యులే తప్పుదారిలో పడినను తొందరగా మేల్కొని దానిని పరిహరించియుందురు.

## అశ్వమేధము

నరమేధముతోపాటు అశ్వమేధ ప్రసక్తియు వచ్చినందున దానిని గురించియు ఇందే చర్చింతము. ప్రాచీన కాలములో గుర్రాలకు చాలా ప్రాముఖ్య ముండెను. కస్సీ (Kassites) జాతివారు బాబిలోనియా ప్రాంతములోనివారు. వారినే ఋగ్వేదములో 'కేశిన్' జాతివారని వ్యవహరించిరి. ఈ కస్సీలు గుర్రపుసవారీలో ప్రవీణులు. క్రీ. పూ. ౧౭౫౦లో వారు గుర్రాలను తీసికొని బాబిలోనియాపై బడి అచ్చటి వారిని జయించి రాజ్యముచేసిరి. మొట్టమొదటిసారి గుర్రములను జూచి బాబిలోనియావారు భయపడిపోయిరట. కస్సీల వలెనే శకులు [సితియనులు] గుర్రపు సవారీలో ప్రసిద్ధినొంది యుండిరి. గుర్రపు సవారీ, ధనుర్విద్య వారి ప్రత్యేక లక్షణాలు. అంతేకాదు. గుర్రపు మాంసము తినుట, గుర్రము పాలు త్రాగుట కూడా వారి ప్రత్యేక లక్షణాలై యుండెను.

ఈ కారణాలచేత ప్రాచీనకాలమందు అనార్య జాతులలో గుర్రమునకు ప్రాముఖ్యముండెను. ఆర్యులును గుర్రముల సవారీలోను, ధనుర్విద్యయందును శకులవలెనే ఆరితేరినవారు. వారిలో అశ్వమేధము ప్రబలియుండెను. అశ్వమేధమును సామ్రాజ్య చిహ్నముగా చేయుచుండిరి. లేదా సంతానాది కామ్యకవ్రతముగా చేయుచుండిరి. దశరథుడు అశ్వమేధ యాగముచేసెను. (బా. సర్గ ౧౪) శ్రీరాముడును అశ్వమేధము చేసెనని ఉత్తరకాండలో తెలిపినారు. అశ్వమేధ మందలి కార్య కలాపము ఉత్తమమైనదిగా కానరాదు. ఆ వివరములోనికి ప్రవేశించుట ప్రకృత మనవసరము. ఈ వివరములను తెలుసుకొన గోరువారు వాజసనేయసంహిత, తైత్తిరీయ సంహిత, ఆపస్తంబ శ్రౌతము, ఐతరేయ బ్రాహ్మణము మున్నగునవి చూచుకొనగలరు.

చండాలురు

రామాయణ కాలములో చండాల జాతి అను అంట రాని జాతియొకటి యుండెను. వారు కుక్కలను తినుచుండిరి. విశ్వామిత్ర వసిష్ఠ కుమారులు శప్తులై కుక్కల తిను ముష్టికు లైరి. ఈ ముష్టికులును చండాల జాతిభేదము వారేమో? అయితే విశ్వామిత్రుడు కూడా ఒకప్పుడు ౧౨ ఏండ్ల క్షామము వచ్చి ఆహారము లభించనప్పుడు చండాల వాటికలో జొర బడి అచ్చట ఆరగట్టబడిన కుక్కమాంసమును సాపడెను. ఇదేమయ్యా ఇట్టి చౌర్యము తమకు తగునా అని చండాలురు ప్రశ్నింపగా—

“ఏవముక్త్వా దేవదేవ నాదే మహామునే మమ
సతీపథాన్ ధర్మేణ హి మహాత్మా ప్రతాపవాన్”

ఒకే, ధర్మాత్మనాలు నీకు ఏనా. అనంతా మాకు తెలుసునులే. నేప్పలు కెకెటమని అక్షేపించితే చెంప్పకొటిని ఆవులు త్రాగిచంచా ఉండాదా మరి? అని ఆక్షేపించెనని పురాణాంతరమందు వర్ణితమైయున్నది.

త్రిశంకు చండాలుడు కాగా,

‘నీలవస్త్రధరో నీలః పరుషో ధ్వస్తమూర్ధజః
చిత్యమాల్యానులేపశ్చ ఆయసాభరణో భవత్’

(బా. ౫౮-౧౦, ౧౧)

నల్లవస్త్రములు ధరించి నల్లనివాడై బిరుసైన దేహము కలవాడై కురుచలైన తలవెంట్రుకలతో శ్మశాన మందలి పూలను బూదిదను ఇనుప సొమ్ములను ధరించెను. ఈ వర్ణనను బట్టి చండాలుర రూపవేషములు గ్రాహ్యములగుచున్నవి. ఈ చండాలుర అటవిక జాతివారుగా ఉండిరేమో. ఈరాణ సింధు మధ్యదేశము లందుండిరేమో? ప్రాచీన పారసీకులు చండాలురను ‘జందాల్’ అని పిలిచిరి.

నేటివలె నాడు ప్రజలు క్రొన్నెల దర్శనము చేసుకొని పూజించిరేమో (బా. ౧-౧౮) స్త్రీలకంగరాగము లుండెను (బా. 3-౧౮) అనసూయ యరణ్యములో సీత కంగరాగము లర్పించెనట! ‘స్నానాని చాంగరాగాంశ్చ మాల్యాని వివిధాని చ’ అని రామాయణమందే కలదు. అంగరాగమనిన చందనాది విలేపనము. కుండలములు పురుషుల

ప్రధాన భూషణములు (బా. ౬-౧౦, ౧౧, ౧౨) పురుషులు కంకణములను (అంగదములు) పతకములను (నిష్కములు) ధరించెడివారు. స్త్రీలు నడుములందు రశనాదామములను కట్టుకొను చుండిరి. (జఘనంతవనిర్ఘుష్టం రశనాదామ శోభితం. అయో. ౯-౪౩) ఈ యలంకరణము విశేషముగా అజంతా చిత్రములలో కానసగును. జాతరూపమయమైన తిలకముతో లలాటము నలంకరించుకొను చుండిరి. (అయో. ౯-౪౯) పెద్దవారు వరాహరక్తమువంటి రక్తచందనము నలదుకొనుచుండిరి. (అయో. ౧౬-౯) రక్తచందనమును తిలకముగా నేటికిని ఉత్తర హిందూస్థానమువారే యెక్కువగా వాడుచున్నారు. రాజుల ఛత్రములకు నూరు శలాకలు (కడ్డీలు)ండెను. అవి తెల్లని గొడుగులు (అయో. ౨-౭; అయో. ౨౬-౧౦) రాజులకు పతాక ధ్వజములుండెను. (అయో. ౯-౩; అయో. ౧౭-౩) పతాకము ధ్వజము అని రెంటిని ఒకే పర్యాయము పలుతావుల వాడినారు. పతాక మనగా (నిషాన్) వస్త్రముపై గల చిహ్నము. ధ్వజమన పతాకాదండము [కట్టె].

మాంసభోజనము

రామాయణ కాలమందు అందరును మాంసమును తినుచుండిరి. ఆవులను కూడా తినుచుండినట్లు సూచనలు కనిపించుచున్నవి. ఒకటి రెండు తావులందు గోవధ తప్పని తెలిపినారు. ఒకచోట ఇట్లు తెలిపినారు:

గౌర్హతా జానతా ధర్మం కండునాపి విపశ్చితా. (అయో. ౨౧-౩౦)

కండు మహర్షి ధర్మ రహస్యమెరిగిన వాడైనను తండ్రియాజ్ఞను పరిపాలించువాడై అతని యాజ్ఞచే ఆవును చంపెను. ఇచ్చట గోవధను కండుమహర్షి యెంతటివాడే చేసినను అది తప్పనియే ధ్వనించబడినది. కాని మరొక ఘట్టమును చూడుము. భరద్వాజ మహర్షి రామునకు మధుపర్కమునకై యెద్దును అర్ఘ్య జలమును తెచ్చియిచ్చెను.

ఉపానయత ధర్మాత్మా గామర్ఘ్య ముదకం తతః (అయో. ౫౪-౧౭)

గోమాంసమును తినుట రామాయణమందు అరుదుగా కనిపించినను ఇతరజంతు మాంసభుక్తి బాగా కనబడుచున్నది.

మాంసమును ఎండించి వరుగుచేసి తినుచుండిరి. చేపలను తినుచు, మునివృత్తి నవలంబించినవారిలో చాలామంది మాంసమును వర్జించుచుండిరేమో? రాముడు కైకేయీ దేవితో నిట్లనెను.

చతుర్దశహి వర్షాణి వత్స్యామి విజనే వనే
మధుమూలఫలై ర్జీవన్ హిత్వా ముని వదామిషం.

అయో. ౨౦-౨౯.

మునులు మాంసమును వదలి మధుమూల ఫలములను తినుచుండిరని పై యుదాహరణమువలన అర్థమగుచున్నది. ఇల్వల వాతాపి అను రాక్షస సోదరులు దొంగ తద్దినములకు బ్రాహ్మణులను పిలిచి వారికి తుష్టిపూర్తిగా మాంసము తినిపించుచుండిరి. అగస్త్యమహర్షియు ఒకమారు వారి శ్రాద్ధ భోజనములో మేకమాంసమును భుజించెను. [ఆర. ౧౧-౬౬

దీనినిబట్టి మునులుకూడా ఎప్పుడు తప్పినను శ్రాద్ధములందైనను మాంసమును తినుచుండిరని ఊహింపవచ్చును.

గంగానది దాటునప్పుడు సీతాదేవి యిట్లని మ్రొక్కుకొనెను. "గంగాదేవీ, మేము సుఖముగా తిరిగి వచ్చినట్లైన నీకు ౧౦, ౦౦౦ ఆవులను ౧౦౦౦ సురాభాండములను మాంసాన్నమును సమర్పించుకొంటాను". [అయో. ౫౨—౮౯] అదే విధముగా యమునానదిని దాటునప్పుడును ఇట్లు మ్రొక్కుకొనెను. "మేము సుఖముగా తిరిగి వచ్చినట్లైన నీకు ౧౦౦౦ ఆవులు ౧౦౦ కల్లుకుండలు సమర్పించుకొందును" [అయో. ౫౫—౨౦]

రాముడు గంగదాటి అరణ్యమున ప్రవేశించిన మొదటి దినమే నాలుగు జంతువులను ఆహారార్థమై వేటాడెను.

తౌ తత్ర హత్వా చతురో మహామృగాన్
వరాహ మృశ్యం పృషతం మహారురుం
ఆదాయ మేధ్యం త్వరితం బుభుక్షితౌ
వాసాయ కాలే యయతు ర్వనస్పతిం. (అయో. ౫౨-౧౦౨)

సీతారామ లక్ష్మణులు బాగా ఆకలిగొనియుండిరి. అప్పుడు రాముడు పందిని, మనుబోతును, దుప్పిని, నల్లచారల దుప్పిని చంపెను. వాటి పరిశుద్ధమగు మాంసమును వారు భుజించిరి. యమునాతీరమందలి వనమును చేరినప్పుడు రామ లక్ష్మణులు

బహూన్ మేధ్యాన్ మృగాన్ హత్వా చేరతు ర్యమునావనే.

(అయో. ౫౫-౩౩)

అనేక పరిశుద్ధ మృగములను చంపిరి. చిత్రకూటమును చేరి అందమైన పర్ణశాలను నిర్మించుకొనిరి. దానిని ప్రవేశించుటకు పూర్వము వాస్తు శాస్త్ర ప్రకారము ఒక జంతువును [జింకను] దానికి బలియిచ్చిరి. ఈ సందర్భములో రాముడు లక్ష్మణునితో ఇట్లనెను.

"ఐణేయం మాంసమాహృత్య శాలాం యక్ష్యామహే వయం
కర్తవ్యం వాస్తుశమనం సౌమిత్రే! చిరజీవిభిః" (అయో. ౫౬-౨౨

లక్ష్మణా! జింకమాంసముతో ఈ పర్ణశాల నధిష్ఠించి యుండు దేవతలను తృప్తింతము. చిరంజీవులుగా నుండగోరు వారు వాస్తు శాస్త్ర ప్రకారము భూతశాంతిని చేయవలెను అని చెప్పెను. ఇదే సందర్భములో అతడింకను ఇట్లనెను. "ఈ ప్రకారము చేయుట విధి. శాస్త్రదృష్టము". ఆ మాటలను విని లక్ష్మణుడు జింకను వేటాడి తెచ్చి దానిని అగ్నిలో కాల్చెను. నెత్తుటి బాగా కాలి మాంసము బాగా పక్వమగు వరకు కాల్చి దానిచే దేవతల కారగింపుపెట్టి తాము భుజించిరి. పాయసమును, నువ్వులను, బెల్లమును, మేక మాంసమును దేవతాపితృతిథులకు నివేదింపకుండా ఒంటిగా భుజింపకూడదని ఆ కాలపు సాంఘిక శాసనము. [అయో. ౭౫-30] భరతుడు దశరథుని శ్రాద్ధకర్మ చేయునప్పుడు బ్రాహ్మణులకు మేకలను, గోవులను, వెండిని, అన్నమును, వస్త్రములను దానము చేసెను. [అయో. ౭౭-3] భరతుడు రాముని పిలుచుకొనివచ్చుటకై వెళ్ళినప్పుడు గంగాతీరమం దుండిన గుహుడు భరతునికి మాంసము, చేపలు, తేనె, కానుకగా

తీసికొనిపోయెను. [అయో. ౮-౮౧౦] అంతేకాదు. పచ్చి మాంసమును ఎండించి నిప్పుచేసిన మాంసమును [ఆర్ద్రి మాంసం చ శుష్కంచ — అయో ౮౮-౧౭] కూడా పై నిషాదరాజు కానుకగా సమర్పించుకొనెను. పితృదేవతలకు వృషణములు కోసివేసిన పిదపలను శ్రాద్ధములందు నివేదించెడి వారు. ఇంద్రునికి మేకవృషణముల నతికించినందున అవి పెద్దలకు పనికిరాక పోయెను.

> తదాప్రభృతి కాకుత్స్థ పితృదేవాః సమాగతాః
> అఫలాన్ భుంజతే మేషాన్ ఫలైస్తేషా మయోజయన్
>
> (బాల. ౪౯-౧౦)

భరద్వాజాశ్రమానికి భరతుడు ససైన్యముగా వెళ్ళిన ప్పుడు ఆ మహర్షి వారందరికిని మద్యమాంసములతో విందు చేసెను. మద్యమన నెట్టిదో ఇదే సందర్భములో తెలుసు కొందము. ఆనాడు నానావిధములగు మద్యములు సిద్ధమగు చుండెను. మైరేయము అను సురతో భరద్వాజుడు విందు చేసెను. అయో. [౯౧-౧౫] మైరేయమంటే ఏమి? మిరా అనే దేశ మెచ్చటనో ఉందనియు, అచ్చట ఖర్జూరాది ఫల రసములతో మద్యమును సిద్ధముచేయుచుండి రనియు అందు చేత దానిని మైరేయ మందురనియు వ్యాఖ్యాతల అభిప్రా యము. రామాయణ వ్యాఖ్యాత లిచ్చిన ఈ అభిప్రాయము తప్పు. మైరేయమును మన దేశమందే సిద్ధముచేయుచుండిరి. కౌటిల్యుడు తన అర్థశాస్త్రమం దిట్లు వ్రాసినాడు. "మేష శృంగిత్వక్కాథాభిషుతో గుడప్రతీవాపః పిప్పలీ మరీచ సంభారస్త్రిఫలయుక్తోవా మైరేయః" [౨-౨౫] అనగా మేష

శృంగి అను చెక్క కషాయమునన్నా, బెల్లము, పిప్పలి, మిరియాలు, త్రిఫలము చేర్చి సిద్ధముచేసిన మద్యమును మైరేయమందురు. సుర మూడువిధాలదిగా గౌడీ, పైష్టీ, మాధ్వీ అను భేదములతో నుండెను. అనగా బెల్లము, గోధుమలు, తేనె అనువానితో సిద్ధముచేయుచుండిరి. [అయో. ౯౧-౨౧] సీత రావణుని ధిక్కరించుచు నీవు నారామునికే లేశమును సరిరావని యిట్లనెను.

"సురాగ్ర్యసౌవీరకయోర్య దంతరం వైతవరాఘవస్యచ"

సురకును సౌవీరమునకును ఎంత అంతరాయమో

నీకును నారాఘవునకును అంతభేదము అని సీతాదేవి పలికెను. దీనినిబట్టి సురాసౌవీరములలో చాలాభేదముండెనని స్పష్టము. ఇవెట్టి మద్యములు? సుర చెడ్డదనియు, దానికి మరణమే ప్రాయశ్చిత్తమనియు మనువు శాసించెను. సురకును శుక్రాచార్యుని శాపముకూడ కలదు. సౌవీరము ఆపేరుగల గుజరాతు దేశమందు సిద్ధమగునట్టి మద్యమని యొకరు వ్రాసిరి. కాని వైద్య గ్రంథాలలో యవలతోను లేక గోధుమలతోను సిద్ధమగు సారాయియే సౌవీరమన్నారు. సుర నిషిద్ధ మద్యమనియు, సౌవీరము శిష్టులు త్రాగు సారాయి యనియు సీతాదేవి యభిప్రాయము. కాని సీతాదేవియే అరణ్యానికి వెళ్లునప్పుడు, "గంగమ్మా, మేము క్షేమముగా తిరిగివచ్చితిమా నీకు "సురాఘట సహస్రమును" [అయో. ౫౨-౮౯] సమర్పించు కొందును" అని ప్రార్థించెను. సుర నింద్యమైనచో దానిని సీతయెట్లు నివేదించుకొనును. గంగ యెట్లు స్వీకరించును? ఇది స్పష్టమగుటలేదు.

భరద్వాజుడు భరతునికిని, అతని సైన్యమునకును మేకలు, పందులు, జింకలు, నెమళ్ళు, కోళ్ళు వీటియొక్క మాంసమును వండించి పెట్టెను. మద్యమాంసములు నింద్యములుగా నుండినచో భరద్వాజునంతటి మహర్షి తన యాశ్రమములో వివిధ జంతుమాంసములను వండించి ఆరగింపజేసి యుండడు. భరతుడు వచ్చుటకుముందు చిత్రకూటమందు ఉన్నతశిఖరముపై సీతారాములు కూర్చునియుండిరి. అప్పుడు రాముడు సీతకు మాంసపు తునకలు నోటికందించి తినిపించుచుండెను. [అయో. ౯౬—౧]

ఇదం మేధ్యం, ఇదం స్వాదు, నిష్టప్తమిదమగ్నినా, [అయో. ౯౬—౨] 'ఇదిగో సీతా, ఈ మాంసఖండము పరిశుద్ధమైనది. ఈ తునక రుచికరమైనది. ఇదిగో ఈ చియ్యముక్క అగ్నిలో బాగుగా కాలినది చూడు. ఇదొక్కటి తినుము'. అని రాముడు అనెను బుజ్జగించుచు [ఛందయన్] మాంసము తినిపించుచు ఆమెకానందము కలిగించుచుండెను. రావణుడు సీతను అపహరించుటకై బ్రాహ్మణవేషముతో పంచవటికి వెళ్ళెను. అతడు నిజముగా బ్రాహ్మణుడేయని సీత తలచి అతనిని దర్భాసనముపై కూర్చుండబెట్టి అతిథిసత్కారము బాగుగా చేయదలచి యిట్లనెను. "ఓ బ్రాహ్మణుడా! ఇక కొంతసేపాగుము. నా భర్త జింకలను, ఉడుములను, అడవిపందులను, ఇంకా ఇతరజంతువులనువధించి తెచ్చును." అనగా వాటితో నీకు విందుచేయుదును అను అర్థము ద్యోతకమగుచున్నది. [అర. ౪౭—౨౨,౨౩] ఆ కాలములో బ్రాహ్మ

ఖలు ఉమములను పందులను ఋక్షములను జంతువులను తినకుండి లేని సీతాదేవి ఆ బ్రాహ్మణవేషధారితో అనుచితములు మాటలుచెప్పి అపచారము చేసియుండునా ?

కబంధుడు రామునితో పంపాసరోవర విశేషములను తెలుపుచు—"రాముడా, పంపాసరస్సులో హంసలు, నీరు కోళ్ళు, క్రౌంచములు, కురరములు, ఉండును. వాటి మాంస ములు పెద్ద వెన్నముద్దలవలె పుష్టికలవై రుచికరములై యుం డును. మీరు వాటిని భక్షింపుడు" అని చెప్పెను. [ఆ.౭౩-౧౩-౧౪] హంసలంటే ఏ పక్షులు ? బాతులే హంసలు. ఫిలా లజీలో హ, ఘగ మారును. హంస ఘంసయయ్యె. ఘ, గ అయ్యెను. గంస్ తుదకు ఇంగ్లీషులో గూస్—బాతు అయ్యెను.

పంపాసరస్సులోని మరి కొన్ని విశేషములను కబంధు డిట్లు తెలిపెను. "అచ్చట బలసినట్టి, ముండ్లు చాలా లేనట్టి గండుమీలు, చోరచేపలు, రొయ్యలు, మున్నగు వివిధ మత్స్యములు లభించును. లక్ష్మణుడు వాటిని బాణములచే చంపి వాటి పొలసులు పోవునట్లు రాచి, ఇనుపసలాకులకు గ్రుచ్చి నిప్పుపై పక్వముచేసి భక్తితో నీకు భోజనార్థము సమర్పించుకొనగలడు. [ఆర. ౭౩-౧౪,౧౫]

వాలిని రాముడు బాణముతో కొట్టి పడగొట్టగా మరణశయ్యపై నుండి వాలి యిట్లనెను—'రామా, నామాం సము, చర్మము, ఎముకలు ఏవియు నీకు పనికిరావుకదా. అయిదుగోళ్ళుగల అయిదు జంతువులు అనగా ఏదుబంది,

అడవిపంది, ఉడుము, కుందేలు, తాబేలు, సీటినిమాత్రమే బ్రాహ్మణ క్షత్రియులు భక్షింపవచ్చును.

పంచపంచనఖా భక్ష్యా బ్రహ్మక్షత్రేణ రాఘవ,
శల్యక, శ్వావిధో, గోధా, శశః, కూర్మశ్చ, పంచమః. (కి. ౧౭-౩౭)

దీనిని బట్టి బ్రాహ్మణ క్షత్రియులు ఐదుగోళ్ల జంతువులలో పై ఐదింటిని మాత్రమే తినుచుండిరని తెలియవచ్చుచున్నది. రాముడు సీతావియోగ దుఃఖముచే బాధితుడై ఆనందదాయకములైన మద్యమాంసములను పరిత్యజించెను.

'న మాంసం రాఘవో భుంక్తే నచాపి మధు సేవతే'. (సు. ౩౬-౪౧)

ఈ విధముగా రామాయణమందు సర్వవర్ణముల వారును మాంసమును పవిత్రమైనదిగా రుచ్యమైనదిగా భావించి భుజించుచుండిరి. పైన కనబరిచిన ప్రమాణములను బట్టి ఆ కాలములోని జనులు ఆవుల, ఎద్దుల, మేకల, అడవి పందుల, మనుబోతుల, దుప్పుల, నల్లచారల దుప్పులను, జింకలను, నెమళ్లను, కోళ్లను, ఉడుముల, హంసల, నీరుకోళ్ల, క్రౌంచముల, గండుమీల, చోరచేపల, రొయ్యల, ఏదు బందుల, కుందేళ్ల, తాబేళ్లను, మరి యితరజంతువులను ఆసక్తితో తినుచుండిరని తెలియవచ్చుచున్నది.

పై జంతువుల మాంసాలు మాత్రమే తినుచుండిరనుటకాదు. ఇంకను ఇతర విధములగు మాంసముల తినియుందురు. మాంసమెక్కువగా లభించిన దానిని ఎండించి వరుగుచేసి వాడుకొనుచుండిరి. కూరలను కుండలలో (భరద్వాజాశ్రమములోవలె) ఉడికించుచుండిరి. భేదా తిత్తి

[illegible] చేసి (బ్రాహ్మణుడు [illegible] చేసిన [illegible]గా) [illegible] [illegible] 'క[illegible]'గా చేసి ఆరగించు చుండిరి. [illegible] శ్లోకుగా మద్యమును సేవించు చుండిరి. ఆ మద్యము నానా విధములైనదిగా నుండెను.

ఆహారములు

రామాయణకాలమునందు మాంసభోజనమునకే ప్రాధాన్యముండెనని చెప్పనగును. ఆదికాలమునుండి త్రైవర్ణికులు మాంసభక్షకులు కారను చాలామందికి కల విశ్వాసము తప్పని యెత్తిచూపవలసినది. జనులు నానావిధ పదార్థముల నారగించుచుండిరి. "పాయసం కృసరం ఛాగం వృథా సోఽశ్నాతు నిర్ఘృణః" (అయో. ౭౫-30) పాయసము, కృసరము, మేకమాంసము ఒంటరిగా తినవాడవ్వాడు! కృసరమనిన నేమి? కొందరు "కృశర" అనియు వ్రాసిరి. విల్సన్ అభిప్రాయములో కిచిడీయే కృసరము. ఇది శబ్దశాస్త్ర ప్రకారము సరిపోవు తద్భవమే. శబ్ద కల్పద్రుమములో కృశర పదమువద్ద "కిచిడీ ఇతిభాషాయాం" అని అర్థము వ్రాసినారు. 'కృసరస్తు తిలౌదనః' [అమరము].

అరణ్యకాండలో ౫౬ సర్గ తర్వాత సీతకు ఇంద్రుడు ప్రత్యక్షమై పాయసము నిచ్చుటను వర్ణించు ౨౬ శ్లోకాలు ప్రక్షిప్తభాగాలని నిశ్చయమైనది. అందు పాయస వృత్తాంతము కలదు. భరద్వాజుని విందులో (అయో. ౯౧-23) "రసాలదధ్నము" చేరియుండెను. శుంఠి పిప్పలి మిరియాలు లవంగాల్లు తక్కోలము శర్కర, అల్లము జిలకర్ర పెరుగులో

కలిపి చేసిన పచ్చడి రసాలదధ్న మని వ్యాఖ్యాత యొక డన్నాడు. కాని ఇది సరికాదేమో? రసాలమన తియ్యమామిడిపండు. మామిడిరసమును పెరుగు చక్కెర సుగంధ ద్రవ్యాలతో కలిపి చేయునట్టి "శిఖరిణి" అనునదే రసాల దధ్నమని తలతును.

ఇవికాక ఆహారములో "భక్ష్యం భోజ్యంచ పేయంచ లేహ్యంచ (అయో. ౫౦-౩౮) అని నాల్గు విధములు ఆనాడే వ్యాప్తిలోనుండెను.

స్త్రీల స్థానము

రాముని కాలమందలి ఆర్యసమాజమందు (అనగా ఆర్యుల సంఘములో) స్త్రీల కెట్టి స్థానముండెనో నిర్ణయించుట కష్టము. శ్రీరాముని ఏకపత్నీవ్రతత్వమును సువ్యక్తముగా చూపదలచినారు. పాతివ్రత్యమాహాత్మ్యమును నిస్సందేహముగానిరూపించినారు. ఆనాటిస్త్రీలకిట్టిలక్షణముసాధారణమని సూచించినారు. అయితే రాముని యనంతరము నా యభిప్రాయప్రకారము ఇంచుమించు ౮౦౦ ఏండ్లతర్వాత సంభవించిన మహాభారత యుద్ధకాలములో స్త్రీలకు నియోగము, స్వేచ్ఛ, అనావృతత్త్వము, ద్వాదశౌరసపుత్రుల యంగీకారము ఇట్టివి చాలా కనబడుచున్నవి. మహాభారతకాలమునకు పూర్వమందలి స్థితినిగురించి పాండురాజు కుంతితో ఇట్లనెను.

అనావృతాః కిలపురా స్త్రియ ఆసన్ వరాననే
కామచారవిహారిణ్యః స్వతంత్రా వారుహాసిని.

[ఆదిపర్వము ౧౨౨ అధ్య-శ్లో ౪]

శ్వేతకేతు తల్లిని ఒక బ్రాహ్మణుడు పట్టపగలే చేయి బట్టి కామశాంతికై గొనిపోవుచుండగ, శ్వేతకేతువు అతని తండ్రియు చూచుచుండగనే, లాగుకొనిపోగా తండ్రియగు ఉద్దాలకు డూరకనేయుండెను. బాలుడగు శ్వేతకేతునకుమాత్రము తన తల్లిచర్యపై కోపమువచ్చెను. అప్పుడు ఉద్దాలకు డిట్లన్నాడు.

అనావృతాహి సర్వేషాం వర్ణానా మంగనా భువి
యథా గావస్థితా స్తాత స్వేస్వేవర్ణే తథా ప్రజాః

(ఆది ౧౨౨-౧౪)

'నాయనా, ఆవులవలె స్త్రీలు యథేచ్ఛగా సంచరింతురు. 'ఏషధర్మః సనాతనః' అన్నాడు పెద్దమనిషి ఉద్దాలకుడు. ఇదంతయు మహాభారత కాలమందును తత్పూర్వమందును వర్తించెనని వర్ణించియుండగా రామాయణకాలమందు ఎచ్చటను ఇట్టి స్త్రీల యనావృతత్వము గోపద్ధతి కానరాకుండుటకు కారణమేమి ? రామాయణమును ఆదర్శ కావ్యముగా చేయుటవలన మన కిట్టివి లభింపనేరవో లేక నిజముగా రామాయణకాలమందు అంతయు ఉత్తమముగా నుండి తర్వాతకాలము చెడిపోయియుండునో నిర్ణయింపజాలము. లభ్యమగుచున్న సూచనలను మాత్రమిం దుదాహరించుచున్నాను.

రామునికాలములో భోగముస్త్రీ లుండిరి. ఋశ్యశృంగుని మోసగించి తీసుకొనిపోయినది వారే (బా ౧౦-౫) అనాలింపస్యుడగు ఆ తిక్కవటుని మోసగించుట ఒక ఘనత

తగు. రాముని పొంటికి యౌవరాజ్యాభిషేకమునకు వారికి వారకాంతలు సభను శోభింపజేయుటకు రానే వచ్చిరి. (అయో. ౧౨) రాజులు అనేక భార్యలను వివాహమాడు చుండిరి. దశరథునికి ముగ్గురు పట్టపుభార్య లుండుటయేకాక 350 మంది పైభార్య లుండిరి. (అయో. 34-13) వీరు సవర్ణస్త్రీలే యనుటకు వీలులేదు. పుత్రకామేష్టి చేసినకాల ములో దశరథుడు తనకు లభించిన దివ్యపాయసమును తన 350 మంది భార్యలకు పంచిపెట్టక "అనురూప"లైన తన ముగ్గురు భార్యలకే పంచిపెట్టెను. 'భార్యాణా మనురూ పాణాం' [బా. ౧౬-౨౦] అనుదానికి సజాతీయలైన క్షత్రియ భార్యలని వ్యాఖ్యాత లభిప్రాయపడినారు. దశరథుని కూతు రగు శాంతను ఋశ్యశృంగుడను బ్రాహ్మణున కిచ్చి పెండ్లి చేసిరి. అనగా అనులోమవివాహములు జరుగుచుండెను.

## కైకేయి

ఈమెను గూర్చి ప్రత్యేకము వ్రాయవలసియున్నది. దశరథుని పట్టపుభార్యలలో చేరినను ఈ కైకేయి సజాతీయ క్షత్రియస్త్రీ యగునో కాదో అనుమానముగానే యున్నది. ఆమె మహా సౌందర్యవతిగా నుండియుండును. పైగా చిన్న భార్య యనగా ముద్దులభార్య. అందుచేత ఆమెకును తక్కిన యిద్దరితో సమానస్థానము లభించియుండును. ఆమెకట్టి యధి కారము లభించునో లేదోయను అనుమానముచేతనే కాబోలు ఆమె తండ్రి దశరథుని యావద్రాజ్యమును ఓలిగా తీసుకొని ఆమె నిచ్చి పెండ్లిచేసెను. స్త్రీశుల్కము ఆర్యధర్మములలో చేరినట్టిది కాదు. తన రాజ్యమును వంతయును భార్యాశుల్కము

క్రిందనే చెల్లించినందున కైకేయి, కేకయరాజు దిక్కునుండి భరతునికి రాజ్యమిప్పించు ప్రయత్నములు జరుగునని దశరథునికి ఒకదిక్కు అనుమానముండి యుండెను. అందుచేతనే రామునితో చెప్పెను.

> విప్రోషితశ్చ భరతో యావదేవ పురాదితః
> తావదేవాభిషేకస్తే ప్రాప్తకాలో మతో మమ. [అయో ౪-౨౫]

భరతుడు ఇచ్చటికి వచ్చేలోపలనే నీ పట్టాభిషేకము కావలెను. భరతుడు మంచివాడే కాని కాలవైపరీత్యమువల్ల జనుల బుద్ధులు మారుచుండును. (అయో. ౪-౨౬, ౨౭) అనియు చెప్పెను. బహుశః భరతుని అతని మేనమామ యింటికి పంపివేసినదికూడా ఈ అనుమానముచేతనే యేమో? పై శ్లోకాలు చాలా ముఖ్యమైనవి. వాటినిబట్టి కైకేయి అంతటి కఠిన కాదనవలసియుండును. అరణ్యావాస ప్రారంభమందే రాముడన్న శ్లోకాలున్నూ గమనింపదగినవి. అతడిట్లనెను.

"ఓయీ! లక్ష్మణా! ఈనాడు రాజు దుఃఖమందు మునిగినాడు. కైకేయీవశగుడై కామార్తుడై వృద్ధుడై మరేమి చేయగలడు? ధర్మార్థ కామములలో కామమే పైచేయికలదై పోయినదికదా. విద్యారహితుడైనను స్త్రీకారణముగా అనుకూలుడగు కుమారుని త్యజించునా?" [అయో. ౫౩-౬ నుండి ౧౦ వరకు]. ఈ విషయాలను సమన్వయించిన దశరథుడు వృద్ధుడుకాగా సుందరాంగియు దూరదేశపురాజకుమారునగు కైకేయిని వివాహమాడి యామె

ఓలిడై తన రాజ్యమిచ్చుటొకటి, ఆమెకుమారునికే తన యనంతరము రాజ్యమిత్తుననుట రెండు—ఈ వరముల నిచ్చి యుండును. కాని రాముని జననముతర్వాత అతనియందే లగ్నమానసుడై వివాహానంతరము భరతుని అతని తాత యింటికంపి తన మంత్రులను, ప్రజలను కట్టుకొని రాముడు మీకందరికినీ ప్రియుడేకదా, ఉత్తమోత్తముడేకదా, మీకు రాజుకావలసిన వాడేకదా అని బాగుగా నూరిపోసి వారిచే ఒప్పించుకొని సర్వసన్నాహాలు చేసియుండును. కైకేయి తన పెండ్లినాటి పై రెండు వరాలుకోరి సాధించి యుండును. తుదకు రాముడడవికి పోవుట దశరథుడు చనిపోవుట జరిగెను. భరతుడువచ్చెను. వచ్చి జరిగినదంతయు వినెను. ప్రజల ప్రాతికూల్యము, తల్లికినింద, తండ్రిమరణము, తన యన్నయందు తనకుగల భక్తిప్రేమలు, అన్నలు, వదినెయు జోగులై అడవిపాలగుట సహింపరానిదగుటయు, అతని మనస్సులో గొప్ప పరివర్తనము కలిగించి తనతల్లి హక్కులను తనకు సంక్రమించు రాచరికమును వదలుకొని యుండును. కథ యిట్లుండగా అకస్మాత్తుగా ఏనాటివో అనిర్దిష్టములగు రెండు వరములను గూర్చి కైకేయికి జ్ఞాపకముచేసి పురి యెక్కించి విషమపాకములోని కామెను దింపుట తర్వాతి కాలపు కల్పనయైయుండును. ఈ యూహ తప్పేయగుగాక. అగుచో పై యుదాహృత శ్లోకత్రయము [అయో. ౭-౨౫, ౨౬, ౨౭] ప్రక్షిప్తములనియైన ననవలెను.

(18)

కైకేయి పుట్టిన దేశము గిరివ్రజము లేక రాజగృహము అనబడినది. అది ఎక్కడనుండెనో తెలియదు. కాని దానిజాడ కొంతవరకు గుర్తించవచ్చును. భరతుడు ఏడుదినాలు రాత్రింబగళ్లు ప్రయాణముచేసినతర్వాత రాజగృహమునుండి అయోధ్యకు రాగలిగెను. అయోధ్యకు పశ్చిమముగా రాజగృహముండెను. భరతుని పిలుచుకొని వచ్చుటకు వెళ్ళిన దూతలు అయోధ్యకు పశ్చిమముగా ప్రయాణముచేసి హస్తినాపురివద్ద గంగను దాటి ప్రయాణము చేయుచూ చేయుచూ తుదకు బాహ్లిక దేశముచేరిరి. దానికింకా పశ్చిమముగానున్న విపాశా నదినిదాటి గిరివ్రజముచేరిరి. [అయో. సర్గ ౬౮] బాహ్లిక దేశమే నేటి బలఖ్ (Balkh) మండలము. అదియిప్పుడు ఆఫ్ఘనిస్థానమున కుత్తరములో నున్నది. కాని ప్రాచీనకాలములో బలఖ్ ఈరాన్ (పర్షియా) దేశములో చేరియుండెను. అట్టి బలఖ్ దేశమునుండికూడా యింకా చాలాదూరము వెళ్ళవలెనని తెలిపినారు. కావున గిరివ్రజ మనునది ఈరాన్‌లోని మండలమని చెప్పవచ్చును. అట్టి గిరివ్రజమునుండి భరతుడు తనతాతవద్ద సెలవుతీసికొని అయోధ్యకు తిరిగి వచ్చునప్పుడు తాత మనుమనికి కొన్ని బహుమానా లిచ్చెను. అందు గాడిదలు చేరియుండెను. గాడిదలకును, కంచరిగాడిదలకును మనదేశములో ఆదరణ లేకపోయినను, ఆఫ్ఘనిస్థానములోను, ఈరానులోను మంచి గౌరవము కలదు. కేకయరాజుకు అశ్వపతి యనుబిరుదముండెను. ఈరాన్ దేశము గుర్రాలకు ప్రసిద్ధినొందినట్టి దేశము. విజయనగర సామ్రాజ్య పతనానంతరమువరకును ఈరాన్‌నుండి మనదేశానికి నిరంతరము గుర్రములు దిగుమతి

యగుచుండెను. కేకయ అను పేరుకూడా ఇరాను ప్రాచీన రాజులగు కైకోబాస్ రాజుల పేరులను బోలియున్నది. కేకయుడు భరతుని కిచ్చిన బహుమానాలలో కంబళ్ళు, జింక చర్మాలు, కుక్కలుకూడా చేరియుండెను. కుక్కలు ఆర్యుల దృష్టిలో అపవిత్రమైనవి. కంబళ్ళు చలిప్రదేశమువారికే పనికివచ్చును. మన దేశములో మామూలుకుగాని అల్లుండ్రకు గాని గాడిదలను, కుక్కలను, కంబళ్ళను, బహుమాన మిచ్చే వాడుక పూర్వమందు కానీ, ఆధునికకాలమందు కానీ కానరాలేదు.

దశరథుని రాజ్యమును ఓలిగొనగోరిన్న కేకయరాజు స్వార్థిగా కనబడుతున్నాడు. అతని బిడ్డకు ఆ గుణమే బాగా అబ్బెను. ఆమెనుగురించి యితరులు నిందించుట అటుండ ఆమె కుమారుడగు భరతుడే ఇట్లన్నాడు.

ఆత్మకామా, సదాచండీ, క్రోధనా, ప్రాజ్ఞమానినీ. (అయో. ౭౦-౧౦)

కైకేయితల్లి జాడకూడ క్రూరమైనట్టిదనిన్నీ, తన మాట చెల్లింపుకై తన మగని చావునుగూడ లెక్కపెట్ట లేదనిన్నీ, దశరథుని మంత్రియగు సుమంత్రుడు కైకేయిని దూరెను. (అయో. స. 3౫) ఈ కారణాలచే కైకేయి ఇరాణ్ దేశపు ఇరానీ సుందరాంగియై యుండెనని ఊహించుచున్నాను. అయితే అయోధ్యనుండి ఇరాణ్ ప్రాంతానికి పోవుటకు ఏడుదినాలు మాత్రమే పట్టుచుండెనా అను సందేహ మొక్కటి బాధించుచున్నది. †

---

† రాధాకుముద ముఖర్జీగారు హిందూ సివిలిజేషన్ అను గ్రంథములో బాహ్లికను మద్రదేశమువద్దను మద్రకు పశ్చిమములో కేకయదేశమును చూపి

## బహుభార్యత్వము

దశరథునికి నూర్లకొలది భార్యలుండిరను విషయమును గురించి వ్రాయుచు మధ్యప్రసక్తిచే కైకేయిని గురించి వ్రాసినాను. దశరథుని బహుభార్యత్వము సువ్యక్తమే కాని రామాది సోదరులకును పెక్కు-భార్యలుండిరా లేదా అని విచారింతము. పారంపర్యముగా వచ్చు హిందువుల భావనలో శ్రీరాముడును, అతని సోదరులును ఏకపత్నీవ్రతులై యుండిరి. అయితే రామాయణములో మూడుతావుల రామ భరతులకు బహుభార్య లుండినట్లు అనుమానము కలుగుచున్నది. వ్యాఖ్యాత లది కాదన్నారు. మంథర కైకేయికిట్లు బోధచేసెను. "రాముడు అభిషిక్తుడైనచో అతని యుత్తమస్త్రీలు ఆనందింతురు. నీ భరతునికి దుర్గతి కలుగును. నీ కోడండ్రందరును ఆనందరహిత లగుదురు" (అయో. ౮-౧౨) దీనినిబట్టి రామునికి సీతయేకాక ఇతర భార్యలును ఉండిరనియు, భరతునికి చాలామంది భార్యలుండిరనియు అర్థమగుచున్నది. సుందరకాండలో సీతాదేవి హనుమంతునితో రామునికిట్లు సందేశ మంపెను.

పితుర్నిదేశం సమయేన కృత్వా, వనాన్నివృత్తశ్చరితవ్రతశ్చ
స్త్రీభిశ్చమన్యే విపులేక్షణాభిః, త్వంరంస్యసే వీతభయః కృతార్థః.

'నాగతి యేమో ఇట్లైనది. రామునికేమి కొదువ. అతడు వనవాస కాలానంతరము తన ఉత్తమస్త్రీలను పొంది రమించుచు సుఖముగా ఉండగలడు' అని సీత యన్నది.

---

వారు. అనగా గాంధారదేశమునకు దక్షిణములో కేకయదేశముండెను, ఇతర పరిశోధకులు బాహ్లికను బల్ఖ్ గా నిర్ణయించినారు.

లంకకు దారికోరినవాడై సముద్రుని ప్రసన్నునిగా చేసికొనుటకై రాముడు దర్భశయ్యపై పరుండెను.

భుజై : పరమనారీణా మభివృష్ట మనేకథా

అప్పుడు తన దక్షిణబాహువును తలగడగా చేసుకొని పరుండెను. ఆ బాహువు ఉత్తమస్త్రీలచేత బహువిధాల ఆలింగనము చేయబడి యుండినట్టిది అని కవి వర్ణించినాడు. ఈ మూడు వాక్యాలను వ్యాఖ్యాతలిట్లు సమన్వయించుచు, "ఉత్తమస్త్రీలనగా పరిచారికలని అర్థము చేసుకొనుడు. లేదా భూలక్ష్ములని యైనా సరిపెట్టుకొనుడు." అని వ్రాసినారు. ఎట్లైతే నేమి పారంపర్యముగావచ్చు జనాభిప్రాయ ప్రకారము రామసోదరులు ఏకపత్నీవ్రతు లనుటకే ఎక్కువ ప్రమాణము లున్నవనిన పైమూడు ప్రమాణాలు ప్రక్షిప్తములనవలెను.

## అంతఃపురవాసము

ఆకాలమందు రాజస్త్రీలకు అంతఃపురవాస ముండెను. అయితే అట్లనుటచే వారు "గోషా"లో ఇరికి అసూర్యంపశ్యలై మగపురుగునకు కనబడనివారై ఘోరస్థితియందుండ లేదు. వారి ఉత్తమ స్థానమునకు, గౌరవమునకు ఎంత అవసరమో అంతపాటి అంతఃపురవాసమునే పాటించుచుండిరి. అయితే సీత వనవాసమునకు వెళ్ళునాడు ప్రజలందరికిని కనబడినప్పుడు జనులిట్లు చెప్పుకొనిరి. "ఎవరినైతే యింతకు పూర్వము ఆకాశమున సంచరించు భూతములుకూడ చూడజాలకుండెనో అట్టి సీత ఈనాడు రాజమార్గమందు అందరి

కిని కనబడుచున్నది” (అయో. 33–౮) ఇంత కఠినముగా రాణివాస ముండినట్లు కానరాదు. ఏలననగా రావణవధా నంతరము సీతను పిలుచుకొని వచ్చుటకై రాముడు విభీష ణునికి అజ్ఞయిచ్చెను. అప్పుడు సీతను పర్దా లేకుండగనే అందరును చూచునట్లుగానే తీసికొని రావలెనని చెప్పుచు రాణివాసతత్త్వమును గురించి ఇట్లు చెప్పెను :—

న గృహాణి న వస్త్రాణి న ప్రాకారా స్తిరస్క్రియాః
నేదృశా రాజసత్కారా వృత్త మావరణం స్త్రియః.
(యుద్ధ. ౧౧౪-౨౭)

స్త్రీకి ఇండ్లుకాని, వస్త్రాలు(ముసుగులు, పర్దాలు) కాని, ప్రాకారాలుకాని, రాజమర్యాదలుకాని ఆవరణములు కాజా లవు. స్త్రీకి తన సదాచారమే మంచి ఆవరణము. స్త్రీలను పరపురుషులు చూడకుండా మూసిపెట్టుటలో మంచి అర్థము కానరాదు. పరపురుషులు తమ స్త్రీలను కాంక్షింతురనియో, లేక తమ స్త్రీలు స్వేచ్ఛగా సంచరింతురనియో భావించి యేమో పురుషులు వారినిదాచి యుంచుట. స్త్రీ పతివ్రతగా ఉండుటకై పర్దాలు గోషాలు ఏమియు సహాయపడజాలవనియు, స్త్రీకే మంచి పవిత్రమానసము ఉండవలెను కాని ఇతర నిరో ధాలేమి అడ్డపడగలవని శ్రీరాముని అభిప్రాయముగా కన బడుచున్నది.

రాణివాసపు స్త్రీలకు ఎప్పు డంతఃపుర మవసరమో ఎప్పుడవసరములేదో శ్రీరాముడే యిట్లు వివరించియున్నాడు.

వ్యసనేషు న కృచ్ఛ్రేషు న యుద్ధేషు స్వయంవరే
స కౄతౌ న వివాహేచ దర్శనం దుష్యతి స్త్రియః

[యుద్ధ. ౧౧౬-౨౭]

ఆపత్కాలములందు, వ్యసనము కలిగినప్పుడు, కష్టములు సంభవించినప్పుడు, యుద్ధభూములందు, స్వయంవరములందు, యజ్ఞములందు, వివాహకాలమందు స్త్రీలు పరపురుషులకు అగపడుట దోషముకాదు.

పైగా భర్తసమీపమందుండినపుడు అతని యనుమతి చొప్పున స్త్రీ యితరులకు కనబడవచ్చు ననియు రాముడు చెప్పెను. [యుద్ధ. ౧౧౭-౨౮]

స్త్రీల వేదాధికారము

మన కాలములో స్త్రీలకు వేదాధికారము లేదు. ఈ విషయములో వారును శూద్రులును సమానులే కాని పూర్వ కాలమందు స్త్రీలకు ఉపనయనాది సంస్కారములు జరుగుచుండెను.

'పురాకల్పేతు నారీణాం మౌంజీబంధన మిష్యతే'

అని హారీతుడు వ్రాసియుండెను. అది కల్పాంతర విషయమందురేమో! కాని రామాయణములో స్త్రీలకు వైదికకర్మలలో పురుషులతో సమానముగా అధికారముండినట్లు సూచనలున్నవి. అశ్వమేధాది యజ్ఞములలో భార్యలు లేనిది పురుషులు ఆ కర్మలు చేయకుండిరికదా. కౌసల్యాదేవి

రామునికి యౌవరాజ్యపట్టాభిషేక మగునని విని తన కుమారునికి మంగళాభివృద్ధి కలుగుటకై :

ప్రాణాయామేన పురుషం ధ్యాయమానా జనార్దనం.

[అయో. ౪-౩౩]

ప్రాణాయామపూర్వకముగా పురుషసూక్తప్రతిపాదితుడైన విష్ణువును ధ్యానించెను. ప్రాణాయామము యోగపద్ధతి. పురుషసూక్తము ఋగ్వేదములోనిది. కావున ఆమె వైదికసూక్తములను పఠించెను. మరియు,

అగ్నిం జుహోతిస్మ తదా మంత్రవత్కృతమంగళా

[అయో ౨౦-౧౫]

ఆమె స్వయముగా వేదమంత్రములను పఠించుచు హోమము చేసెను. కౌసల్యయే హోమము చేసెనని ఇచ్చట స్పష్టముగానున్నను వ్యాఖ్యాతలు 'స్త్రీలకు వేదాధికారము లేనందున బ్రాహ్మణులచే హోమము చేయించెను' అని వ్రాసినారు. పైశ్లోకము తర్వాతనే యీ విధముగా చెప్పబడినది. కౌసల్య హోమము ఇతరులచేతగూడా చేయించుచుండెను. దీనినిబట్టి కౌసల్య స్వయముగా హోమము చేసెననియు, వేదవిదులైన విప్రులచేతను చేయించెననియు స్పష్టమగుచున్నది.

సీతారామలక్ష్మణులు అరణ్యానికి బయలుదేరిన మొదటిదివము సాయంకాలమందు గంగాతీరమున

వాగ్యతాస్తే త్రయ స్సంధ్యాం సముపాసత సంహితాః

[అయో ౫౭-౧౮]

ముగ్గురును వాజ్నియతితో ఏకాగ్రచిత్తులై సంధ్య నుపాసించిరి. సీతాదేవి గాయత్రిని జపించుట స్త్రీల వేదాధికారమునకు ప్రమాణము.

స్త్రీల యితర సమస్యలు

ఆర్యులలో పూర్వకాలమందు దేవరన్యాయపద్ధతి యుండెను. దీనికి నిదర్శనములు మహాభారతమందు చాలా కలవు. పరాశరుని కాలమువరకు దీనికి చెల్లుబడియుండెను. దేవర అను శబ్దమందే రెండవ వరుడు అను నర్థమిమిడియున్నది. నేటికిని మరదికి దేవరుడని యందురు. హిందీలో ఈ పదము బాగా వ్యాప్తిలో నున్నది. ఇప్పటి కాలమందును లంబాడీలు మరి కొన్ని జాతులవారు దేవరన్యాయమును పాటించుచున్నారు. రామాయణములో ఆనాటి జనులలో దేవరన్యాయము వర్తించుచుండినట్లు నిదర్శనములు కానరావు. మహాభారతకాలమం దుండిన యాచారము అందుకు ౧౦౦౦ ఏండ్లకు ముందుండినకాలములో లేకుండెనా? అప్పుడును ఇది వర్తించియుండును. రామాయణమందు దీనికి ఒకే ఒకజాడ కనబడుచున్నది. రాముడు మాయామృగమును చంపినప్పుడు మారీచుడు హా లక్ష్మణా అని యరచెను. దానిని సీత విని రామునికేమో అపాయమయ్యెనని లక్ష్మణుని సహాయార్థము పొమ్మనెను. నిజ మెరిగిన లక్ష్మణుడు వెళ్ళుటకు నిరాకరించెను. అప్పుడు సీత అతనితో కఠినముగా ఇట్లు పలికెను.

ఇచ్ఛసి త్వం వినశ్యంతం రామం లక్ష్మణ ! మత్కృతే,
లోభా త్త్వం మత్కృతేనూనం నానుగచ్ఛసి రాఘవం

(అర- ౪౫-౬)

"లక్ష్మణా, నీవు రాముని చావు కోరినావు. అతడు చనిపోతే నన్ను పొందవలెనని దుర్బుద్ధి కలవాడవుగా కని పించుచున్నావు." దేవరన్యాయము వర్తించకుండినచో పతి వ్రతాశిరోమణియగు సీతనోట ఎంతటి దుఃఖములోనుండినను ఎంత యాగ్రహము కలిగినను ఇట్టిమాట రానేరదు. కావున రామాయణకాలములో దేవరన్యాయము వర్తించుచుండెనని యూహింప శక్యమగుచున్నది. స్త్రీలను దత్తుగా ఇచ్చుచుండి నట్లు చెప్పజాలము కాని దశరథుడు తన ఒకే ఒక కూతును రోమపాదునకు దత్తుగా ఇచ్చెనని వ్రాసినారు. ఇది యా కాలమందలి యాచారమో లేక అపవాదమో తెలియరాదు.

ఈ కాలములో పెద్దనగరములలోని విహారారామము లందు స్త్రీపురుషులు సాయంకాలములందు వాహ్యాళిచేసి ఆనం దించుచుండురు. రాముని కాలమందును అయోధ్యానగరము లోని స్త్రీలు సాయంకాలములందు బాగా బంగారునగలతో అలంకరించుకొని గుంపులు గుంపులుగా ఉద్యానవనములందు సంచరించుచుండిరి.

"నారాజకే జనపదే ఉద్యానాని సమాగతాః
సాయాహ్నే క్రీడితుం యాంతి కుమార్యో హేమభూషితాః"

(అయో. ౬౭-౧౮)

మరియు యువకులు స్త్రీలతోసహా అరణ్యాలలో సంచ రించుటకై వాహ్యాళివెళ్లి వచ్చుచుండిరి.

నరా నిర్యాంత్యరణ్యాని నారీభిస్సహ కామినః. (అయో. ౬౭-౧౭)

ఈ విషయాలన్నింటిని పరికించిచూచిన పైన రామాయణ కాలములో స్త్రీలకు మంచి స్థానముండెను. ఏకపత్నీ వ్రతత్వమును శ్రీరామాదులద్వారా బాగా సమర్థించినారు. పాతివ్రత్యమునకు సీతయు, అనసూయయు ముఖ్య పూజ్య స్థానములు.

నావలు

రామాయణ కాలమందలి జనుల విశ్వాసాలు నేడును చాలవరకు హిందువులలో వర్తించుచున్నట్లు కానవచ్చుచున్నది. నదులను దాటునప్పుడు నేటికిని వాటికి నమస్కారముచేసి రాగిడబ్బులు దక్షిణగా సమర్పించుకొనుచున్నారు. రాముడు గంగనుదాటునప్పుడు నౌకారోహణ మంత్రమును జపించెను.

మం॥ సుత్రామాణం పృథివీద్యామనేహసం..........

ఋగ్వేద ౧౦-౬౩-౧౦

అను వేదమంత్రమును జపించెనని వ్యాఖ్యాతలు వ్రాసినారు. ఆ కాలమందు సముద్రప్రయాణము బాగుగా జరుగుచుండెనని పై మంత్రము సూచించుచున్నది. గంగ పైనుండు ఓడలు చిన్నస్టీమర్లవలె నుండెను. వాటికి స్వస్తికలని పేరుండెను. వాటిలో గదులు, కిటికీలు, అలంకారాలు, గంటలు మున్నగున వుండెను.

అన్యాః స్వస్తికవిజ్ఞేయా మహాఘంటాధరా వరాః
శోభమానాః పతాకాభి ర్యుక్తవాతా స్సుసంహతాః

తత స్స్వస్తికవిజ్ఞేయాం పాండుకంబళ సంవృతాం
స నందిఘోషాం కల్యాణీం గుహో నావ ముపాహరత్.

అయో. ౮౯-౧౧,౧౨

ఇవి పెద్దఓడలను గురించిన వర్ణన. అందొకొక్క ఓడలో ౧౦౦ మంది ఓడను నడుపువా రుండుచుండిరి.

"నావాం శతానాం పంచానాం కైవర్తానాం శతం శతం"
(అయో. ౮౪-౮)

అను శ్లోకమువలన విశదమగుచున్నది. ఇవికాక చిన్న చిన్న పడవలుకూడా గంగపై నడిపింపబడుచుండెను. వాటిని ప్లవములు అని పిలుచుచుండిరి.

నావశ్చారురుహు శ్చాన్యే ప్లవై స్తేరు స్తథాஉపరే. (అయో. ౮౯-౨౦)

వృక్షపూజ

సీతాదేవి గంగను, యమునను దాటునప్పుడు ఆ నదులకు మ్రొక్కులిడెను. గంగను దాటిన తర్వాత మఱ్ఱిచెట్టును గూడ సీతాదేవి పూజించెను.

విస్పృద్ధం బహుభి ర్వృక్షై శ్శ్యామం సిద్ధోపసేవితం
తస్మై సీతాంజలిం కృత్వా ప్రయుంజీతాశిష శ్శివాః

అయో. ౫౫.౬

యమునానదివద్ద ఒక పెద్ద మఱ్ఱిచెట్టు కలదు. దానికి సీత మ్రొక్కి మంచి కోరికలు కోరుకొనగలదు అని భరద్వాజు డాదేశించెను. ఆదేవిధముగా ఆచెట్టును సమీపించినప్పుడు సీత యిష్టుని మ్రొక్కులిడెను.

నమస్తేస్తు మహావృక్ష పారయే స్మే పతి ర్వ్రతం
కౌసల్యాంచైవ పశ్యేయం సుమిత్రాంచ యశస్వినీం.

అయో. ౫౫-౨౫.

హిందువులలో ఇప్పుడు మఱ్ఱిచెట్ల ప్రభావము తగ్గినట్లున్నది. వాటిపూజ కానరాదు. కాని అశ్వత్థపూజ దాని స్థాన మాక్రమించుకొన్నది. ఇది బౌద్ధమతవ్యాప్త్య నంతరము వచ్చిన యాచారమై యుండును. మొహంజదారో హారప్పాశిథిలాలలోని కుండపెంకులమీది చిత్రాలలో అశ్వత్థ వృక్షాలుకలవు. వాటిపై దేవతా విగ్రహాలనుంచి ఆనాటి అనార్యులు పూజించిరని తెలియుచున్నది. అశ్వత్థనారాయణునికి వేపచెట్టులచ్చిని పెండ్లిచేయు వారున్నారు. మరియు శమీపూజ విజయదశమినాడు చేయుట సుప్రసిద్ధము. తులసీ మాహాత్మ్యము రానురాను ఎక్కువయ్యెను. ఇట్టి వృక్షపూజ లన్నియు అవైదికములే.

### ఇతర విశ్వాసాలు

రాజులు ప్రయాణము చేయునప్పుడు అందందు తాము చేసిన తాత్కాలికపు విడుదులను దహించి వెళ్లుచుండిరని భరతుని సైన్యము చేసిన చర్యలనుబట్టి తెలియుచున్నది. లక్ష్మి వెనుక నిలిచిపోకుండా తమ వెంటనే వచ్చుటకై అట్లు చేయుచుండిరేమో? భరతుడు గంగను దాటుటకు పూర్వము తాను చేసియుండిన విడిదిని కాల్పించెను. (అయో. ౯౯-౧౫) ఈ యాచారము హిందూరాజులలో విజయనగర సామ్రాజ్యాంతము వరకు వర్తించుచుండెనేమో? అముక్త మాల్యద, రాయవాచకము, మున్నగు [illegible]

వస్తులకాలపు వాఙ్మయములో రాజుల వెలిగుడారములను వర్ణించినారు. అచటినుండి చక్రవస్తులు ముందునకు సాగినప్పుడు వాటిని దహింప జేయుచుండిరని వర్ణించినారు.

● రామాయణ కాలమందు వడ్డీ వ్యాపారము జరుగుచుండెను. అందు బ్రాహ్మణులుకూడా చేరియుండిరి. వారి వ్యాపారానికి ప్రత్యేకసౌకర్య ముండెను. అది ఇతరవర్ణాలకు నిషిద్ధమైయుండెను. అప్పు తీసుకున్నవాడు దానిని చెల్లింపకుండిన అప్పిచ్చిన బ్రాహ్మణుడు వానియింటికడప కడ్డముగా తన ముఖమును కప్పుకొని భుజింపకుండా ప్రాయోపవేశము చేసి భూమిపై పండుకొనుచుండెను. అప్పు చెల్లించువరకీ ప్రాయోపవేశము సాగుచుండెను. (అయో. ౧౧౧-౧౪)

మృత్యువాసన్నమైన వారికి బంగారుచెట్లు కనిపించునని జనులు విశ్వసించుచుండిరి. [అర. ౪౭-౩౭] స్త్రీలకు ఎడమ కన్నదిరితే మంచిదనియు, అదే పురుషులకు చెడ్డదనియు, పురుషులకు కుడికన్నదిరిన మంచిదనియు, అదే స్త్రీలకు చెడ్డదనియు నమ్ముచుండిరి. (కి. ౫-౩౨) ఈ విశ్వాసము హిందువులలో నేటికిని కలదు. క్రొత్తగా గృహప్రవేశము చేయుటలో మేలుగోరినట్లైన కుడికాలు మొదట కడపలోనికి పెట్టవలెను. ఎడమకాలు పెట్టగూడదు. హనుమంతుడు లంకాద్వారమందు ప్రవేశించినప్పుడు ఎడమకాలు ముందు పెట్టెను. లంకకు నాశనము కోరి అతడు బుద్ధిపూర్వకముగా అట్లు చేసెను. [సుం. ౪-౩] ఈ కుడి యెడమకాళ్ల విశ్వాసము ఇప్పటికిని మనయందు కలదు. క్రొత్త యొద్దను

కొన్ని వ్యవసాయకులు ఎద్దు కాడికాలిని ప్రయత్నపూర్వక ముగా కడపలోనికి పెట్టించి దాటింతురు. నూతన వధూవరు లచే అత్తవారి యిండ్లలో ఇదే ప్రకారము చేయింతురు. నూతన గృహప్రవేశమందును ఇట్లే చేయుదురు.

ఆకాలమందు కఠశాఖాధ్యయనమున కెక్కువ ప్రాము ఖ్యముండెను. [అయో. ౩౨-౧౮] ఆర్యులు చనిపోయిన ప్పుడు దహనసంస్కారములే చేయుచుండిరి. [అర. ౩-౨౦] దహనకర్మ ఆర్యుల విశిష్టాచారము. ఒక కాలమందు ఆర్యు లుగానుండి తర్వాత భిన్నించినట్టి ఈరాన్ దేశపు పార్సీ మత స్థులు [జరథుస్త్రానుయాయులు] శవాలను దహించకుండిరి. పూడ్వకుండిరి. వాటిని ఎత్తుప్రదేశాలపై వదలివచ్చుచుం డిరి. నేటికిని పార్సీలలో ఈ యాచారమున్నది. మరి యితర మానవ సంఘాలవా రందరును శవాలను పూడ్చుచుండిరి. ఆర్యులలోను అతి ప్రాచీనకాలములో శవాలను బయలులో వదలివచ్చు ఈరానీ ఆచారముకూడా అందందు వర్తించు చుండెనేమో! పాండవుల ఆయుధములను శవాకారముగా కట్టి జమ్మిచెట్టుపై వ్రేలాడగట్టిన కథ గమనింపదగినది. వా రట్లుచేసి పోవుచుండగా "గొల్లలు మున్నగు క్షుద్రజనులు" చూచి అదేమని విచారించగా పాండవు లిట్లనిరి.

> "ఇది శతవృద్ధ, మాజనని, యిప్పుడు మృత్యువుబొందె, ఇట్లు సే
> యుదుము, కులప్రవృత్తమగుచున్న సనాతనధర్మ మిత్తెఱం
> గ, దహనకర్మ మొల్లమదిగా నిదిగా మును నిశ్చయించి మా
> మొదలిటివా రొనర్చు విధము గొనియాడితి మేము నియ్యెడన్."
> (విరాట. ౧-౧౯౭)

శవాలను చెట్లకు కట్టుట వారి పూర్వీకులు చేయుచుండిన ఆచారమట. అది వారి సనాతన ధర్మమట. వారు దహనకర్మ మెల్లరట. ఈ మాటలు నిజముగాకుండిన, ఇట్టి యాచారము అందందు వ్యాప్తిలో నుండకుండిన "గొల్లలు మున్నగు క్షుద్రజనులు" ఎంతటి తిక్కవారైనను ఆ మాటల నూరకనే నమ్మి నోరుమూసుకొని వెళ్ళిపోదురా? అయితే ఈ యాచారము క్రమముగా భారతీయార్యులు వదలుకొనిరనియు, ఈరాని జరథుస్త్రానుయాయులు మాత్రము దానిని వదలుకొనలేదనియు దీనివలన ఊహించవచ్చును. రాక్షసులు శవాలను పూడ్చుచుండిరని రామాయణమందు తెలిపినారు.

భాద్రపదమాసము వేదాధ్యయనమునకు ఉత్తమకాలముగా పరిగణింపబడుచుండెను. [కి. ౨౮-౫౪] ప్రయాణములు చేయునప్పుడు సైనికులు ఏనుగులలద్దితో చలిమంటలు కాపుకొనుచుండిరి. [అయో. ౯౯-౭] బ్రాహ్మణులు బహుశముగా సంస్కృతమునే మాట్లాడుచుండిరని పలుతావులందు తెలుపబడినది. వాతాపి సోదరులు బ్రాహ్మణవేషముతో సంస్కృతములో మాట్లాడి జనులను మోసగించుచుండిరి. [అర. ౧౧-౫౭] హనుమంతుడు సీతను మొదటిసారి చూచినప్పుడు తా నామెతో బ్రాహ్మణులవలె సంస్కృతములో మాట్లాడవలెనా యని తనలో వితర్కించుకొనెను. [సుం. ౩౦-౧౮] హనుమంతుడు గొప్ప విద్వాంసుడనియు వైయాకరణి యనియు ఉత్తరకాండలో వర్ణించినారు.

అసౌ పునర్వ్యాకరణం గ్రహిష్యన్.........ఉత్తర. ౩౬-౪౫
స సూత్రవృత్త్యర్థపదం మహార్థం ససంగ్రహం సాధ్యతివై కపీంద్రః
నహ్యస్యకశ్చి త్సదృశో స్తిశాస్త్రే వైశారదే ఛందగతౌ తథైవ
సర్వాసు విద్యాసు తపోవిధానే ప్రస్పర్ధతే.........
ఉత్తర ౩౬-౪౬-౪౭

ఈ శ్లోకాలనుబట్టి హనుమంతుడు వ్యాకరణసూత్రాలలోను, వార్తికములలోను, ఛందస్సులోను, శాస్త్రములందును, సకల విద్యలందును ప్రవీణుడని వర్ణించినారు. ఇట్టి వర్ణనవలన హనుమంతుని పాండిత్యవిషయములో అనుమానము కలుగుచున్నది. వ్యాకరణసూత్రాలు వార్తికాలు క్రీ. పూ. ౫వ శతాబ్దానంతరమే ఏర్పడెను. హనుమంతునికాలములో అవి లేకుండెను. కావున ఈ ప్రక్షిప్తాలమూలాన సుందరకాండలో అతడు సీతతో సంస్కృతములో మాట్లాడజూచినమాట నమ్మరానిదగుచున్నది. సంస్కృతమును జనులలో ముఖ్యముగా బ్రాహ్మణులు మాట్లాడుచుండిరనుటయు విశ్వాసయోగ్యము కాదు.

ఇల్వలుడు బ్రాహ్మణునివలె సంస్కృతంలో మాట్లాడెనని అందుచేత ఆకాలమందు బ్రాహ్మణులే సంస్కృతమందు మాట్లాడుచుండిరని గ్రహింపవచ్చును. కాని పతంజలికి పూర్వము అనగా క్రీ. పూ. 300 కంటే ముందు కాలములో శూద్రులుకూడా సంస్కృతమును మాట్లాడుచుండురనియో లేదా మాట్లాడితే అర్థము చేసుకొనుచుండిరనియో చెప్పకతప్పదు. "ప్రత్యభివాదే శూద్రే ౮-౨-౮3" అను

పాణిని సూత్రములో శూద్రులుకాని వర్ణత్రయము వారిని సంబోధించునపుడు ప్లుతమునుపయోగించవలెననన్నారు. అందుపై పతంజలి మహర్షి గారిట్లన్నారు. "కుశల్య సితుష జక" తుషజక ! (ఓరీ శూద్రా) నీవు కుశలివికదా అని తుషజకా ! యనక హ్రస్వముగానే యుండవలెనని యుదాహరణమిచ్చినారు. తుషజకునితో సంస్కృతముతో మాట్లాడితే వాడర్థముచేసుకొని సంస్కృతములో ప్రత్యుత్తర మియ్యగల శూద్రుడే యనవలెనుకదా ! పతంజలికి పూర్వము శూద్రులకుకూడా సంస్కృతమువస్తే రామాయణ కాలములో అది వారి మాతృభాషయై యుండెనేమో ? అట్లయినచో "ధారీయన్ బ్రాహ్మణం రూపమిల్వల సంస్కృతం వదన్" (అరణ్య. ౧౧-౫౪) అను శ్లోకభాగము ప్రక్షిప్త మనవలసివచ్చును. ఇట్లనుటకు మరొక కారణముకూడా కలదు. పాణిన్యాచార్యులు తన సూత్రాలలో వంతటను వేదభాషను ఛందస్సు అనియు తదితరమగు గీర్వాణభాషను "భాష" యనియు వ్రాసినారు. అష్టాధ్యాయిలో "సంస్కృతము" అను పదమెందును కానరాదు. తుదకు క్రీ. పూ. 300 ప్రాంతము నందుండిన పతంజలికూడా సంస్కృత శబ్దమును వాడినటుల కానరాదు. కాన సంస్కృతభాష అనుమాట పతంజలి యనంతరముదే యనవలెను. అట్లగుచో హనుమంతుడు సీతతో సంస్కృతముతో మాట్లాడుదునా వద్దా—

"యదివాచం ప్రదాస్యామి ద్విజాతిరివ సంస్కృతాం"

అని తర్కించుకొనుటలో "సంస్కృత" పదమును వాడుటచే

సీ శ్లోకము క్రీ. పూ. 300 తర్వాతనే ఎవ్వరిచేతనో రచితమై రామాయణమందు చేర్చబడిన దనవలెను.

క్రీస్తు శకారంభమునుండి సంస్కృతము బ్రాహ్మణుల విశిష్ట పఠనభాషగా నుండినట్లు పై ప్రమాణాలు నిరూపించుచున్నవి. నాటకములలో స్త్రీ శూద్రులకు సంస్కృతము నిషిద్ధమగుటయు నీ విషయమును దృఢపరచుచున్నది.

చాతుర్వర్ణ్యప్రాముఖ్యము ఆనాటికే సిద్ధమైయుండెను. (కిష్కి- ౨౭-౪౮) మణిశిలతో చేసిన తిలకమును నొసట జనులు ధరించుచుండినట్లు కానవచ్చుచున్నది. (కి. ౨౬-౨౭) నగరాలలో జనులు జూదమాడుచుండిరి. (బా ౫-౧౬)

"చిత్రా మష్టాపదాకారం..............."

అని వర్ణించినారు. ఇందు అష్టాపదం అంటే జూద మాడెడి పీట అని వ్యాఖ్యాతలు వ్రాసినారు. ఈ పీట యెట్టిదో ఇదెట్టి జూదమో తెలుపలేదు. ఇది చతురంగపు ఆట ఆడు పలక అని నే ననుకొంటాను. చతురంగపుపీటలో ౬౪ ఇండ్లు, ఎనిమిది పంక్తులు, ఒక్కొక్క పంక్తిలో ఎనిమిది ఇండ్లు ఉండును. శబ్దకల్పద్రుమములో అష్టాపదం అను పదాని కిట్లర్థము వ్రాసినారు. "పంక్తౌ పంక్తౌ అష్టౌపదాని యస్యేతివా" కావున ఇది చతురంగపు ఆట అని నేను భావించుచున్నాను. ఇది సరియగు ఊహ యగుచో చతురంగ ప్రాచీనత ఇందు స్పష్టమగుచున్నది. చతురంగమునకు భిన్నమై జూదముగా భావింపబడిన ఆటుకు అక్షము అన్నపేరుం డిరి. అది నింద్యముగా భావింపబడుచుండెను. ఇతే రామాయ

యణమందు భరతుడు కౌసల్యతో తాను రాముని అడవికి పంపుట కంగీకరించినచో మద్యపానము, పరస్త్రీ సంగమము, అక్షఖేలనము [జూదము] చేసిన పాపము పొందుదును గాక అని శపథము చేసెను. [అయో. ౭౫-౪౧]

ఎద్దులను రెండువిధములగు పనులకు ఉపయోగించుచుండిరి. వ్యవసాయము చేయు ఎద్దులను భద్రకము లనిరి. మూటలుమోయు ఎద్దులను శాలివాహములనిరి. బియ్యము మూటలనే ప్రధానముగా ఎద్దులపై తీసుకొని పోవుచుండిరనియు అయోధ్యాదేశ వాసులకు బియ్యమే ముఖ్యభోజ్య ధాన్యముగా నుండెననియు శాలివాహిపద చరిత్ర తెలుపుచున్నది. [అయో ౩౨-౨౦] ఈ కాలములో లంచాలు ఎట్లు స్థిరపడిపోయిన సంఘుజాడ్యమైయున్నదో అదే విధముగా ఆ నాడును లంచాలను తినువారుండిరి. మంత్రు లంతటివారు కూడా దీని రుచిమరగినవారుగా కనబడుచున్నారు. కుంభకర్ణుడు రావణునితో లంచాలుతినే మంత్రులను పరిహరింపవలెనని చెప్పెను. [యుద్ధ. ౬౩-౧౮] అయితే ఇది రాక్షసాచారమేమో అని సందేహింపవచ్చును. కాని ఆర్యుల లోను లంచముల తినువా రుండిరి. రాముని భరతు డరణ్యములో దర్శించుకొన్నప్పుడు భరతునితో నతడిట్లనెను. "నీవు చక్కగా పరీక్షించి ఉత్తములైన మంత్రులను నియోగించినావు కదా" అని ప్రశ్నించెను. [అయో. ౧౦౦-౨౬]

రామాయణకాలమందు ఆపత్సమయములందుగూడా లత్తుక, మద్యమాంసములు, లోహము, విషము అమ్మి జీవించుట నీచవృత్తులుగా పరిగణింపబడుచుండెను.

[అయో. ౭౫-౩౦] యామదుందుభులు జాముననొక మారు మ్రోగించుచుండిరి. యామకాలములను తెలుపుటకు దుందుభులను [నగారాలను] రాచనగరులముందు మ్రోగించు చుండిరి.

'సువర్ణకోణాభిహత: ప్రాణద ద్యామదుందుభి:' (అయో. ౮౧-౨)

క్షత్రియులకు మృతాశౌచము ౧౦ దినాలపాటు వర్తించుచుండెను. [అయో. ౭౬-౨౩] కుండలు, స్థాలీలు, దొప్పలు, కరంభ్యములు [వెడల్పు మూతలుగల పెద్దపాత్రలు,] కుంభ్యములు [చిన్న కుండలు] ఋష్యాశ్రమములలో వాడబడుచుండెను. [అయోధ్య ౯౧ సర్గ ౬౭ నుండి ౮౦ వరకు శ్లోకాలు] ఈ కాలములో పై వర్ణములవారు మట్టి పాత్రలను హీనముగా జూతురు. వైదికాచారములకు మట్టి పాత్రలే పవిత్రమైనవి. ఇప్పటికి వివాహములలో, అంత్యక్రియలలో కుండలనే వాడుదురు. [తెనాలి రామకృష్ణుని కాలములో బ్రాహ్మణుల యిండ్లలో కుండలు, అటకలు, మున్నగునవి వాడినట్లు పాండురంగమాహాత్మ్యములో వర్ణించినాడు].

మిద్దెలనుండి వాననీరు పారుటకై దోనులను [ప్రణాళి] పెట్టుచుండిరి. అంటే ఆ కాలమందలి యిండ్లకు మట్టిమిద్దెలుండెననియు వాటికి దోను లుండెననియు తెలియవచ్చుచున్నది. [అయో. ౬౨-౧౦] ఈ కాలములో పాశ్చాత్యులు కనిపెట్టినామని చెప్పుకొను పరిపాలనతంత్రములో పురపాలక సంఘము లొకశాఖగా నున్నవి. అట్టి సంఘములందు వాడవాడకు కొందరు ప్రముఖులు ఎన్నుకొనబడినవారై సభ్యులుగాచేరి వాటిని పరిపాలింతురు. రామాయణ కాలమునందు

వృత్తులనుబట్టి నగరాలలో "శ్రేణులు" ఏర్పాటగుచుండెను. వాటిపక్షమున శ్రేణీముఖ్యులు ఎన్నుకొనబడుచుండిరి.

న త్వాం ప్రకృతయ స్సర్వా శ్శ్రేణీముఖ్యాశ్చ భూషితాః
అనువ్రజితు మిచ్ఛంతి పౌరజానపదా స్తథా. (అయో. ౨౬-౧౪)

నాస్తికులు

ఆర్యమతములో విశిష్టత యేమనగా అందు మతస్వాతంత్ర్యము సంపూర్ణముగా వర్తించుచుండెను. విమర్శలకు భిన్నాభిప్రాయాలకు తావులుండెను. మతముతో భిన్నించినంతమాత్రాన వారిని తలగొట్టకుండిరి. త్రిత్తిబలిచి చంపించకుండిరి. విశేషమైతే వారిని గర్హించుచుండిరి. ఈ కారణముచేత వైదికమతములో రానురాను నానాశాఖలుద్భవించెను. అందు ప్రకృతివాదులు, లోకాయతులు, సాంఖ్యులు, కణవాదులు, నాస్తికులు, చార్వాకులు, బయలుదేరిరి. సాధారణముగా మతసంధికాలములో నాస్తికత పొడసూపును. పూర్వమతమును ఖండించుచు నూతనమతము విజృంభించినప్పుడు జనులు అటు పూర్వమతమందు పట్టుతప్పి క్రొత్తమతమందు పట్టుదొరకక నాస్తికతలో బడుదురు. జైనబౌద్ధమతాల విజృంభణకాలములో నాస్తికత ప్రబలెను. రామాయణకాలమందట్టి మతసంధి కానరాదు. కానరాకున్నను అందు నాస్తికులనుగురించి చర్చించినారు. అయితే ఆచర్చలోనే 'తథాగతుడు' 'బుద్ధుడు' 'చోరుడు' 'నాస్తికుడు' అనుచు వాని మతబోధను గురించిన నిందకలదు. కావున రామాయణమందలి నాస్తికమత చర్చయంతయు బౌద్ధకాలమునాటిదే యనియు, ఆ వంతయు ప్రక్షిప్తభాగమందు

చేరి తర్వాతికాలములో చేర్చబడినదనియు నేను విశ్వసించు చున్నాను.

రామాయణములో ముత్తెరంగులగు నాస్తికశాఖలు తెలుపబడినవి. లోకాయతులు, చార్వాకులు, బౌద్ధులు అను వారు నాస్తికులై యుండిరి. బౌద్ధమత దూషణమును శ్రీరామునిచే చేయించిన విషయమును ఇదివరలోనే చూపించియున్నాను. ఇక లోకాయతికులను గురించి అం దిట్లున్నది. రాముడు భరతునిట్లు ప్రశ్నించుచున్నాడు.

"కచ్చిన్నలోకాయతికాన్ బ్రాహ్మణాం స్తాత సేవసే"

(అయో ౧౦౦-౩౮)

'నాయనా ! నీవు లోకాయతికులైన బ్రాహ్మణులను సేవింపవుకదా' అని రాముడు ప్రశ్నించెను. బ్రాహ్మణుల లోనే ఈ నాస్తికవాదులు ఉండిరని పై వాక్యము స్పష్టము చేయుచున్నది. ఈ లోకాయత మెట్టిదో రాముడే యీ విధముగా విశదీకరించినాడు.

అనర్థకుశలా హ్యేతే, బాలాః పండితమానినః
ధర్మశాస్త్రేషు ముఖ్యేషు విద్యమానేషు దుర్బుధాః
బుద్ధి మాన్వీక్షికీం ప్రాప్య నిరర్థం ప్రవదంతి తే.

(అయో ౧౦౦-౩౯)

ఈ లోకాయతమతమును ప్రచారముచేయు బ్రాహ్మణులు బాలురవంటి అజ్ఞానులు. తమకేమో చాలా తెలియునని గర్వించుచుందురు. వీరు అనర్థాలకే దారితీసేవారు. పైగా దుర్బుద్ధులు. ముఖ్యమైన ధర్మశాస్త్రాలు ఉండగానే

ఉన్నవికదా! వాటిని విడిచిపెట్టి కేవలము శుష్కతర్కాన్ని అవలంబించి నిష్ప్రయోజనముగా వాగుచుందురు అని రాముడనెను—అన్వీక్షికి యన న్యాయదర్శనము. "ప్రత్యక్షా గమాశ్రితం అనుమానం సా అన్వీక్షా"అని న్యాయభాష్యమన్నది. అన్వీక్షకీవిద్యను ప్రతిపాదించినవాడు గోతముడు లేక గౌతముడు. ఇత డహల్యాపతి యని కొందరు భావించినారు. దానికి ప్రమాణములు లేవు. అక్షపాదుడను బిరుదముగల గౌతముడు వేరు. అతడు బుద్ధునికాలమువాడని విమర్శకుల యభిప్రాయము. లోకాయతికులకు అనగా నాస్తికులకు నైయాయికులకు అవినాభావసంబంధ మిందు నిరూపించుట గమనింపదగినది. రామునికాలములో ముఖ్యమైన ధర్మశాస్త్రి లుండెనా? ఉన్నట్లుకానరాదు. ఇదికూడా ప్రక్షిప్త సూచనయే! లోకాయతికులను లౌకాయతికులకు లనియు పిలుచుచుండిరి.

సూ॥ వరం సాంశయికా న్నిష్కా దసాంశయికః
కార్షాపణ ఇతి లౌకాయితికాః
(వాత్స్యాయన కామసూత్రములు ౧-౨-౩)

రేపేదో నిష్కం దొరకుతుందికదా అను నాశతో ఇప్పుడు దొరికే కార్షాపణమాత్ర ద్రవ్యమును లోకాయతులు వదలుకొనరట! అనగా లోకాయతికులు ప్రత్యక్ష వాదులు (materialists), లోకే ఆయతంత ఇతి లోకాయతాః— జనులను కుయుక్తులచే భ్రమింపజేయువారు కాన వారు లోకాయతులని తార్కికులు నిర్ణయించిరి. ఇట్టి లోకాయతులలో జాబాలి యొకడు. అతడు శ్రాద్ధము లేల పెట్టవలెను,

అని రామునితో వాదించెను. ఇది చార్వాకులు చేసినట్టి వాదము. చార్వాకులకును లోకాయతికులకును భేదములేదు.

### ఏ క వే ణి

స్త్రీలకు పతివియోగముకాని మహాదాపద కాని సంభవించినప్పుడు ఏకవేణీధరలై యుండుచుండిరి. (సుం. ౫౭-౩౯) వ్యసనములో నుండినప్పుడు ఒంటిజడను వేసుకొనుచుండిరనుటచేత సంతోషకాలములందు రెండుజడలును (ఈరానీ నారీమణులవలె) వేసుకొనుచుండిరా? ఇది స్పష్టమగుట లేదు. ఆర్యజాతికిచెందిన ఈరానీ స్త్రీలు నేటికిని సాధారణముగా రెండుజడలను రెండుబుజాలపై వేసికొనుటను చూచుచున్నాము. ప్రాచీన భారతవర్షీయార్యస్త్రీలును విలాసకాలములందు అట్లే యాచరించుచుండిరేమొ?

### వ ర్ణ వ్య వ స్థ

ఆనాటి వర్ణవ్యవస్థను గురించి యిదివరకే కొంత సూచించియున్నాను. పూర్వము ఇప్పటివలె కఠినమగు వర్ణవిభేదములు లేకుండెను. భోజన ప్రతిభోజనము లన్ని వర్ణములలో వర్తించుచుండెనని ఇంతవరకు వ్రాసినదానిని బట్టి స్పష్టమే. గుహుడు నిషాదజాతివాడు. నిషాదులు ఆటవికజాతివారు. అంటరానివారు. మహాభారత కాలమందు వారు నీచజాతివారుగాను అపవిత్రులుగాను చూడబడుచుండిరి

ఉ॥ విప్రుడ నన్నవాడ, అపవిత్ర నిషాది మదీయభార్య, కీ
ర్తిప్రియ, భిన్నిఁబెట్టి చమదెంచుట ధర్మువె నాకు, నాపుడున్

విప్రులఁ బొందిన యన్న యపవిత్రులు పూజ్యులుకారె, కావునన్
విప్రకులుండ! వెల్వడుము వేగమ, నీవును నీ నిషాదియున్
మహాభారతము ఆది. ద్వి. ౬౧

అట్టి అపవిత్రుడైన నిషాదరాజగు గుహుడు తెచ్చిన మాంసమత్స్యములను భరతుడు స్వీకరించెను. శ్రీరామచంద్రుడా నిషాదుని కౌగిలించుకొనెను. శబరిపేరును బట్టియే శబరకన్యక, ఆటవిక స్త్రీ, అంటే అంటరాని అనార్య స్త్రీ— ఆమె యిచ్చిన యాతిథ్యమును శ్రీరాముడు స్వీకరించెను. వానరులు అనార్యులు. కావున అవర్ణులు. వారితో రామాదులు భుజించిరి. బ్రాహ్మణులు ఇతర వర్ణములవారి యిండ్లలో శ్రాద్ధాది కర్మలందు పాల్గొని మాంసయుక్త భోజనమును భుజించుచుండిరి. (చూడుడు, వాతాపికథ) వర్ణాంతర వివాహాలు జరుగుచుండెను. ఇట్లుండినను బ్రాహ్మణులకు కొన్ని విశిష్టతలు ప్రారంభమయ్యెను. అప్పుల రాబట్టుకొనుటకై ప్రాయోపవేశము చేయు అధికారము వారికేయుండెను. సంస్కృతమును వారు ప్రత్యేకముగా మాట్లాడుచుండిరి. బ్రాహ్మణులకు వివిధదానాలు చేసిన పుణ్యము లభించునను భావన ఏర్పడెను. వారు మెల్లమెల్లగా మత్తువస్తువులను వదలుకొనిరి. బహిరంగముగా వీధులలో మద్యపానముచేయు బ్రాహ్మణుని తక్కువ చూపుతో చూచుచుండిరి.

(అయో. ౧౩-౭౮)

'ధిక్కరిష్యంతి రథ్యాసు సురాపం బ్రాహ్మణం యథా'

## యుద్ధతంత్రము

రామాయణములోని యుద్ధపద్ధతులను గమనించిన కొన్ని విశేషములు స్ఫురించును. ఆర్యులకన్న రాక్షసులు,

రాక్షసులు బలాఢ్యులై యుండినట్లు కానవచ్చుచున్నది. వానర రాక్షసవీరులు కుస్తీపట్లలోను చెట్లను ఊడబెరికి వాటిని ఆయుధాలనుగా ఉపయోగించుటలోను, గదాయుద్ధముల యందును, ప్రవీణులుగా కానవచ్చుచున్నారు. అట్టిది ఆర్యు లందు కానరాదు. కాని ఆర్యులలో మారణయంత్రాలెక్కు వగా నుండుటచే వారు పశుబలముకల వానరరాక్షసులను లోబరచుకొనగలిగిరి. ప్రపంచ చరిత్రలో నేటివరకు కూడా ఈ రహస్యమే వర్తించుచు వచ్చినది. ఏ జాతికి మారణ యంత్రాలెక్కువగా నుండునో ఆ జాతి యితరజాతులను లోబరచుకొనుచు వచ్చినది. ఏషియా ఆఫ్రికా ఆస్ట్రేలియా ఖండాలను యూరోపువారు గెలుచుటలో ఈ రహస్యము తప్ప మరి వేరురహస్యము కానరాదు. రామాయణ యుద్ధా లలో అమ్ములు, బాణములు, గుండ్లు, చెట్లు, కత్తులు, గదలు, డాలులు, రథాలు, గుఱ్ఱములు, ఏనుగులు, యుద్ధమందుప యోగింపబడెను.

ఆర్యులవద్ద శతఘ్నులు అను ఆయుధము లుండెను. (బాల. ౫-౧౧) అవి యినుప గుదియలని వ్యాఖ్యాత లభి ప్రాయపడినారు. అవి ఒక్కొక్క దెబ్బతో నూరుమంది వరకు చంపగల్గు చుండెడివని పదముయొక్క యర్థము తెలు పుచున్నది. కౌటిల్యుని కాలములో స్థిరయంత్రము లనియు, చలయంత్రము లనియు రెండువిధాల యంత్రాలుండెను. అందు శతఘ్ని చలయంత్రాలలో చేరినట్టిది. దాని స్వరూప మును గురించి ఆర్. శ్యామశాస్త్రిగారు ప్రాచీన వ్యాఖ్యా ధారమును బట్టి యిట్లు వ్రాసినారు.

'A big pillar with immense number of sharp points on its surface and situated on the top of a fort wall' అనగా ఒకపెద్ద స్తంభానికి మొనలుగల వస్తువులు చెక్కి దానిని కోటబురుజులపై ఉంచుచుండిరని తెలిపినారు. శబ్దకల్పద్రుమకారుడు శతఘ్ని కిట్లు అర్థము వ్రాసినాడు "శతం హంతీతి శతఘ్నీ-అస్య లక్షణం ;

అయఃకంటక సంఛన్నా శతఘ్నీ మహతీ శిలా—ఇతి విజయరక్షితః ... ... ... ... శతఘ్నీ లోహకంటక కీలితయష్టి విశేషా ఇతి మల్లినాథః" చాలామంది శతఘ్ని అంటే ఫిరంగి అని అర్థము చేసుకొనుచున్నారు. అది కాదని చూపుట కింత విపులముగా వ్రాయవలసి వచ్చినది.

రాజులు సైన్యములతో బయలుదేరినప్పుడు విడిది చేయు స్థలములలో డేరాలు ఎత్తించుచుండిరి. (అయో. ౮3-౨౬) ఒక్కొక్కరాజు కొక్కొక్క విధమగు ధ్వజముం డెడిది. ఇక్ష్వాకువంశము వారిది కోవిదారధ్వజము (అయో. ౮౪-3) డాలులు చర్మముతో చేయబడినట్టివై యుండెను. (అయో. ౯౭-౨) బాణములు వేగముగాను బలవత్తరము గాను పోవుటకై వాటికి నెమలియీకెలను కట్టుచుండిరి. (అర. 3-౧3) ఈ కాలములో ఉభయపక్షాల సైనికులు కలబడు టకు పూర్వము వారికి సారాయి, బ్రాందీ, త్రాపి యుద్ధ దుందుభులను (బ్యాండును) మ్రోగించి యుద్ధములోనికి వదలు దురు. రామాయణ కాలమందును భటులకు మద్యమును త్రాపి యుద్ధసన్నద్ధులనుగా చేయుచుండిరి. అట్టి మద్యపాన

మునకు "వీరపాణము" అని పేరుండెను. (కిష్కి. ౧౧-౩౮) వీరులు త్రాగునట్టి పానము కావున అది వీరపాణ మయ్యెను.

శత్రుసైన్యమునకు నష్టము కలిగించుటకై బావులలో విషము కలుపుచుండిరి. ఫలవృక్షములను నాశనము చేయుచుండిరి. (ఇది ఈనాడు రష్యాకనిపెట్టిన భూదహన తంత్రము వంటిది—Scorched earth policy) శత్రుసేనలోనికి చారులనుబంపి వారి బలాబలములను వారి యుద్ధాలోచనలను వారి ప్రయత్నాలను కనుగొనుచుండిరి. చెట్లలోను గట్లలోను దాగియుండి కూట యుద్ధాలు (గొరిల్లా యుద్ధాలు) చేయుచుండిరి. అయితే ఇవన్నియు రాక్షసుల చర్యలని తెలిపినారు. (యుద్ధ. ౪-౧౨, ౧౩).

సైన్యములో ఇప్పుడు పల్టన్, బ్రిగేడ్, డివిజన్ అను విభాగా లుండునట్లుగా రామాయణ కాలములో కొన్ని సంఖ్యాయుక్తమైన సైనిక విభాగాలుండెను. ఒక ఏనుగు, ఒక రథము, మూడు గుర్రాలు, అయిదుగురు పదాతులు కల సేనను "పత్తి" (Unit) అని వ్యవహరించిరి. ఇది అన్నిటి కన్న చిన్న సైనికవర్గము. మూడు పత్తులు సేనాముఖమనియు, మూడు సేనాముఖాలు ఒక గుల్మమనియు, మూడు గుల్మాలు ఒక గణమనియు, మూడు గణాలు ఒక వాహినియనియు, మూడు వాహినులు ఒక పృతనయనియు, మూడు పృతనలను చమువు అనియు, లేక అనీక మనియు వ్యవహరించుచుండిరి. అయితే రామాయణములో పై సైనికవర్గాల ముచ్చట కానరాదు. అందు మాట్లాడితే లక్షలు, కోట్లు

సంఖ్యలలోనున్న సైన్యములను పేర్కొన్నారు. అనీకముల శతసహస్ర సంఖ్యలే అందున్నవి.

ఆకాలమందొక విశేషము కనబడుచున్నది. ఆర్యులే ధనుర్విద్యయందు ప్రవీణులై యుండినట్లు తోచుచున్నది. ఆ విద్యను ఇంకను వానరరాక్షసులు నేర్చుకొనలేదు. వారు గదలతోను, వృక్షాలతోను, గుండ్లతోను, కత్తులతోను యుద్ధముచేయుచుండిరి. పైగా కుస్తీలుపట్టుట, ముష్టియుద్ధము చేయుట వారి ప్రత్యేక యుద్ధకళగా కనిపించుచున్నది. వాలి సుగ్రీవులు కుస్తీపట్టిరి. రాముడు బాణముతో వాలిని చంపు దుననగా సుగ్రీవుడు దాని మాహాత్మ్యమును మొదటవిశ్వసింపక రాముని ధనుర్విద్యాపరీక్షను తీసుకొని సప్తతాళవృక్షభేద నము చూచి పర్వాలేదులే అని తృప్తిపడెను. యుద్ధకాండలో సాధారణముగా వానర రాక్షసులందరును బాణములుతక్క తక్కినవాటితో యుద్ధము చేసినట్లు వర్ణించినారు. కుంభకర్ణు నంతటివాడు ధనుర్విద్య నెరిగియుండలేదు. ఒక ఇంద్రజిత్తు, రావణుడుతప్ప తక్కినవారెవ్వరును ధనుర్విద్య నెరుగరు. వారిరువురుకూడా ఎరిగియుండిరో లేదో, అది కవివర్ణనమేనో యేమో? అస్త్రములముచ్చట యందందు కలదు. మంత్రాలతో పనిచేయుబాణాలను మనకాలములో నమ్మజాలము. అదియు కవి కల్పితమేమో?

ఆర్యులలోనే ధనుర్విద్యాప్రాబల్య ముండెననుటకు రాముడొక్కడే ఖరుని ౧౪౦౦౦ రాక్షససైన్యాన్ని బాణములతో చంపిన కథయొక్కటే ఒక నిదర్శనము. వానరవీరు

లెవ్వరును ఎందును ధనుస్సు నుపయోగించినట్లు వ్రాయకుండుట మరొక విశేషము. ఆర్యులలో ధనుర్విద్యాపాటవము బహుకాలము వర్ధిల్లెను. తుదకు క్రీ. పూ. ౬వ శతాబ్దమందు రాజ్యముచేసిన పర్షియా చక్రవర్తుల సైన్యాలలో ధనుర్ధరులైన హిందువులసేన యొకటి ప్రత్యేకముగా నుండెను. సుప్రసిద్ధమైన థర్మాప్లై లీ యుద్ధములలో పర్షియా చక్రవర్తి పక్షాన గ్రీకులతో హిందూ ధానుష్క సైన్యము యుద్ధము చేసెను. ఆ సైన్యము నూలుబట్టలను కట్టుకొని యుండెననియు బెత్తపు అమ్ములను, ఇనుప మొనలుగల బాణములను ఉపయోగించెనని చరిత్రకారులు వర్ణించినారు. †

ధనుర్విద్యను ప్రపంచమందు మొట్టమొదట కనిపెట్టినది ఆర్యులే. వారు భార్గవార్యులు. ప్రపంచ గ్రంథాలలోనెల్ల అత్యంత ప్రాచీన గ్రంథరాజమగు ఋగ్వేదమందు ధనుర్విద్యను గురించిన చర్చకలదు.

> ధన్వనా గా ధన్వనాజిం జయేమ, ధన్వనా తీవ్రాః సమదో జయేమ
> ధనుః శత్రోరపకామం కృణోతి, ధన్వనా సర్వాః ప్రదిశో జయేమ.
> (ఋగ్వేద మం ౬. సూ ౭౫. మంత్రం ౨)

ధానుష్కులు తమ బలాబలముల పోటీపరీక్షలు చేయుచుండిరని ఋగ్వేదమందు వర్ణించినారు. ఋగ్వేదమందలి మండలం ౬ సూక్తము ౭౫ లో, ధనుస్సు, వర్మము, జ్యా, ఇషువులు, సారథి, రథము, అశ్వములు, యుద్ధభూమి, కవచాలు మున్నగునవి విపులముగా వర్ణింపబడినవి. ఇది

† Ancient India, Vol. I, S. K. Iyengar.

ధనుర్విద్యా ప్రాచీనతకు ప్రబల నిదర్శనము. ప్రాచీనకాలములో ఆర్యులతర్వాత శకులు (సిథియనులు) ధనుర్విద్యయందు పాండిత్యము కలిగియుండినట్లు వర్ణింపబడినారు. అదే విధముగా ఆర్యుల కెట్లు గుఱ్ఱములు ప్రధాన యుద్ధాంగములై యుండెనో శకులకును గుఱ్ఱములే ప్రధాన వాహనములై యుండెను. ఋగ్వేదమందు గుఱ్ఱములను పలుతావుల వర్ణించినారు.

ఏ జనులందు ఏ విద్య ప్రాముఖ్యమువహించియుండునో దాని గురించిన చర్చయే వారిలో నెక్కువగా నుండును. నేటికిని భారత దేశమందలి ఆటవికులలో వివాహాలకాలమందు పెండ్లికూతురు అమ్మపై విడిచిన బాణమును పెండ్లికుమారుడు తేగలిగితే వాని కా బాలిక నిత్తురట! సీతా వివాహమునకు శివధనుస్సు నెక్కుబెట్టువాడే అర్హుడుగానిర్ణయింపబడియుండెను. ద్రౌపదికి మత్స్యయంత్రమును పడగొట్టువాడే భర్తయగుటకు అర్హుడై యుండెను. రామునికి ధనుర్విద్యా గురువు విశ్వామిత్రుడు. రాముని వివాహముతో విశ్వామిత్రుడు రామాయణమునుండి అకస్మాత్తుగా మాయమైపోయెను. మరల యెచ్చటను అతనిజాడ కానరాదు. ఈ విచిత్రమునకు కారణమేమో దురూహ్యముగా నున్నది.

ధనుర్విద్యను గురించి రామాయణము మరికొన్ని విశేషములు తెలిపినది. రాముడు భరతుని నిట్లడిగెను.

> ఇష్వస్త్ర వరసంపన్న మర్థశాస్త్ర విశారదం
> సుధన్వాన ముపాధ్యాయం కచ్చిత్త్వం తాతమన్యసే
>
> (అయో. [illegible])

నాయనా! ధనుర్విద్యలో పారంగతుడును అర్థ శాస్త్ర విశారదుడును నగు సుధన్వ గురుపాదులను మన్నించు చున్నావుకదా! అని శ్రీరాముడు భరతునడిగెను. ఈ సుధన్వ డెవడు? రామాదులకు ధనుర్విద్యాగురువు విశ్వామిత్రు డొక్కడేయని తెలిపినారు కాని ఇంతకు పూర్వము కాని ఈ శ్లోకానికి పరమందుకాని ఈ సుధన్వుని జాడలేదు. ధను ర్విద్యలో మంచినేర్పరియగువాడు సుధన్వుడని శబ్దార్థముం డుటచేత అది నామవాచకము కాదని తలపవచ్చును. కాని అత డుపాధ్యాయుడనియు పేర్కొనుటలో అతడెవ్వడో తెలియవచ్చుటలేదు. కాని రామాదులు భార్గవ వంశము వాడగు విశ్వామిత్రునొద్దనే ధనుర్విద్యను నేర్చినటుల రామా యణమందు కలదు.

విశ్వామిత్రుని వెంట రామ లక్ష్మణులను పంపుటకు దశరథుడు నిరాకరింపగా విశ్వామిత్రుని కాగ్రహాము కలుగు నని వసిష్ఠుడు తలచుటయేకాక అతడే ధనుర్విద్యకు తగిన గురువని ఇట్లు దశరథునితో చెప్పెను. "ఈ విశ్వామిత్రుడు ముల్లోకములందెవ్వరును నెరుగని వివిధాస్త్ర ప్రయోగముల నెరిగినవాడు. దేవాసుర యక్షకిన్నరాదు లెవ్వరును నింతటి విద్య నెరుగరు. పూర్వము కృశాశ్వుడను నతని పుత్రులు పరమధార్మికులుండిరి. వారు సర్వాస్త్రములను పూర్వమే కౌశికునికి (భార్గవవంశమువానికి) ఇచ్చియుండిరి. ఆ కృశాశ్వ పుత్రులు ప్రజాపతిసుతాసుతులు. వారు మహావీర్యులు, దీప్తి మంతులు. జయావహులు. దక్షకన్యలైన జయయు సుప్ర

భయు, అస్త్రశస్త్రముల నూరింటిని కనిపెట్టిరి.............
ఆ శస్త్రములనుగూడ నీ కుశికాత్మజుడగు విశ్వామిత్రుడు
నేర్చినాడు. ఇతడపూర్వములైన ధనుర్విద్యా విధానములను
సృష్టించగలవాడు. ఇతడు స్వయంసమర్థుడు. కాని నీ పుత్రుల
హితార్థమే వచ్చినాడు. కాన బాలకులను పంపుడు" (బాల.
౧౧. సర్గ, శ్లోకాలు ౧౨ నుండి ౨౧ వరకు).

పై వాక్యాలవలన కొన్ని విషయములు మనకుస్ఫురించు
తున్నవి. ధనుర్విద్యలో మొదట కృశాశ్వ వంశము వారు ప్రవీ
ణులు. అశ్వాంతనామ వాచ్యులందరును ప్రాచీనమునుండియు
ఈరానీ ప్రభువులు. కావున ఈరానీ ఆర్యులలో నీవిద్య
మొదట సృష్టియయ్యెనననవచ్చును. తర్వాత వారినుండి
భార్గవులావిద్యను గొప్పగా సాధించిరి. దక్షకన్యలుకూడా
ధనుర్విద్యలో ప్రవీణులన్నదియు అందు క్రొత్తరీతులు కని
పెట్టిరన్నదియు ముఖ్యముగా గమనింపదగినది. ఆకన్యకలకును
కృశాశ్వ వంశ్యులకును నేమి సంబంధముకలదో తెలియదు.
వారెక్కడివారో అదియు తెలియదు. ఆవిషయమేలనో అంత
సూచనమాత్రగా చెప్పి వదలివేసినారు. ఆ శస్త్రాస్త్ర విద్యలన్ను
గూడ విశ్వామిత్రుడు సాధించెను. అనగా ఎచ్చటెచ్చట
ధనుర్విద్యాప్రౌఢిమ ప్రకర్ష కానవచ్చెనో అచ్చటనంతట
విశ్వామిత్రుడు సాధన చేసెనన్నమాట.

[illegible] ఆర్యులలోని [illegible] భార్గవ [illegible] ధనుర్విద్యా [illegible]
దర్శితుడుగా నిరూపితుడుకదా !

(౩౨)

అయితే యీ విద్యలో హిందూార్యులు గురువులకు గురువులైరి. దరయస్ (దారాయువస్) అను పర్షియా చక్రవర్తి గ్రీసుపై దండయాత్ర చేసినప్పుడు తనసేనలో హిందూ ధానుష్కుల పటలమును (పల్టనును) చేర్చి తీసుకొనిపోయి యుండెనని చరిత్ర చెప్పుతున్నది.

ధనుర్విద్య క్షత్రవిద్యయని ప్రసిద్ధియేకాని సకల వర్ణములవారును దానిని సాధించినవారే. ఇప్పుడది ఆటవికుల విద్యగా నిలిచినది. వారిలోను అది క్షీణించిపోతున్నది. ఈశాస్త్రమునుగురించి వ్రాయుటకు హిందువులేఅర్హులు. కాని అదేమి గ్రహచారమో దీనిని గురించిన శాస్త్రము లిప్పుడు కానరావు. అపరార్జునుడను ప్రఖ్యాతిగాంచిన అప్పారావుగారను నాంధ్రునిచేతనైనను ఎవ్వరును నీ శాస్త్రమును వ్రాయించినవారుకారు. అతడు గ్రామంలో దిక్కులేని చావుచచ్చెను. మన ఆదరణ ఇట్టిదే!

ఆర్యుల సంస్కృతి

సంస్కృతి యనగా ఇంగ్లీషులో కల్చర్ అను పదమునకే సంపూర్ణార్థముకలదో ఆ యర్థమందే వాడుచున్నాను. ఆర్యుల నాగరికత, సంస్కృతి రామాయణకాలమునాటికే బాగా ప్రబలియుండెను. ఆర్యావర్తమందు అనగా గంగానదికి పశ్చిమోత్తరభాగములందు పట్టణములు, నగరములు, గ్రామములు సమృద్ధిగా వర్ధిల్లియుండెను. ఈ లక్షణము గంగకు దక్షిణమందును, కాననమందును, దండకారణ్యమందును కోసలరాజ్యమందు అయోధ్యానగరము ఇంచుమించు

ఈనాటి నగరాలవలె గొప్పదియై నాగరికత కలదియైయుండెను. వివిధవృత్తులవా రుండిరి. అయోధ్యానగరములో గుఱ్ఱాలు, ఏనుగులు, ఒంటెలు, ఆవులు, ఎద్దులు, గాడిదలు కూడా ఉండెను. (బా. ౫-౧౩) బాబిలోనియా జనులు క్రీ. పూ. ౧౭౦౦ ఏండ్లకుముందు గుఱ్ఱాలముఖమే చూచినవారు కారని తెలిపినాను. చూచిన తర్వాత వారు గుర్రమంటే "తూర్పునాటి గాడిద" అని వర్ణించిరి! అయోధ్యలో కూటాగారములో అనగా అంతస్థులుకల మేడ లుండెను. (బా. ౫-౧౫) విమానశిఖరా లుండెను. అనగా ఏడంతస్థుల మేడ లుండెను. (అయో. ౩౨-౩) అందు "కుథాస్తరణ తల్పము"లుండెను. (అయో. ౩౦-౧౪) అనగా అందు చిత్ర కంబళములు, పరుపులు, పై కప్పులు, దుప్పట్లు, ఉండెను. నగరాలలో నాటకములాడి వేషములు వేసుకొని ప్రజలకు వినోదాలు కలిగించుచుండిరి. (శైలూష ఇవ-అయో. ౩౦-౮) రాజులకు సహజముగా వేటలం దాసక్తియుండెను. ఏనుగులను విషదిగ్ధబాణముతో కొట్టి వేటాడుచుండిరి. (అయో. ౩౦-౨౩)

ఆర్యుల విజ్ఞానముకూడా మంచి అభివృద్ధిదశలోనుండెను. జ్యోతిశ్శాస్త్రమందు వారికి మంచి ప్రవేశ ముండెను. వాల్మీకికి జ్యోతిశ్శాస్త్రసంబంధోపమానములు చాలా యిష్టము. ఉదహరింప శక్యముకానన్ని పర్యాయములు ఇట్టి యుపమానములను వాడియున్నాడు. అంగారకాది గ్రహాలు రోహిణిని వీక్షించుట లోకానర్థకమన్నాడు. (అర. ౪౬-౫) బుధుడు రోహిణిని పొందితే జగత్పీడ కలుగు నన్నాడు.

(యుద్ధ. ౧౦3-3౦). 'నా జన్మ నక్షత్రాన్ని సూర్యాంగారక రాహువు లాక్రమించినవి' అని దశరథుడు విచారపడినాడు. (అయో. ౪-౧౮) శుభదిన శుభ నక్షత్రయోగమునుచూచి ప్రయాణముగాని ఉద్యమములను గాని సాగించు చుండిరి. (యుద్ధ. ౪-3) ఇట్టివెన్నైనను కలవు. ఈనాడు టెలెస్కోపు యంత్రాలద్వారా చూచి సూర్యునిలో మచ్చలు (Sun Spots)ఉన్నవని తేల్చినారు. ఇంతమాత్రము ఆనాడే వాల్మీకికి తెలియకపోలేదు.

"ఆదిత్యే విమలే నీలం లక్ష్మ లక్ష్మణ దృశ్యతే" (యుద్ధ. ౨౩-౯)

'లక్ష్మణా! సూర్యునిలో నల్లనిమచ్చ కనబడుచున్నది సుమా!" అని రామునిచే వాల్మీకి చెప్పించినాడు.

ఆ కాలమందు శిల్పనిర్మాణకుశలు లుండిరి. మయులను జాతి శిల్పవేత్తల జాతిగా నుండెను. వారి శిల్ప మొక మాయవలె నుండెను.

"మాయే వ మయనిర్మితా" (యుద్ధ. ౧౨-౧౪)

ఈ మయు లెవ్వరు? వీరి సంతతితర్వాత బహు పురాణాలలో కాని ప్రాచీన చరిత్రలందు కాని కానరాదు. మహాభారతమం దొక మయుడు వచ్చెను. అతడు నిర్మించిన "మయసభ" కౌరవయుద్ధాని కొకకారణ మయ్యెను. అతడు ఖాండవవనమందలి అనార్య నాగజాతిగా అందు నిరూపితుడైనాడు. ఈనాడు కొందరు విమర్శకులు మెక్సికో (అమెరికా ఖండము)లోని సుప్రసిద్ధమగు మయజాతివారే యీ మయ. మహాభారత మయునిజాతివారని తెల్పుచున్నారు.

"హిందూ అమెరికా" అను గ్రంథము వ్రాసిన చమన్‌లాల్ గారు మెక్సికోకు హిందువులు అతి ప్రాచీనకాలములో వలసపోయి ఆ దేశమందుండిపోయిరనియు, అందుచేత మయులు ఒక కాలమందలి భారతీయులనియు వాదించినారు. మయబ్రహ్మ అను దేవజాతివాడొకడుండెననియు, అతడే ఇపుడు లభ్యమానమగు 'మయవాస్తు' అను శిల్పగ్రంథమును రచించెననియు మరి కొందరి విశ్వాసము. మొత్తానికి "మయుడు" అనార్యుడు, మహా శిల్పవేత్త.

అయోధ్యలో ఏడంతస్థుల వరకు సౌధరాజములను నిర్మించి యుండిరనిన గృహనిర్మాణ శిల్పమెంతయో అభివృద్ధిపొంది యుండవలెను. రాముడు శిల్పశాస్త్రప్రకారము కుటీరము నిర్మించుకొనెను. అదే శాస్త్రమును అనుసరించియే వాస్తుశాంతికై జింకను బలి యిచ్చెను. బాటలు అనగా రోడ్లు నిర్మించు 'ఇంజనీయర్లు' ఉండిరి. దారముతో కొలత పట్టువారు, త్రవ్వువారు, కూలీలు (కర్మాంతికులు), శిల్పుల పర్యవేక్షకులు (మేస్త్రీలు, వారిని రామాయణమందు స్థపతులు అని యన్నారు), వడ్లవారు (వార్ధకులు), బాటలు వేయువారు (మార్గణులు), చెట్లను నరుకువారు (వృక్షతక్షకులు), బావులను త్రవ్వువారు (కూపకారులు), సున్నము గచ్చు పనిచేయువారు (సుధాకారులు), మేదరవారు (వంశకర్మకులు), గడ్డపారలతోను రంపములతోను పనిచేయువారు— [illegible] దేశమందు నుండి [illegible] [illegible] శిల్పవేత్త [illegible]

ప్రకారమే లంకకు వారధి కట్టబడెను. నలుని తండ్రికూడా అట్టివాడే. (యుద్ధ ౨౨–౮౫ సేతునిర్మాణ విశేషాల కీ సర్గను చూడుడు). ఇదంతయు వాస్తుశాస్త్ర సంబంధమగు చర్చ.

ఇక సాముద్రిక శాస్త్రమును గురించి చర్చింతము. జనులకు సాముద్రికమందు మంచి విశ్వాసముండెను. రామాయణకాలమందు అనగా క్రీ. పూ. ౨౫౦౦ నాడు సాముద్రికముండెనా యని సంశయింపబనిలేదు. ఈ శాస్త్రము జ్యోతిషముతో లంకెవేసుకొనియున్నట్టిది. సాముద్రికమును మొట్టమొదట హిందువులే కనిపెట్టిరి. రానురాను దానికి సంబంధించిన శాస్త్రము జీవనాధారముగా కల్పించుకొన్న కొందరి చేతులలో ఒక రహస్య గోప్యశాస్త్రమైపోయెను. కీరో (Cheiro) అను సుప్రసిద్ధ పాశ్చాత్య సాముద్రికవేత్త తన గ్రంథాలలో "నేనీ శాస్త్రమును హిందువులవద్ద నేర్చుకొంటిని" అని వ్రాసినాడు. వారీ శాస్త్రమునుగురించి యిట్లభిప్రాయ మిచ్చినారు.

"అతి ప్రాచీనకాలములో శబ్దసృష్టి ఆర్యజాతిమూలమునసే కలిగినది... ...విషువత్తులు ౨౫,౬౦౦ పండ్ల కొకమారు కలుగునని సరిగా ప్రాచీనకాలమందే ఈ హిందువులు తెలిసిరి. ఇట్టి ప్రజ్ఞాశాలయుకల జాతియే సాముద్రికమును కనుగొను... ...ఇప్పుడు మనము ఏ జాతులనైతే చాలా ప్రాచీనమైనవి అనుచున్నామో అట్టి జాతులలో నాగరికత వర్ధిల్లుటకు ఎంతో కాలానికి ముందుగానే హిందువులీ శాస్త్రాలను సృష్టించిరి. అనగా ... [illegible] ... తెలియరాని ... [illegible]

పెదతాత అబ్రహాం పుట్టకముందే, మూసా (మోసెస్) ప్రవక్తకు దశనిబంధనలు (Ten Commandments) ప్రసాదితము కాకపూర్వమే యీ శాస్త్రాలు వ్రాయబడెను. హిందువుల నుండి యీ సాముద్రికము చీనా, తిబ్బెట్, పర్ష్యా, ఈజిప్టు, గ్రీసు దేశాలలో వ్యాపించెను. క్రీ. పూ. ౮౮౦లో అనక్షగోరస్ అను గ్రీకు పండితుడు తన శిష్యుల కీ శాస్త్రమును నేర్పుచుండెను" †

---

† In the far off dawn of Civilization, the first evidence of a word language belongs to the Aryan race. To their descendants, the Hindus, we owe the discovery of the precesion of the equinoxes which takes place every 25,600 years and we, with all the marvellous scientific instruments at our disposal, have only in recent years proved their calculations to be correct. The intellectual power that was able to make such a discovery speaks for itself. It is this self same people that discovered the study of the Hand......The period of time when these studies were created by the Hindus, was long before the dawn of civilisation had reached nations we now call ancient, a period long before Persia or Egypt had been heard of; before Abraham, the Father of the Hebrews had been born, & before the 10 Commandments were given to Moses. From the Hindus the study of the Hand reached China,

రాజరాజులు, చక్రవర్తులు, నియంతలు, మహాప్రధానులు, ప్రధానసేనానులు, జగద్విఖ్యాత పురుషులు, వేలకొలదిగా ఈ కీరో పండితునిచేత తమ సాముద్రిక భవిష్యత్తును చెప్పించుకొని అతడు చెప్పినవన్నియు సత్యమని వ్రాసి చెప్పియున్నారు. అట్టి కీరో యీ శాస్త్ర ప్రాచీనతనుగురించి యే వాక్యములను సెలవిచ్చెనో వాటి విలువ అద్వితీయము. వారింకను చాలా సంగతులు హిందువులనుగురించి వ్రాసిరి. అవి యిచ్చట అప్రధాన మగుటచే ఉదాహరించలేము. ఈజిప్టు చరిత్ర క్రీ. పూ. ౪౦౦౦ ఏండ్లనుండి లభించుచున్నది. దాని పేరు, గురుతు, జాడ తెలియరానప్పుడే హిందువులు సాముద్రికమును కనిపెట్టిరనిన రామాయణకాలములో దీని చర్చ యుండుట ఏ మాత్రమునూ ఆశ్చర్యము కలిగించనేరదు.

సీతకు పెండ్లి కాకముందే జ్యోతిర్విదులగు బ్రాహ్మణులు ఆమెచేతి రేఖలను పరీక్షించి ఆమెకు వనవాసయోగ మున్నదని చెప్పియుండిరి. (అయో. ౨౯—౯) జ్యోతిర్వేత్తలగు బ్రాహ్మణులేకాక తాపసవేషములతో దేశసంచారము చేయు స్త్రీలుకూడా యీ శాస్త్రమందు ప్రావీణ్యమును సంపాదించిరి. (అయో. ౨౯-౧౩) వీ రెవ్వరు? వీరే జిప్సీల (Gipsy) పూర్వికులై యుందురు. జిప్సీలభాషలోని పదాలు అధిక భాగము సంస్కృతసమములై యున్నవనియు, వారు

Tibet, Persia, Egypt & finally to Greece... Anaxagoras taught this study to his pupils in 440 B. C.— Chiero's Secrets of the Hand. PP 17, 18, 19

తమ భాషను రోమనీభాష యని యందురనియు అనగా రామ (యజమాని) అను పదమునుండి ఏర్పడినదనియు జార్జి బారోగారు వ్రాసినారు‡ రామాయణకాలమందు స్త్రీపురుష సాముద్రిక శాస్త్రములు వేరువేరుగా ఏర్పడినట్లు కానవచ్చుచున్నవి. వాల్మీకి పురుషసాముద్రిక లక్షణాలను కొన్నింటిని వివరించినాడు. (ఎంత సంగ్రహముగా ఈ చర్చలను చేయ దలచినను విషయము పెరిగిపోవుచున్నందున ఈ లక్షణాలు ఉదాహరింప వీలులేకపోయినది. అభిలాషులు సుందరకాండము సర్గ 35లోని ౧౭ నుండి ౨౧ వరకుండు శ్లోకాలను వాటిపై వ్యాఖ్యాతలు వ్రాసిన విపుల వ్యాఖ్యానమును చూచుకొనగలరు.) వాల్మీకి స్త్రీసాముద్రిక లక్షణాలనుగూడా ప్రత్యేకముగా వ్రాసియున్నాడు. (అభిలాషులు యుద్ధకాండ సర్గ ४౮లో ౧ నుండి ౧౫ వరకుండు శ్లోకాలను వాటిపై వ్యాఖ్యాతల వివరణను చదువుకొనగలరు.

రామాయణ ప్రారంభమందే రాముని సాముద్రిక లక్షణముల నిట్లు వర్ణించినారు. "రాముడు విపులాంసుడు. మహాబాహువులు కలవాడు. కంబుగ్రీవుడు. మహాహనువు కలవాడు.

'మహోరస్కో మహేష్వాసో గూఢజత్రురరిందమః
ఆజానుబాహుః సుశిరాః సులలాటః సువిక్రమః
పీనవక్షా విశాలాక్షో లక్ష్మీవాన్ శుభలక్షణః

(బాల. ౧-౯, ౧౦, ౧౧)

‡ Romano Lavo-lil by George Borrow. PP 3 to 8

ఈ శ్లోకాలకు వ్యాఖ్య వ్రాసినవారు ఇవి సాముద్రిక ప్రతిపాదిత లక్షణములనియు 'జగద్వల్లభ' అను పుస్తకములో సాముద్రిక శాస్త్రమున్నదనియు తెలిపినారు. ఈ జగద్వల్లభ యెట్టిదో తెలియదు అదే వ్యాఖ్యలో వరాహమిహిరుడు ఒక సాముద్రిక శాస్త్రమును రచించినట్లు తెలిపినారు. ఈ రెండు గ్రంథములిపుడు కానరానట్లు! సంస్కృతములో మూడు సాముద్రిక గ్రంథాలు ముద్రితమైనది. అవి పనికిరాని గ్రంథాలే! మనదేశమందిప్పుడు నిజమైన సాముద్రిక శాస్త్ర వేత్తలు కానరారు.

వాల్మీకికాలమునాటికే ఆర్యహిందువులలో వైద్యవిద్య మంచి పరిణతి పొందియుండెను. ఓషధీ ప్రభావమును మన పూర్వీకులు బాగుగా గుర్తించిరి. చికిత్సలలో ఓషధులను వాడుటలో హిందువులే మొట్ట మొదటివారని మరల చెప్పవలసియున్నది. హిమవత్పర్వత ప్రాంతమంతయు ఓష ధులకు జన్మస్థానముగా మనవారు భావించియుండిరి. నేటికిని ఆ విశ్వాసమందు లోపమేమియు గలుగలేదు. విశల్యకరణి, సువర్ణకరణి, సంధానకరణి, సంజీవకరణి అను నాలుగు విధాల ఔషధములను మనవా రెరిగియుండిరి. (యుద్ధ. ౧౦౨—౨౨, ౨౩) అయితేఇందు సంజీవకరణిని వా రెరిగియుండిరనుట సంశ యాస్పదమే. హిందువులలో కొందరు అట్టి యౌషధమందు విశ్వాసము కలిగియుండిరి. క్రీ. శ. ౬౪౮ లో నారాయణ స్వామి యను దాక్షిణాత్య హిందువును చీనాచక్రవర్తి పిలి పించి అతనిచే మృత్యుంజయ రసాయనమును చేయించెను. కాని ఆ చక్రవర్తి క్రీ. శ. ౬౪౯ లోనె చనిపోయెను.

తర్వాత చక్రవర్తియగు కోత్సంగ్ అనువాడుకూడా ఈ విశ్వాసమునకులోనై నారాయణస్వామిచే సిద్ధౌషధమును చేయించెను. ఈ తడవ నారాయణస్వామియే చనిపోయెను. అక్కడికిని చీనా చక్రవర్తికి సంజీవకరణియందు విశ్వాసము తగ్గలేదు. లోకాదిత్యుడు అను మరొక హిందువును పిలిపించెను. గరుడ పురాణములో ఒక విధమగు పలాశమునుండి దీర్ఘాయువు నిచ్చు ఔషధమును సిద్ధముచేయు క్రియను వ్రాసియున్నారు. †

రామసైన్యములో నలుడెట్లు మంచి శిల్పియో సుషేణు డట్లు మంచివైద్యుడు. (యుద్ధ. ౯౨-౨౦) అయితే చిత్ర మేమనగా సుషేణుడు, జాంబవంతుడు, నలుడు, హనుమంతుడు, వీరందరును అనార్యులే. అనార్యులలో కూడ ఓషధీ ప్రభావ మెక్కువగా నుండుటకు నేటి ఆటవికులగు గోండు, చెంచు, ముండా, మున్నగువారిలో ఓషధీ వైద్యము విశేషముగా నుండునని ప్రతీతి. శస్త్రవైద్యమునుకూడా (సర్జరీ) ఆకాలములో అభ్యాసము చేసియుండిరి.

'గర్భస్థజంతో రివ శల్యకృంతః' సుం ౨౮-౬

పిండము గర్భమందే మృతించిన దానిని తునకలుగా కత్తిరించి బయటకు తీయుచుండిరి. జాంబవంతుడు మంచి వైద్యవేత్త. హనుమంతునితో హిమవత్పర్వతమందు ఋషభకైలాసగిరులమధ్య ఓషధీపర్వత మున్నదనియు, అందు నాలుగు ఓషధులు మృతసంజీవని, విశల్యకరణి, సౌవర్ణ్యకరణి,

---

† ఎ. వి. శరగూరి వ్యాసము. మాడరన్ రివ్యూ, ఆగష్టు ౧౯౩౬లో.

సంధానకరణి అనునవి కలవనియు చెప్పి వాటిని తెమ్మనెను. (యుద్ధ. 28-33) హనుమంతుడు ఆకాశగమనముతో హిమవంతమునకు పోవుట, ఓషధులు కల పర్వతభాగమునంతయు ఉత్పాటనముచేసి అరచేత పెట్టుకొని మరల ఆకాశమార్గమున వచ్చుటయు, పనితీరిన తర్వాత దానిని యథాస్థానమందు వేసివచ్చుటయు, ఇదంతయు కవి కపోల కల్పితముగా కనబడుచున్నది. దగ్గరి గుట్టలలో ఓషధులను వెదకి తెచ్చిన తెచ్చియుండును. ఇది వైద్యమును గురించిన చర్చ.

ఇక గణితశాస్త్రమునుగూర్చి విచారింతము. జ్యోతిషమునకు గణితమునకు దగ్గరి బాంధవ్యమున్నది. జ్యోతిషము తెలిసినవారికి గణితములో పాండిత్యముండును. ప్రపంచానికి సరియగునట్టి గణితశాస్త్ర భిక్ష పెట్టినది హిందువులే. సున్నను మొట్టమొదట కనిపెట్టినది హిందువులే. ఆ సున్నయే కనిపెట్టకుండిన ప్రపంచ విజ్ఞానశాస్త్రము ఇంచుమించు సున్నగానే యుండి యుండును. తొమ్మిది అంకెల తర్వాత ఇతర జాతులవారు పదికొక అంకెను పదకొండు కొకటి యీ విధముగా ఒక్కొక్క రూపమును వ్రాయుచూ పోయిరి. ఎంతవరకని అట్లు అంకెలను సృష్టించుచు పోగలరు. అందుచేత కొన్ని జాతులవారు ౧౦౦౦ వరకు వెళ్ళేవరకు అలసిపోయిరి. కొన్ని జాతులలో లక్షకు పేరు లేదు. నేటికిని పాశ్చాత్య జాతులలో పదిలక్షలకు మిలియన్ అందురు. అటుపై వారికి కోటి, అర్బుదము, శంఖము, వంటి సంఖ్యానామములు లేనే లేవు. బాబిలోనియావారు ౧౨ నక్షత్రరాసులను కనిపెట్టిరి. ఆ ౧౨ సంఖ్యయే నేటికిని యూరోపు జాతులకు ప్రధానము. వారు

లెక్కలను ౧౨ వ ఎక్కముతో ఎక్కువగ గుణింతురు. డజన్ల మాటనే చెప్పుచుందురు. వారికి దశకము తెలియదు. (Decimal system) దశాంశ పద్ధతిని మొదలు కనిపెట్టినది హిందువులు. నేటికిని తురేనియన్ (Turanian race) జాతి డజన్లతోనే వ్యవహారాలు చేసుకొనుచుందురు. వాల్మీకి కాలములో ఏకసంఖ్య మొదలుకొని మహౌఘము వరకు సంఖ్యానామము లేర్పడియుండెను. ("కోట్యాపరార్ధైశ్చ అయో. ౧౫-౪౯) అది వారు పొందిన గణితశాస్త్ర పరమావధి. మనవారు ౪౫౦౦ ఏండ్ల క్రిందటనె మిలియన్ (౧౦ లక్షల) పేరుకంటె ఊహించజాలనట్టి అంకెల పేరులను కనిపెట్టి ముందునకు సాగిపోయిరన్న వారి ప్రజ్ఞాబలముయొక్క ఉచ్ఛ్రస్థాయి కానవచ్చుచున్నది. ఎట్లనగా నూరులక్షలు కోటి, అటుపై శంఖము, మహాశంఖము, బృందము, మహాబృందము, పద్మము, మహాపద్మము, ఖర్వము, మహాఖర్వము, సముద్రము, ఓఘము, మహౌఘము, అను సంఖ్యలను పేర్కొనిరి. (యుద్ధ. ౨౮-3౪ నుండి 3౯ వరకు) ఇట్టి గణిత విజ్ఞానమానాడే ఏర్పడినందున తర్వాత కాలములో ఆర్యభటుడు, వరాహమిహిరుడు, భాస్కరాచార్యుడు, మున్నగు గణితాచార్య శేఖరులు హిందువులలో ఉత్పత్తియైరి. వారు వ్రాసి పెట్టి పోయిన గణిత రహస్యములను పాశ్చాత్యు లిప్పుడు క్రొత్తగా పై మహోపాధ్యాయులు గతించిపోయిన ౧౫౦౦-౨౦౦౦ ఏండ్ల తర్వాత కనిపెట్టుచున్నారు! కాని గ్రీకు పండితులైన ప్రాచీన యూక్లిడ్, ఆర్కిమిడీసు పేర్లను ఎల్లప్పుడును విసుగులేకుండా పొగిడే మన ఇంగ్లీషు ప్రభుజాతికి

బానిసజాతిలోని వరాహమిహిర భాస్కరాచార్యాదులు ఎన్నడును కానరారు! శుల్బసూత్రాలను యెత్తుకోనరు! అయితే సున్నను ప్రాచీనమందు కనిపెట్టలేదు. క్రీ. శ. 300 తర్వాతనే సున్న హిందువులచే మొదటిసారి కనిపెట్టబడెనని చరిత్రకారులన్నారు. (చూ. National History of Indian people Vol. VI. P. 413)

రామాయణములో చాతుర్వర్ణ్యముల వర్ణనము పలుతావులలో కలదు. "శూద్రాఃసర్వధర్మనిరతాః"(బా.౬-౧౯) అని ఆదిలోనే కలదు. ఈ గ్రంథమందు రామకాలమని నిర్ణయించిన క్రీ. పూ. ౨౫౦౦ ప్రాంతమందు బుద్ధభగవానుని కాలమందు ఘనీభవించిన జన్మప్రాముఖ్యముకల నాలుగు వర్ణములుండెనా? అందు శూద్రజాతి యుండెనా? శూద్ర చర్చకల భాగాలు ప్రక్షిప్తమనవలెనా? అనునవి చర్చనీయములు. వేదములలో ఋగ్వేదమే సంపూర్ణ ప్రామాణిక గ్రంథము. తర్వాతివాటిలో అర్వాచీనత్వము, ఖిలత్వము, ప్రక్షిప్తము, అను విషయాలు కలవని అనేకులు విమర్శించిరి. ఋగ్వేదమంతటను త్రైవర్ణికులే వర్ణితులు. వారికన్న తక్కువగా భావింపబడినవారు దస్యులు. వారార్యుల పొరుగు భూములవారై శత్రువులై జితులై యుండినట్టివారు. అందుచేత దస్యుశబ్దమునకు "దాస" (బానిస) అనియు, దొంగ అనియు అర్థమిచ్చిరి. అవి ద్వేషమువలన కల్పితమైన యర్థములు. పరాజితులను బానిసలుగా నేలుట సర్వప్రపంచమందాచారముగనుండెను. అట్లున్నను దస్యులతో త్రైవర్ణికులు బాంధవ్యముచేసిరి. కవష ఐలూషుడు దస్యుజాతిని ఋషి

యయ్యెను. ఋగ్వేదమంత్రద్రష్ట యయ్యెను. దస్యులు అను వారేదహ్యులు. వారు హిందూకుష్ పర్వత పశ్చిమవాసులు. ఫార్సీలో సకారము హకారమగుటచేత దస్య-దహ్యా శబ్దములు రెండునొక్కటే!

అయితే శూద్రశబ్దము ఋగ్వేదములో లేదాయనిన కలదు. ఒకేచోటకలదు. అది పదవ మండలమున పురుష సూక్తమున కలదు. అంతపెద్ద ఋగ్వేదములో అందును తుదిలో, అందును ఒకేఒక్కమారే శూద్రశబ్దము కనబడుట యేల? అది తర్వాతచేర్చబడిన సూక్తమనవలెనా? నాలుగు వర్ణాలకు జన్మప్రాధాన్యము కలిగిన తర్వాత ఋగ్వేదములో ప్రవేశింపబడియుండునా. అనుసందేహము విమర్శకులకు కలిగినది. ఏ. నందీగారు ఇండియన్ ఎత్నాలజీలో ఇట్లు వ్రాసినారు "పురుషసూక్తము తర్వాతికాలములో దూర్చబడినది" (interpolation) యూరోపు ఖండ వేదవిమర్శకు లందరును నీ విషయమున నేకాభిప్రాయులు. కారణమేమనగా ఋగ్వేదములోని భాషతో నీ సూక్తభాష భిన్నించినది. "దీనిస్వరూపములో, శబ్దజాలములో ఇది అర్వాచీనమైనది. ఇందు పూర్తిగా యజ్ఞవిధాన వర్ణనమున్నది. ఇందు వేదాంత పారిభాషిక పదాలున్నవి. ఇందు వసంత గ్రీష్మ శరదృతువులు ముందువరుసగా వర్ణితములు. నాలుగు వర్ణాల ముచ్చట కల్ల దిదొక్కటే యొక్కటి. దీని యర్వాచీనత్వము దీని భాషయే పట్టించును. నిదాఘమును తెలుపు గ్రీష్మ పదము ఋగ్వేదమందెందును ప్రయుక్తము కాలేదు. వసంత పదము [illegible] ఋగ్వేదములో అది

మరొక్కమారే, అదియు పదవమండలములోనే (౧౬౮-౮) వచ్చినది" అని మోక్షమూలుడు నిర్ణయించెను.

గ్రేస్‌గారును ఇట్లేయన్నారు "నాలుగు వర్ణముల మంత్రాలు చాలా ఇటీవలివే. ఈమంత్రాలభాష అవైదికము. ఇవే పురాణములోనైన నుండిన నందివి బాగుగా అతికి పోయెడివి. మరియు సందర్భరహితముగా ఈ మంత్రాలిరికి నవి. ఎట్లన "బ్రాహ్మణోస్య ముఖమాసీత్ ... ...పద్భ్యాం శూద్రోஉజాయత" అనిన వెంటనే అదే ఊపులోనే ఇం ద్రాగ్నులు విరాట్పురుషముఖమునుండి, భూమిపాదమునుం డియు జనించె నన్నారు." (సెన్సస్ రిపోర్టు ౧౯౭౧ సం ౧. పు. ౨-3౦) రమేశచంద్రదత్తుగారు పదవమండల మంతయు తర్వాతికాలమున అతికించినదే అని భావించినారు. వా రనేక యుపపత్తులతో నిరూపించి మరల నిట్లన్నారు. "పదవ మండలములో బహు ఋక్కులకు కర్తలు దేవతలట! ఇదొ క్కటే ప్రక్షిప్తకారుల దొంగతనమును పట్టించును. (ఏన్ షంట్ ఇండియా పు. 3౬) కోల్బ్రూకు ఇట్లే నిర్ణయించెను. "ఇతర సూక్తాలు మోటుగాను ఈ సూక్తము శ్రావ్యము గాను రచించుట దీని అర్వాచీనత్వమును పట్టించును." అని యనెను. వెబర్, మ్యూర్, మరి యితరులందరును ఈ సూక్త మాధునికమనియే తేల్చిరి".

ఋగ్వేదమందుగూడ స్వార్థులు హస్తక్షేపము చేసిన ఇక యేదిదిక్కు? కంచెయే చేనిమేసిన యెట్లు? ఈ చర్చ

యట్లుండదనిండు. శూద్రపదమునకు చారిత్రకాధార మేమో కనుగొండము. శూద్రులు కాళ్లలో పుట్టినవారుకారు. ప్రాచీనకాలమందు ఆర్యులు సింధూదేశములోనికి ప్రవేశించిననాడు అచ్చట నుండిన ఆదిమనివాసులగు "శూద్రులు" అను జనులతో అతిఘోరముగా పోరాడవలసి వచ్చెను. ఆ శూద్రవర్గమువారు మహావీరులు. కాని యార్యులవద్ద మేలైన యాయుధాలుండెను. తుదకు శూద్రులోడి బానిసలైరి. అందుచేతనే మనుస్మృత్యాదులలో శూద్రులకుహక్కు లేకుండుట. వారెల్లప్పటికి త్రైవర్ణికుల సేవచేయుట, వారు సంపాదించిన దంతయు బ్రాహ్మణాదులకు చెందుట, వారు పై వారితో సింహాసనమందు కూర్చునిన పిర్రలుకోయుట, పద్యూహవాయపతత్ శ్మశానో శూద్రః అనుట, శూద్రాయ మతింనదద్యాత్ అనుట, వేదముచ్చరించిన జిహ్వోచ్ఛేదం కారయేత్ అనుట, వేదవాదమువినిన త్రపుజతుభ్యాం కర్ణాని పూరయేత్ అనుట, ఇవన్నియు సంపూర్ణముగా బానిసల లక్షణాలే కాని ఏదోకొంతమైన స్వేచ్ఛగల జాతిలక్షణాలు కానేకావుకదా! అయితే శూద్రులు కైబరు కనుమలవద్ద నుండిరనుట కేమి ప్రమాణము? అలెగ్జాండరు దాడిచేసినపుడతనితో యుద్ధముచేసిన వీరజాతులలో "క్షుద్రక" అను వర్గమొకటి. దానినే గ్రీకులు (oxydrakai) అక్సిుద్రకై అనిరి. మరికొందరు వారిని శద్రీ (Sadrae) అనిరి. మరికొందరు గ్రీకు చరిత్రకారులు వారిని హైద్రకీ (Hydrakes) అనిరి. జీలం రావి నదులమధ్య నుండిన అలెగ్జాండరు కాలపు వీరజాతి పేరు [illegible] (Malloi). రావి సట్లెజ్ నదులమధ్య నుం

డిన వీరజాతిపేరు అక్షుద్రకీ (oxydrakai). ఈ రెండు జాతులును ఏకజాతులనియు, మహాశూరులనియు, అలెగ్జాండరు సైన్యాన్ని ప్రతిఘటించిన వీరజాతియనియు గ్రీకు చరిత్రకారులు వ్రాసిరి. అలెగ్జాండరుకన్న ముందు ఇంచుమించు అతనికి వేయియేండ్లకు ముందు పై క్షుద్రక వీరజాతి ఆర్యులతో నిరంతరము తమయొక్కయు తమ యాదినివాసము యొక్కయు స్వాతంత్ర్యమునకై పోరాడి తుదకోడియుండురు. అలెగ్జాండరు మల్లాయిలను క్షుద్రకులను ఓడించి వారినెట్లు వరుసబెట్టి చంపించెనో గెలిచిన ప్రాచీనార్యులును క్షుద్రకులను ఘోరముగా బాధించియుందురు. తుదకు వారిని బానిసలుగా చేసిరి. వారినినాల్గవవర్ణముగా తమసేవకులనుగానేర్పాటుచేసుకొనిరి. పర్షియా ప్రాంతపు ప్రాచీన దహ్యా (Dahae) (దస్యు) జాతినెట్లుగెలిచి బానిసలుగాచేసి యుండిరో సింధునదీ ప్రాంతాలలోని క్షుద్రకులను తర్వాతికాలములో గెలిచి బానిసలుగా చేసికొనిరనిన సత్యదూరము కానేరదు. క్షుద్రకులే తర్వాతి శాస్త్రపురాణాలలోని శూద్రక, శూద్రజాతివారైరని తలతును. తర్వాత యార్యులు గంగాప్రాంతము, వింధ్యప్రాంతము, దక్షిణాపథము, వంగప్రాంతమును ఆక్రమించుకొనినప్పు డక్కడి కార్మికవర్గములను తమకు పసందుకానివారిని, తమ్మెదిరించినవారిని, తమ యాచారములను స్వీకరింపనివారిని శూద్రజాతిలో చేర్చినట్లూహింతును. ఈశూద్రచర్చయంతయు నాయూహాయే. తప్పొఒప్పొ తోచినది వ్రాయనైనది.

రాముని కాలమందలి ఆశ్రమజీవనమును గురించి విపులముగా వ్రాయవలసిన అవసరము కానవచ్చుచున్నది. అయినను విషయవిస్తరము ఇప్పటికే ఏర్పడిపోయినది. అందుచేత దానిని వదలినాను. అభిలాషులు అత్రి భరద్వాజాగస్త్య మహర్షుల సంబంధమగు భాగములను చదివిన విశదమగును.

ఆర్యావర్తమేది ? అను విషయము చర్చనీయ మగుచున్నది. "వాల్మీకి భూగోళము" అను ప్రకరణమును వేరుగా వ్రాయుచున్నాను. అందీచర్చ చేయుదును. అతి ప్రాచీన కాలములో అనగా ఋగ్వేదకాలములో ఆర్యావర్తము ఇప్పటి భారతదేశ మనబడు భూభాగమందే లేకుండెనని నా కనుమానము కలుగుచున్నది. రామాయణ కాలమువరకు అయోధ్యయే ఆర్యావర్తానికి తూర్పుహద్దనియు, గంగయే దక్షిణపుహద్దనియు నేనభిప్రాయపడు చున్నాను. ఈ విషయములో సనాతనపండితులు వివాదపడుదురని నే నెరుగుదును. అయినను నాకుతోచిన అభిప్రాయమును ముందు వెల్లడింతును. రాముని కాలములో ఆర్యులు తమ సంస్కృతిని గంగకు దక్షిణభాగమందు వ్యాపింపజేయు నుద్దేశముతో భరద్వాజుడు, అత్రి, అగస్త్యుడు మున్నగు ఋషులు దక్షిణ భాగమందు అందందు ఆశ్రమములను స్థాపించుకొని ఆర్యమత సంస్కృతులను వ్యాపింపజేయు నభిమానము కలవారై యుండిరని తోచుచున్నది (ఇట్లు కానవచ్చుచున్నది). రాక్షసులచేత ఆవరింపబడిన జనస్థానములో ప్రాణములకు తెగించి అంతటి పట్టుదలతో [illegible] ఆశ్రమజీవనమును ఈ మునులు గడుప [illegible] అవసరము కానరాదు. ఆర్యుల [illegible]

(Colonisation) వీరు నాందీభూతులై యుండిరి. దక్షిణా పథమందు అదేపనిగా దుష్టులను శిక్షించి నిర్మూలించుటకై అగస్త్యుడు వెళ్ళెనని రామాయణమందు స్పష్టముగా తెలిపినారు.

> నిగ్రిహీతా జీవలోకస్య తపసా భావితాత్మనా
> అగస్త్యేన దురాధర్షా మునినా దక్షిణేవ దిక్. —యుద్ధ ౧౧౮-౧౪

ఈవిధముగా రామాయణకాలమందు సాంఘికాద్యాచార వ్యవహారములు వర్తించుచుండెనని తెలుసుకొనగలుగుచున్నాము. ఇంతదూరము వ్రాసినను ఇదంతయు సంగ్రహ విషయమే అని చెప్పవలసియున్నది. సూక్ష్మముగా తరచు కొలది ఇంకను అనేకాంశములు పరిశోధకుల దృష్టికి వచ్చుచుండును.

# ౭

## రాజనీతి

రామాయణమందు రెండు విధములగు నీతులుగలవు. సాధారణనీతి, రాజనీతి. హితోపదేశము చేయునట్టి నీతియె కాక, రాజులు రాజ్యాంగము నడుపుటలో ప్రత్యేకముగా నడుచుకొనవలసిన పద్ధతియు ఇందు పలుతావుల తెలుపబడి యున్నది. మొదట రాజనీతిని గురించి తెలిపి తర్వాత ధర్మనీతులను గురించి కొంత సూచింతును.

పూర్వము నుండియు హిందువులలో రాజును గౌరవించు పద్ధతి యుండెను. రాజుకు విష్ణ్వంశ కలదని హిందువులు విశ్వసించిరి. అయితే అది అంధ విశ్వాసముకాదు. హిందూ రాజనీతిలో రాజు నిరంకుశుడగుటకు వీలులేదు. అతడు ప్రజాభిప్రాయమునకు వశవర్తుడై యుండవలెను. అతడు ధర్మమును సక్రమముగా పరిపాలించవలెను. అతడు దుష్టుడైనచో ప్రజలు అతనిని తొలగించుచుండిరి. బుద్ధుని కాలానికి పూర్వమందే భారతదేశములో వైరాజ్యములు (Republics) వెలసియుండెను. ఈ సంగతులను దృష్టియందుంచుకొని రామాయణ కాలమందలి రాజనీతి యెట్టిదో [illegible]దము.

[illegible] రాజులు తాము పాలించిన రాజ్యములోని [illegible] యుండిరని చెప్పుకొనుటలో గర్వించు [illegible] సుఖులై నీతి [illegible]

తస్మిన్ పురవరే హృష్టాధర్మాత్మానో బహుశ్రుతా:
నరాస్తుష్టా ధనై: స్వై: స్వైరలుబ్ధా: సత్యవాదిన:
కామీ వానకదర్యోవా నృశంస: పురుష: క్వచిత్
ద్రష్టుం శక్య మయోధ్యాయాం నా విద్వాన్ నచనాస్తిక:
సర్వేనరాశ్చ నార్యశ్చ ధర్మశీలా: సుసంయుతా:
ఉదితా: శీలవృత్తాభ్యాం మహర్షయ ఇవామలా:

ఈ విషయములో వివరములకై బాలకాండ షష్ఠ సర్గమంతయు చదువవలెను.

అయితే ఇదంతా కవి కపోలకల్పితమని యనవచ్చును. ఇంచుమించు అదేకాలములో నుండిన అశ్వపతి కైకేయ వృత్తాంతమునుగూర్చి ఛాందోగ్యోపనిషత్తులో(౫,౧౧,౫లో) ఇట్లు వ్రాసియున్నారు. ప్రాచీన శాలాదులు ఉద్దాలక ఆరుణి పురస్సరులై వైశ్వానరమునుగూర్చి తెలుసుకొనుటకై అశ్వపతి కైకేయ అను రాజునొద్దకు వెళ్లిరి. రాజు వారికి కానుకలర్పించుకొనగా వారంగీకరించుటకు నిరాకరించిరి. తనలో ఏదో లోపమున్నదని వారట్లు సంకోచించిరేమో యని సంశయించి అశ్వపతి వారితో ఇట్లు మనవిచేసుకొనెను.

"నమేస్తేనోజనపదే, నకదర్యో, నమద్యపో, నానాహితాగ్ని:, నా విద్వాన్, నస్వైరీ, నస్వైరిణీ కుతో"

నా రాజ్యములో దొంగలులేరు. పిసినిగొట్టులులేరు, మద్యపాయులులేరు, అగ్నిహోత్రము చేయనివారులేరు, చదువురానివారులేరు, స్త్రీ పురుషులందు వ్యభిచారు లొక్కరునులేరు.

ఇది కట్టుకథయందురేమో? అయితే క్రీ. పూ. 300 ఏండ్ల ప్రాంతమందు గ్రీకులు, రోమనులు, ఏమనార్రో వినుడు. స్ట్రాబో యిట్లనెను "హిందువులు సత్యనిరతులు. వారి యిండ్లకు తాళాలువేయరు. వారి వ్యవహారాలకు పత్రాలవసరములేదు." అర్రియన్ ఇట్లన్నారు "అబద్ధమాడు హిందువు కానరాలేదు." మెగస్తనీసు ఇట్లనెను "హిందువులలో అబద్ధమాడువారు, తస్కరులు, వ్యభిచారులులేరు." ఇదికూడా కల్లయందురా? అయితే మరల వినుడు. క్రీ. శ. ౧౨౦౦ ప్రాంతపు షంషొద్దీన్ అబూఅబ్దుల్లా అను అరబిట్లువ్రాసెను. "హిందువులు హింసచేయరు. మోసముచేయరు. వారికి మృత్యుభయములేదు" ఇదికూడా అబద్ధమందురా? ఇక సర్వంకల్ల సాగరంకల్ల అనువారితో మాకు ప్రసక్తిలేదు.

ప్రజల కేది హితమో దానిని రాజులు ముఖ్యముగా ఆచరించవలెనని బాలుడగు రామునికి విశ్వామిత్రుడు బోధించెను.

నృశంస మనృశంసంవా ప్రజారక్షణ కారణాత్
పాపనంవా సదోషంవా కర్తవ్యం రక్షతా సతా.

—బాల, ౨౫-౧౮.

'మంచిరాజు ప్రజల రక్షించు నిమిత్తమై క్రూరము కాని, అక్రూరము కాని, పాపము కాని అపవాదము వచ్చునది [illegible] కాని అవశ్యము చేయవలెను.

విశ్వామిత్రుడు రాజుగా నుండగా వసిష్ఠుని చూడ బోయెను. వసిష్ఠు డతని నిట్లు మొట్టమొదటి ప్రశ్నగా విచారించెను.

"రాజా, నీకు క్షేమమా? ధర్మమార్గమున చరించి ప్రజల రంజించి ధార్మికుడవై రాజవృత్తముచే పరిపాలించుచున్నావుకదా." (బాల. ౫౨-౭)

రాజవృత్తమునుగురించి పూర్వీకులిట్లు నిర్వచించినారు.

న్యాయే నార్జన మర్థస్య వర్ధనం పాలనం తథా,
సత్పాత్రే ప్రతిపత్తిశ్చ రాజవృత్తం చతుర్విధం.

న్యాయముగా ధనము సంపాదించుట, దానిని వృద్ధి పొందించుట, రక్షించుట, సత్పాత్రమున కొసంగుట, ఇవి రాజవృత్త మనబడును.

వసిష్ఠు డింకను విశ్వామిత్రు నిట్లు విచారించెను. "నీ భృత్యులను నీవు సరిగా పోషించుచున్నావా? వారు నీ ఆజ్ఞలను సరిగా పాలింతురా? నీ శత్రువుల నందరిని గెలిచినావుకదా? నీ సైన్యబలము మొక్కపోనిదిగా ఉన్నది కదా? నీ ధనకోశము లోపము లేనిదికదా, నీ మిత్రవర్గము బలీయముగా నున్నదికదా." ఈ విధముగా ఆకాలమందు రాజులను విచారించుట పరిపాటియై యుండెను.

దశరథుడు రామునికి యౌవరాజ్య పట్టాభిషేకము సేయ దలపెట్టెను. కాని ప్రజల అనుమతిని అతడు ముందుగా

కోరెను. సామంతరాజులను నగరప్రముఖులను పల్లె పెద్దలను అందరిని పిలిపించి వారి అనుమతిని అర్థించుచు (అయో. ౧-౪౧) వారితో నిట్లనెను.

"అయ్యలారా, మా పెద్దలు ప్రజలను తమకుమారుల వలె చూచుకొనుచు పరిపాలించినది మీ రెరుగుదురుకదా. నేనును పూర్వులజాడలలో యథాశక్తి నడిచినాను. నేను వృద్ధుడనైనాను. రాముడు నాకన్న శ్రేష్ఠుడు. అతనిని యువ రాజుగా చేయదలచితిని.

యదిదం మేఽనురూపార్థం మయా సాధు సుమంత్రితం,
భవంతో మేఽనుమన్యంతాం కథం వా కరవాణ్యహం.

అయో. ౨-౧౫

నా ఆలోచన సరియైనదేనా ? నే నేమి చేయవలెను ? నాకు సెలవియ్యగలరా ?" ఈ మాటలను విని ప్రజ లేక వాక్యముగా మాకు రామపట్టాభిషేకము సమ్మతమే అని పలికిరి. దశరథుడు మరల ఇట్లనెను. "నేను బాగుగా పరిపాలించుచున్నా ననుకొందును. నాలో ఏ లోపము లున్నవని నన్ను కాదని ఇంకొకరిని రాజుగా చేసుకొనుచున్నారు" అని ప్రజల నడిగెను. వా రప్పుడు రాముని ఉత్తమోత్తమ గుణములను వర్ణించి చెప్పిరి.

రాముడు రాజు కాబోవుచున్నాడు ; అతివృద్ధుడైన దశరథుడు తన యనుభవమును బట్టి రాముడు ఎట్లు రాజ్యము చేయవలెనో బోధించెను. "రామా, సప్తవ్యసనము లందెప్పుడును లగ్నుడవు కావలదు.

"అమాత్యప్రభృతిః సర్వాః ప్రకృతీః అనురంజయన్,"

ఆయో. ౩-౪౪

మంత్రులను గౌరవలుకొని సర్వప్రజలను సంతోషపెట్టుము.

కోష్ఠాగారాయుధాగారైః కృత్వా సన్నిచయాన్ బహూన్
తుష్టానురక్తప్రకృతిర్యః పాలయతి మేదినీం
తస్య నందంతి మిత్రాణి, లబ్ధ్వామృత మివామరాః.

ఆయో. ౩-౪౫

కోశాలను, ఆయుధములను, కోశములను, బాగుగా సమకూర్చుకొని ప్రజలను బాగుగా సంతోషపెట్టి యే రాజు పాలించునో అతని మిత్రులు అమృతము పొందిన దేవతల వలె ఆనందింతురు."

రాముడు వనవాసమునకు పోవలసివచ్చునని విని లక్ష్మణు డతనితో నిట్లనెను. "ఆర్యా, రాజు తమ ప్రజలను పుత్రులవలె కాపాడి పూర్వరాజర్షులవలె వృద్ధులైన తర్వాత వానప్రస్థాశ్రమములో చేరవలెను. తమ కుమారులకు రాజ్యమప్పగించి పోవలెను." రామాయణములో అడుగడుగునకు ప్రజలను పుత్రులవలె పాలించవలెనని తెలిపినారు. రాజా విధముగా ప్రజలను ప్రేమించకుండిన అతడు కటికవాడుగాను ప్రజలు పశువులుగాను ఉందురని (సౌనికే పశవో యథా— అయో. ౪౮-౨౮) రామాయణమే బోధించినది.

దశరథుడు చనిపోయినప్పుడు అతని నల్వురు కుమారులలో ఇద్దరు వనవాసమందును ఇద్దరు మాతామహి గృహ

మాంగును ఉంచిరి. రాజు లేకుండిన దేశ మరాజక మగు ననియు దానివలన సంక్రింది నష్టములు కలుగుననియు అయోధ్యలోని పెద్దలు పలికిరి. "రాజులేని రాజ్యము నాశన మగును. దొంగలు ఎక్కువగుదురు. వారి భయముచే రైతులు పంటలు పండించరు. శిక్షించువాడు లేనందున తండ్రిమాట కొడుకుగాని, మగనిమాట భార్యకాని వినరు. దేశములో ధనసంపద యుండదు. స్త్రీ పురుషులలో నీతి వర్తన ముండదు. సత్యము పూర్తిగా దేశమందు మాయ మగును. ప్రజలు తమ సభలను చేసికొనరు. ఉద్యానములు దేవాలయములు నిర్మించువారే యుండరు. యజ్ఞయాగా లెవ్వరును సేయరు. స్త్రీలకు దుర్మార్గులనుండి భయోత్పాత ములు కలుగును. వర్తకులు బాటదొంగల భయముచే వ్యాపారాలు సేయరు. విజ్ఞానము వృద్ధికాదు. ప్రజలు మత్స్య న్యాయముచే పరస్పరపీడకు లగుదురు. నాస్తికులు ప్రబ లుదురు."

(అరాజకమగు దేశమందలి ప్రజల కష్టనష్టములను గురించి తెలుసుకొనుటకు అయోధ్యాకాండలోని ౬౭ సర్గను సాంతముగా చదువవలెను.)

రామాయణ కాలములో రాజులు ప్రజలనుండి వారి ఆదాయములో ఆరవభాగమును పన్నుగా గ్రహించుచుండిరి. (బలిషడ్భాగం:—అయో. ౭౫-౨౫) ఉత్తమ రాజనీతిని తెలుసుకొనగోరిన, పైన రాముడు అరణ్యమం దుండినప్పుడు భరతుడు ధాగా అతనికి బోధించిన విషయములను గమనింప

వలెను. (ఈ సందర్భములో అయోధ్యాకాండ ౧౦౦-వ సర్గ సాంతముగా చదువవలెను.) రాముడిట్లనుచున్నాడు. "శూరు లును జితేంద్రియులును విద్వాంసులును కులీనులును ఇంగిత జ్ఞులును నగు వారిని రాజు మంత్రులుగ నియోగించవలెను. మంత్రాలోచన ఇతరులకు తెలియకుండునట్లుగా చూచు కొనవలె. ఉత్తమభృత్యులను ఏర్పాటు చేసుకొనవలెను. ప్రజలను రాజు కఠినముగా శిక్షించగూడదు. ప్రజలు భరింప రాని పన్నులను విధింపగూడదు. శూరులను సమ్మానించి చేరదీయవలెను. భృత్యులకు సైనికులకు సకాలములో జీత ముల నియ్యవలెను. చారులద్వారా ౧౮ విధములగు అధి కారవర్గమును అనగా పురోహితులు, సేనాపతి, కోశాధిపతి, నగరాధ్యక్షులు, దండపాలురు, దుర్గపాలురు, ధర్మాధికారులు, కర్మాంతికులు మున్నగువారు తమ తమ కార్యములను చక్కగా నిర్వర్తించుచున్నారా లేదా యని విచారించుకొను చుండవలెను. గ్రామములవృద్ధి, తటాకాది నిర్మాణములచే సస్యవృద్ధి, పశుసంపద, చోరభయరాహిత్యము, కలుగునట్లుగా రాజు పాలింపవలెను. ప్రతిదినము ఉదయముననే రాజు ప్రజలకు దర్శన మియ్యవలెను. సైన్యమున కవసరమగు ఏనుగులను, గుఱ్ఱములను సమకూర్చుకొనవలెను. కోటలలో ధనధాన్యములను ఆయుధములను యంత్రములను ఉంచవలెను. ఆదాయము ఎక్కువగా నుండినను వ్యయముమాత్రము స్వల్ప ముగా చేయవలెను. న్యాయమును నిష్పక్షపాతముతో భాగ్య వంతులకును దరిద్రులకును ఒకేవిధముగా ప్రసాదించవలెను.

... ... ... ... ... ... ... ... ... ... ...."

"ఏరాజు ప్రజలవద్ద ఆరవభాగము పన్ను తీసుకొని వారిని తన కుమారులవలె రక్షించడో అతడు అధికమైన అధర్మము చేసిన వాడగును." (అర. ౬-౧౧) అని మునులు రామునికి బోధించిరి.

శూర్పణఖ రావణుని చెల్లెలు. స్వైరకామిని. తత్ఫలితముగా ముక్కు చెవులను బోగొట్టుకొనెను. స్వార్థముతోనైనను సరే, మరే కారణముతోనైనను సరే, శూర్పణఖ రావణుని నిందించెను. అతడు రాజధర్మము సరిగానిర్వర్తించ లేదని కఠినముగా పలికెను. ఆమె చెప్పిన రాజనీతి అది రాక్షసులదే యైనను ఉత్తమ రాజనీతియై యున్నది. ఆమె రావణునితో ఇట్లనెను. "నీవు గ్రామ్యస్వైర కామభోగము లందు ప్రమత్తుడవై నిరంకుశుడవై యున్నావు. ఇట్టి రాజును ప్రజలు శ్మశానమును చూచినట్లుగా చూచి దూరముగా తొలగిపోదురు. స్వయముగా సకాలములో చేయవలసిన విధులను ఏ రాజు నెరవేర్పడో అతని రాజ్యము నాశనమగును. తగని కార్యముల చేయునట్టివాడును, ప్రజలకు దర్శన మియ్యనివాడును పరవశుడైనవాడును అగు రాజును జూచి ప్రజలు దూరముగా తొలగిపోదురు.................. క్రూరుడును, లుబ్ధుడును, గర్వితుడును, శఠుడును, వ్యసనాసక్తుడును నగు రాజును ప్రజలు గౌరవింపరు."

—(అర. 33-3, ౪, ౫, ౬, ౧౫, ౧౬)

సుగ్రీవుడు తన వాగ్దానప్రకారము ఆచరించ లేదని లక్ష్మణుడు క్రుద్ధుడై అతనితో ఇట్లనెను. "బలవంతుడును,

కులీనుడును, ఉత్తరక్షకుడును, జితేంద్రియుడును, కృతజ్ఞుడును, సత్యవాదియు నగు రాజు లోకమందు పూజ్యుడగును. అధర్ముడును, అసత్యవాదియు, కృతఘ్నుడును, అగు రాజుకన్న నీచుడు మరిలేడు.'' —(కిష్కి. ౩౪–౭, ౮)

సీత రావణునితో ఇట్లనెను. ''తెలివిలేనివాడును, నీతిహీనుడును నగు రాజుయొక్క సమృద్ధమైన రాష్ట్రములు కూడ నశించును.'' —(సుంద. ౨౧–౧౧)

రాక్షసులను వదలి వారి శత్రువుల దగు రామవర్గమును ఆశ్రయించిన విభీషణుని ఇంద్రజిత్తు నిందించు వాక్యములు చాలా ఉత్తమరాజనీతితో కూడినట్టివి.

శోచ్య స్త్వ మసి దుర్బుద్ధే నిందనీయశ్చ సాధుభి:
య స్త్వం స్వజన ముత్సృజ్య పరభృత్యత్వ మాగత:
నైతచ్ఛిథిలయా బుద్ధ్యా త్వం వేత్సి మహదంతరం
క్వచ స్వజనసంవాస: క్వచ నీచపరాశ్రయ:
గుణవాన్ వా పరజన స్స్వజనో నిర్గుణోపివా
నిర్గుణ స్స్వజన శ్శ్రేయాన్ య: పర: పరఏవ స:
య స్స్వపక్షం పరిత్యజ్య పరపక్షం నిషేవతే
స స్వపక్షే క్షయం ప్రాప్తే పశ్చా త్తై రేవ హన్యతే.
—యుద్ధ. ౮౭–౧౩, ౧౪, ౧౫, ౧౬.

''దుర్బుద్ధీ! నీవు స్వజనమునువదలి పరులకు భృత్యుడవైతివి. దీనిని పెద్దలు నిందింతురు. స్వజనులలో నివసించుట మంచిదా, లేక పరుల నాశ్రయించి నీచుడై బ్రదుకుట మంచిదా? పరులు గుణవంతులే అగుదురుగాక, స్వజనులు

గుణహీను లగుదురుగాక. గుణహీనులైనను స్వజనులే శ్రేయస్కరులు, పరులు పరులేకాని తన వారెన్నటికిని కారు. ఎవడు తనవారిని పరిత్యజించి పరపక్షములో చేరి వారిని సేవించుచుండునో వాడు తన పక్షము నాశనమైన తర్వాత పరులచేత తానుగూడ నాశనము పొందును.”

హిందూస్థాన చరిత్రలో గ్రీకుదండయాత్ర నాటినుండి నేటివరకు అడుగడుగునకు దేశద్రోహులే కానవచ్చుచున్నారు. మనకు పై శ్లోకాలు నిత్యమననార్హములు.

ఇంతకుముందు శూర్పణఖ యొక్కయు ఇంద్రజిత్తు యొక్కయు రాజనీతి పరిజ్ఞానమును వెల్లడించినాను. రాక్షసుల నీతికి ఆర్యుల నీతికి భేదములేదు. వాల్మీకి అందరినోటను ఒకేవిధమగు రాజనీతిని ప్రకటించినాడు. కుంభకర్ణుడుకూడ తన యన్నయగు రావణునికి అతని యవసానదశలో మంచి రాజనీతిని ఈ విధముగా బోధించెను. “హితుల మాటలు వినకపోవుట దోషహేతువు. పాపకర్మములు నరకపాతము కలిగించును. ఏ రాజు ముందు చేయవలసిన కార్యములను వెనుక, వెనుక చేయవలసిన వాటిని ముందు చేయుచుండునో అతడు నయానయములను తెలియనివాడు. దేశకాల విరుద్ధములగు కార్యములు నాశనము చెందును. ఏ రాజు మంత్రులతో బాగా ఆలోచించి ఉత్తమ మధ్యమాధమ కార్యముల లక్షణములనెరిగి పురుషద్రవ్యసంపత్తు, దేశకాల విభాగము, వినిపాత ప్రతీకారము, కార్యసిద్ధి, కార్యారంభోపాయము అనే అయిదువిధాల నెరిగియుండునో అతడు కార్యసిద్ధి

పొందును. రాజు ధర్మార్థకామముల సద్వినియోగము నెరిగి యుండవలెను. పశువులవంటి బుద్ధిగలవారిని సభలో ఆలోచనకై చేర్చుకొనినవారు వట్టి ప్రగల్భాలు ప్రకటించుచుందురు. అర్థశాస్త్రము తెలియనివారితో ఆలోచింపగూడదు. శత్రువులవద్ద లంచములు గొన్నవారిని ఎరిగి రాజు అట్టివారిని పరిహరించవలెను." (యుద్ధ. ౬౩-౩ నుండి ౧౮ వరకు)

రామాయణకాలమందు రాజ్యస్థిరత్వమునకు, అభివృద్ధికి, శత్రువులనుండి బాగా రక్షణచేసికొనుటకు రాజులు మంచి వ్యవస్థను ఏర్పాటు చేసియుండిరి. ప్రజాపాలనమునకుగాను ౧౮ విధములగు అధికారవర్గమును ఏర్పాటు చేసియుండిరి. వారిని "తీర్థములు" అని వ్యవహరించిరి.

కచ్చి దష్టాదశాన్యేషు స్వపక్షే దశ పంచచ
త్రిభి స్త్రిభి రవిజ్ఞాతై ర్వేత్సి తీర్థాని చారకైః.

—అయో. ౧౦౦-౩౬

ఈ ౧౮ తీర్థా లేవనగా: (౧) మంత్రులు, (౨) పురోహితులు, (౩) యువరాజు, (౪) సేనాపతి, (౫) దౌవారికులు, (౬) అంతర్వంశికులు, (౭) కారాగారాధికారులు, (౮) కోశాధ్యక్షులు, (౯) కార్య నియోజకులు, (౧౦) ప్రాడ్వివాకులు (Judges), (౧౧) సేనానాయకులు, (౧౨) నగరాధ్యక్షులు (City Prefect—Kotval), (౧౩) కర్మాంతికులు, (౧౪) సభాధికృతులు, (౧౫) ధర్మాధికారులు, (౧౬) దండపాలురు (Police), (౧౭) దుర్గపాలురు; (౧౮) రాష్ట్రాంతపాలకులు.

మొదటి మూడువర్గాలు తప్ప తక్కిన అధికారులపై చారులను పెట్టి వారు అన్యాయములుకాని, రాజ దేశద్రోహములుకాని చేయకుండునట్లుగా రాజులు విచారించుకొనుచుండెడివారు.

కోటలను ఎల్లప్పుడును శత్రువులనుండి భయము లేకుండున్నట్లుగా రక్షించు ఏర్పాట్లు చేయుచుండిరి. అందు ధనము, ధాన్యము, ఉదకము, యంత్రములు, ఉంచుచుండిరి. యంత్రములను శత్రువులపై ప్రయోగించుటలో కుశలులగు శిల్పులను, బాణములను ప్రయోగించుటలో ప్రవీణులైన ధనుర్ధరులను అందు కాపుంచుచుండిరి.

(అయో. ౧౦౦-౫౩)

రాజు కుండవలసిన లక్షణములను రామాయణమందు చాలా తావులందు నిరూపించినారు. రాజు జితేంద్రియుడుగను, కామక్రోధాది వర్జితుడుగను, నిష్పాక్షికత కలవాడుగను, రాజ్యాంగవేత్తగను, ధైర్యస్థైర్యాది వీరగుణయుక్తుడుగను, ఉండవలెనని తెలిపినారు.

దశపఞ్చ చతుర్వర్గాణ సప్తవర్గం చ తత్త్వత:
అష్టవర్గం త్రివర్గంచ విద్యా స్తిస్రశ్చ రాఘవ
ఇంద్రియాణాం జయం బుద్ధ్వా షాడ్గుణ్యం దైవమానుషం
కృత్యం వింశతివర్గంచ తథా ప్రకృతిమండలం
యాత్రాదండవిధావం చ ద్వియోనీ సంధివిగ్రహా
కచ్చిదేతాన్ మహాప్రాజ్ఞ యథావ దనుమన్యసే.

(అయో. ౧౦౦-౬౮, ౬౯, ౭౦)

ఈ శ్లోకాలలో కొన్ని సాంకేతికములు తెలిపినారు. రాజనీతి బోధించునప్పుడు పురాణాలలో అందందు ఇట్టి సాంకేతికములను వాడుట పరిపాటి. మహాభారతములో విదుర నీతిలో—

"ఒకటి గాని రెంటి నిశ్చలయుక్తి చేర్చి" అనునట్టి దిట్టిదే.

పది, అయిదు, నాలుగు వర్గాలలో పది అంటే వేట, జూదము, కామము, మదము, మున్నగు వ్యసనాలని కొందరు, అసత్యలుబ్ధత్వాది దుర్గుణములని కొందరు చెప్పుదురు. పంచవర్గము లనగా అయిదు విధాల దుర్గములనియు, పంచ విధ వైరములనియు చెప్పుదురు. నాల్గువర్గాలనగా సామ దానాదులు, లేక చతుర్విధమిత్రులు, అని చెప్పుదురు. సప్తవర్గములనగా రాజు, మంత్రులు, రాష్ట్రము, కోశము, సేన, మిత్రులు అనియు, లేదా ఏడువిధములగు మిత్రులనియు, చెప్పుదురు. అష్టవర్గ మనగా కృషి వాణిజ్యదుర్గములు, సేతు బంధములు (P. W. D.) ఏనుగులను కూర్చుట, గనులను త్రవ్వుట, పన్నులు తీసికొనుట, క్రొత్తగ్రామాలను స్థాపించుట అనియు, లేదా పైశున్య సాహస ద్రోహాది దుర్గుణాలనియు, చెప్పుదురు. త్రివర్గమనగా ధర్మార్థకామము లనియు, ఉత్సాహ ప్రభుమంత్ర శక్తులనియు, లేక శత్రువుల క్షయ స్థానవృద్ధులనియు, చెప్పుదురు. "విద్యాత్రిసములు" అనగా త్రయీవార్తా దండనీతులని చెప్పుదురు. షాడ్గుణ్యం అనగా సంధి విగ్రహాది షడ్గుణములు. వింశతి వర్గమనగా బాలుడు, వృద్ధుడు, దీర్ఘరోగి, బంధు పరిత్యక్తుడు, భీరువు, లుబ్ధుడు,

కామి, దేవబ్రాహ్మణ నిందకుడు, సత్యధర్మరహితుడు మున్నగు ౨౦ విధాలవారనియు, లేదా రాజద్రోహి, వనితాపహారి,పరస్వత్వాపహారి,ధర్మదేవమిత్రాదివిరోధి, క్రూరుడు, మున్నగు దుర్మార్గులనియు చెప్పుదురు.

ఈ శ్లోకాలలోని రాజనీతి అస్పష్టముగా నున్నది. వ్యాఖ్యాతలు ఎవరికి తోచినట్లు వారు వ్యాఖ్యానించినారు. (వివరణకై పై శ్లోకాలపై వ్రాయబడిన గోవిందరాజాది వ్యాఖ్యాతల అభిప్రాయములను చూడగలరు.) రామాయణ మందలి రాజనీతి ఇంకను విపులముగా కలదు. ముఖ్యవిషయాలను మాత్రమే చూపించి వదలివేయుచున్నాను.

ఇక హితోపదేశ తుల్యమగు నైతికబోధ రామాయణ మందెట్లు నిరూపింపబడినదో సంగ్రహముగా తెలిసికొందము.

జటాయువు ఆటవికుడు. రామునకు భృత్యుడు. రావణుడు సీత నెత్తుకొని దొంగయై పోవుచుండగా అతని కెదురై అనేకనీతులు బోధించెను. "పరదారలను తాకుట నీచమైన పని. ఇతరులు గర్హించు కార్యములను బుద్ధిమంతుడు చేయరాదు. (అర. ౫౦-౭)

యథాత్మన స్తథాన్యేషాం దారా రక్ష్యా విమర్శనాత్.

అర. ౫౦-౮)

తన భార్యను పరపురుషులు అభిమర్శనము చేయకుండా ఎట్లు రక్షించుకొనవలెనో పరభార్యలను అట్లే రక్షించవలెను.

రాజా ధర్మస్య కామస్య ద్రవ్యాణాం చోత్తమో నిధిః.
(అర. ౩౦-౯).

రాజు ధర్మార్థ కామములకు మూలము. రాజు సాక్షాచరించిన జనులును అదేపని చేయుదురు. ఈ విధముగా బహునీతులను బోధించెను. (వివరములకై ఆరణ్య ౫౦ం అధ్యాయము పూర్తిగా చూడుడు) తుదకు తన స్వామిసేవలో జటాయువు రావణునితో యథాశక్తి పోరాడి ప్రాణము లర్పించెను. ఆటవికులలో ఇట్టి విశ్వాసపాత్రమగు సేవ రామాయణమందు పలుతావుల నిరూపింపబడినది.

లక్ష్మణుడు దశరథుని పై కోపించుకొని ఇట్లను చున్నాడు :

గురో రప్యవలిప్తస్య కార్యాకార్య మజానత:
ఉత్పథం ప్రతిపన్నస్య కార్యం భవతి శాసనం. అయో. ౨౧-౧౩

తండ్రియైనను యుక్తాయుక్త కార్యవిచక్షణ లేనివాడగుచో అతనిని కుమారులు దండింపవలెను. ఇదే నీతి శ్లోకము భారతమున నున్నదని లోకమాన్య తిలకుగారు తమ గీతారహస్యమందు తెలిపియున్నారు.

సగర చక్రవర్తియొక్క ధార్మికపాలనమును గురించి యొక యంశము రామాయణమందు ఒకే శ్లోకమందు సూచింపబడినది. సగరుని పెద్దకుమారుడు, అతని యనంతరము చక్రవర్తి కావలసినవాడు, యౌవనమందు పిల్లవాండ్రను సరయూనదిలోవేసి ముంచి వారి బాధల కానందించు

చుండెను. ఈ వార్త సగరునికి తెలియగా తన పుత్రుని తన రాజ్యమునుండి నిర్వాసితునిగా జేసెను.

రామాయణమందు నీతివాక్యములుగా జ్ఞాపక ముంచుకొనదగిన వాక్యములు చాలాకలవు. కొన్నింటిని మాత్రమే యందు ఉదాహరించుచున్నాను.

'అనిషిద్ధసుఖత్యాగీ పశురేవ న సంశయః' (బాల.౮) శాస్త్ర నిషిద్ధములుకాని సుఖములను వదలుకొనువాడు పశువే.

వరప్రవాసే హి వదం త్యనుత్తమం
తపోధనా స్సత్యవచో హితం నృణాం. (అయో. ౧౧-౨౯)

సత్యమే మనుష్యులకు స్వర్గలోకప్రాప్తి హేతువని ఋషులు చెప్పినారు.

''యదాయదాహి కౌసల్యా దాసీవచ్చ సఖీవచ
భార్యావ ద్భగినీవచ్చ మాతృవచ్చోపతిష్ఠతి''

దశరథుడు కౌసల్యా ప్రాశస్త్యము నిట్లు నిరూపించెను:

'ఆమె నాకు దాసివలె, సఖివలె, భార్యవలె, చెల్లెలి వలె, తల్లివలె వర్తించుకొనుచున్నది. (అయో. ౧౨-౬౮)

''సత్యం హి పరమం ధర్మం'' (అయో. ౧౪-౩)

''సత్య మేకపదం బ్రహ్మ సత్యే ధర్మః ప్రతిష్ఠితః
సత్యమేవాక్షయాంవేదా సత్యే నైవాప్యతే పరం. (అయో. ౧౪-౭)

''మృదుర్హి పరిభూయతే'' (అయో. ౨౧-౧౧)

మెత్తనగువానినే లోకులు అవమానము చేయుచుం దురు. (మెత్తనగుచోటనే గుద్దలి వాడియౌకదా–చేమకూర–సారంగధర)

"ధర్మోహి పరమో లోకే ధర్మే సత్యం ప్రతిష్ఠితం"
(అయో. ౨౧-౪౧)

"విక్లబో వీర్యహీనో య స్సదైవ మనువర్తతే
వీరా స్సంభావితాత్మానో న దైవం పర్యుపాసతే" (అయో. ౨౩-౧౭)

ఇది లక్ష్మణుని నీతి. అతడు హిందువుల కవసరమగు నీతిని బోధించుచున్నాడు. ఈ సర్గలో దైవము బలీయమా, పురుషకారము బలీయమా అను చర్చచేసినాడు. "చేతకాని వారు నా కర్మ మిట్లుంది అని ఏడ్తురు. బుద్ధిమంతులైన వీరులు దైవమును లెక్కపెట్టక పురుషప్రయత్నము తప్పక చేసితీరుదురు" అని వాదించినాడు. (ఈ చర్చకై అయోధ్యాకాండ ౨౨, ౨3 సర్గలను పూర్తిగా చదువవలెను.)

"బుద్ధియుక్తాహి పురుషా న సహంతే పరస్తవం"
(అయో. ౨౬-౨౫)

బుద్ధిమంతులు ఇతరులు తమ్ము స్తుతించిన సహింపరు.

"నహి నింబాత్ స్రవేత్ క్షౌద్రం" వేపనుండి తేనె కారదు.
(అయో. ౩౫-౧౫)

"పితౄన్ సమనుజాయంతే నరా: మాతర మంగనా:"

(అయో. 3౫-౨౮) తండ్రిపోలిక కొడుకులకు, తల్లి పోలిక బిడ్డలకు.

"ఆత్మాహి దారా స్సర్వేషాం దారసంగ్రహ వర్తినాం"

(అయో. ౩౭-౨౪)

గృహస్థులకు భార్య మగనియొక్క ఆత్మయే.

"నహి తావ దతిక్రాంతా సుకరా కావన క్రియా" (అయో. ౫౦-౯౭)

ఏ కార్యమైనా చెడినపిమ్మట సవరింప నలవికాదు.

"న పరేణాఽశితం భక్ష్యం వ్యాఘ్రః ఖాదితు మిచ్ఛతి"

(అయో. ౬౧-౧౬)

ఇతర జంతువులు తిన్న మాంసమును వ్యాఘ్రము ముట్టదు.

"గతి రేకా పతి ర్నార్యా ద్వితీయాగతి రాత్మజః
తృతీయా జ్ఞాతయో రాజం శ్చతుర్థీ నేహ విద్యతే"

(అయో. ౬౧-౨౪)

ఇది "పితా రక్షతి కౌమారే" వంటిది.

"శోకో నాశయతే ధైర్యం, శోకో నాశయతే శ్రుతం
శోకో నాశయతే సర్వం, నాస్తి శోకసమో రిపుః" (అయో. ౬౨-౧౫)

"పూర్వాపకారిణాం త్యాగే న హ్యధర్మో విధీయతే"

(అయో. ౯౬-౨౪)

ముందుగా అపకారము చేసినవారిని శిక్షించుటలో అధర్మములేదు. ఇది లక్ష్మణుని నీతి.

సత్యముయొక్క ప్రాముఖ్యమును తెలుసుకొనుటకై అయోధ్యాకాండ ౧౦౯ సర్గలో ౧౦ నుండి ౨౨ శ్లోకములను చదువవలెను.

"యద్వృత్తా స్సంతి రాజాన స్తద్వృత్తా స్సంతిహి ప్రజా:"
(అయో. ౧౦౯-౯)

. ఇది యథా రాజా తథా ప్రజా వంటిది.

"పూజనీయశ్చ మాన్యశ్చ రాజా దండధరో గురు:" (అర. ౧-౧౮)
"ధర్మా దర్థ: ప్రభవతే, ధర్మాత్ ప్రభవతే సుఖం
ధర్మేణ లభతే సర్వం, ధర్మసార మిదం జగత్." (అర. ౯-౩౦)
"పరేతకల్పాహి గతాయుషో నరా
హితం న గృహ్ణంతి సుహృద్భి రీరితం" (అర. ౪౧-౨౧)

స్నేహితుల హితమును గ్రహించనివారు చెడిన వారు. ప్రేతసమానులు.

"ఉత్సాహవంతోహి నరా న లోకే,
సీదంతి కర్మ స్వతిదుష్కరేషు." (అర. ౬౩-౧౯)

ఉత్సాహవంతులైనవారు అతిదుష్కరమగు కార్యములందుకూడా పరాజయము పొందరు.

"ఉత్సాహవంత: పురుషా నావసీదంతి కర్మసు."

(ఉత్సాహ వర్ణనమును గురించి కిష్కి. ౧-౧౨౨ నుండి ౧౨౫ వరకు చూడుడు.)

"శోచతో వ్యవసీదంతి సర్వార్థా:" (కిష్కి. ౨౮,౩౪

వ్యసనమందు లగ్నుడగు వానికి అనర్థములు కలుగును.

"నహి ధర్మార్థసిద్ధ్యర్థం పాన మేవం ప్రశస్యతే
పానా దర్థశ్చ ధర్మశ్చ కామశ్చ పరిహీయతే" (కిష్కి. ౩౩-౪౬)

మద్యపానమువలన ధర్మార్థకామములు నాశనమగును. ఇది మితపానసంఘ (Temperance) ప్రచారానికి పనికివచ్చు నీతి.

"మనోహి హేతు స్సర్వేషా మింద్రియాణాం ప్రవర్తనే"
(సుంద. ౧౧-౪౧)

మనస్సే సర్వేంద్రియ ప్రవర్తనకు హేతువు. ఇది "మనఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః" అను ఉపనిషద్వాక్యమును బోలియున్నది.

"అకామాః కామయానస్య శరీర ముపతప్యతే" (సుంద. ౨౨-౪౨)

కోపము ఉండకూడదు. దానివలన నష్టములను గురించి సుందరకాండ ౫౫ సర్గలో ౪, ౫, ౬, ౭ శ్లోకాలలో బాగుగా ఉపన్యసించినారు.

భృత్యలక్షణములను గురించి యుద్ధకాండ ౧వ సర్గలో ౭, ౮, ౯, ౧౦ శ్లోకాలలో బాగా నిరూపించినారు.

"సర్వే చండస్య బిభ్యతి" [యు. ౨-౨౧]

అందరును చండునికి భయపడుదురు. ఇదివరలో చూపిన 'మృదుర్హి పరిభూయతే' అను లక్ష్మణనీతి కిది అనుబంధము. దాయాదుల మత్సరమును గురించి యుద్ధకాండ సర్గ ౧౬ లో 3, ౪, ౫. ౬. ౭, ౮, ౯ శ్లోకాలలో చక్కగా వర్ణించినారు. మరియు సర్గ ౧౮ లో ౧౦, ౧౪ శ్లోకాలను చూడుడు

"సులభాః పురుషా రాజన్ సతతం ప్రియవాదినః
అప్రియస్య చ పథ్యస్య. వక్తా శ్రోతా చ దుర్లభః."
[యుద్ధ. ౧౬-౨౦, ౨౧]

ప్రియముగా మాట్లాడేవారు చాలామంది. అప్రియమైనను హితవు చెప్పువారును వినువారును మాత్రమే దుర్లభులు.

పిఱికితనముయొక్క నష్టములను గురించి హిందువులు బాగా అర్థము చేసుకొనవలెను. అంగదుడు చెప్పిన నీతులలో ఇవి చాలా శ్రేష్ఠమైనట్టివి. చూడుడు.

యుద్ధకాండ. సర్గ. ౬౬ శ్లోకాలు ౧౯ నుండి ౨౭ వరకు.

"న కత్థనాత్ సత్పురుషా భవంతి" [యుద్ధ. ౭౧-౫౮]

ఆత్మశ్లాఘనచే సత్పురుషులు కానేరరు.

"పౌరుషేణతు యో యుక్తః సతు శూర ఇతి స్మృతః"
[యు ౭౧-౫౯]

పౌరుషము కలవాడే శూరుడు.

"యస్యార్థ స్తస్య మిత్రాణి, యస్యార్థ స్తస్య బాంధవాః
యస్యార్థా స్స పుమాంల్లోకే, యస్యార్థా స్సచ పండితః
[యు. ౮౩-౩౫]

ఈ శ్లోకాన్ని హితోపదేశములో ఉదాహరించినారు.

"మరణాంతాని వైరాణి" [యు. ౧౧౨-౨౬]

ఈ విధముగా రామాయణము నీతులకు నిధియై యుండుటచేతకూడ పూజ్యస్థానమును పొందియున్నది

## ౨

# కవిత—గుణపోషణము

ష్లెజల్ అను జర్మన్ ప్రాచ్య విద్యాపండితుడు "రామాయణము ప్రపంచ పురాణములన్నింటిలో గంభీరమైనది (Ramayana is the noblest of epics)" అని అభిప్రాయ మిచ్చెను.

మానియర్ విలియమ్సు అను ఇంగ్లీషు పరిశోధకు డిట్లు వ్రాసెను. "రామాయణము సంస్కృత వాఙ్మయములోని మహానిధులలో ఒకటై యున్నది. మొత్తము సంస్కృత సాహిత్యమందు రామాయణముకంటె మనోహరతరమైన కవిత మరి లేదు. ఉత్తమ సాంప్రదాయక పవిత్రత, స్పష్టత, స్వాభావికత దాని శైలిలో కలవు. కవితా సన్నివేశము అతిమనోహర భావములతో కూడినట్టిది. దానిలో శౌర్య సంఘటనల ఉదారవర్ణనలు, ప్రకృతిలోని సుందరతమమైన రంగముల ప్రదర్శనము, మానవహృదయము నందలి గంభీరోద్రేకములు; వాటి పరస్పర సంఘర్షణముల గాఢపరిచయము —ఇవన్నియు ఈ రామాయణమునకు సర్వకాలములందును సర్వదేశములందును అతి సుందరమైన రచనలని ప్రఖ్యాతి గాంచిన కావ్యములలో అగ్రస్థాన మిచ్చుచున్నవి.‡

‡ *Monier Williams says:*—Ramayana is undoubtedly one of the greatest treasuries is Sanskrit Literature. There is not in the whole range of Sanskrit Literature a more charming poem than the

ఇతర పాశ్చాత్య పండితులును ఇట్టి అభిప్రాయము లనే యిచ్చియున్నారు. ఇక భారతదేశమందలి హిందువులు రామాయణమును గురించి సదభిప్రాయమే కలవారై యున్నా రనుటలో ఏ సందేహమునులేదు. రామాయణము హిందువు లందరికినీ ఒక పవిత్రగ్రంథము. దానిలోని ఉత్తమ కవితను గురించి హిందూ పండితు లందరును అతి ప్రాచీన కాలము నుండి, అనగా కనిష్ఠము ౨౦౦౦ ఏండ్లనుండి అత్యుత్తమ మని అభిప్రాయమిచ్చుచూ వచ్చుటయేగాక నిన్న మొన్నటి వరకు సంస్కృతము నభ్యసించిన ప్రతి పండితుడును ఇతర కావ్యాలను ప్రారంభించుటకు ముందు రామాయణములో కొన్ని భాగములను మొదట చదువుకొనుచుండెను. ఎంతటి మహాకవియైననుసరే, అత దేభాషయందైనను సరే కవిత్వము వ్రాసినను, మొట్టమొదట వాల్మీకి మహర్షికి నమస్కారము చేయనిది ముందునకు సాగకుండెడువాడు. తుదకు రామా యణమును చదువని హిందువు కవియే కానేరడు అని చెప్పిన అతిశయోక్తి కాదు.

---

Ramayana. The classical purity, clearness, and simplicity of its style, the exquisite touches of true poetic feeling, with which it . bounds, its graphic descriptions of heroic incidents, nature's grandest scenes, the deep acquaintance it displays with the conflicting workings and the most refined emotions of the human heart, all entitle it to rank among the most beautiful compositions that have appeared at any period or in any country. P. 191.

రామాయణములోని కవితా ప్రాశస్త్యమునుగూర్చి మహావిద్వాంసులు నూర్లకొలదిగా ప్రాచీనము నుండియు నేటివరకు బహువిధముల తెలిపియున్నారు. అట్టి దానిని గురించి నేను మరల వ్రాయుట కాలహరణ హేతువున్నూ, పునరుక్తి దోషమున్నూ, తుదకు తలవని తలంపుగా భావ చౌర్యమున్నూ కావచ్చును. ఆలంకారికులు రామాయణ మహాభారతాదుల రచనానంతరము, తుదకు కాళిదాసుని యనంతరమే బయలుదేరి కొన్ని కవితానిబంధనలను ఏర్పాటు చేసినారు. ఆ కొలతబద్దతో నేను వాల్మీకిని కొలుచుటకు పూనుకొనను. సూటిగా నాకెట్లు భావస్ఫురణము కలిగినదో దానిని మాత్రమే నివేదించు కొందును.

కవితా ప్రయోజనము ఆనందము, లేక విజ్ఞానప్రదానము, లేక బోధ–రామాయణములో ఈ మూడున్నూ సంపూర్ణముగా కలవు. "ఏకో రసః కరుణఏవ" అని కొందరు ఆలంకారికులు తెలిపియున్నారు. రామాయణమం దీ రసము సమగ్రముగా ఉన్నది. ఒక విధముగా రామాయణము కరుణ రస పూరిత కావ్యము. దశరథునికి సంతానము లేదను చింత, కలిగిన కొన్ని యేండ్లకే పుత్రుల వియోగము. తర్వాత సీతారామలక్ష్మణుల అరణ్యావాసము, దశరథుని మరణము, భరతుని సంతాపము, అరణ్యమందు రామాదుల కష్టములు, శూర్పణఖాపరాభవము, కబంధుని మరణము, శరభంగుని మృతి, ఖరాదులవధ, సీతాపహరణము, రాముని పరితాపము, జటాయువుయొక్క ఆత్మార్పణము, వాలివధ, లంకాదహనము, రాక్షసుల వినాశము, లక్ష్మణుని మూర్ఛ, రాముని

వ్యసనము, సీతాపరీక్ష, ఈ విధముగా అడుగడుగునకునూ శోకనే పాఠకుల నెదుర్కొనుచున్నది. సాంప్రదాయకముగా రామాయణమందు సుందరకాండ శ్రేష్ఠమైన దందురు. నాకు అయోధ్యాకాండయే శ్రేష్ఠతమమైనది. ఏభాగము చదువకున్నను ఒక్క అయోధ్యాకాండను మాత్రము చదివితే అనేకోత్తమ కావ్యాలు చదివినట్లు అని భావింతును.

రామాయణములో కథయొక్క ఐక్యత కలదు. ఇతర పురాణాలలో అది కానరాదు. మహాభారతములో ఉపాఖ్యానాలు కొల్లలుగా ఉన్నవి. మూలకథకు సంబంధము లేని శాంత్యానుశాసనికాది పర్వాలు బహు దీర్ఘమైనవి కలవు. రామాయణ మందును కొన్ని యుపాఖ్యానాలు కలవు. ఋశ్యశృంగోపాఖ్యానము, కుశనాభకోపాఖ్యానము, భగీరథోపాఖ్యానము, అహల్యాకథ, విశ్వామిత్ర చరిత్ర, ఋషికుమార వధాఖ్యానము, ఇట్టివి మరికొన్ని కలవు. కాని యవి మూలకథకు సంబంధించినవై యున్నవి. పైగా ఇవి చిన్న వగుటచేత ప్రధానవిషయమునకు భంగము కలిగింపవు. కథావస్తువుయొక్క ఐక్యత (Unity of plot) కావ్యానికి జీవము వంటిది.

బహు సంస్కృతాంధ్ర కావ్యాలలో అష్టాదశ వర్ణనలు కలవు. ఇవన్నియు వాల్మీకిలో లేవు. అయినను రామాయణము ఇటీవల ఆలంకారికుల నిబంధనల ప్రకారము మహాకావ్యము కాజాలదని చెప్ప సాహసించువారు కానరారు. మరి కావ్యాలలోని వర్ణనలుకూడా ఒకేవిధమైనట్టివి. పలుమారు పాఠకులను విసిగించును. ఉత్ప్రేక్షాతి శయోక్తులకవి

పుట్టినిండ్లు. కాని వాల్మీకి సహజకవి, ప్రకృతి కుమారుడు, ఉపమానములకు ఆది పురుషుడు, రమ్యమగు వర్ణనలకు నిధి.

రామాయణములో అయోధ్యావర్ణన (బాల. సర్గ ౫) రాజవర్ణన (బాల. ౬) అమాత్య వర్ణన (బా. ౭) అరాజక దురవస్థావర్ణన (అయో. ౬౭) చిత్రకూట వర్ణన (అయో. ౯౪) వసంతము (అయో. ౫౬) మందాకినీ వర్ణన (అయో. ౯౫) హేమంతము (అర. ౧౬) రామపరితాపము (అర.౬౦) రామవిలాపము (అర. ౬౩) ప్రావృట్కాలము (కి. ౨౮) శరత్కాలము (కి. 3౦) పుష్పక వర్ణనము (సు. ౮) మధువన క్రీడలు (సు. ౬౧, ౬౩) అనువర్ణనలు ముఖ్యమైనవి. అరణ్య వర్ణన పలుతావులలో సుందరముగా కావింపబడినది. (అర. ౧౧, కి. ౧; కి. ౨౭) పై వర్ణనలలో కొన్ని యుదాహరణార్థము ఈ క్రింద ఎత్తి చూపింపబడుచున్నవి.

"ఈ చిత్రకూటపర్వతము సెలయేరుల చేతను, ఊటల చేతను, మదపు ఏనుగువలె ప్రకాశించుచున్నది.

(అయో. ౯౪–౧3)

నాట్యము చేయుచు విలాసముగా పూలను చల్లు నటునివలె ఈ చిత్రకూటములోని వృక్షములు గాలిచే పూలను మందాకినిపై విడుచుచున్నవి. (అయో. ౯౫-౮)

చలికాలమందు సూర్యుడు దక్షిణగామి యగుటచేత ఉత్తరదిశ తిలకములేని స్త్రీవలె కాంతి హీనమై యున్నది. (అర. ౧౬–౮

చలికాలములో పున్నమనాడుకూడా చంద్రుని వెన్నెల తుషారమలినమై ఆతపశ్యామమైన సీతవలె ప్రకాశము తగ్గియున్నది. (అర. ౧౬-౧౪)

శూరులు కానివారు యుద్ధములో జొరబడుటకు వెనుకముందాడినట్లు ఈ పక్షులు శీతజలములను తాకుటకు భయపడుచున్నవి. (అర. ౧౬-౨౨)

వసంతఋతువునందు అంతటను నిప్పంటుకొన్నదా అన్నట్లు మోదుగుపూలు వికసించియున్నవి.(అయో.౫౬-౬)

వానకాలమందు పర్వతములు మేఘములచే గప్పబడి జలధారలు కల సెలయేరులతోనొప్పి గుహాలందు గాలిచొచ్చి ధ్వనించుచుండుటవలన కృష్ణాజినములు తాల్చి జందెములను ధరించి వేదాధ్యయనము చేయుచు (ఋషివలె) ఒప్పుచున్నది. (కి. ౨౮-౧౦)

నల్లని మేఘాలలో చలించుచున్న మెఱపు, రావణుని తొడపై విడిపించుకొనుటకై పెనఁగులాడుచున్న శోచనీయయగు సీతవలె నున్నది. (కి. ౨౮-౧౨)

పచ్చని బయళ్లలో చిన్నయారుద్ర పురుగులు నిండియున్నవి. చిలుకవన్నె వంటి చీరపై లక్కచిత్తరువులు వ్రాసిన చీరను కట్టిన స్త్రీవలె ఆ బయలు ఒప్పుచున్నది. (కి. ౨౮-౨౪)

నవసంగమసంవ్రీడలగు స్త్రీల జఘనములవలె శరత్కాలమందు నీరింకుటచేత నదులు పులినములను ప్రదర్శించుచున్నవి. (కి. ౩౦-౫౮)

తర్వాతికాలపు కవులందరును రామాయణములోని ఋతువర్ణనలతో తులదూగు వర్ణనలు రచింపజాలిన వారు కారు. ఋతుసంహారమును రచించిన కవి (కాళిదాసైనను సరే, మరెవ్వారైనను సరే) రామాయణము నుండియే భావములను తుదకు శైలినిగూడా అనుకరించెను.

వాల్మీకికి ఉపమానాలు చాలా యిష్టము. తర్వాతి కాలములో కాళిదాసు ఈ పద్ధతిని బాగా అనుకరించెను. రామాయణమందేవర్ణననైనను చదివినచో ఉపమానము లందు కనబడును కావున ప్రత్యేకముగా వాటి నుదహరించుట అనవసరము.

రామాయణ కవితను తర్వాతి కవులు చాలామంది విశేషముగా అనుకరించుచు వచ్చిరి. కొందరు కవులు అందలి భావములను స్పష్టముగా గ్రహించిరి. మహాభారతమందు కొన్ని రామాయణశ్లోకాలు కనబడుచున్నవి. మరికొన్ని భావాల అనుకరణముకూడా కనబడుచున్నది. ఎట్లనగా—

"అనార్యజుష్ట మస్వర్గ్యం కుర్యాం పాప మహం యది"

(అయో. ౮౨-౧౪)

"అనార్యజుష్ట మస్వర్గ్య మకీర్తికర మర్జున" భగవద్గీత.

"యద్ద్రవ్యం బాంధవానాం వా మిత్రాణాం వా క్షయే భవేత్
నాహం తత్ప్రతిగృహ్ణీయాం భక్షా న్విషకృతానివ." (అయో. ౯౭-౪)

"కులక్షయకృతం దోషం మిత్రద్రోహేచ పాతకం" భగవద్గీత.

"నహీచ్ఛేయ మధర్మేణ శక్రత్వ మపి లక్ష్మణ" (అయో. ౯౭-౮)

ఇదే భావము ఉద్యోగపర్వమందును ధర్మరాజును గురించి చెప్పబడినది.

"మనోహి హేతు స్సర్వేషా మింద్రియాణాం ప్రవర్తనే."
(సు. ౧౧-౪౧)

మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః"
(ఉపనిషద్వాక్యము)

వేపతే స్మాధికం సీతా విశంతీ వాంగమాత్మనః
వనే యూథపరిభ్రష్టా మృగీ కోకై రివార్దితా. (సు. ౨౫-౫)

ప్రావేపత భయోద్విగ్నం సింహం దృష్ట్వేవ గోగణః
—(మహాభారతం భీష్మ. అ. ౧౩ శ్లో. ౧౦)

ఇక్కడ సింహమును చూచిన ఆవులు వణకినట్లుగా భీష్మమరణ కాలమందు కౌరవసైన్యము కంపించెనని వర్ణించినారు. కాని తిక్కన సోమయాజి పూర్తిగా రామాయణ మందలి పై శ్లోకమునే అనుకరించెను.

అంగద నాథు మ్రింగిన వృకావలి తన్ వెసజుట్టుకొన్న స
ర్వాంగములం జలించి వెగ డందుచు, దిక్కులు సూచుచున్న సా
రంగియపోలె నుండె కురురాజ ! భవత్సుతుసేన భీష్ము నా
జిం గబళించి పాండవులు జృంభితవిక్రమలీలఁ బొల్చుటన్.

అసంశయం హరిశ్రేష్ఠ ! క్షిప్రం మాం ప్రాప్స్యతే పతిః
అంతరాత్మా హి మే శుద్ధ స్తస్మింశ్చ బహవో గుణాః,
[సుం. ౩౬-౧౨]

ఈ భావమును సంపూర్ణముగా కాళిదాసు సంగ్రహించుకొనెను.

అసంశయం క్షత్రపరిగ్రహక్షమా, యదార్య మస్యా మభిలాషి మే మనః
సతాంహి సందేహపదేషు వస్తుషు, ప్రమాణ మంతఃకరణప్రవృత్తయః.
[అభిజ్ఞాన శాకుంతలం. అంకం ౧, శ్లోకం. ౨౨]

"ఇదం శ్రేష్ఠ మభిజ్ఞానం బ్రూయా స్త్వంతు మమప్రియం."
[సుం ౩౮-౧౨]

"నివేదయిత్వాఽభిజ్ఞానం ప్రవృత్తించని వేద్యచ" బాల. ౧-౭౪

"అభిజ్ఞాన ప్రదానంచ రావణస్యచ దర్శనం" బాల. ౩-౩౦

కాళిదాసునికి అభిజ్ఞాన శాకుంతలమేకాక రఘువంశ కుమార సంభవ నామములు సహితము వాల్మీకి సూచితమై యుండునేమో.

"కుమారసంభవశ్చైవ ధన్యః పుణ్య స్తథైవచ" బాల. ౩౭-౩౨
"రఘువంశస్య చరితం చ కార భగవానృషిః" బాల. ౩-౯

అను శ్లోకాలనుబట్టి యిట్లూహించితిని—

సీతాపహరణా నంతరము రాముడాక్రోశించి చెట్లను గట్లను నా సీతను చూచితిరాయని విచారించుటను కాళిదాసు తన విక్రమోర్వశీయములో పురూరవుడు ఊర్వశి జాడను విచారించు ఘట్టమున పూర్తిగా వినియోగించుకొనెను.

రామునికి జ్ఞాపకము చేయుటకై కాకాసురుని కథ ఒక గుర్తు అని సీత హనుమంతునితో చెప్పెను. ఈ శ్లోకము

లోని "అభిజ్ఞానం" కాళిదాసునకు అభిజ్ఞాన శాకుంతలము యొక్క భావము నిచ్చినట్లు కనబడుచున్నది.

యస్యార్థా స్తస్య మిత్రాణి యస్యార్థా స్తస్య బాంధవాః
యస్యార్థా స్స పుమాన్ లోకే యస్యార్థా స్సచ పండితః
(యుద్ధ. ౮౩-౩౫)

ఈ శ్లోకము ఉన్నదున్నట్లుగా హితోపదేశమందు ఉదాహరింపబడినది.

ఋక్షేణ గీత శ్లోకో మే తన్నిబోధ ప్లవంగమ. (యుద్ధ. ౧౧౬-౪౨)

ఇది సుప్రసిద్ధమైన "ససేమిరా"—భల్లూకము కథ.

దీనిని రామాయణమందు పెంచకుండా ఒకే శ్లోకములో సూచించి వదలినారు. అదేవిధముగా అష్టావక్రుని కథను ఒకే శ్లోకములో సూచించి వదలినారు.

నైనం సూర్యః ప్రతపతి పార్శ్వే వాతిన మారుతః
చలోర్మిమాలీ తంధృష్ట్వా సముద్రోపి నకంపతే. (బాల. ౧౫-౧౦)

రావణునిపై సూర్యుడు ఎండగాయడు, గాలివీచుటకు భయపడును, సముద్రుడు చలింపడు అను భావమును పోతన హిరణ్యకశిపునిచే నిట్లు చెప్పించినాడు—

సీ॥ అస్మదీయంబగు నాదేశమునగాని మిక్కిలి రవిమింట మెరయవెరచు
అన్నికాలములందుననుకూలుడై కాని, విద్వేషియై గాలి వీవవెరచు
మత్ప్రతాపానల మందీ కృతార్చియై విచ్చలవిడివహ్ని వెలుగవెరచు
అతిశాతమైన నాయాజ్ఞ మల్లంఘించి శమనుండు ప్రాణులఁజంప వెరచు

ఇంద్రుడాదల నా మ్రోల నెత్త వెఱచు
అమరకిన్నర గంధర్వయక్ష విహగ
నాగవిద్యాధరావలి నాకువెరచు
విలవెరవవు వలువ నీకేది దిక్కు.

(భాగవతము సప్తమస్కంధము ౨౫౭)

అష్టావక్రేణ ధర్మాత్మా తారితో బ్రాహ్మణో యథా. (యుద్ధ. ౧౨౨-౧౭)

సంస్కృత సాహిత్యమందు మంచి ప్రవేశముగల వారి కిట్టి వింకెన్నియో కనబడకమానవు.

గు ణ పో ష ణ ము

ఇంతవరకు కవితా విశేషములను గురించి యథామతి సంక్షిప్తముగా తెలుపబడినది. రామాయణము కవితయం దెంతటి ప్రాముఖ్యము వహించినదో అందలి పాత్రల గుణ పోషణమందును అంతటి ప్రాముఖ్యము వహించినది.

రామాయణమందలి ప్రతివ్యక్తికిని ఒక ప్రత్యేకత కలదు. ఆ వ్యక్తిత్వము అంతటను ఏకవిధముగా నిరూపింప బడినది. ఆంగ్లదేశమందు ౪౦౦ ఏండ్లక్రిందట జగత్ప్రసిద్ధి గాంచిన షేక్స్పియర్ మహాకవి తన నాటకములలో ఎంతటి చిన్నపాత్రయైనను సరే దానికొక విశిష్టగుణ పోషణమును Characterisation) చేయుటలో అద్వితీయుడని పేరు పొంది నాడు. రామాయణమందును అదే లక్షణము సమగ్రముగా కనబడుచున్నది. వాల్మీకి షేక్స్పియరులలో శ్రేష్ఠ మెవనిన

ఒకడు ఇంచుమించు ౪౦౦౦ ఏండ్ల క్రిందటివాడు. ఇంకొకడు ౪౦౦ ఏండ్ల క్రిందటివాడు! ఇంతే!!

రామాయణమందలి పాత్రలన్నింటి గుణపోషణమును గురించి చర్చించినచో విషయవిస్తర మగును. కావున వాల్మీకి చిత్రించిన కొందరిని గురించిమాత్రమే, అదియును సంగ్రహాముగానే, యిందు సూచింపబడుచున్నది.

## శ్రీ రా ము డు

ఇతడు కథానాయకుడు. ప్రధానపాత్ర. ప్రపంచ మహానాయకులలో అగ్రగణ్యుడు. ఏమాత్రము కూడ కళంకములేని అవతారపురుషుడని హిందువుల విశ్వాసము. అందుచేతనే దేవుడై వెలసినాడు. ఇచ్చట అతనిని మానవోత్తమునిగానే గ్రహించి విచారింతును. యౌవరాజ్య పట్టాభిషేక కాలములో రాముని ఉత్తమోత్తమ గుణములు వ్యక్తమయ్యెను. గొప్ప సామ్రాజ్యమునకు పట్టాభిషేకము చేయుటకై తండ్రి, మంత్రులు, పురోహితులు, నగరవాసులు, పల్లెజనులు, తమ్ములు, తల్లులు అందరునూ వాంఛించిరి. కాని కైకేయికి మంథర దుర్బోధలు చేయుటచేత బుద్ధి మారెను. దశరథుడు ఆమెకు రెండువరాలు ఇచ్చియుండెను. వాటిని పాలించవలసివచ్చెను. పట్టాభిషేకము కొన్ని గడియలలో జరుగవలసియుండెను. అప్పుడు రాముడు కైకేయీ దశరథుల సన్నిధికి పిలువబడెను. తండ్రికి అమంగళము పలుకుటకు నోట తడిలేదు. మూర్ఛావస్థలో నున్నాడు. గట్టి

గుండెగల కైకేయి బండుగా రామునితో రాజ్యత్యాగము వనవాసము చేయవలెనని చెప్పను. పిడుగువంటివార్త. దానిని వినిన ఇతరులందరును గట్టిగా రోదనము చేయుచుండిరి. మరి రాముడో ? అభిషేక మప్పుడు ఆనందమును ప్రకటింపలేదు. ఇప్పుడు కూలబడి వాపోవలేదు.

> ఇతీవ తస్యాం పరుషం వదంత్యాం, నచైవ రామః ప్రవివేశ శోకం
> ప్రవివ్యథే చాప మహానుభావో, రాజాతు పుత్రవ్యసనాభిత ప్తః.
>
> [అయో. ౧౯-౪౧]

పైగా వెంటనే యిట్లనెను.

> ఏవ మస్తు, గమిష్యామి వనం వస్తు మహం త్వితః
> జటాజినధరో రాజ్ఞః ప్రతిజ్ఞా మనుపాలయన్.

ఇంతేనా, ఇదిగో ఇప్పుడే అడవికి వెళ్ళుచున్నాను. జడలు దాల్చి రాజునాజ్ఞను పాలించుచున్నాను అని అన్నాడు. మరియు ఇట్లన్నాడు. "ఇంత మాత్రపు కోరికను నాకు తెలిపి యుండరాదా ? దీనికై వరములు కోరవలెనా ? వనమునకు పోవుటకు సిద్ధముగా నున్నానుకదా" అనియు నిశ్చింతతో పలికెను.

జను లతనిపై ఏ వ్యసనచిహ్నములు కూడా చూడజాలక పోయిరి. పైగా అతడు ప్రసన్నుడుగా కాంతియుక్తుడుగా నుండెను. అయితే రామునిలో అంతయు నిగ్రహమే కాని కష్టకాలమందు వ్యసనపడు మానవ సహజ గుణమే లేదా అనిన అదియును కలదు. అతడెవ్వరి యెదుట నిగ్రహము, ప్రసన్నత, గాంభీర్యము చూపింపవలెనో బాగా

ఎరుగును. తనతల్లి వద్దకూడా అట్లే చాలాసేపు ఆచరించు కొనెను. కాని ఎంతసేపు? ఆమె దుఃఖపరంపరలకు లోబడి

"తాం తథా రుదతీం రామో రుదన్ వచన మబ్రవీత్.

[అయో. ౪౩-౨౦]

తల్లిదుఃఖాన్ని చూచి తుదకు పట్టలేక రోదనము చేసెను. ఇదే వ్యసనముతో అతడు సీతను చూడబోయెను. ఆ యమాయకురాలి కింకను తారుమారైన యీవ్యవస్థ తెలియనే తెలియదు. ఆమె చింతావ్యాకులుడైన రాముని చూచి భయపడెను. మరి రాముడున్నూ ఆమెను చూచిన వెంటనే దుఃఖము నాపుకొనలేక రోదనముచేసెను. ఇది తన ఆంతరంగికులయెదుట. మరల సీతాలక్ష్మణులతో తుదిమారు తండ్రి సెలవు తీసుకొనునప్పుడు నిగ్రహమును, ప్రశాంతతను, గాంభీర్యమును ప్రకటించెను. ప్రజ లందరు ఏడ్చిరి కాని అత డేమియు సంచలించలేదు. లక్ష్మణుడేడ్చెను. రౌద్రమూర్తి యయ్యెను. కాని రాముడతని నోదార్చి, శాంతునిగా జేసెను. అరణ్యావాసమందును ఎన్నడును తండ్రిని కినియ లేదు. మహావ్యసనము ముంచుకొనివచ్చిననాడు మాత్రమే రెండుమూడు మారులు ఇక కైకేయి సంతోషపడుగాక అని జారవిడిచెను. భరతుడు తనను అడవిలో కలిసెను. అప్పు డతనితో తనతల్లి నేమాత్రమున్నూ కష్టపెట్టవద్దని ఆజ్ఞాపించెను. ఇంకొకరై యుండిన ప్రజలు, పురోహితులు, మంత్రులు, భరతశత్రుఘ్నులు, కైకేయీదేవితో కూడవచ్చి

రాజ్యము చేయుటకై మరలిరమ్మని ప్రార్థించియుండిన ఒప్పుకొని యుందురు. రాముడట్లు చేయలేదు.

రామునికి హనుమంతుడు నమ్మినబంటుగా లభించెను. సుగ్రీవుడు మంచి మిత్రుడుగా దొరకెను. అయితే వాలివధ మాత్రము అంతగా సమర్థనీయము కాజాలదు. వాలిని చంపుటకు ముందు అతనికి రాయబార మంపవలసియుండెను. అతని నుండి ఏమి సమాధానము వచ్చెడిదో తెలిసికొనవలసి యుండెను. అటుపై యుద్ధము ప్రకాశముగా చేయవలసి యుండెను. తెలియకుండా దాగియుండి కుస్తీపట్టుచున్న వాలిని బాణముతో వధించుట ఏల? వాలి మరణశయ్యపై సూటిగా పోటుమాటలతో రాముని అధిక్షేపించెను. "నేను నీకపకారము చేయలేదుకదా. యుద్ధము చేయదలచిన ఈలాటి పనియేల? నీ సీతను తెచ్చుటకు సుగ్రీవుడు సాయపడునని చేసితివా? నన్ను అడిగియుండిన అవలీలగా ఆపనిని సాధించియుందునే? నన్ను అడవిమృగ మని వేటాడితివా? అట్లైతే కోతులను తినువారి నెందును చూడలేదే? మాంసాపేక్షలేని వేట యెందులకు?" ఈ విధముగా ప్రశ్నపరంపరలను రామునిపై కురిపించెను. రాముడన్నింటికిని సమాధానమిచ్చెను. అవన్నియు తృప్తికరముగా లేవు. వ్యాఖ్యాతలందేవో పరమరహస్యపు జాడలను తీసినారు. అవన్నియు బలవంతపు బ్రాహ్మణార్థమువలె కనిపించుచున్నవి. వాల్మీకి అట్టి ద్వంద్వార్థాలు వ్రాయునట్టి మాయాకవి కాడు! ఈ భావమును నేనొక్కడనే ప్రకటించిన అపచారము చేసినవాడ నగుదునేమో.

భవభూతి తన మహావీర చరితములో చేసిన మార్పును గమనించవలెను. చెట్టుచాటునుండి తన కపచార మేమియు చేయని వాలిని బాణముతో కొట్టుట తన కథానాయకుని శౌర్యమునకు లోటని భవభూతి వాలికిని శ్రీరామునికిని ద్వంద్వయుద్ధమును కల్పించెను. అదేవిధముగా ఉదాత్త రాఘవమును రచించిన మాయురాజకవియు తన నాటకమందు వాలి రాముల ద్వంద్వయుద్ధమును కల్పించెను. ఈ విధముగా ప్రాచీన ప్రామాణిక పండిత కవులును వాలి వధా ఘట్టములో న్యూనతను గమనించియున్నారు—హనుమన్నాటక మను సంస్కృత నాటకములో రాముడు వాలిని చంపుట తప్పని వాలితోనొప్పుకొన్నట్లును, అతని నన్యాయముగా జంపినందులకు ప్రాయశ్చిత్తముగా సీతావియోగమును మరొకమారు పొందుననియు చెప్పినట్లును కవి నిరూపించినాడు. (ఉత్తరకాండలోని సీతావియోగ సూచన యీ రెండవ వియోగము.)

రామునికి సీత అంటే రెండవ ప్రాణము. కాని ఆయన లక్ష్మణుని ఎంతగాఢముగా ప్రేమించెనో ఆ ముచ్చట తుద వరకునూ వ్యక్తపరుపలేదు. యుద్ధకాండలో లక్ష్మణుడు మూర్ఛనొందినప్పుడు రాముడు నాకు రాజ్యమేల, సీతయేల? నాకెవ్వరునూ లక్ష్మణుడు లేనిది కాబట్టరు అని విలపించెను. లక్ష్మణుడు ఇంద్రజిత్తును చంపి వచ్చినప్పుడు అతనిని గాఢముగా కౌగలించుకొని చిన్నపిల్లవానిని వలె తన తొడపై కూర్చుండబెట్టుకొని లాలించెను.

రావణుడు తనకు చేసినంత యుపకారము మరెవ్వరును చేయలేదుకదా. మొదటిసారి ఇరువురును పోరాడినప్పుడు రావణుని రథమును ధనుస్సును ఆయుధాలను అన్నింటిని రాముడు ధ్వంసము చేసెను. అప్పుడీతనిని చంపి యుండవచ్చును కదా. చంపలేదు. "నీవు నిరాయుధుడవు; నీ నగరములోనికి వెళ్ళి మరల క్రొత్తరథమెక్కి ఆయుధాలతో రమ్ము" అని పంపివేసెను. రావణుడు చనిపోయిన వెంటనే రాముడిట్లనెను.

మరణాంతాని వైరాణి నివృత్తం నః ప్రయోజనం [యుద్ధ ౧౧౨-౨౬]

ఇతని చావుతో నా వైరముకూడా ముగిసినది. ఇతని యుత్తరక్రియలను లోపములేకుండా చేయవలెను, అని ఆజ్ఞాపించెను.

రామునికి సీతయొక్క పాతివ్రత్యము, ఆమె లోకోత్తర పవిత్రత, అన్నియును తెలియును. కాని రావణుని యింట ఒక ఏడు ఉండిన సీతకు, ప్రపంచము నింద లాడిగట్టుననియు రామునికి తెలియును. సీతచే అగ్నిపరీక్ష చేయించినప్పటి అతని నిగ్రహము అద్వితీయమైనది.

రాముడు మహావీరుడు. అతనికి సాటివారు లేకుండిరి. సత్యసంధుడు. జితేంద్రియుడు. ఈ కారణాలచేత అతడు దేవసము డయ్యెను.

## లక్ష్మణుడు

ఇతడు ప్రీతిపాత్రుడు. రామునంతటి నిగ్రహుడు కాడు. ధర్మాగ్రహుడు. ఉత్తగా కోపించుకొనడు. మంచిచెడ్డలను అత

నికి సన్నికర్షము. దుష్టమెల్లను అతని కసహ్యము. కోపము వచ్చినా దానిని శాంతింప జేయువాడు రాముడొక్కడే. రామునిలోని ఉత్తమత్వము అతనికి చాలా ప్రియమైనట్టిది. అందుచేత అతనికి స్వయంసేవకు డయ్యెను. రాముని యౌవ రాజ్య పట్టాభిషేకము భగ్నమైనప్పుడు, రాముని త్యాగ మును మొదటిసారి చూచినప్పుడు అతడు కన్నీరుకార్చినాడు. ఎట్లో కోపము బిగబట్టినాడు. రామునివెంట నోరుమూసు కొని తిరిగినాడు. తుదకు రాముడునూ్నా తల్లివద్ద ఏడ్చినప్పుడు లక్ష్మణుని క్రోధము బయటపడినది. కాలరుద్రుడైనాడు. చిన్న భార్యచే మోహితుడై పెద్దకొడుకును అడవికి పంపే తండ్రి తండ్రికాడని అన్నాడు. ఎవ్వరడ్డము వత్తురో చూచె దనుకాక, నేనొక్కడనే ధనుర్ధరుడనై ప్రపంచాన్ని ఎదిరించి రామునికి పట్టము కట్టుతానని హుంకరించినాడు. రాముడు ఆగు మాగుము, శాంతించుము అని బోధించినాడు. మదపు టేనుగునకు ఆమాటలు సంకెళ్లైనవి. "మృదుర్హి పరిభూయతే" "మెత్తనగు చోటనే గుద్దలి వాడియౌకదా"! అని రాముని మెత్తదనాన్ని గర్హించినాడు. కర్మము ననుభవించవలె నందురా ? దైవవిధి అనుల్లంఘనీయ మందురా ?

"వీరా స్సంభావితాత్మానో న దైవం పర్యుపాసతే" [అయో. ౨౩-౧౬]

పరాక్రమశాలురకు దైవము అడ్డము రాజాలదు అని గట్టిగా పలికినాడు.

భరతుడు తల్లివంటి గుణాలుకలవాడై యుండునని మొదలనుకొన్నాడు. దూరమందు భరతుడు అరణ్యానికి

వచ్చుట చూచినాడు, అతడు దురుద్దేశముతో వచ్చినాడు. ఇదిగో ఇప్పుడే అతని పని పట్టించుతాను చూడు అని అన్నతో పలికినాడు. భరతుడు చాలా మంచివాడే అని తేలిన తర్వాత అట్టి తల్లి కిట్టి కొడుకు పుట్టినాడే అని ఆశ్చర్య పడినాడు.

రామునందే కాక సీతయందును లక్ష్మణునికి పరమ భక్తి. సీతారాములకు ఏమాత్రమున్నూ ఆయాసము, శ్రమ, కష్టము కలుగకుండా సేవించిన బంటు. రాత్రులందు వారికి పహారాయిచ్చి కావలికాచినాడు. వారి ఆజ్ఞలను పాలించి నాడు. కాని తన ధర్మాగ్రహమును ప్రకటించక మానలేదు. సీత కిష్కింధలో పారవేసిన ఆభరణాలను లక్ష్మణునికి చూపించినారు. అందేదియు అతడు గుర్తించ జాలినవాడు కాడు. ఒక్కనూపురమును మాత్రము వెంటనేగుర్తించినాడు.

> "నాహం జానామి కేయూరే నాహం జానామి కుండలే
> నూపురే త్వభిజానామి నిత్యం పాదాభివందనాత్." [కి. ౬-౨౨]

ఇది సుందరమైన భావము. అతని అకల్మషత్వమును వెల్లడించును. సీతను తల్లికంటె ఎక్కువగా పూజించినదిందు ధ్వనింపబడినది. అయితే గంగను దాటేకాలములో రాము నాజ్ఞచేత లక్ష్మణుడు సీతను చేతులతో ఎత్తి పడవలోని కెక్కించెను. ఆవిధముగా ఆమెను తాకుటలో ఆ నిష్కలం కునికి దోషములేదు. నూపురములను మాత్రమే గుర్తింతును అనుటలో అతడు సీతను, పరికించి యెన్నడును చూడలేదని భావము, ఆమె తన దృష్టిలో అంత పవిత్ర

శౌర్యములో లక్ష్మణుడు రాముని కేమాత్రమును తీసిపోనివాడు. రామునైనను ఇతరులు తేరిపార జూడగల రేమో, లక్ష్మణునికి కోపము వచ్చెనా అతని నెదిరించుట కష్టము.

భ ర తు డు

అతనికి తన తల్లి లక్షణాలు బాగా తెలియును.

"ఆత్మ కామా, సదా చండీ, క్రోధనా ప్రాజ్ఞ మానినీ"

[అయో. ౬౯-౧౦]

అని మొదలే అన్నాడు. అయోధ్యకు వచ్చి సంగతులు కనుగొన్నాడు. తల్లిపై మండిపడినాడు. "నిన్ను చంపివేయవలెను. కాని రా ము డు కోపపడునని ఊరకున్నాను" అని అన్నాడు. ప్రజలకు మొదలతనిపై మంచి భావము లేకుండెను. కాని అతని యుద్దేశములు విన్నతర్వాత వారతనిని గౌరవించిరి. అరణ్యమందలి ఋషులును అతనిని మెచ్చుకొనిరి. రాము డీతనిని ప్రథమసమాగమములోనే కౌగలించుకొని తొడపై కూర్చుండబెట్టుకొని గాఢముగా ప్రేమను ప్రకటించెను. రాముడు తిరిగివచ్చుటకై అతడు చేయవలసినన్ని ప్రయత్నాలుచేసెను. కడప కడ్డము పండుకొనెను. లాభములేకపోయెను. తుదకు రాముని పాదుకలు తలపై ధరించి మహావ్యసనముతో వెళ్ళెను. ౧౪ ఏండ్లు అయోధ్యను ప్రవేశించక పోయెను. తానును తాపసియై నందిగ్రామములో రాముని పాదుకలవద్ద కూర్చుండి ధర్మ పరిపాలనము చేసెను.

శ త్రు ఘ్ను డు

అప్రసిద్ధుడు. మంచివాడే కాని వీరుడుకాడు. వ్యాప దిష్టుడుకాడు. ఎటులో మంథరపై కోపమువచ్చి ఆమెను బాధించి చంపుటకై లేచెను. అటుతర్వాత అతని ముచ్చట మనకు ఏమియు తెలియదు. యథాజ్ఞాపయతి రాజా (జోహుకుం సర్కార్) అనునట్టి వ్యక్తిగా కానవచ్చుచున్నాడు.

కై కే యి

మొదట మొదట స్వార్థము లేనట్టిది. కాని మంథర ఆమెకు దుర్బోధలు బాగా నూరిపోయగా పోయగా ఆమెలో పూర్తిగా మార్పుకలిగెను. అటుతర్వాత ఎవరేమనినాసరే ఆమె అచంచల యయ్యెను. రాజ్యమంతయును తిట్టిపోసెను. దశరథుడు చావసేచచ్చెను. అప్పటికినీ ఆమెకు మనస్తాపము కలుగలేదు. ప్రాయశ్చిత్తమన్న మాటలేదు. ఆమె పారసీక దేశపు స్త్రీయని తెలిపినాను. ఆమె చెలికత్తె మంథరకూడా అక్కడిదిగానే కనబడుచున్నది. అందుచేతనే దాని నిట్లు వర్ణించినారు.

"జ్ఞాతిదాసీ యతోజాతా, కైకేయ్యాస్తు సహోషితా" [అయో. ౭-౧]

పుట్టింటివారిచే అరణముగా నియ్యబడినట్టిది; ఎక్కడనో పుట్టినట్టిది, కైకేయి వెంట పంపబడి ఆమెదగ్గరనే సదా యుండునట్టిది అని వర్ణించుటచే కైకేయియొక్కయు మంథరయొక్కయు వైదేశికత మరింత స్పష్టమగుచున్నది. పైగా మంథర "కుబ్జ". పర్షియాలోకూడ పూర్వకాలమందు రాజులు

తమ అంతఃపురాలవద్ద నపుంసకులను, గూని స్త్రీలను, కాప లాగా ఉంచుచుండినట్లు ప్రతీతి.

కైకేయి తల్లిదండ్రులున్నూ కఠినులని తెలిపినారు. వారిజాడయే బిడ్డకును పట్టువడినది. అయినను భరతుని కన్నందున ఆమెను రాక్షసిగా లోకము తలపజాలక పోయినది.

సీత

మహాపతివ్రత. ఆమెపేరు భారతీయస్త్రీలకు ఉత్త మోత్తమ మంత్రరాజము. హిందూస్త్రీలకు రామునకంటె సీత యెక్కువ ప్రీతిపాత్ర. పతిభక్తి ఆమెలో అచంచలము. రావణుని సామ్రాజ్యము, ౫౦౦౦ దాసీజనుల సమర్పణము, రావణుడే స్వయముగా దాసుడై యుండుమాట, సకల భూలోక వైభవములు, ఆమెకు రాముని పాదధూళితో సమానము. ఘోరహింసలు ఆమెను ఆవంతయు చలింప జేయలేవు. జగద్విద్రావణుడగు రావణుడు ఆమెకు గడ్డి పుల్లతోసాటి. అతనితో మాట్లాడినప్పుడు గరికపుల్ల నడ్డ ముగాపెట్టి మాట్లాడినది. "నీ విలువయంతే" అని చెప్పకయే చెప్పినది. హనుమంతుడామెను తన వీపుపై ఎక్కించుకొని తీసుకొని పోదుననెను. ఆమె నీతిజ్ఞ. అట్లు చేసిన తన కపవా దము, పరపురుషునిస్పర్శ, రాముని శౌర్యమునకు భంగము, రావణునికి శిక్షతప్పుట, ఇవన్నియు సంభవించునని నిరాక రించెను.

(30)

ఆమె ధైర్యము, కష్టములనోర్చు సహనము చాలా ప్రశంసనీయములు. అడవికి పోవుటకై సిద్ధమైననాడు ఆమెకు తాపసు లెట్టివారో తెలియదు. అందుచేత కైకేయి ఆమె చేతికి నారచీర లియ్యగా కంట నీరుపెట్టుకొని, రామా!

> "కథన్ను బధ్నంతి మునయో వనవాసినః
> ఇతి హ్యకుశలా సీతా సా ముమోహ ముహు ర్ముహుః
> [అయో. ౩౭-౧౩]

వనవాసినులు నారచీరలెట్లు కట్టుకొంటారు? అని సభలో అందరియెదుట అడిగెను. ఆమె యమాయకత్వాని కందరును విలపించిరి. రాముడామెకు సభలోనే చీరపై చీర కట్టు విధమును తనకు వచ్చినట్టుగా చూపించెను. సీత రామునికి సేవకురాలుగానే యుండలేదు. అవసరమని తోచినప్పుడు మంత్రివలె తనకు తోచిన అభిప్రాయముల నిచ్చుచుండెను. ఋషులు రాముని రాక్షసులను సంహరించుటకు ప్రేరేపించినప్పుడు చక్కని హితమును చెప్పి తుద కిట్లనెను. "రామా! స్త్రీచాపలముచే నేనిట్లు చెప్పితిని. నీకు ధర్మోపదేశము చేయ సమర్థుడెవడు? నీ తమ్మునితోగూడా ఆలోచించి మీ కేది యుచితమని తోచునో దాని నాచరించుడు."

### హ ను మ ం తు డు

ఒకటి చెప్పితే రెండు చేసుకొనివచ్చు రాముని నమ్మిన బంటు. మహాసమర్థుడు. కాని నిగర్వి. మహాప్రజ్ఞాధురీణుడు. కాని వినయసంపన్నుడు. సంస్కృతములో మహాపండితుడు. బహుభాషల నెరిగినవాడు. విశ్వాసపాత్రుడు.

రా వ ణు డు

మహాబలాఢ్యుడు. అనేక దేశాలను జయించినవాడు. శత్రుభయంకరుడు. విషయాసక్తుడు. ౧౦౦౦౦ మంది భార్యలు కలవాడు. సీతను కామించి ప్రపంచమందు శాశ్వతమగు అపకీర్తిని పొందినవాడు. ఈ సందర్భములో రావణునికి దుర్యోధనునికిని కల తారతమ్య మెరుగవలెను. రావణుని చెల్లెలగు శూర్పణఖయొక్క ముక్కు చెవులు కోయించిన వాడు రాముడు. ఖరదూషణాదుల ౧౪౦౦౦ మందిని సంహరించినది రాముడు. దానికి ప్రతీకారము చేయదలచినది రావణుడు. రాముడు ఆర్యుడు. రావణుడు రాక్షసుడు. ఇద్దరును సంపూర్ణముగా భిన్నజాతులకు చేరినవారు. దుర్యోధనుడును ధర్మరాజును అన్నదమ్ముల కుమారులు. జ్ఞాతులు. ద్రౌపది దుర్యోధనునికి వదినెవరుస. ఆమెను జూదములో దుర్యోధనుడు గెలిచినాడు. ఆమెను తన తమ్మునిచే సభకు సిగబట్టి లాగించినాడు. నిండుసభలో ఆమెను దిగంబరనుగా చేయించినాడు. నాతొడపై కూర్చుండరమ్మని ద్రౌపదిని పిలిచినాడు. రావణుడు ఒల్లని సీతను బలాత్కార కామమునకు గురిచేయలేదు. రాక్షస వివాహాలలో ఒల్లని స్త్రీలకు ఒక సంవత్సరము గడువిచ్చుచుండిరి. సీతకు అదే గడువిచ్చినాడు. రావణుని జాతి నరమాంసమును తినునట్టిదని వర్ణింపబడెను. తన బలమంతయు, తన కుమారులు బంధువులు తమ్ములు నాశనమైనప్పుడు కూడా సీతను చంపలేదు. అయినను ఆర్యులలో బలాత్కారమును గర్హించినట్లు మరి దేనిని

కూడా గర్హింపకుండిరి. దుర్యోధనునికిని, రావణునికిని ప్రాయశ్చిత్తము తప్పదయ్యెను.

రావణుడు బంధుప్రీతి కలవాడు. తన తమ్ముడు చనిపోయినప్పుడు చాలా వ్యసనపడెను. ఇంద్రజిత్తు చనిపోయినప్పుడు అతని దుర్భరదుఃఖమును వాల్మీకి బాగా వర్ణించినాడు. రావణుడు కన్నీరు జోటజోట కార్చెను అవి కాలుచున్న నూనెబొట్లవలె నుండెను. అతనికి క్రోధముకూడా నిండియుండెను. అందరును స్తబ్ధులైరి. ఎవరికిని అతనితో మాట్లాడే ధైర్యములేకుండెను. అతని పట్టపురాణి మండోదరి. అప్పుడప్పుడామెను సలహా అడుగుచుండెను. తుదికాలములో కూడా అడిగెను. ఆమె చక్కని నీతియుక్తమగు బోధ కావించెను. కాని అతని పాపము పండినందున దానిని విను బుద్ధి అతనికి పుట్టలేదు.

విభీషణుడు.

దేశద్రోహి, బంధుద్రోహి అని రాక్షసులచేత గర్హింపబడినాడు. తన యన్న నీతిబాహ్యుడైనందున రాముని ఆశ్రయింపవలసి వచ్చెను. అతడు రాక్షసులలో తప్ప బుట్టినాడు. శాంతపురుషుడు. ధార్మికుడు. నీతిజ్ఞుడు. రామునికి గొప్ప సహాయము చేసినవాడు. అందుచేత కీర్తనీయుడైనాడు.

దశరథుడు

బహుకాలము బహుభార్యలతో భోగములనుభవించెను. [illegible]

కుమారులు కల్గిరి. అందు రామునిపై పంచప్రాణా లప్పజెప్పుచుండెను. తాను చూచుచుండగనే అతనిని రాజుగా చేసి ఆ వైభవమును చూడకోరెను. కైకేయి భగ్నపరచెను. అతడు కరుణామయమూర్తి. సత్యవాక్యపరిపాలకుడు. లోకానుభవము సంపూర్ణముగా కలిగినవాడు. కైకేయిని పరిపరివిధముల ప్రార్థించిన ఘట్టము ప్రపంచవాఙ్మయములో సాటిలేనట్టిది. శ్రోతలు కంట తడిబెట్టకమానరు. అయోధ్యాకాండమంతయు మహాపరితాపముతో చిత్రింపబడిన భాగము. దశరథుని ఉత్తమగుణములు చాలా సుందరముగా ఇందు వర్ణింపబడినవి.

వ సి ష్ఠ డు

ఇతని ప్రతిభను గురించి చాలా వినుచుందుము. విశ్వామిత్రుని తన కామధేనువుయొక్క దివ్యశక్తిచే పరిపరి విధముల పరిభవించి ఓడించినవాడట! అట్టి వసిష్ఠుడు రామాయణములో పనికిరాని ఒక పంచాంగ పురోహితునివలె కనబడుచున్నాడు. దశరథునికి కలిగిన చిక్కును తీర్చడు. కైకేయిని గర్హింపడు. దశరథుడు చనిపోయిన తర్వాత నలుగురు పెద్దమనుష్యులలో తానును ఒకనివలె కనిపించును కాని అతని ప్రాధాన్యము కానరాదు. భరతునివెంట నలుగురితోపాటు వెళ్లును. ఇదిసరి, ఇదితప్పు అని యేమియు నిర్ణయింపడు. భరద్వాజుని ఆశ్రమములో ఇతని ఖ్యాతికి తగిన మన్నన కానరాదు. భరతుడు పాదుకలతో వెళ్లిపోయినప్పటినుండి మరల రామాయణములో వసిష్ఠుడు కానరాడు.

## వి శ్వా మి త్రు డు

వసిష్ఠునివలెనే రామాయణములో పనికిరానివానివలె కానవచ్చును. అతని గొప్పతనాన్ని బాలరామ లక్ష్మణులకు ఇతర మునులెవ్వరో చెప్పెదురు. కాని ఆ గొప్పతనానికి తగిన చర్యలు రామాయణములో కానరావు. రామునికి బాణవిద్యను నేర్పువాడతని సహాయమునే పొందును. కొంత కాలములోనే శ్రీరాముని మిథిలకు పిలుచుకొనిపోవును. అక్కడ సీతను రామునికిచ్చునట్లు ఏర్పాటుచేయును. అంతటితో అతనిపని ముగిసినది. ఇక రామాయణములో ఎచ్చటను కానరాడు. ఏమైపోయినట్లు?

విశ్వామిత్ర వసిష్ఠులను గురించి ఒక అంశమును గమనింపవలెను. పురాణకర్తలు, వీరు ఒకేవ్యక్తి అనుకొని పొరపాటు పడినారు. వసిష్ఠవంశములో పలువురా పేరుతో వెలసిరి. అదేవిధముగా విశ్వామిత్రవంశములో చాలామంది విశ్వామిత్ర నామధేయులుండిరి. ఒక్కొక్కరు కొన్ని ఘన కార్యములను చేసిపోయిరి. అవన్నియు ఒకే వ్యక్తికి తర్వాతి పౌరాణికు లంటగట్టినారు.

పర్గిటర్ గారిట్లు వ్రాసినారు. "విశ్వామిత్రులు ఇద్దరుండిరి. ఒకరు శునశ్శేపుని రక్షించినవారు. ఇంకొకరు పాంచాల రాజైన సుదాసుని పురోహితులు. వీరిద్దరిని ఒకటిగా భావించి ఇద్దరి చర్యలను కలగలిపినారు. గాధికుమారుడైన వాడు మొదటి విశ్వామిత్రుడు. రామాయణములో విశ్వామిత్రుడు రెండవవాడు. వసిష్ఠునిచేత బ్రాహ్మణ్యమును పొందిన

వాడు మొదటి విశ్వామిత్రుడేకాని రాముని కాలములో నుండిన రెండవ విశ్వామిత్రుడు కాడు. అదేవిధముగా అనేక వసిష్ఠులుండిరి. వీరందరును ఒకే వసిష్ఠునిగా పౌరాణికులు భావించిరి. అదేవిధముగా మార్కండేయులును బృహస్పతులును పలువురుండిరని ఎరుగవలెను. †పర్గిటర్ ఇంకను ఇట్లు వ్రాసినారు.

"జనకులును అనేకు లుండిరి. సీరధ్వజ జనక, ధర్మధ్వజ జనక, దైవరాతి జనక, ఖాండిక్య జనక అనువారెందరో యుండిరి. హరిశ్చంద్ర, సగర, కల్మాషపాద, దశరథ రాజుల సంబంధములో పేర్కొనబడిన వసిష్ఠులు, వేర్వేరు వారని ఎరుగవలెను.‡" "పూర్వములో ఎనిమిది సుప్రసిద్ధ బ్రాహ్మణ మూలకుటుంబము లుండెను. భృగు, అంగిరస మరీచి, అత్రి, వసిష్ఠ, పులస్త్య, పులహ, క్రతువంశములు. మొదటి అయిదు బ్రాహ్మణ వంశములుగానే నిలచెను. తక్కిన మూడింటిలోని పులస్త్యవంశములో రాక్షస, వానర, కిన్నర, యక్షులు పుట్టిరి. పులహవంశములో పిశాచాదులును క్రతువునకును వాలఖిల్యాదులును పుట్టిరి. రామాయణములోని వసిష్ఠుడు తన వంశములో అరవవాడు. రామాయణములో విశ్వామిత్రుడు ఉండినది అనుమానమే".§

ఈ సందర్భమును గమనించినచో రామాయణములో వసిష్ఠ విశ్వామిత్రులు మనము వినిన మానవాతీత శక్తులగు

---

† Pergiter-Ancient Indian Historical tradition P 64
‡ ,, ,, P 138
§ ,, ,, P 236

వారు కారనియు, వారివంశములోని వారనియు, వారు రామాయణములో ముఖ్యస్థానములో నుండినవారుకారనియు విశదమగును.

ఈ విధముగా రామాయణములో ప్రతిపాత్రకును ఒక వ్యక్తిత్వమున్నది. ముఖ్యమగు వ్యక్తుల గుణపోషణ మును లోపము లేనట్లుగా వాల్మీకి పోషించినాడు. ఇట్టి పవిత్ర గ్రంథము, చదివినకొలది ఆనంద మతిశయించు చుండును. రామాయణమందలి సహజ వర్ణనలు, సుందర భావములు, ఉత్తమ నీతివర్తనము, కేవలము హిందువులకే కాక ప్రపంచమందలి ధార్మికాభిలాషు లందరికిని ఆదర్శ ప్రాయములు. ఇట్టికావ్యము సంస్కృతమందే కాదు, ప్రపంచ మందేభాషయందును నేటివరకునూ సృష్టికాలేదు. హిందు వుల సంస్కృతిని, నాగరికతను, భావోన్నత్యమును, ధార్మి కోదాత్తతను, కవితా ప్రాగల్భ్యమును, ప్రతిభాశక్తిని ఈ వాల్మీకి రామాయణమే సర్వకాలములందు, సర్వదేశము లందును చాటుచు వచ్చినది. ఇకముందును చాటుచుండ గలదు.

## ౯

# వాల్మీకి భూగోళము

పురాణములను పరిశోధించువారు రెండుమూడు విషయములను గమనించియుండవలెను. ఈ కాలములో పట్టపరీక్షలకు సెలెక్షన్సు ఎటులో, నూరు సంవత్సరాల క్రిందట బాలశిక్ష తెనుగుబాలురకెటులో, అటుల ప్రాచీనకాలమందు పురాణములు చదువను వ్రాయను నేర్చినవారికి పనికివచ్చుచుండెను. వాటిలో రాజుల చరిత్ర, దేశాలచరిత్ర, కన్నంత విన్నంత ప్రపంచ భూగోళము అనగా ఏషియాఖండ భూగోళము, నీతి మతవిద్యలు (Ethics & religion) రాజశాస్త్రము (Politics), లలితకళలు (Fine arts), జ్యోతిషము, ధర్మశాస్త్రము, చేరియుండెను. అవి విజ్ఞానకోశములుగా సిద్ధమయ్యెను. కాలము మారేకొలది పురాణాలనుకూడా పెంచుతూవచ్చిరి. ఆ పెంచుటలో తర్వాతివారికి పూర్వుల భూగోళజ్ఞానము లేకపోయెను. సముద్రయానమాగిపోయెను. హిందువులు ఇంటిపట్టు (insular) వారైరి. ఇతర దేశముల యొక్కయు, అందలి స్థలముల యొక్కయు జనులయొక్కయు విశేషములను అర్థము చేసుకొనలేక శబ్దసామ్యముచేత కల్లలు కథలుపెంచి అడ్డాదిడ్డిగా వ్రాసిరి. శబ్దసామ్యమువలన నేర్పడిన కల్పనలను ఈ ప్రకరణములో కొన్నింటిని చూపించినాను. రెండవ దేమనగా కులాలు బిగిసిపొయ్యేకొద్ది ఉచ్చనీచతలను పురా

కాలద్వారా ప్రచారముచేసిరి. పరమతములను దూషించిరి. ఈ విధముగా పురాణాలను దుర్వినియోగము చేసిరి.

మరొక్క విషయమును గమనించవలెను. పురాణాలలోని నానాజాతులను యక్షరాక్షసకిన్నర గంధర్వాది జాతులను గురించి చదివినప్పుడు వారు ఊర్ధ్వలోకాలలోనో అధోలోకాలలోనో యుండినవారని తలపరాదు. వారు భూలోకములోనివారనియె గమనించియుండవలెను. మరియు పై వారే కాక శక, పహ్లవ, హూణ, బర్బరాది జాతులను గురించి చదివినప్పుడు వారు హిందూస్థానములోనే యుండినారని తలపరాదు. వారికై ఏషియాఖండమందును, తూర్పుదీవులందును, ఆఫ్రికాలోని ఈజిప్టునందును, అబిసీనియాయందును, గ్రీకు దేశమందును వెదకవలెను. అనగా మన ప్రాచీనుల భూగోళజ్ఞానము ఏషియాఖండమంతయును, ఆఫ్రికాలో ఈజిప్టు, అబిసీనియా దేశాలును, యూరోపులో గ్రీసు దేశమును మాత్రమే. అంతకుమించి వారికి తెలియదనవచ్చును. పాతాళలోకము అమెరికాఅనియు, మయ అను మెక్సికో జాతివారు మయసభనిర్మాతలగు మయ జాతివారేయనియు, ఒక వాదమున్నది. అదింకను స్థిరపడలేదు.

ఈ దృష్టితో పురాణాలను చదువుటవలన మనము చాలాచిక్కులను విడదీయగలమని తలతును. ఈదృష్టితోనే నేనీచర్చను చేయుచున్నాను.

మన పురాణాలన్నింటిలో కొన్ని సామాన్యధర్మములు కానవచ్చుచున్నవి. అన్ని పురాణాలలోను, వంశావళులు,

నీతులు, ధర్మములు, సృష్టిక్రమమును, వర్ణించియున్నారు. ఈ సృష్టిక్రమములోనే భూగోళపరిజ్ఞానము చేరియున్నది. ప్రాచీనకాలములో పురాణకర్తలు తమకు తెలిసిన దేశాలను వర్ణించుటయేకాక తాము ఇతరులవలన విన్నసంగతులను గూడ చేర్చినారు. దధిక్షీరాది సప్తవిధ సముద్రాలుండినట్లు, చిత్ర విచిత్రజాతులు, అనగా యక్షరాక్షస గంధర్వాదు లుండినట్లును, వ్రాసినారు. ఇందు చాలావరకు సత్యమే యిమిడియున్నది. ఇప్పటి కాలమందును ఒక్కొక్క దేశా నికి అనేక నామములున్నవి. ఆ కాలమందును విదేశములకు మనపూర్వీకులు తమకుతోచిన పేరులనుపెట్టి వ్యవహరించిరి. టైగ్రిస్ అనెడు నది ఖాల్డియాలోనిది. అది బాణమువలె మహావేగముతో ప్రవహించును. అందుచేత ఆభాషలో టైగ్రిస్ అనగా బాణము. మన పూర్వీకులు శరావతి అను ఒకనదిని పేర్కొనిరి. అది యీ టైగ్రిస్ నదియేయైయుండును. యూఫ్రటీస్ అనెడు నది "యూ—భరతస్" అనున దనియు, భరతునిపేర దానికాపేరు మనవారు పెట్టియుండిరనియు ఒక చరిత్రకారుడు వ్రాసినాడు. ఆక్సస్ నదిని ఇక్షునది అనినట్లు న్నది. రెడ్‌సీ అను ఇంగ్లీషు పదమునే మన పూర్వీకులు లోహిత సముద్రము అని రామాయణములో వాడినారు. ఆ సముద్రములోని ఎర్రని ఛాయవలన ఈ పేరు వచ్చుటచే మనవారివలెనే ఇంగ్లీషువారును దానికి "రెడ్‌సీ" (ఎఱ్ఱసము ద్రము) అని పేరుపెట్టి యుందురు. ఇదేవిధముగా యక్ష, రాక్షస, కిన్నర, నాగ, వానరాది జాతులు మనుష్యులు కానట్టి భూతములు, జంతువులు, అని మన పౌరాణికులు

పొరపాటుపడిరి. ఆదిపౌరాణికుల కాభ్రమ లేకుండెను. తర్వాత పురాణాలను పెంచినవారికి ఆదికాలపువారికుండు భౌగోళిక జ్ఞానము లేనందున వారిట్టి పొరపాటులు చేసినవారైరి. యక్షాది జాతులవారందరునూ మనుష్యులే. వీరందరునూ అనార్యులై యుండిరి. ఈ చర్చ "వానర రాక్షసతత్త్వము" అను ముందు ప్రకరణములో చేయుదును. ఇక రామాయణములో వాల్మీకికి తెలిసియుండిన ప్రపంచభూగోళ మెట్టిదో విచారింతము.

రామాయణములో నాలుగుతావులలో సందర్భాను సారముగా భూగోళ పరిస్థితులు కొన్ని తెలుపబడినవి.

౧. శ్రీరాముడు విశ్వామిత్రునితో ఆశ్రమమునుండి జనకరాజు రాజధానివరకు ప్రయాణము చేయుట.

౨. భరతుడు తనతాత నగరములోనుండగా అతనిని పిలుచుకొని వచ్చుటకు వెళ్ళినవారిమార్గము, మరియు భరతుడు తన తాతయింటనుండి అయోధ్యకు వచ్చినమార్గము.

3. రాముడు వనవాసార్థమై చేసిన ప్రయాణములు.

౪. సీతాన్వేషణమునకై సుగ్రీవుడు ప్రపంచము యొక్క నాలుగు దిక్కులకు తన వానర సైన్యములను పంపునప్పుడు వర్ణించిన భూభాగములు.

ఈ నాలుగున్నూ వాల్మీకియొక్క భూగోళపరిజ్ఞాన మెట్టిదో మనకు తెలుప గలుగుచున్నవి. అందుచేత ఈ నాల్గింటిని వరుసగా విచారింతును.

౧. విశ్వామిత్రునితో రామలక్ష్మణులు ప్రయాణమై నప్పుడు అయోధ్యను వదలి సరయూనదినిదాటిరి. తర్వాత సరయువు గంగతో సంగమగు తావునుచేరిరి. అదే అంగ దేశమని విశ్వామిత్రుడు తెలిపెను. ఆ సంగమస్థానమున గంగనుదాటిన వెంటనే "అవిప్రహతమును" "ఘోరసంకా శమును" అయిన అరణ్యమును వారు ప్రవేశించిరి. (బాల. ౨౪-౧౨) ఇచ్చట గమనింపవలసిన దేమనగా సరయూ సంగమమగు గంగకు దక్షిణతీరమునుండి అరణ్యము ప్రారంభ మగుచుండెను. రాముని కాలములో ఆర్యావర్తమున కదొక హద్దుగా కనబడుచున్నది. ఈ విషయము నింతలో చర్చింతును. ఈ యడవిలోనే మలద, కరూశ దేశములుండెను. వీటిని తాటకియు, ఆమె కొడుకగు మారీచుడును పాలించి జనులను పీడించుచుండిరి. ఈ దేశములను తాటకావన మనియు అనుచుండిరి. దీనిని దాటినతర్వాత సిద్ధాశ్రమమను పేరుగలది యుండెను. ఆ ప్రాంతమందే పూర్వము బలిచక్రవర్తి రాజ్యము చేసియుండెనట. ఆ సిద్ధాశ్రమమందే విశ్వామిత్రుడుండెడివాడు. ఇది మొదటి ఘట్టము. విశ్వామిత్రుడు కొంతకాలము తర్వాత రామలక్ష్మణులను మిథిలలోని జనకుని ఆస్థానమునకు పిలుచుకొనిపోవు మార్గమును ఇక విచారింతము.

మిథిల హిమత్పర్వత సమీపమందుండెనని తెలిపినారు. సిద్ధాశ్రమమునుండి వారు మొదట శోణనదిని చేరిరి. అచ్చట అయిదు పర్వతములుండెను. అందుచేత ఆ ప్రాంతమును గిరివ్రజ మనుచుండిరి. అది మగధదేశమునకు రాజధాని.

దాని కుత్తరమున గంగానదినిదాటి విశాలనగరిని చేరిరి. దాని కుత్తరమున గౌతమాశ్రమ ముండెను. అచ్చటనే అహల్య యుండెను. అటు తర్వాత వారు మిథిలకు వెళ్ళిరి.

౨. భరతుని పిలుచుకొనివచ్చుటకు దూతలుపోవు మార్గమునుగురించి యిదివరలో కొంత వ్రాసినాను. దానినే యిచ్చట వివరించుచున్నాను. దూతలమార్గ మిట్లుండెను. అయోధ్యకు పడమరగా వారు ప్రయాణముచేయుచు వెళ్ళిరి. మొదట అపరతాల పర్వతము. దానికి దక్షిణోత్తరమున ప్రలంబపర్వతము. తర్వాత మాలినీనది. హస్తినాపురము, కురుజాంగల దేశములమధ్యన పాంచాలదేశము. అటుతర్వాత శరదండానది, తర్వాత కుళింగాపురము, ఇక్షుమతీనదిని దాటిరి. తర్వాత బాహ్లీక సుదామ పర్వతములకు మధ్య నుండి దారిబట్టిరి. అచ్చట విపాశానదిని దాటిరి. అచ్చటికి బహుదూరముననున్న గిరివ్రజమను కేకయరాజధానిని చేరిరి. ఇంతకుముందొక గిరివ్రజము వచ్చెను. అది మిథిలకు సమీప మందలిది. ఈ గిరివ్రజము ఈరాక్ దేశము సమీపమందుండి నట్టిది. ఇదేవిధముగా భరతుడువచ్చు మార్గమునుకూడా వాల్మీకి వర్ణించియున్నాడు.

—(అభిలాషులు అయో. ౭౧ స. చూడగలరు.)

ఈ సందర్భములో ఒక్కవిషయమును విచారించ వలెను. భరతుడు తాత యింటినుండి తిరిగివచ్చునప్పుడు ఐరావతములను బహుమానములుగా గొనివచ్చెనని వ్రాసి నారు. ఐరావతములనిన ఏనుగులని అర్థమని అందరెరిగినదే.

దానిపై వ్యాఖ్యాతలు ఇరాపర్వతములలో పుట్టినవి కాన ఐరావతములని పేరువచ్చెనని వ్రాసినారు. ఈ ఇరాపర్వత మెక్కడనున్నదో? మన మెరిగినంతవరకు ఏనుగులు బర్మా దేశములో సమృద్ధిగానున్నవి. అచ్చట ఐరావతీనది ప్రవహించుచున్నది. అందుచేత ఏనుగులకీ పేరువచ్చియుండరాదా? అయితే ఇరాపర్వత మెక్కడనైనా ఉన్నదా అనిన దానిజాడ కానరాదు. "ఐరావతవర్షము" అను దేశము ఆర్కిటిక్ మహాసముద్రతీర ప్రాంతమున నుండెననియు, దాని కాపేరు మన ప్రాచీను లిచ్చియుండిరనియు రాయ చౌధరీగారు (Geographical knowledge of the Hindus) అను గ్రంథములో వ్రాసినారని మరొక చారిత్రకుడు ఉదాహరించియున్నాడు. కాని అట్టి ఆర్కిటిక్ ప్రాంతపు ఐరావతవర్షములో ఏనుగులు లేనేలేవు. సింధునదీ ప్రాంతాలలో ఏనుగులు విశేషముగానుండెను. అందుచేతనే పురుషోత్తముడు అలెగ్జాండరుతో యుద్ధముచేసినప్పుడు ఏనుగులబలముతో ఎదిరించియుండెను. సింధునదికి ఐరావతినది ఒక ఉపనదిగానున్నది. అదే యిందు సూచితమైయుండును.

3. శ్రీరాముడు సీతాలక్ష్మణులతో వనవాసార్థము అయోధ్యను వదలి గంగనుదాటెను. ఆ రెంటికినీ మధ్య ఈ క్రింది ప్రదేశములుండెను. అయోధ్యవద్ద సరయూనది, దానికి దక్షిణములో ఉత్తరకోసల, వేదశ్రుతీనది, గోమతీనది, స్యందికానది, శృంగిబేరము, అచ్చట గంగనుదాటెను. గంగనుదాటిన వెంటనే అరణ్యము మొదలయ్యెను. (అయో. 46-52) -ఈవిధముగా చెప్పుట ఇది రెండవమాట.

గంగదక్షిణమున వత్సదేశముండెను. గంగాభాగీరథీ సంగమస్థానమందు ప్రయాగ. దానికి ౧౦ కోసులదూరములో చిత్రకూట పర్వతముండెను. (అయో. ౫౪-౨౮) దీనినిబట్టి ఇప్పుడు హంపీవద్ద ఒక చిత్రకూటమున్నదని చెప్పుచున్నారు. అది వేరనియు, రాముడు నివసించిన చిత్రకూటము ప్రయాగ వద్దదే యనియు గ్రహింపవలెను. చిత్రకూటమువద్దనే తమస. అదే వాల్మీకిస్థానము.

చిత్రకూటమునుండి రామాదులు యమున, కాళిందీ నదులు దాటిరి. చిత్రకూటమువద్దనే మాల్యవతీనదియు కలదు. రాముడు ప్రయాణముచేసిన లెక్కనుబట్టి అయోధ్యకు చిత్రకూటము ఇంచుమించు ౫ దినాల ప్రయాణము దూరముండునట్టిది. అటుపై రాముడు దండకారణ్యమును ప్రవేశించి అందలి "జనస్థానము" అను దేశమందు సంచరించుచు గోదావరీనది సమీపమందుండు పంచవటిని చేరెను. అచ్చటనే పర్ణశాలను నిర్మించుకొని కొంతకాల ముండెను.

పంచవటి యెచ్చటిది?

వాల్మీకి రామాయణములో పంచవటి గోదావరికి సమీపములో ఉన్నదని తెలిపినారు.

గోదావర్యా స్సమీపేచ మైథిలీ తత్ర రంస్యతే. [అర. ౧౩-౨౧]

అట్లుండగా నాసిక్ ప్రాంతములో ఒక పంచవటి యున్నదని మహారాష్ట్రులందురు కాని అది రామాయణ మందుదాహృతమైనది కానేరదు, రాముడు వెళ్లిన బాటను

బట్టి యిప్పుడు భద్రాచలమునకు ౩౦ మైళ్ళ దూరములో పంచవటి యను ప్రసిద్ధినొందిన స్థలమె సరియైనదిగా కనబడు చున్నది. ఇంగ్లాండులోని ప్రసిద్ధులగు యం. వీ. కీబేగారు తాము ఇంగ్లీషుపత్రికలలో వ్రాసిన సుమారు రామాయణ వ్యాసముల ప్రతులను నాకంపినారు. అందు ఒకదానిలో వారొక పటమును వ్రాసి అందిట్లు చూపించినారు. "శోణనదికి దక్షిణములో ఇప్పుడు కైమూర్ అనబడు పర్వతము గట్టు లున్నవి. వాటికి దక్షిణములో అగస్త్యాశ్రమమున్నది. దానికి తూర్పున పంచవటికలదు. దాని దక్షిణములో క్రౌంచ పర్వతము, దీనికి దక్షిణములో పంప, కిష్కింధలు కలవు. అచ్చటికి సమీపమందే అమరకంటక పర్వతములుకలవు. ఆ పర్వతములందే లంక యుండెను. అమర కంటక పర్వతాలలో ఇప్పుడు గోండుజాతివారున్నారు. వారే ప్రాచీన రాక్షసులు. ఈ లంక నర్మదానది పుట్టుతావునకలదు." దీనినిబట్టి ఈక్రింది అంశములు తెలియవచ్చును. నర్మద అమరకంటక పర్వతాలలో పుట్టినది. ఆ పర్వతాల కుత్తరమున క్రౌంచము, దాని కుత్తరమున పంచవటియు కలవు. అయితే రామాయణములో పంచవటి గోదావరికి సమీపమందున్నదని వ్రాసినది తెలిపియున్నానుగదా. ఆ విషయ మబద్ధమగునా? కానేరదు. శ్రీ కీబేగారి నిర్ణయము తప్పగుచున్నది.

సీతాపహరణమైన తర్వాత రామలక్ష్మణులు సీత నన్వేషించుచు పంచవటిని వదలి దక్షిణమార్గముగా వెడలి క్రౌంచారణ్యమును దాటిపోయిరి. ఈ క్రౌంచారణ్యము దండ

కారణ్యమునకు దక్షిణభాగము. ఇచ్చటనే "జనస్థానము" అను దేశముండెను. ఈ జనస్థానములో రాక్షస సంచారముండెను. పంచవటి కుత్తరమునుండి జనస్థాన మారంభమగునని తలపవచ్చును. అచ్చటినుండి మరికొన్ని అరణ్యములను దాటుచూ వెళ్ళినతర్వాత పంపాసరస్సు వచ్చెను. అచ్చటనే ఋశ్యమూక పర్వతముండెను. అచ్చటినుండి ఒక దినప్రయాణములో మహేంద్రగిరి ఇది రాముని వనవాస భూగోళము.

౪. సుగ్రీవుడు సీత నన్వేషించుటకై తన వానరులకు నాలుగు దిక్కులలోని దేశములను గురించి వివరించిచెప్పెను. ఈ భాగమే ముఖ్యమైనట్టిది. అయోధ్యను ముఖ్యకేంద్ర స్థానముగా చేసికొని వాల్మీకి తనకిప్పుడు తెలిసినంతవరకు ప్రపంచ భూగోళమునంతయు ఒక్కమారు మనకు సింహావలోకనముచేసి చూపించినాడు. దానినిట్లు నిరూపించెను.

తూర్పు దిక్కు

గంగానది, సరయూ, కౌశికీ, యమునా, కాళిందీ, సరస్వతీ శోణనదులు. శైలకానన శోభితమైన కాలక(వన)ము, బ్రహ్మమాలదేశము, విదేహ, మాళవ, కాశి, కోసల, మగధ, పుండ్ర, వంగ, కోశకారుల పట్టణము. అటుతర్వాత సముద్రము, మందర పర్వతము, దానికి తూర్పులో ద్వీపములున్నవి. అందలి జనులు వికారచిత్రరూపులును, పురుషాదులును" (అనగా మనుష్యులను తినువారును) నై యుండిరి. ఆ ద్వీపములలో ముఖ్యమైన వేవనగా, రత్నములకు ప్రసిద్ధి కల యవద్వీపము, బంగారుగనులుకల సువర్ణరూప్యమను

ద్వీపము. ఆ ప్రాంతమందే శిశిరము అను పర్వతమున్నది. ఆ ద్వీపముల కింకను పూర్వపున ప్లక్షద్వీపము కలదు. అటు తర్వాత శాల్మలీ ద్వీపమున్నది. ఆ ప్రాంతములోనే రక్త జలము ఇక్షుసముద్రము క్షీరసముద్రమును కలవు. కట్టకడపట ఉదయపర్వతమున్నది.

ద క్షి ణ ది క్కు

వింధ్యపర్వతము, నర్మదానది, గోదావరి, కృష్ణ, వరదానది, మేఖలానది, ఉత్కలానది, దశార్ణ దేశము, అశ్వవంత నగరము, అవంతీదేశము, విదర్భ ఋషిక దేశము, మాహిషక దేశము, వంగ, కళింగ, కౌశిక, దండకారణ్యము, ఆంధ్ర దేశము, పుండ్ర దేశము, చోళ, పాండ్య, కేరళ, సహ్యాద్రి, కావేరి, మలయపర్వతము, తామ్రపర్ణి, దానికి దక్షిణములో మహేంద్రపర్వతము, దానికి ౧౦౦ యోజనముల దూరములో లంకకలదు. లంకకు దక్షిణమున ౧౦౦ యోజనముల సముద్రము దాటినతర్వాత పుష్పితక మను పర్వతము. తర్వాతసూర్యవంత పర్వతము,వైద్యుతపర్వతము, భోగవతీ నగరము, ఋషభ పర్వతము, తర్వాత పితృలోకము.

ప డ మ టి ది క్కు

సురాష్ట్రదేశము, బాహ్లికము, తర్వాత కొన్ని ఎడారులు, మురచీపట్టనము, జటీపురము, అవంతి, అంగలోపము, సింధుసాగర సంగమము, దానివద్దనున్న హేమగిరి, అటు తర్వాత సముద్రముపై వెళ్ళవలెను. వెళ్ళినచో ౧౦౦ యోజనముల పొడవుగల పారియాత్ర పర్వతము కలదు. అటు

తర్వాత వజ్రమను మహాపర్వతము, చక్రవంత పర్వతము, వరాహపర్వతము,అచ్చటనే ప్రాగ్జ్యోతిషమను నగరమున్నది. తర్వాత మేఘవంతము, మేరుపర్వతము, అస్తగిరి.

ఉత్తర దిక్కు

మ్లేచ్ఛదేశము, పుళింద, శూరసేన, ప్రస్థల, భరత దేశము, దక్షిణకురు దేశము, మద్ర, కాంభోజ, యవన, శక, ఆరట్టక, బాహ్లీక, ఋషిక, పౌరవ, టంకణ, చీనా, పరమ చీనా, విహార, దరద, హిమాలయము, కాళపర్వతము, సుదర్శనపర్వతము, దేవసఖ పర్వతముకలవు. దేవసఖపర్వతమును దాటితే అక్కడ ౧౦౦ యోజనముల విస్తీర్ణము కల "శూన్య" ప్రదేశముకలదు. అందు నదులు వృక్షాలు లేవు. ఏజంతువున్నూ అచ్చట నివసించదు. దానిని దాటితే కైలాసపర్వతము వచ్చును. తర్వాత క్రౌంచపర్వతము కామ్యపర్వతము, మానసపర్వతము, మైనాకము, వైఖానస సరస్సు. ఆ ప్రాంతములను సూర్యచంద్రుల సంచారములేదు. అచ్చట నివసించు తపస్సిద్ధుల స్వయంప్రభలు వెలుగుచు సూర్యకాంతివలె ప్రకాశించుచుండును.

గత స్త్రిభి రివార్కస్య సతు దేశః ప్రకాశతే
విశ్రామ్యద్భి స్తపస్సిద్ధై ర్దేవకల్పై స్స్వయంప్రభైః.

(కిష్కి. ౪౩-౩౮)

దానితర్వాత ఉత్తరకురు దేశమున్నది. దానితర్వాత ఉత్తరసముద్రము. అందు సోమగిరి కలదు.

విమర్శ

వాల్మీకికి తెలియవచ్చిన ప్రపంచపు నాలుగు దిక్కుల లోని దేశపర్వతనదుల వివరమీ విధముగా నున్నది. అయితే అదంతయు సరిగా ఉన్నదని చెప్పుటకువీలులేదు. క్రీ. పూ. 326 ప్రాంతాలలో గ్రీకులకు సింధునదికి తూర్పున ఇక ప్రపంచమే లేదను భావనయుండెను. అందుచేత అంతకన్న చాల ప్రాచీనుడైన వాల్మీకికి ఇతర దేశముల సంగతులును బాగుగా తెలియకుండిన అది తప్పుకాదు. నేను మొదలే తెలిపినట్లుగా ఇప్పుడు ప్రాచీన దేశాదినామములు మారి పోయినవి. అయినను కొన్నిమాత్ర మింకను గుర్తించి యూహించవచ్చును. వాల్మీకి చూపించిన వాటిలో కొన్ని అస్తవ్యస్తమైనవి. కొన్ని రెండుమూడు దిక్కులలో ఉండి నట్లు తెలిపినాడు. తూర్పున పుండ్ర, వంగ దేశంబు లున్న వన్నాడు. మరల అవే పుండ్ర, వంగ దేశములు దక్షిణము లోను ఉన్నవన్నాడు. బాలకాండములో తెలిపిన అంగదేశ మిచ్చటలేదు. దక్షిణములోని పుండ్రదేశము ఓఢ్రదేశమై యుండవచ్చును. ఎందుకనగా దాని వెంటనే ఆంధ్రదేశము పేరుచెప్పినాడు. అవంతిని దక్షిణములోను, పడమటను ఉండినట్లు తెలిపినాడు. బాహ్లీక ఋషిక దేశములు రెండు దిక్కులలోను ఉదహరింపబడినవి.

ఇక మనకు ఇప్పుడు అగ్రముకాని దేశసముద్ర ద్వీపా దులను గురించి ఆలోచింతము. మన ప్రాచీనులు, వ్యాపారము చేయుటకై సముద్రముమీద ఇతరదేశములకువెళ్ళి అచ్చటి విశేషములను కథలుగా పెంచి మనదేశమువారికి వర్ణించి

యుందురు. మరియు ఇతర విదేశముల పేరులను మనవారికి తెలుపగా వాటికి సమానధ్వనిగల సంస్కృతనామములను మనవారు వాడియుందురు. ఇక్షుక్షీర ఘృతదధి సముద్రాలిట్టివే. ఈనాటివరకు మన పల్లెలలో మళయాళమును ఆడు మండలరాజ్య మని ఎన్నియో కథలు కల్లలు అల్లి వర్ణించుటను మనము వినుచున్నాముకదా. అటులే మన ప్రాచీనులు విదేశములను గురించి తాము విన్న విషయములను పెంచి ఊహించి వ్రాసిరి. తర్వాత పురాణాలను పెంచువారు ఆదికర్తలు వాడినపదములకు అర్థమున్నదని తలచి ఇక్షుక్షీరాది శబ్దముల నాధారముగాచేసికొని మరికొన్నికథలు తమ బుద్ధి కుశలత కొలది అల్లి మనకర్పించి పోయినారు. తుదకు మన పురాణాలు మన వారికే అబద్ధాల పంచాంగము వంటివై పోయినవి.

తూర్పు దిక్కుననుండు ద్వీపములలో కొన్నింటిని మనము గుర్తింపవచ్చును. వాల్మీకి తూర్పుదీవులలో మనుష్యులను తినువారున్నారని వ్రాసెను. నేటికిని మనకుతూర్పున నుండు పాసిఫిక్ (శాంతి) మహాసముద్రములోని ద్వీపములందు కొన్నిట నివసించు ఆదిమనివాసులు మనుష్యులను తినువారని (Cannibals) పాశ్చాత్యులిప్పటికి వర్ణించి తెలుపుచున్నారు. వాల్మీకిచూపించిన యవద్వీపము, ఇప్పటి జవద్వీపము (Java) సువర్ణరూప్యక ద్వీపమే సుమిత్రా (Sumatra) ద్వీపము. దానికి తూర్పులో ప్లక్షద్వీపము, శాల్మలీద్వీపము, ఇక్షుక్షీరసముద్రములు కలవనినాడు. ఇవి ఇప్పటికి కలవుకాని తూర్పులో లేవు. ఇవి మనకు పడమట నున్నవి.

కిష్కింధకు తూర్పున బ్రహ్మమాలదేశ మున్నదని నారు. ఇప్పుడు ఒరిస్సాలో కాంగోలు బారామహల్ అను జిల్లాకలదు. ఇది ఊర్ధ్వాపదముగా కనిపించుచున్నది. ప్రాచీన బ్రహ్మమాలయే యీ రూపమును పొందెనేమో అని ఒక ఊహను తెలుపుకొనుచున్నాను.

లంకకు చాలా దక్షిణములో భోగవతీనగరి మున్నదని వ్రాసినారు. అది యవద్వీపములో కలదు. పడమటిదిశలో ఎడారులున్నవని తెలిపినారు. బహుశా అవి రాజపుత్రస్థానపు ఎడారియగు తార్ ఎడారి సూచనగా ఉండును. మధ్య ఏషియాలో గోబీ అను ఎడారికలదు. దానిని మన పూర్వులు వాలుకార్ణవము అనినట్లున్నది. కాని అది ఉత్తరదిక్కున నున్నది. అందుచేత అది యిచ్చట సూచింపబడలేదు. ప్రాగ్జ్యోతిషము పడమటిదని రామాయణమందున్నది. అది ఆసాం ప్రాంతములోనిదని చరిత్రకారుల అభిప్రాయము. మేరుపర్వతము పామీరుపర్వతాలే అని నే ననుకొనుచున్నాను. ఈరానుకు త్తరమున సుమేరు అనునదికలదు. అది హిందూకుషి పర్వతాలలోనిది. అచ్చటనే మేరోస్ (Meros) అను పర్వతమున్నదని ఆరియన్ అను ప్రాచీన చారిత్రకుడు వ్రాసెను.† పామీరు పర్వతమే మేరువని నేనీ కారణముచే అనుచున్నాను. పామీర్ అనునదే పాయెమేర్ అను శబ్దము. దానికి పార్సీభాషలో మేరువుయొక్క పాదుఅని అర్థము. దానితో తూర్పువరకు వ్యాపించిన పర్వతాన్ని మనము హిమాలయ మనుచున్నాము. అట్టి హిమాలయములోని ఒక

---

† రసాతల by నందలాల్ దేవ్. పుట. ౧౨.

దేశము కాశ్మీరము. కాశ్మీరపదముకూడా మేరుశబ్దమును పట్టించి యిచ్చుచున్నది. మేరువు సకాశములో ఉంకు దేశము కావున, కాశమేరు అయియుండును. క్రమముగా అది కాశ్మేరమయి, తుదకు కాశ్మీర అయియుండును.

ఇక వాల్మీకి చూపించిన ఉత్తర దిక్కులోని దేశ పర్వతాలనుగూర్చి ఆలోచింతము. మొదటిది మ్లేచ్ఛదేశము. ఇదే చర్చలో 21 వ ప్రకరణములో ఫనికియా దేశమువారు మోలచ్ అను దేవునికి నరబలులు ఇచ్చుచుండిరనియు అట్టి మోలచ్ దేవపూజకులు కావున, వారు మ్లేచ్ఛులుగా పరిగణింపబడి యుందురనియు నే నమకొని వ్రాసినాను. మాక్సు మూలర్ పండితుడిట్లు అభిప్రాయ మిచ్చియున్నారు. "హిందూస్థానమునకు పశ్చిమములోనున్న బెలూచీజాతియే‡ మ్లేచ్ఛజాతి". మాక్సుముల్లరు అభిప్రాయముకూడ సరిగాదను కొందును. పతంజలి కాలమువరకు ఆర్యులు సింధునదినుండి బిహార్ వరకును వింధ్యపర్వత ప్రాంతమువరకును వ్యాపించి యుండిరి. ఇప్పటి పశ్చిమోత్తర సరిహద్దు సూబా (N.W.F. Province) లో హజారా అను జిల్లాకలదు. దానిలోమలచ్ అనుతాలూకా స్థానముకలదు. అది పతంజలి కాలమందు ప్రసిద్ధమైయుండును. మలచ్ మండలమువారిని మ్లేచ్ఛులని ప్రాచీనులని యుందురు. అది హిమాలయ పర్వతాలలోనిది. అచ్చటి కొండజాతులు నేకును అనాగరికులైన ఆఫ్రీడీ, మహ్మండ్, వజీరీ జాతులవారు. వారందరును మన ప్రాచీను

‡ **Max Muller's Science of Language Vol. I. P. 93.**

లకు మ్లేచ్ఛులే. వారిభాష మోటుగను అస్తవ్యస్తముగను నుండుటచేత వ్యాకరణాధ్యయనము చేయనివారు అపభ్రంశ వాక్కు కలవారై మ్లేచ్ఛతుల్యులగుదురని పతంజలి వ్రాసెను. నాయభిప్రాయములో పైసరిహద్దులోని మలచ్ గల హజారా జిల్లాయే ప్రాచీన మ్లేచ్ఛమండలము. భరతదేశమొకటి పశ్చిమములో నున్నదని వాల్మీకి వ్రాసినాడు. ఇప్పుడు మనము హిందూస్థానమునంతను భరతదేశ మనుచున్నాము. కాని వాల్మీకికాలములో మద్రదక్షిణ కురుదేశముల మధ్యభాగమునే భరతదేశ మనినట్లున్నది. అది ఈరాక్ దేశమునకు సమీపదేశమగుటచేత నేను ఈ ప్రకరణాదిలో తెలిపినట్టి యూఫ్రటీస్ "యూ-భరతస్" నదికిని సంబంధించియుండును. యవనపదము ప్రాచీన హీబ్రూలో జవన్, యవన్ అను వానికి సంబంధించినదిగా తెలిపియున్నారు. సాధారణముగా యవన అనునది అయోనియా (గ్రీసు) ద్వీపాలకు వర్తించునందురు. ఇక్కడ అంతదూరపు ముచ్చటలేదు. కాన జవన్ అను రాజుపేర బరగిన ఏషియామైనరులోని భూభాగమునకు ఇది వర్తించియుండును. బాహ్లీకను గురించి యిదివరకే తెలిపినాను§. చీనాదేశమును గురించి యిందు తెలుపబడినది. క్రీస్తునకుపూర్వము యించుమించు ౨౨౧ సంవత్సరముల కాలమునాడు చీన్ అను చక్రవర్తి రాజ్యము చేసిననాటి

§ భారతములో బల్హిక అనియు బాహ్లిక అనియు రెండు పేరులు వచ్చును. ఇది ఇప్పటి పశ్చిమోత్తర సీమలోని భాగమే. పర్షియాలోనుండు బల్ఖ్ అనునదే బల్హికా అని కొందరు. అధివేరు ఇదివేరు.

నుండియే చీనా దేశమునకు ఆ పేరు కలిగెను. అందుచేత చీనా దేశము పేరు మనవాఙ్మయములో ఎందు కానవచ్చినను అది క్రీ. పూ. ౨౨౦ తర్వాత మచ్చటగానుండును. ఈదృష్టితో చూచిన ఈ చీనా పదసంబంధమగు శ్లోకము రామాయణ మందు ప్రక్షిప్తమనవలెను. దరద అనునది కాశ్మీరములోని "దరద్దేశము" అను మండలమని నేననుకొను చున్నాను. ఈ పేరు కాశ్మీరములోని మండలమున కుండెనని కల్హణుడు తన రాజతరంగిణిలో పలుమారులు వర్ణించియున్నాడు. హిమాలయముదాటి ఇతర పర్వతాలను దేశాలనుకూడ దాటి వెళ్లిన ఒకగొప్ప "శూన్య" దేశము వచ్చునని వాల్మీకి వ్రాసెను. ఆ శూన్యప్రదేశములో వృక్షములు లేవనియు ఏప్రాణియు జీవించదనియు వర్ణించినాడు.

అట్టి ప్రతీతికలది మృతసముద్రము, డెడ్ సీ (Dead Sea) అనునట్టిదని మన మెరుగుదుము. అయితే యిదొక్కటే కాదు. ఇంకను అట్టి రెండు సముద్రములు డెడ్ సీని మించి నవియు. దానికంటె చాలా పెద్దవియు నగునవికలవు.

కకేషస్ పర్వతాలకు దక్షిణభాగములో రెండు పెద్ద సరస్సులున్నవి. ఒకటి వాన్ సరస్సు. అది సముద్రముకంటె ౫౦౦౦ అడుగుల తక్కువలోతులో నున్నది. రెండవది ఉరు మియూ సరస్సు. అది సముద్రముకంటె ౪౦౦౦ అడుగుల తక్కువలోతులో ఉన్నది. అందే ప్రాణులును జీవించవు. డెడ్ సీ అనునది సముద్రముకంటె ౧౩౦౦ అడుగుల తక్కువ లోతులో ఉన్నది. బహుశా రామాయణములో [illegible]

బడిన శూన్యప్రదేశము వాన్ ఉరుమియా సరస్సులను సూచించును. పూర్తిగా ఉత్తరములో ఉత్తరసముద్ర మున్న దనినారు. అనగా అది ఇప్పటి ఆర్కిటిక్ మహాసముద్రము; దాని సమీపములోనే వైఖానసులను తేజోమూర్తులు నివసించు చున్నారనియు, ఆ ప్రాంతములో సూర్యచంద్రుల సంచారము లేనందున దేశమంతయు అంధకారమయ మనియు, అచ్చట మునుల తేజస్సు "స్వయంప్రభ"తో కూడి నట్టిదనియు ఆ స్వయంప్రభ మూలాన ఆ దేశమందు పెద్ద వెలుతురు ఏర్పడుచున్నదనియు రామాయణమందు వర్ణించి నారు. (కిష్కి. ౪3-3౮) ఇదేమి చిత్రము? ఆర్కిటికు సముద్రప్రాంతములో రష్యా ఉత్తరభాగమున్నది. అచ్చట ఆరు నెలలు పగలు ఆరు నెలలు చీకటియని ఇప్పటి భూగోళ శాస్త్రముద్వారా మన మెరుగుదుము. ఆరు నెలల చీకటి కాల ములో అచ్చటి నివాసులకు ప్రకృతి సహాయపడుచున్నది. అచ్చట అప్పుడప్పుడు గొప్ప వెన్నెలవంటి ఒకజ్యోతి ఆకాశములో వెలుగుచుండును. దానినే ఇంగ్లీషులో ఆరోరా బోరియాలిస్ (Aurora Borialis) అని యందురు. దానినే మన వాల్మీకి "స్వయంప్రభ" అని అన్నాడని నేనూహించు చున్నాను. వైఖానసులు అడవిలో ఉండేవారని భావము. ఆరోరా వెలుగునట్టి ఆర్కిటికు ప్రాంతమందే సైబీరియాదేశ మున్నది. అది యీనాటివరకును మహారణ్యమయ ప్రదేశమై యున్నది. ఇంతవరకు నాకు స్ఫురించిన భావములను తెలుపు కొన్నాను. ఇంకను కొన్ని విషయములను గురించి తెలుప వలసియున్నది. అవంతి యనునది ఇప్పటి అహమదునగరు

ప్రాంతములోనిదని కొందరు చరిత్రకారు లనినారు. మాళవయే యవంతియని నందలాల్ దేవ్ గారు వ్రాసిరి. అది ఇప్పటి మట్రా అనునదనియు ఉజ్జయినియొక్క రాజధానిగా నుండెననియు మిత్రా అనువారు వ్రాసినారు‡. 'కళింగము' సుప్రసిద్ధమే. మహానదీ గోదావరీ మధ్యప్రదేశము. తూర్పుతీరభూమి. విదర్భ యిప్పటి బీరారు మండలము. అయితే ఈ విదర్భ సుగ్రీవునియొక్క కిష్కింధకు దక్షిణములో నుండలేదు. వాల్మీకియొక్క అయోధ్యకును, తమసానదికిని దక్షిణములో నుండినది. ఉత్తరదిశలో టంకణ అను దేశముండెనని వాల్మీకి వ్రాసినాడు. అక్కడిదో తెలియదు. టెంకణ దేశమొకటి యుండెను. అది కావేరీప్రాంతముది. ఈ పదములోని అర్థముకూడా అది దక్షిణములోనిదనియే తెలుపుచున్నది. (తెం లేక టెం అనిన దక్షిణము. కణ లేక కడ అనగా దిక్కు) పుండ్రదేశము అంగవంగ దేశములవద్ద నుండెను. దానివద్దనే మగధదేశము, సహ్యాద్రి అనునది ఇప్పటి పడమటి పర్వతములు (ఘాటులు) మహేంద్ర పర్వతము, ఇప్పటి ఒరిస్సా దక్షిణభాగములో తూర్పు సముద్రతీరమున నుండు తూర్పుపర్వతములు (ఘాటులు); కాని రామాయణములో ఇది దక్షిణదిశలోనున్నట్లు వ్రాసినారు. అంటే అయోధ్యకు దక్షిణమందేకాని కిష్కింధకు మాత్రము తూర్పుననే అని సరిపెట్టుకొనవలెను. ఇదేవిధముగ గంగా, యమునా, సరయూ, శోణాది నదులన్నియు కిష్కింధకు ఉత్తరముగనున్నవి. కాని అవి అయోధ్యకు తూర్పుగా

‡ Pre-historic India by Panchanan Mitra.

పారుచున్నవి. సుగ్రీవునిచేత కిష్కింధా నగరమునుండి భూగోళశాస్త్రము చెప్పించినప్పుడు వాల్మీకి అయోధ్యను దృష్టిలో నుంచుకొనకుండ వ్రాయలేకపోయెను.

ఇప్పటి తూర్పుఇండియా దీవులగు జావా సుమిత్రాల తర్వాత శాల్మలీద్వీపము కలదనియు, ఆ ప్రాంతములోనే ఇక్షుక్షీరాది సముద్రము లున్నవనియు వాల్మీకి తెలిపినాడు. కాని యివి మన హిందూస్థానమునకు పడమటనున్నవి. తూర్పుసముద్రములలో రక్తజలము కలిగిన లోహితసాగర మున్నదని వాల్మీకి తెలిపినాడు.

"తతో రక్తజలం భీమం లోహితం నామ సాగరం" (కి. ४०-3౮) అర్థమునుబట్టి లోహితసాగర మనగా ఎర్ర సముద్రము. అనగా ఇది ఇంగ్లీషులో రెడ్ సీ అగును. అయితే బ్రహ్మపుత్రానది పారునట్టి అస్సాం (కామరూప) ప్రాంతములో లౌహిత్య అను పేరుగల ఒకలోయ (valley) కలదని సు. మ. శాస్త్రిగారు కనింగ్‌హాం గ్రంథ టీకలో ఒకచోట వ్రాసినాడు. అదే వాల్మీకి సూచించిన "సాగరము" అనగా నదీప్రాంతము అని యర్థముచేసిన చేయవచ్చును. శాల్మలీ ద్వీపమే ఖాల్డియాదేశము. నందలాల్ దే అనువారు ఇట్లు వ్రాసినారు: "మహాభారత భీష్మపర్వ ౧౧ వ అధ్యాయములో శకద్వీపముచుట్టును క్షీరసాగర మున్నదని వర్ణించినారు. కాస్పియన్ సముద్రమును షీర్వాన్ సముద్రమని యందురు."[4] ఖాల్డియా దేశమే శాల్మలము. దానివద్దనే

---

[4] Rasatala by Nandalal Dey P. 68.
షిర్వాన్ అనునది పార్సీ పదము. షిర్ అనగా క్షీరము.

ఘృతసముద్రమున్నది. "దానినే ఇరిధ్రియా (Erythria) అని యిప్పుడు పాశ్చాత్యు లుచ్చరించుచున్నారు."[5] "ఇక్షుసముద్రమునే ఇప్పుడు ఇంగ్లీషులో ఆక్సస్ (Oxus) నదియని పిలుతురు."[6]

ఈ నది మధ్యఏషియాలోని అరల్ (Sea of Aral) అను సముద్రములోనికి పారుచున్నది. ప్రాచీనార్యులు సముద్రమునకు, నదులకు, సరస్సులకును, సముద్రమనియే వాడినట్లున్నది. చిత్రవిచిత్రములుగా తర్వాతి పౌరాణికులు ఊహించి వర్ణించిన సప్తసముద్రముల యాథార్థ్యమును నందలాల్ దే గారిట్లు నిరూపించినారు.

"షీర్వాక్ (కాస్పియన్ సముద్రము) క్షీరసముద్రమయ్యెను. సరైన్ (Sarain) అనునది సురసముద్రమయ్యెను. ఇరిధ్రాస్ అనునదే ఘృతసముద్రము. దహి అనునదే దధిసముద్రము.[7]" ఆక్సస్‌నది ఇక్షుసముద్రమయ్యెను. "చాదున్ (Tcha-dun) అనునదే స్వాదుజల మయ్యెను.[8]"

ప్రాచీన హిందువులు ప్రపంచాన్ని సప్తద్వీపములుగా విభజించిరి. అవెట్టివో నందాలాల్‌గారిట్లు తెలుపుచున్నారు. "ద్వీపమనగా (ద్వి+ఆప) రెండుదిక్కుల నీరుండు ప్రదేశము.

[5] రసాతల. పుట. ౧౩౪

[6] ,, ,, ౧౩౫

[7] దహి అనునది దధి అను పదమే. ఇప్పటికి ఉర్దూలో దధిని దహి అని యందురు.

[8] రసాతల. పుట. ౧౩౬

ఆనీరు సముద్రము కానక్కరలేదు, నదికూడ కావచ్చును. కావున ద్వీపమనగా నీటిమేరకల ఒక భూభాగమను నర్థములో ప్రాచీనులువాడిరి. ఏడుద్వీపము లేవనగా (౧) జంబు, (౨) శక, (౩) శాల్మల, (౪) పుష్కర, (౫) కుశ, (౬) క్రౌంచ, (౭)ప్లక్ష.[*] ప్లక్షద్వీపమునే కొన్నిపురాణాలలో గోమేద లేక శ్వేతద్వీపమనియు చెప్పినారు. ఇప్పటి భూగోళపరిభాషలో పై ద్వీపము లీవిధముగానున్నవని యెరుగవలెను. (౧)జంబూ ద్వీపమనగా హిందూస్థానము. ప్రాచీనార్యులకు సింధునదీ ప్రాంతభూములే మొదట పరిచయమయ్యెను. ఆపరిచయము లోని మొదటి పరిచయము ఇప్పటి కాశ్మీరురాజు పరిపాలన లోని జమ్మూఒకటి. ఆ జమ్మూపదమే జంబూ పదమైయుం డును. ఆ పేరునే హిందూస్థానమున కంతయు ప్రాచీనార్యు లిచ్చియుందురు. తర్వాతికాలములో సింధులే హిందూనామ మును మొత్తము దేశానికి ఈరానీలు, గ్రీకులు ఇయ్యలేదా? కావున నా అభిప్రాయములో జమ్మూ మండలమునుండియే జంబూద్వీపనామ మేర్పడియుండును. (౨) శకద్వీపము అనగా సితియా (కాస్పియన్ సముద్ర దక్షిణభాగము). ఈ కాస్పియన్ సముద్రానికి షీర్వాన్ అని మరొకపేరు. ఈ శకద్వీప మునే పూర్వము సగ్దియా అని అచటివారనిరి. (సగ్దియా (Sogdia) అనగా సగ్ + దియా. సగ్ = శక, దియా = ద్వీపము) (౩) శాల్మలీద్వీపమే ఖాల్దియా (౪) పుష్కరద్వీపమున్ను

[*] నా అభిప్రాయములో అట్లుకాదు. హూణుల ప్రాముఖ్యము క్రీ. పూ. ౫వ శతాబ్దమునకన్న ముందునకుపోదు. క్రీ. పూ. ౧౦వ శతాబ్దమునందే ఖాల్దియాకు ఉత్తరములో కాపి లేక కస్పి అనుజాతివారుండిరి. వారినే ఇంగ్లీషులో కస్పైట్ అని యందురు. కస్పిలందు భాగమే కుశద్వీపమైయుండును.

ట్రాన్సు ఆక్సేనియా (Trans-Oxania) అని యందురు. అనగా ఆక్ససునది కవతలనుండు భాగము. దీనినే ఇప్పుడు బుఖారా (Bukhara) అని యందురు. ఈ శబ్దము పుష్కరశబ్ద సారూప్యము కలది. (౫) కుశద్వీపమువద్ద సురసముద్ర ముండె నన్నారు. కాస్పియన్ సముద్రానికి సరైన్ (Sea of Sarain) అను మరొక పేరున్నది. అదే సురసముద్రము. సరైన్ అను నది షీర్వాన్ అనుదాని అపభ్రంశమైయుండును. కుషానులు అను హూణజాతి వారినుండి కుశ అనుపేరు వచ్చియుండును. లేదా కకేసస్ పర్వతమునుండియైన ఈ కుశ అనుపేరు వచ్చియుండును. ఎందుకనగా కకేసస్ అనుదానిని కోహ్ కుస్ అని అన్నారు. దానినే పురాణాలలో కుశేశయ పర్వతమని అనినారు. (౬) క్రౌంచద్వీపము వద్దనే దధిసముద్రము. అనగా అరల్ సముద్రము (Sea of Aral) దహియు అను శకజాతి యుండెను. ఆజాతిపేరుతో ఈ దధిసముద్ర మేర్పడియుండును. † తూర్పు తుర్కిస్థానములో కుచర్ అను మండల మున్నది. అది ప్రాచీనమందు బౌద్ధమత ప్రచారస్థానముగా ఉండెను. అదే ఈ క్రౌంచముగా నుండును. (౭) ప్లక్షద్వీపమే శ్వేతద్వీపము. స్వాత్ (Swat) అనునది పారునట్టి దేశమే శ్వేతద్వీపము.

ఇది ఆల్టాయి పర్వతప్రాంతాలలో నున్నది. దీనివద్ద స్వాదుజల సముద్రమున్నది. అనగా ఆల్టాయి ప్రాంతమందలి మంగోలియాలో "ఛాదూన్" (Tcha-dun) పారుప్రదేశము.

---

† ఇప్పటికిని భూగోళపటములో దహి (Dahae) దేశము అనుదానిని చూపించుచున్నారు.— సం ప్ర.

శ్వేతద్వీపమందే ఉత్తరకురుద్వీపమున్నది. అనగా కొరియా (Kor-ia) దేశము."[10] కాని నాయభిప్రాయములో ఇది ఉత్తరకురుదేశము (ఆఫ్ఘనిస్థాన్ ప్రాంతముది)

పై ద్వీపాలలో శకద్వీపమును పూర్వము శకసేనదేశమనిరి.[11] కస్సి లేక కుష్ అను జాతివారినుండియే హిందూకుష్ పర్వతనామ మేర్పడినది.[12] మ్లేచ్ఛులు ప్రచేతసరాజు సంతతివారని పురాణాలలో తెలిపినారు.

సుగ్రీవునిచే వర్ణింపజేయబడిన భూమండల భాగముల లోని విశేషభాగమును ఇప్పటి భూగోళశాస్త్రమునుబట్టి తెలుసుకొనినాము. ఇక మూడు విషయాలను గురించి ఆలోచించి యీ చర్చను ముగింతును. ఆ మూడేవనగా (౧) కిష్కింధ ఎక్కడనున్నది? (౨) లంక ఎక్కడనున్నది? (3) ఆర్యావర్తమేది?

## కిష్కింధ ఎచ్చట నున్నది?

ఇంతదూరము చర్చించినను కిష్కింధ ఎచ్చట నున్నదో విచారించలేదు. కిష్కింధ ఇప్పటి హంపీప్రాంతము లోనిదని అందరునూ అంటున్నారు. యం. వీ. కిబేగారు మాత్రము అది నర్మద పుట్టినట్టి ప్రాంతములో దీని కుత్తర భాగమున నున్నదని చూపించినారు. అచ్చటనే పంపా సరస్సుకూడా కలదని వారు తెలిపినారు. పంచానన మిశ్రగా

10 రసాతల-పుటలు: ౧౩౨ నుండి ౧౪౦ వరకు.

11 అసీరియా-జెడ్. ఏ. రగో[illegible]

12 ,, ,,

రిట్లు వ్రాసినారు. "బళ్లారినుండి ధార్వాడుకు వెళ్లుమార్గ ములో ఒకపెద్ద మిట్టకలదు. అచ్చటిజనులు దానిని హిడింబ సమాధి అని యందురు. ఇదే రామాయణములో చెప్పబడిన కిష్కింధ.[13] వాల్మీకివ్రాసిన ప్రకారము రాముడు గోదావరీ తీరమందలి పంచవటినుండి సీత నన్వేషించుచు దక్షిణముగా కదలివచ్చెను. అచ్చట అరణ్యములో విరాధుని చంపెను. అక్కడినుండి యింకను దక్షిణముగా ప్రయాణమై ఋశ్య మూక పర్వతమునకు వచ్చెను. ఇప్పుడు హంపీ అనబడు బళ్లారిజిల్లాలోని స్థలముచుట్టుముట్టియుండు ప్రదేశములలో పంప, ఋశ్యమూకము, మున్నగు ప్రదేశము లుండెనని స్థానికులందురు.

లాంగ్‌హర్స్టుగారు ఇట్లు వ్రాసినారు. "రామాయణ ములో వర్ణింపబడిన కిష్కింధ హంపీ ప్రాంతములోని దను టలో సందేహములేదు."

అందువల్ల వర్ణింపబడిన స్థలములు హంపీ చుట్టుపట్టుల కలవు. పంపాతీర్థమే పంపాసరస్సు. అది ఆనెగొందివద్దకలదు. తుంగభద్రకే ప్రాచీనకాలమందు పంపానది యని పేరుండె నని చెప్పుదురు. ఋష్యమూకపర్వతము నిజాముదాజ్యము సరిహద్దులో కలదు. మతంగ పర్వతము హంపివద్దనే కలదు. హంపీయాత్రికులకు స్థానికాభిమానులు రామాయణ ఘట్ట ములను, వాలివధ జరిగిన స్థలము మున్నగువాటిని చూపింతురు.[14]

---

[13] Prehistoric India by Panchanan Mitra.
[14] Hampi ruins by A. H. Longhurst P. P 7,8

లంక యెచ్చట ?

ఇదే గడ్డు ప్రశ్న: అదెక్కడ ఉన్నదో నాకు తెలియ రాదని ముందే తెలుపు కొనుచున్నాను. రామాయణ మీా విషయములో మన కేమియు సహాయము చేయదు. పైగా చిక్కులు తెచ్చిపెట్టి యున్నది. అందరునూ ఇప్పటి సింహళద్వీపమే లంకయనియు, అచ్చటనున్న సేతువే రాముడు కట్టిన వారధియనియు, అది రామేశ్వరమువద్ద నున్నదనియు అందుచేతనే అది ముఖ్యతీర్థస్థల మైనదనియు అందురు. కాని ఈ అభిప్రాయమునకు తగిన ఆధారములు కానరావు. యం. వీ. కీబేగారిట్లన్నారు. "నర్మదానది పుట్టుస్థానము అమరకంటక పర్వతము అను కొండలు. ఈ అమరకంటక పర్వతములు నేటి రీవా సంస్థానములోనున్నవి అచ్చటనే సేదు పుష్పరాజగఢ్ అను అడవికలదు.† అందు గోండు లుందురు.

అట్టి అమరకంటక దక్షిణ భాగములోనే లంక యున్నది.[15] ఈ సిద్ధాంతములో ఒక్క లోపమున్నది. నర్మదకు దక్షిణములో గోదావరికలదు. అచ్చట పంచవటి యుండెను. దానికి చాలాదూరమున దక్షిణమందు కిష్కింధ యుండెననియు, దానికి చాలాదూరమందు దక్షిణములోను సముద్రమును ౧౦౦ యోజనముల దూరము దాటినతర్వాత

† పుష్పితక పర్వతము దక్షిణమం దున్నదని (అనగా అయోధ్యకు దక్షిణమందని) వాల్మీకిచెప్పెను. ఈ పుష్పరాజగఢ్ అదే అయి యుండును.
—సు. ప్ర.

[15] Mr. M. V. Kibe's Cultural descendants Ravana in Studies in Indology, P. 264.

లంకయుండెననియు రామాయణములోనున్నది. అందుచేత కీబేగారివాదము సరిగానున్నట్లు కానరాదు.

ఇక రామాయణములో ఏమన్నారో చూతము. హను మంతుని యాజమాన్యములో సీతాన్వేషణమునకై కొందరు వానరులు కిష్కింధకు దక్షిణముగా ప్రయాణముచేసిరి. అట వింధ్యపర్వతములోని గుహలను వెదకిరి అని వ్రాసినారు. వింధ్యపర్వతము కిష్కింధకు చాలా ఉత్తరములో నున్నది. ఇదెట్లు సరిపోవును. వింధ్యపర్వత మన మధ్యహిందూదేశము లోని పర్వతమొకటేకాదు. దక్షిణ హిందూస్థానములోను కొన్ని పర్వతభాగాలుగూడ పౌరాణికులు పొరపడియో, లేక తెలియకనో వింధ్యనామముతో పేర్కొనిరని కొందరు చారి త్రకు లనుచున్నారు.

అటులే సరిపెట్టుకొని ముందుసాగుదము. బహుకాలము హనుమదాదులు సీతాన్వేషణముచేసి తుదకు సంపాతిచే ప్రబోధితులై లంకయుండెడి దిక్కెనెరిగి మహేంద్ర పర్వత మునకు బోయిరి. ఆ మహేంద్రగిరి సముద్రతీరమందున్నది. కాని అది కిష్కింధకు దక్షిణమునగాక తూర్పుననున్నది. ఇప్పటి ఒరిస్సారాష్ట్రములో అదియున్నది. తూర్పుగట్లు అను పేరుగల యీస్టరన్ ఘాట్లకు అది మకుటాయమాన మహీధరము. మహేంద్రగిరి అయోధ్యకు దక్షిణమున నున్న దని సరిపెట్టుకొని ముందుకు సాగుదము. అక్కడినుండి ౧౦౦ యోజనముల దూరములో దక్షిణపుదిక్కుగా లంక కలదని రామాయణములో వర్ణించినారు. ఒరిస్సాలోని మహేంద్ర గిరి నుండి యిప్పటి సింహళము ఇంచుమించు ౧౦౦ యోజన

ములు అనగా ౮౦౦ మైళ్లుండును. కాని రామేశ్వరమువద్ద దీనిని చేరుటకు వీలైయుండగా ౧౦౦ యోజనములు ఒకే దుముకుతో ఆకాశములో ఎగిరి హనుమంతునికి పోవలసి వచ్చిన శ్రమయెందుకు కలిగెను? మహేంద్రగిరికిని లంక కును మధ్య భూభాగమే లేనట్లును ఒకే అగాధమగు సముద్ర మున్నట్లును వర్ణించినారుకదా! ఆ లెక్కచొప్పున దక్షిణ మునకు మారుగా మహేంద్రగిరికి తూర్పుదిక్కునసే చాలా దూరమువరకు సముద్రమున్నది. అట్లు వెళ్ళినచో మహేంద్ర గిరినుండి ఇంచుమించు ౬౦౦ మైళ్లదూరమున అండమాన్ దీవులును, నికోబార్ దీవులును ఉన్నవి.

ఆ దీవులలో మనుష్యులను తినువారును క్రూరులును అనాగరికులును ఆటవికులును అగు నివాసులున్నారు. నిజమే కానిఆ దీవులలో రావణాదుల రాజ్యముండినట్లుకాని, వాటికి లంకలు అనుపేరు లుండినట్లుకాని, నాగరికత చెందినవిగా నుండినట్లుకాని కానరాదు.

శ్రీ రాముడు సుగ్రీవహనుత్సమేతముగా వానర సైన్యముతో లంకపై దండెత్తినప్పుడు కిష్కింధనుండి మహేంద్రగిరికి ఒక్కదినములో ప్రయాణము చేసెనని రామా యణములో వర్ణించినారు. ఒక్కదిన ప్రయాణము పొసగదు. పొసగునని యనుకొందముగాక, ఒక్కదిన ప్రయాణము దూరములోనున్న మహేంద్రగిరికి ౧౦౦ యోజనముల దూరముననున్న లంకను, దాని నేలు ప్రబలుడైన రావణుని సుగ్రీవు డెరుగలేకపోయెనా? అంతమాత్రము పదికై కోట్ల కొలది వానరమూకను నేల నాలుగు చెఱగులం శోధించుటకై

మాసకాలావధితో పంపించనేల? మూడు మాసాలకు మిం చిన కాలమువరకు హనుమదాదులు వెదుకనేల? వెదకిరిపో, సైన్యముతో రాముడు కిష్కింధనుండి మహేంద్రగిరికి ఒకే దినములో ప్రయాణమెట్లుచేసెను? వానరులు ఆకాశములో పోయినట్లుకాని, రామలక్ష్మణులనుగూడ ఆకాశములో తీసు కొని పోయినట్లుకాని తెలుపక పాదచారులై వెళ్లినట్లే వర్ణించి నారు. కొందరు సనాతనపండితులు లంకఎన్నడో మునిగి పోయిన దందురు. ఏమి నిదర్శనము? వారి పదవాక్య ప్రమాణమే! అదిచాలదు. ఒప్పుకొనుటకు వీలులేదు. మరి లంక యెక్కడనున్నట్లు? ఈ సందర్భములో నాకుతోచిన యూహలను నెల్లడింతును. హిందూస్థానపటమును చూచిన దక్షిణములో తిరువాన్కూరుకు పశ్చిమభాగములో "లక్కా దీవ్సు" Lakadives అను చినచిన్న ద్వీపాలుకలవు. దీవ్సు అంటే దీవులు. కావున ఆపదము లక్కాదీవులు అగును. లంకాదీవులు అనుధ్వనికి దగ్గరగానున్నది. ఈ దీవులే లంకా ద్వీపమైయుండునా అని పలుమారు అనుమానించినాను. కాని ఆ దీవులలో జనులు నరభక్షకులు (Cannibals) అగుదురో కాదో, వారాటవికులో కారో, తెలియరాలేదు వాల్మీకి రామాయణములో వానరసైన్యము మహేంద్రగిరికి నడిచె నన్నప్పుడు లక్కాదీవులకు వెళ్లువారు తూర్పునకు వెళ్లుటకు వీలుండదు. వారు పశ్చిమముననే వెళ్లియుందురు. వాల్మీకి దిశలను నిరూపించుటలో పలుమారు పొరపాటు చేసినందున వానరసైన్యము పశ్చిమముననే వెళ్లెననియు సహ్యాద్రి పర్వ తాలను పేర్కొనుటకు మారుగా మహేంద్రగిరిని పేర్కొనె

ననియు సరిపెట్టుకొనవలసి వచ్చును. లక్కాదీవులను సమర్థించుకొనుటకై ఈ విధముగా అన్నియు సరిపెట్టుకొనుట తగదు. అందుచేత భవిష్యత్పరిశోధకుల కొకసూచనచేసి ఈ యూహను పరిహరించి మరొకయూహను తెలుపు కొందును. నాకు బహుకాలమునుండి మరొక సందేహము కలుగుచుండెను. లంక అను పదము గీర్వాణపదముకాదు. అది తెనుగు దేశపు ఆదిమనివాసుల పదమేయైయుండును. గోదావరి కృష్ణా డెల్టాభూములను లంకలు అని నేటికిని అందురు. అట్టిలంకయె యేదోయొక గోదావరిలంకయె రావణుని లంకయై యుండును. గోదావరీ నదినిదాటి రాముడు లంకను ముట్టడించి యుండును. ముండాలు అను జాతివారు చాలా ప్రాచీనులు. దక్షిణాపథమందలి ఆదిమనివాసులు వారిని మహాభారతమందును పేర్కొనియున్నారు. అట్టి ముండాజాతిలోని ఒక శాఖకు "ఉరోవన్" అను పేరుకలదు. నేటికిని తమిళభాషలో రేఫకుముందు ఇకారమునుచ్చరింతురు. [వ్రాయుదురు. ఉరోవన్ అనునది రోవన్ అగును. అనగా రావణ అను శబ్దమునకు సమీపమన్నమాట. ఈ ఉరోవన్ జాతివారు నేటికిని ఆటవిక స్థితిలోనున్నారు. విశేషమేమనగా తాము రావణసంతతి వారమని చెప్పుకొనుచున్నారు. అనగా రావణ శబ్దము జాతిబిరుదమేకాని ఒకవ్యక్తి నామముకాదు. రావణుడు ఉరోవన్ జాతిలోనివాడనియు వారిరాజనియు ఊహించిన రావణుని లంకయు ముండాజాతి వారుండు ప్రదేశమందే యుండియుండును. రావణుని సేనానులగు ఖరశూర్పణఖలు జనస్థానములోని పరిపాలకులు. "జనస్థానము" అనుపదమునకు [illegible]

జైతాన్‌పదమే యైయుండును. కావున ముండాలు సవరులు ఉండు ప్రదేశాలలోనే లంకను వెదుకవలెనని నేను సూచిస్తున్నాను. బాలకాండలో (3-౨౫) "లంకామలయదర్శనం" అని లంకయు మలయమును రెండును కలిపి చెప్పినారు. మలయ శబ్దమునకు పర్వతమని యర్థము (మలయః పర్వతాంతరే, పర్వతాంశే, ప్రియోధ్యానే—అని రత్నమాల) మలయ శబ్దము ద్రావిడశబ్దమేమో? నల్లమల, ఎఱ్ఱమలలు, దక్షిణాపథములోనివి. మలయజము చందనము దక్షిణముదే. మలయానిలము దక్షిణవాయువే! మలై యని తమిళమందు మలయమని తెనుగునందు కలవు. మలయమువలెనే లంకయు దాక్షిణాత్యపదమైయుండును. తూర్పు మలలలోని (Eastern ghats) లంక కావున "లంకామలయ"మన్నారని యూహింపవచ్చును.

సీతాన్వేషణ సమయములో సుగ్రీవుడు చూపి చెప్పిన స్థలము లెచ్చటెచ్చటివో చాలవరకు నిరూపించినాను. అందింకను కొన్ని స్థలములనుగురించి తెలుసుకొందము. ఈక్రింది వాటిని గురించి నందలాల్‌దేవ్ తన ప్రాచీన హిందూ భూగోళములో నిట్లు తెలిపినారు.

కరుశ అనునది బీహారులో షాహాబాదుజిల్లా తూర్పు భాగము. ఇక్షుమతీనది రోహిల్ ఖండులోని కాలీనది. దశార్ణము ఇప్పటి ఛత్తీస్‌ఘఢ్‌జిల్లా. ఆరట్టకము పంజాబుదేశము. మందరగిరి భాగల్పూరు జిల్లాలోనిది.

ఆర్యావర్తమేది ?

ఇది మరొక గడ్డుప్రశ్న. దీనిపై పెద్దపెద్ద గ్రంథాలు వ్రాసినారు. ఆర్యులు మధ్యఏషియానుండి హిందూస్థానములోనికి వచ్చిరనియు, ఉత్తరధ్రువ ప్రాంతమునుండి క్రమముగా క్రిందికి దిగుచూ దిగుచూ సింధునదీ ప్రాంతములోనికి వచ్చిరనియు కొందరు వ్రాసిరి. అదంతాతప్పు, ఆర్యు లీ దేశము వారే అని మరికొందరు వ్రాసిరి.

నా యభిప్రాయములో రామాయణ కాలముకంటె చాల పూర్వమందు ఆర్యావర్తమనిన, కాస్పియన్ సముద్రము నుండి హిందూకుష్ హిమాలయములవరకు ఉత్తరసీమగాను, కాస్పియన్ సముద్రమునకు, పెర్షియన్ గల్ఫునకు మధ్యనున్న అసీరియా బాబిలోనియాలు పశ్చిమసీమగాను, సింధునది తూర్పుసీమగాను, అరేబియన్ సముద్రము దక్షిణసీమగాను కలిగియుండిన ఆ మధ్యప్రదేశమంతయు ఆర్యావర్తముగా పరిగణింపబడుచుండెను. రామాయణకాలమునాటికే ఆ సీమ పశ్చిమములో తగ్గిపోయెను. అప్పటికే మీడ్ జాతి, మీడియా దేశమువారు (అజామీళుని సంతతివారు) మరియు ఈరాన్ వారు (పర్షియావారు) ఆర్యులనుండి భిన్నించిరి. తర్వాత పతంజలి కాలమునాటికి ఆర్యావర్తపు సీమాంతములు (సరిహద్దులు) ఈ విధముగా నుండెను. పతంజలి పాణినీయ ౬-౩-౧౦౯ సూత్రమగు "పృషోదరాదీని యథోపదిష్టం" అను దానిపై వ్యాఖ్య వ్రాయుచూ ఇట్లు చర్చించినాడు :

"కః పున రార్యావర్తః ?"

"ప్రాగాదర్శాత్ ప్రత్యక్ కాలకవనాత్, దక్షిణేన హిమవంతం ఉత్తరేణ పారియాత్రం ఏతస్మిన్ ఆర్యావర్తే నివాస, యే బ్రాహ్మణాః కుంభీధాన్యా అలోలుపా అగృహ్యమాణకారణాః కించి దంతరేణ కస్యాశ్చి ద్విద్యాయాః పారంగతాః తత్రభవంతః శిష్టాః".

అనగా ఆర్యావర్తమునకు పశ్చిమమున ఆదర్శపర్వతములును, తూర్పున కాలకవనమున్నూ, ఉత్తరమున హిమాలయమున్నూ, దక్షిణమున పారియాత్రమున్నూ సీమాంతములుగా ఏర్పడియున్నవి. పతంజలి క్రీ. పూర్వము ౨౦౦ నుండి 300 ఏండ్ల ప్రాంతమందుండినాడని చెప్పెదరు. కావున నేటికి ౨౨౦౦ ఏండ్లక్రిందట ఆర్యావర్తమునకు ఒక నిర్ణయమగు భౌగోళికస్వరూప మేర్పడెనని చెప్పవచ్చును. అయితే ఈ ప్రదేశాలేవో మనము నిరూపింపగలమా అనునదే ప్రశ్న. మనుస్మృత్యాదులలోను, కొన్ని పురాణాలలోను ఆర్యావర్తమును గురించి వర్ణించియున్నారు. పురాణాలు క్రీ. శ. ౧౦ వ శతాబ్దమువరకు పెరుగుచూ వచ్చినందున మన్వాదిధర్మశాస్త్రాలు పరస్పర భిన్నమైనవిగాను మధ్య మధ్య స్వార్థుల హస్తలాఘవముచే అందందు తారుమారైనవిగాను ఉండుటచేతను, పతంజలి భాష్యాని కట్టి అవస్థ పట్టుటకు వీలులేనందునను నేను పతంజలినే ఉదహరించినాను. ఇక పతంజలి నిరూపించినసీమ లేవో నిర్ణయింప ప్రయత్నింతము.

నాలుగు హద్దులలో హిమవంతము అను దానిని మాత్రము మనము తటాలున గుర్తింపగలుగు చున్నాము.

అది ఇప్పటి హిమాలయపర్వతము. అయితే హిమవంతమను పర్వతమింకొకటికూడా ఉండినట్లున్నది. మావర్ అను ఇంగ్లీషు గ్రంథకర్త క్రీ. శ. ౧౮౧౨లో తాను ప్రకటించిన గ్రంథములో ఇట్లు వ్రాసెను. "సితియనులు (శకులు) ఇమాస్ (Imaus) పర్వతమువద్ద నివసించుచుండిరి".[16] అయితే సుప్రసిద్ధమగు మన హిమవత్పర్వతము మనకు తెలిసిన దుండగా ఎక్కడనో శకదేశములో కకేసస్ పర్వతప్రాంతాలవరకువెళ్ళి అప్రసిద్ధమును అస్పష్టమునుఅగు ఇమయుస్ లేక ఇమాన్ అను పర్వతమును ఉదహరించుట ఏల? ఒక కాలములో అంతవరకును ఆర్యావర్తము వ్యాపించియుండుటచేత దానిని సూచించుచు భావిపరిశోధకుల కదియు దృష్టిలోనుండవలెనని వ్రాసినాను. కాని మన పతంజలి చెప్పినది హిమవత్పర్వతరాజమే అని నేను విశ్వసించుచున్నాను. ఇక తూర్పున కాలకవనము ఉన్నదని వ్రాసినారు. అదెచ్చటిది? సుగ్రీవుడు వానరులకు తూర్పు భూభాగమును సీతాన్వేషణకై వర్ణించునప్పుడు ఇట్లన్నాడు:

> "సరస్వతీంచ సింధుంచ శోణం మణినిభోదకం,
> మహీం, కాలమహీం చైవ శైలకాననశోభితాం. —కిష్కి. ౪౦-౨౧.

ఇచ్చట నాలుగుపేరులు తెలిపినాడు. సరస్వతీనది, శోణనది, మహియనుదేశము, శైలకాననములతో కూడిన కాలమహిప్రదేశము. ఇందు సరస్వతీనదిమాత్రము సింధూనదివద్ద నుండునట్టిది. అయోధ్యకు చాలా పడమట నున్నది. శోణనది పాటలీపుత్రమువద్ద అయోధ్యకు తూర్పుదిక్కున

[16] Universal History by Mavor (1812)

గంగతో కలియుచున్నది. కావున పాటలీపుత్ర ప్రాంతమందే మహీదేశమున్నూ, కాలమహియున్నూ ఉండి యుండును. "కాలమహి" శైలములతోను అడవులతోను శోభించునట్టిదని వర్ణించినారు. ఈ కాలమహియే పతంజలిచెప్పిన కాలకవన మని నే ననుకొనుచున్నాను. కావున ఆర్యావర్తమునకు పతంజలి కాలమునాడు పాటలీపుత్ర ప్రాంతమందలి కాలక వనము తూర్పు హద్దైయుండెను. రెండు హద్దులను నిర్ణయించి నాము. ఇక దక్షిణపు హద్దేదియో కనుగొందము. ఆర్యావర్తమునకు దక్షిణమున పారియాత్రమున్నదని పతంజలి చెప్పెను. అదెక్కడనున్నది? రాధాకుముదముఖర్జీగారు తమ హిందూ సివిలిజేషన్ అను గ్రంథములో ప్రకటించిన పట ములో "పారిపాత్ర పర్వతములు" అని వ్రాసినారు. పారి యాత్రకే పారిపాత్రమను పేరు పలుతావుల కనబడుచున్నది. ఆ పర్వతమును వారు వింధ్య కుత్తరముగాను, ఆభీర నిషధ దేశములమధ్య నుండునదిగాను, సాళ్వదేశమునుండి నిలువుగా నిషధవరకు వ్యాపించినదిగాను చూపించినారు. పారియాత్రము లేక పారిపాత్రము వింధ్యపర్వతాల కుత్తరముననుండు పర్వతము పేరని ఇతర భూగోళశాస్త్రజ్ఞు లంగీకరించి యున్నారు. నందలాల్ దేవ్ గారిట్లన్నారు. "నర్మదానది నుండి కాంబే అఖాతమువరకు వ్యాపించిన వింధ్యపర్వతాల యొక్క పశ్చిమభాగమే పారియాత్రము". ఇప్పటికి మూడు హద్దులయ్యెను. ఇక మిగిలినది పశ్చిమపుహద్దు. అదియే నాకు తెలియరానట్టిది. కావున తుదిలో చర్చించుటకై ఆగి తిని. దానినిగూడ ఊహాతోనైనను ఏదోఒకటిగా నిర్ణయించి

వేయుదము. హిందూస్థాన పశ్చిమభాగములో అనగా బెలుచిస్థాన సరిహద్దులోగాని కాశ్మీరులోగాని ఆదర్శపర్వతములెచ్చటనున్నవో పరిశోధకు లెవ్వరును తెలుపలేరు. ఆదర్శమనునది పర్వతమని "అదర్శాదయః పర్వతవిశేషాః" అని టీకలో వ్రాసినారు. అట్టి పర్వతమేదో నాకు కానరాలేదు. పర్షియా (లేక ఈరాన్) దేశములో సీస్థాన్ అను మండలమున్నది. అందు హామూన్ జిర్రా (ఝురీ) సరస్సు ఉన్నది. దానిలోనికి హెన్‌రూడ్ అను నదిపాఱును. దాని ఉపనది పేరు అద్రస్‌కుండ్ అను నదికలదు. అనగా ఆదర్శకుండ నది. ఈ విషయమును గురించి "గజెటియర్ ఆఫ్ ది వరల్డు" అను గ్రంథములో ఇంచుమించు ౧౨౦ ఏండ్ల క్రిందట వ్రాసినారు.[17] పర్షియా సంబంధమగు ఇతర గ్రంథాలలో ఈముచ్చట కానరాదు. ఇదే సరియగునదైనచో ఆర్యావర్తముయొక్క-పశ్చిమహద్దు ఈరాన్‌లోని తూర్పుమండలమును ఆక్రమించుకొనుచున్నది. అది ఆశ్చర్యజనకముకాదు. కన్నింగ్‌హాం వ్రాసిన ఇండియా ప్రాచీన భూగోళము అను నాంగ్లగ్రంథమునకు విపులమగు పీఠిక వ్రాసిన సురేంద్రనాథ మజుందార్ శాస్త్రిగారు కాలకవనమును గురించి, "ఆదర్శ" మును గూర్చియు ఇట్లు వ్రాసినారు.

---

[17] "Adraskand–Adruskand a river in Seistan which rises to the N. W. of Ghore and flowing S.S.W. past Subzawive is continued in the Hen Rud river which flows in lake Hamoon Zerrah—Gazetteer of the World. Vol. I.

"వసిష్ఠబౌద్ధాయన సూత్రాలలో ఆర్యావర్తము సరస్వతీనదికి తూర్పునను, కాలకవనమునకు పశ్చిమమునను, పారిపాత్ర కుత్తరమునను, హిమాలయమునకు దక్షిణమునను ఉండినట్లు వ్రాసినారు. ఇందుల చిత్రమేమన ఋగ్వేదార్యుల నివాసభూమియగు బహుభూభాగమును ఈ స్మృతికారులు ఆర్యావర్తమునుండి వదలివేసినారు. ఆదర్శ అనిన ఏమి? బుహ్లార్ గారు అదర్శన లేక వినశన అనగా సరస్వతి కావున అదే ఆదర్శమై యుండవచ్చును అని ఊహించినారు. ఇది సరిగా కానరాదు..................ప్రయాగయే కాలకవనమని నే ననుకొందును.........ఆర్యావర్తమునకు పడమటిహద్దు అయిన ఆదర్శము ఎచ్చటనున్నదో ఏ పరిశోధకుడునూ దానిని నిరూపించలేదు. బృహత్సంహితలో (౧౪–౨౫) యమున, త్రిగర్త మున్నగువాటితో కూడ ఆదర్శను చెప్పినందున ప్రాచీన శ్రుఘ్న దేశమునకు, త్రిగర్తదేశమునకును (కాంగడాకు) సమీపములో నుండునని ఊహింపవచ్చును."

ఇక నేను చూపించిన ఆదర్శమన్నట్టిది ఒకనది. అది హామూన్ జిర్రాలోనికి పారును. జిర్రా అనిన సరస్సు. పైశాస్త్రిగారు దాని విషయమై యిట్లన్నారు. సరస్వతిని 'హారహ్వతి' అని యందురు. అది పర్షియాలోని ఒకనది. సరస్సు కలది కావున సరస్వతి. అది హామూన్ సరస్సులోనికి పారును". అదేసరస్సులోనికి నేను తెలిపిన ఆదర్శకుండనది పారును. ఇది పతంజలినాటిమాట. అశోకుడు ఆఫ్ఘనిస్థానమును

పర్షియాలోని కొంతభాగమును జయించియుండెను గదా. అందుచేత ఇందు అసంగతము కానరాదు.

రామాయణకాలముకంటె పూర్వకాలములో ఆర్య జాతి ఒక ప్రసిద్ధజాతియై యుండెను. కేవలము వైదికార్యులే కాక ఈరాక్‌లోని పారసీకులు అనగా జరథుస్త్ర మతాను యాయులుగా నుండిన ఈరానీలు, మీడులు (మీడియా వారు) కాషి, కస్సి, కుష్ అను పేరులుగల జాతి, వీరందరునూ ఆర్యులమని చెప్పుకొనిరి. ఈ విషయమును గురించి మాక్సుమూలర్ (మోక్షమూల) పండితుడిట్లు వ్రాసెను. "ఆర్యశబ్దము √ అర్ అను ధాతువునుండి ఉత్పన్నమైనది. దానికి వ్యవసాయము చేయుట అని యర్థము. తుర్వాసులు (గుఱ్ఱములమీద వేగముగా ఎల్లప్పుడు సంచారముచేయు తురాన్ జాతివారు) తమకు భిన్నులని సూచించుటకు ఆర్యులీ పదమును తమకు ప్రయోగించుకొనిరి. ఆర్య అను పదము జాతివాచకము (a national name). మనుస్మృతిలో ఆర్య భూమి, ఆర్యదేశము అని ఆర్యావర్త పర్యాయపదములుగా వాడబడినవి. జెండు భాషలో ఐర్య (airya) అనగా పూజ్యుడు అని యర్థము. సింధూనది, పర్షియాఖాతము (gulf), హిందూకుష్ పర్వతము, కాస్పియా సముద్రము, ఈ నాల్గింటిమధ్య నున్న దేశమును స్ట్రాబో (అను ప్రాచీన చరిత్రకారుడు) ఆర్యాణ (Ariana) దేశమని చెప్పెను. అట్టి ఆర్యాణమునకు బాక్ట్రియా (Bactria) తిలకాయమానమగు మండలమనియు చెప్పెను. (క్రీస్తునకుపూర్వము చాలా శతాబ్దములకు ముందుండిన) హేరొడోటస్ కంటె ఇంకనూ పూర్వికుడైన హెల్లా

మియస్ అనునతడు ఇప్పటి పర్షియాను ఆర్య దేశము (Aria) అని పేర్కొనెను. ఎలమైస్ (Elymais) అను పదము ఐలమ (ailama) నుండియు, అదియు ఐర్యాణనుండియు ఏర్ప డెను."[18] ఒకను మాక్సుమూలర్ గారిట్లు వ్రాసిరి. "పార శీకులు, బాక్ట్రియావారు, మీడులు, సగ్డియావారు స్ట్రాబో కాలమువరకు ఒకే భాషను మాట్లాడుచుండిరి. తురాన్ జాతికి వీరు భిన్నులై తామందరును ఒకేజాతి వారమని చెప్పికొనిరి. దరయన్ (దారా) పర్షియా చక్రవర్తి తన శాసన ములలో తాను ఆర్యజాతివాడనని వ్రాయించుకొనెను. కకే సస్ కనుమలలో ఒస్సెట్టి (Ossetti) అను జాతి ఆర్యభాషను మాట్లాడుచున్నది. వారు తమను ఐరను (Iron) జాతిగా చెప్పుకొనుచున్నారు".[19] మరల పై పండితుడిట్లు వ్రాసినాడు– "కకేసస్ పర్వతాలపాడవునను ఆక్సస్, జక్సార్టిస్ నదులు పారు ప్రాంతాలలోను ఆర్య, అనార్యజాతులు రెండును కలగలుపు అగుచూవచ్చెను. తుర్వసుడును, అతని సంతతి వారును తురానులైరి. ఆక్సస్ నదికి (పశ్చిమముగా) బహు దూరము వరకును ఆర్యులుండిరి. హిర్కేనియా ప్రాంతములో అరికీ అనుజాతియు, అంతర్యాని అనునదియు కలవు. జర్జిస్ కాలములోని ఒక రాజు అరిపితస్ (ఆర్యపతి) అని వ్యవహ రింపబడెను. థ్రేస్ దేశము ఆర్య (Aria) అని పిలువబడు చుం డెను. విశ్చులా నదివద్ద ఒక జర్మను జాతి అరియై (Arii)

---

[18] Maxmuller--Science of Language, Vol. I, P. 294

[19] " " P. 296

అని పిలువబడుచుండెను.[20] పంచానన మిత్రగారిట్లు వ్రాసి నారు. "జండవెస్టా (చంధోఽఅవస్థా) గ్రంథములో ఆర్య దేశము చెప్పబడినది. నేటి పర్షియాలోని హీరట్ నగరము చుట్టునుండు మండల మంతయు ఆర్యాణమనియు అదే ఆర్య భాషల కేంద్రమనియు ప్రాచీనులు చెప్పుకొనిరి."[21] రగోజిన్ గ్రంథములో ఇట్లున్నది. "ప్రాచీనములో బాక్ట్రియానాను ఆర్యాణము (Ariana) అని పిలుచుచుండిరి. అదే ఏరాన్ (Eran) తుదకు ఈరాన్ (Iran) అయ్యెను. వీరిలో మొట్ట మొదట ప్రసిద్ధినొందినవారు మీడులు. వారినే బైబిల్‌లో మాదాయ (Madai) జాతి అని వ్యవహరించిరి."[22] ఆర్మీనియా యనునది ఆర్యదేశమే. అందు జండ్ ఆర్యులుండిరి. ఇప్పటి థ్రేస్ దేశాన్ని పూర్వము ఆర్య (Aria) దేశమని పిలిచిరి. ప్రాచీన ఐరిష్ భాషలో ఐరీ (Aire) అనిన రాజపురుషుడు. ఐర్—లెండ్—ఐర్ దేశము అనగా ఆర్యదేశము. గ్రీకుభాషలో ఆర్యన్ అనిన ఉత్తమత్వము. మండాలు (Mandas) అను జాతి తామార్యులమని చెప్పుకొని పశ్చిమపర్షియాలో క్రీ. పూ. ౨౫౦౦ ప్రాంతములో నివసించిరి.

ప్రాచీనార్యుల యాదిస్థానమునుగూర్చి పాశ్చాత్య పరి శోధకులు మధ్యఏషియాయనియు, ఈరాననియు, కాస్పి యన్ ప్రాంతమనియు, రష్యా మధ్య దక్షిణభాగాలనియు,

[20] M. Muller—Science of Language, Vol. I, P. 297

[21] Prehistoric India by P. Mitra.

[22] Z. A. Ragozin's Assyria.

ఆల్టాయి పర్వతోత్తర భాగాలనియు, బహుముఖముల తర్కించినారుకాని ఆర్యులు మొదట హిందూస్థానమువారు కారని యందరును అంగీకరించినారు. యూరోపులోని బ్రెస్లో (Breslau) వాసులగు "ప్రొఫెసర్ ష్రేడర్ (Schrader) అనువారిదిప్పుడు తుదినిర్ణయము (latest theory). అదేమన ఆర్యులు వాల్గానదీ ముఖప్రాంతమందును కాస్పియన్ సముద్రోత్తర తీరములందును మొట్టమొదట నుండినట్టివారు."†

మరొక విశేషమును గమనింపవలెను. ఏషియాఖండ పటమును చూచినట్లైన అందు ఫ్రిజియా అనుదేశము కట్టకడపటి పశ్చిమదేశముగాను మధ్యధరాసముద్ర తూర్పు తీరములో నున్నదిగాను తెలియును. అనగా హిందూస్థానమునకు పశ్చిమముగా ఈరాన్, అసీరియా, సిరియా, ఈరాఖ్ దాటిన నల్లసముద్రమునకు దక్షిణములో ఫ్రిజియాకలదు. ఫ్రిజియావారు ఆర్యశాఖవారు. వారు ఫ్రిజియాకు ఇంకనూ పశ్చిమోత్తరముగానున్న థ్రేస్‌లోకూడా నివాసముచేసిరి. వారు బహుకాలమునరకు తాము 'భృగులము' (Bhryges) అని చెప్పుకొనిరి. ఈ మాటల రగోజిన్ అనువారు వ్రాసిరి.[23] ఈ భృగువంశమువారిలో కొందరు నైరీపీఠభూములలోనికి బోయిరి. అచ్చటి ఆర్మీనియా జాతులకు మూలపురుషులైరి.[24] ఈ విషయమునే బైబిలులోని జెనిసిస్ (సృష్టి ప్రకరణము)

---

† Taraporewala—Elements of the Science of language. P. 332.

[23] Z. A. Ragozin's Assyria.

[24] " "

లోని ౧౦వ అధ్యాయము జాఫెటిక్ వంశచర్యలో తెలిపియున్నారు.[25] పై విషయాలను బట్టి ఆర్యశాఖలు గ్రీసు దేశమువరకుకూడ వెళ్ళియుండెనని తెలియును. మరియు అతిప్రాచీనకాలములో ఆర్యుల కేంద్రము ఈరాన్‌లో నుండినట్లు కానవచ్చుచున్నది.

భృగువంశమువారిని గురించి మరొక్కమాట. హీవిట్ ఇట్లనెను. "భృగులు ఫ్రిజియాలో నివసించిరి. అచ్చట వారు అగ్నిపూజను ప్రచారముచేసిరి.[26] నేను మొదటి ప్రకరణములో భృగువు జరథుస్త్రుడేయని తెలిపినాను. జరథుస్త్రుని మతములో అగ్నిపూజకే ప్రాధాన్యముండెను. ఈ విషయముకూడ ఆర్యులవ్యాప్తి ఫ్రిజియావరకు సాగియుండెనని నిరూపించుచున్నది.

ఆర్యావర్తమనగ "ఆర్యా అవర్తంతే అత్ర"— ఆర్యులుండు ప్రదేశమని అర్థము. ఈరానులో కకేసను ప్రాంతములో ఆర్య, ఆర్యాణ దేశములుండగా మరొక ఆర్యావర్త మెందుకేర్పడెను? భార్గవార్యులతో ఈరాన్ ఆర్యులతో వైదికార్యులు వేరుపడి ఇప్పటి హిందూస్థానములోనికి వచ్చినతర్వాత ఇచ్చట వారికి భిన్నించినజాతులతో సంఘర్షణజరిగెను. వారినిగెలిచి మొదట సింధూనది హిమాలయపర్వత పశ్చిమభాగపు ప్రాంతాలను ఆక్రమించుకొని క్రమముగా వింధ్యవరకును పాటలీపుత్రమువరకునూ వ్యాపిం

25. Z. A. Ragozin's Assyria.
26. [illegible] ...tional History.

చిరి. మరికొంతకాలానికి తూర్పుపశ్చిమసముద్రాలకును వింధ్య హిమాలయములకును మధ్య దేశమునంతయు ఆక్రమించుకొని ఇప్పుడు మనము ఉత్తరహిందూస్థానమను భాగములో వారు నిండుకొనిరి. ఈ భావములనే అమరసింహుడును, మనువును, వసిష్ఠబోధాయనులు తమతమ కాలములలోని ఆర్యావర్తపు హద్దులను వివిధముగా వర్ణించిరి. అయితే ఒక విషయమును మనము దృష్టిలో నుంచుకొనవలెను భారతవర్ష మననేమి? భరతఖండమననేమి? ఆర్యావర్త మననేమి? ప్రాచ్య ఉదీచ్య మధ్యదేశములననేమి? ఈ విషయాలను మనము స్పష్టముగా తెలుసుకొనవలెను.

భరతవర్షము ఏషియాఖండమంతటి భాగము. దానిలో భరతఖండ ముండెను. కాని మనము చర్చించు కాలము నాడు భారతవర్షమే యుండెను. భరతఖండము అను పేరు లేకుండెను. భారతవర్షములో హిందూస్థానమే కాక ఇతర దేశాలు చాలా చేరియుండెను. అందుచేత భారతవర్షమును చెప్పుచు మనవారు ఆర్యావర్తమును అందలి ఒక చిన్న భాగముగ చూపించియున్నారు. సు. మ. శాస్త్రిగారిట్లు వ్రాసినారు.

"పూర్వము భారతవర్షములో నవద్వీపములుండెను. పురాణాలలో ఇట్లు వ్రాసినారు "భారతస్యాస్య వర్షస్య నవ భేదాన్ నిబోధమే". అవి ఇంద్రద్వీపము, కశేరు, తామ్రపర్ణి, గభస్తిమాన్, నాగద్వీపము, సౌమ్యము, గాంధర్వ ద్వీపము, వారణము, కుమారీద్వీపము. కుమారీద్వీపమే మన హిందూస్థానము. కావ్యమీమాంసలో దానినిట్లు వర్ణించి

నారు. వింధ్య పారిపాత్ర ఋక్షశుక్తిమాన్—మహేంద్ర సహ్యాది మలయపర్వతాలుకల దేశమే కుమారీద్వీపము. ఇక తక్కిన ద్వీపములేవనగా ఇంద్రద్వీపమే బర్మాదేశము. తామ్రపర్ణము సింహళద్వీపము, కశేరుమద్ద్వీపము మలయా పెనిన్సులా. గాంధర్వము పశ్చిమోత్తర పరగణాలలోని గాంధారదేశమే. తక్కిన నాలుగేవో తెలియదు" (పుట ౨౫౧ నుండి) పై విషయమును దృష్టిలో నుంచుకొని అమరసింహుడు తన నామలింగానుశాసనములో ఏమన్నాడో తెలిసికొందము.

"లోకోయం భారతం వర్షం శరావత్యాస్తు యోఽవధేః
దేశః ప్రాగ్దక్షిణః ప్రాచ్య, ఉదీచ్యః పశ్చిమోత్తరః
ప్రత్యంతో మ్లేచ్ఛదేశ స్స్యా న్మధ్యదేశస్తు మధ్యమః
ఆర్యావర్తః పుణ్యభూమి ర్మధ్యం వింధ్యహిమాగయోః (ద్వి. కాం.)

ఈశ్లోకాలకెట్లర్థము చెప్పవలెను? చెప్పి యెట్లు సమన్వయించవలెనో తెలియదు. నాకు నచ్చినట్లు తెలుపుకొనుచున్నాను. "ఇది భారతవర్షము. శరావతి అనునది కలదు. దానికి ప్రాగ్దక్షిణభూభాగము ప్రాచ్యమనబడును. దానికి పశ్చిమోత్తరభాగము ఉదీచ్యమనబడును. అటు తర్వాతది మ్లేచ్ఛదేశము. మధ్యనుండునది మధ్యదేశము. ఆర్యావర్తము వింధ్య హిమాలయములకు మధ్యనున్నది." భారతవర్షము వేఱు అనియు తక్కినదంతయు అందులోని అంతర్భాగమగు హిందూస్థానములోని దనియు మనము గమనింపవలెను. ఎందుకనగా భారతవర్షములో నవద్వీపాలున్నవనియు, అందు కుమారీద్వీపము మన హిందూస్థానమనియు

తెలిపినాను. ప్రాచ్య. ఉదీచ్య, మధ్యదేశములను ఆర్యావర్తమును ఉత్తరహిందూస్థానములోని భాగములని ఇతరాధారముల వలన మనకు తెలియవచ్చుచున్నది. కావ్యమీమాంసలో యీ వాక్యములను సు. మ. శాస్త్రిగారుదహరించినారు :—

"తత్ర వారణావత్యాః పరతః పూర్వదేశః, మాహిష్మత్యాః పరతః దక్షిణాపథః, దేవసభాయాః పరతః పశ్చాద్దేశః పృథూదకాత్ పరతః ఉత్తరాపథః వినశన ప్రయాగయోః గంగాయమున యోశ్చ అంతం అంతర్వేదీ"

ఇందు పృథూదకము ఇప్పటి పెహోవా అనుస్థలము. థానేశ్వరమునకు ౧౪ మైళ్ళు పశ్చిమములోనున్నది. సరస్వతీ నదీతీరములోనున్నది. దేవసభా ప్రాంతములో సురాష్ట్ర, భరుకచ్ఛ (ఇప్పటి బ్రోచ్) మున్నగు దేశాలు చేరినవి. మాహిష్మతి నర్మదాతీరములో మాంధాత అనుస్థలము ; అంతర్వేది యనగా మధ్యదేశము. కావున ఈ భాగమంతయును వింధ్య హిమాలయ మధ్యప్రదేశమే. అమరుడు చూపిన ప్రాచ్యదేశమే గ్రీకులు తెలిపిన ప్రాసీ (Prasii) అయియుండును. లేదా మగధదేశమై యుండునని కన్నింగ్హాంగారు వ్రాసిరి. (పుట. ౫౨౦). అంతయు బాగున్నదికాని శరావతి ఎక్కడనున్నదో అంతపెద్ద గ్రంథము వ్రాసి కన్నిగ్హాం తన (Ancient Geography of India) భూగోళములో ఎచ్చటను తెలుపలేదు. సింధు గంగానదుల యుపనదుల నన్నింటిని పలువురు తెలిపినారు. అందెందును శరావతి లేదు. సు. మ. శాస్త్రిగారు కన్నింగ్హాముగారి గ్రంథమునకు పీఠికను వ్రాయుచు

ఇట్లు వ్రాసినారు. బౌద్ధులు మత్స్యదేశపు హద్దులను దివ్యావదాన మను గ్రంథములో వ్రాసినారు. మత్స్యదేశమునకు ప్రాగ్దక్షిణములో శలలావతి కలదు. అదే శరావతియేమో? అని సూచించినారు. కాని ఇంతకు మించి మనకేమున్ను తెలియదు. అమరసింహుడు "వారివర్గము"లో ఇట్లు వ్రాసినాడు.

"శరావతీ వేత్రవతీ చంద్రభాగా సరస్వతీ" మొదలుగా నదుల పట్టికలో దీనిని తెలిపినాడు. శబ్దకల్పద్రుమ నిఘంటువులో నిట్లున్నది:

> "శరా: తృణవిశేషా: సంతి అస్యా మితి నదీవిశేష:
> మహాభారతే ౬,౯,౨౦ శరావతీం పయోష్ణీంచ వేణాం భీమరథీమపి"
> రఘువంశే "శరావత్యాం, సతాం సక్తై: జనితాశ్రుకవం లవ:"
> (౧౫, ౯౭)

భారతములో ఒకనదిగాను, రఘువంశములో రాముని కుమారుడైన లవుడు రాజ్యముచేసిన నగరముగాను శరావతి తెలుపబడినది. ఇట్లు వ్రాసినను మనకేమియు బోధయగుట లేదు. అదిఇట్లుండనీ. మధ్యదేశ మేదియో తెలిసికొందము. మనువు ఇట్లన్నాడు:

> "హిమవద్వింధ్యయో ర్మధ్యం యత్ ప్రాగ్వినశనా దపి
> ప్రత్యగేవ ప్రయోగాచ్చ మధ్యదేశ: ప్రకీర్తిత:" (౨-౨౧)

ఉత్తరమున హిమాలయము, దక్షిణమున వింధ్య, తూర్పులో ప్రయాగ, పశ్చిమములో వినశన అనగా సరస్వతీనది. ఈ విధముగా హద్దులుకలది మధ్యదేశము. ఇంతవరకు స్పష్టమైనట్లేకదా. ఇకనైనా మనకు శరావతి యెచ్చ

టినో తెలియవచ్చుచున్నదా? లేదు. సరస్వతికి పశ్చిమము లోనైనను, ప్రయాగకు తూర్పులోనైనను ఈ శరావతి యుండవలెను. బౌద్ధజాతకసూచనయే సరియైన, శరావతి ప్రయాగకు తూర్పుదిక్కులో నుండవలెను. ప్రాచ్యదేశము మగధయై యుండునని కన్నింగ్‌హాం అన్నాడు. అందుచేత శరావతి మగధకును ప్రయాగకును మధ్యన నుండియుండ వలెను. అట్లైనచో అది గంగానదికుపనదిగా నుండియుండును.

భరతుడు తాతయింటినుండి వచ్చినపుడు శరదండానదిని దాటెనని రామాయణములోనే కలదు. అయితే అది చాల పడమరగానున్నది. తుదకీ శరావతి యెచ్చటనున్నదో నిర్ణయము కాలేదు.

ఇక నేను నా సొంతముగా ఒక ఊహనిత్తును. అది ఎవ్వరునూ ఒప్పుకోనట్టిదిగా నుండును. ఇట్టి అజ్ఞాత విషయములలో మంచివో చెడ్డవో ఊహాలుచేసిన భావిపరిశోధకులు తుదినిర్ణయమునకు రాగలరు. శరావతి భారతవర్షము లోనిదిగా నుండియుండును. కాని హిందూస్థానము హద్దులలో కాక యితర దేశములలోనిదై యుండును. జడ్. ఏ. రగోజిన్ రచితమైన ఖాల్డియా అను గ్రంథములో ఒకవాక్య మిట్లున్నది. "Tigris was named in the ancient Languages as "the arrow" from the swiftness of the current" టైగ్రీసునది ప్రచండవేగముతో ప్రవహించుట చేత దానిని శరము (బాణము) అని యనిరి. అది పర్షియా ఖాతములోనికి ప్రవహించును. అదియే శరావతీనదియై యుండును. (శరశబ్దము పుల్లింగముకాన శరవతికాక శరావతి

యెట్లగుననని పాణినీయులు తగవున కెగబడుదురు. శబ్దసామ్య చర్చలో అది యప్రధానము. శరావతి అను చిన్నదనది మైసూరు సంస్థానములో కలదని తెలియవచ్చుచున్నది. దాని నుండియే జోగ్ జలపాతము (water fall) కలదు. అచ్చట జలవిద్యుత్తును మైసూరు ప్రభుత్వమువారు నిర్మించినారు. అదొక చిన్న ఉపనదికదా. ఏ మాత్రమున్నూ భూగోళ ప్రఖ్యాతిలేని నదిని అమరుడు ఒక ఖండముయొక్క హద్దుగా నిర్మించికొని యుండునా?

కాళిదాసుని రఘువంశమందలి రామాయణ కథలో ౧౫వ సర్గములో రాముడు తన నిర్యాణసమయములో కుశు నికి కుశావతిని లవునికి శరావతిని ఇచ్చిపోయెనని కలదు. దానిపై నందార్గికర్ పండితుడు ఇట్లు వ్యాఖ్యానించెను. "ఉత్తరకోసలలోని శ్రావస్తియే శరావతి యందురు. మత్స్య పురాణములో "గండ" అను జిల్లాలోని నేటి "గండ"యే శరావతియందురు. అయోధ్యకుత్తరమునందున్న నేటి సాహేత్ మాహేత్ అనునదే శరావతియని కనింఘాం అన్నాడు. రాముని పూర్వజులలో నొకడగు శ్రావస్తఅనువాడు నిర్మిం చినది శ్రావస్తియని విష్ణుపురాణమంటున్నది. శరావతి యెక్కడిదో తృప్తికరమగు నిర్ణయముకాలేదు".

నందాలాల్ దేవ్ గారు ప్రాచీన హిందూస్థాన భూగో ళము (౧౯౨౭)లో ఇట్లు వ్రాసినారు. "శరావతి (౧) గుజ రాతులోని సబర్మతీనది. (౨) ఔధులోని ఫైజాబాదు. (3) శ్రావస్తియొక్క అపభ్రంశము శరావతి యైనట్లున్నది.

్రశావస్తినిప్పుడు సాహేత్ మాహేత్ అందురు." అట్లైనచో ఆర్యావర్తమందు చేరునా? చేరునని నేనుచెప్పను. ఒక కాలములో శరావతి ఆర్యాణము అని గ్రీకులలో వర్ణింపబడిన ఆర్యులనివాసమునకు పశ్చిమసీమయై యుండెను. దానికి ఉత్తరపశ్చిమ భూములలోను ఆర్యులుండిరి. అదే ఉదీచ్యమనవచ్చును. దానికి తూర్పుదక్షిణము ప్రాచ్యము. అట్లైతే టైగ్రిసునదికి పడమటిభాగమందలి దక్షిణభాగమేమై యుండును? అది ఆర్యభూమికాదు. మ్లేచ్ఛభూమి. అందే అసిరియా, బాబిలోనియా, ఫినికియా, అరేబియా, సిరియా, ఈరాఖు దేశములున్నవి. అవి అనార్యజాతుల దేశములు. అమరసింహుడు స్పష్టముగా వ్రాయక ఇంతకథకు కారకుడయ్యెను.

ఇక మను వేమన్నాడో విచారింతము.

"ఆసముద్రాత్తువై పూర్వాత్ ఆసముద్రాత్తు పశ్చిమాత్
తయోరేవాంతరం గిర్యో రార్యావర్తం విదుర్బుధాః" (౨-౨౨)

తూర్పు పడమర సముద్రాలకును వింధ్యహిమాచలములకును మధ్యన ఉండుదేశము (అనగా ఇప్పటి ఉత్తర హిందూస్థానము) ఆర్యావర్తము. ఈ శ్లోకము మనువు సొంతముగా వ్రాసెనో ప్రక్షిప్తమో తెలియదు. ఎట్లైనను ఈశ్లోకము పతంజలికి చాలా తర్వాతిది. ఆర్యులు తూర్పునకు, దక్షిణమునకు ఎక్కువగావచ్చినట్లు తెలుపు భాగములన్నియు పతంజలికి చాలా తర్వాతివనుట స్పష్టమే. సారాంశమేమన

ఆర్యులు మొదట కకేసస్ పర్వతాలనుండి సింధునదకుంజిరి. తర్వాత మీడులతో, అక్కడులతో (Accadians), ఫ్రిజియా వారితో, ఈరానీలతో వేరుపడి హిందూస్థానమందే నివసించిరి.

శ్రీరాముని కాలములో ప్రయాగ, మరియు దానికి ౧౦ కోసుల దూరములోనుండిన చిత్రకూటము, తర్వాత అనార్య దేశము ప్రారంభమగుచుండెను. చిత్రకూటమునుండి దండకారణ్యము, జనస్థానము, యక్షులు అనగా అనార్యులగు జక్కులవారు నివసించు తాటకావనము, ఇంకనూ దక్షిణము లోను తూర్పులోను అనగా ఇప్పటి ఒరిస్సా రాష్ట్రములో నుండు ముండాజాతి పూర్వీకులగు వానరులు, రాక్షసులు అనబడు అనార్య జాతివారును, ఇంకను దక్షిణములో శబరి కులము వారగు సవరజాతివారును, కిష్కింధలో వానర లేక "హరి" జాతివారగు ఆటవికులును, వారికి దక్షిణములో ఇప్పటి తమిళనాడులో రావణవర్గమువారగు రాక్షసులు నివసించినట్లు నే నూహించుచున్నాను. అనార్యులను సంస్కరించి, ఆర్యుల వలసలకు దేశమును యోగ్యముగాచేయుటకు నేటి క్రైస్తవ మిషనరీలవలె అత్రి, అగస్త్యుడు, మున్నగు మునులు జనస్థానములో ఆశ్రమములను ఏర్పాటుచేసుకొని యుండిరి.

గుఱ్ఱము లేదేశములనుండి అయోధ్యకు వచ్చెడివో యిట్లు తెలిపినారు.

"కాంభోజ విషయే జాతై బాహ్లీకైశ్చ హయోత్తమైః
వనాయుజైర్నదీ జైశ్చపూర్ణాహరి హయోత్తమైః (బాల. ౬-౨౨)

కాంభోజ, బాహ్లిక, వనాయు, సింధు దేశాలనుండి ఉత్తమాశ్వములు అయోధ్యకు దిగుమతి యగుచుండెనని తెలిపినారు. కాంభోజము ఇప్పటి అఫ్ఘనిస్థానమనియు, బాహ్లికమిప్పటి ఈరాన్‌లోని బలఖ్ అనియు తెలిపినారు. వనాయు వనగా అరేబియా దేశమని నందలాలన్నాడు. కాని "వనాయుః పారసీకః" అని రత్నకోశమన్నది. నదీజములనగా సింధూనదీ ప్రాంతోద్భవములు. "వింధ్య, హిమవంతము, ఐరావతము, అంజనాద్రి, అను ప్రదేశాలనుండి ఏనుగులు దిగుమతియయ్యెను" (బాల. ౬-౨౩,౨౪) అని తెలిపినారు. ఐరావతమనిన ఇంద్రుని ఏనుగుయొక్క కులము అని వ్యాఖ్యాతలువ్రాసిరి. అదితప్పు. ఇరానదీ ప్రాంతమందలి భద్రగజమునే పౌరాణికులు ఇంద్రునికి వాహనముగా జేసిరి. ఇరానది నిప్పుడు రావియందురు. అది సింధూనది కుపనది.

దశరథుని పుత్రకామేష్టికి మిథిలకాశీ, కేకయ, అంగ సింధు సౌవీరసౌరాష్ట్ర రాజులును, ప్రాచ్యదాక్షిణాత్య రాజులును ఆహూతులైరి (బాల. ౧౩-౨౫) ప్రాచ్యదాక్షిణాత్యులెవరో వాల్మీకికే తెలియదు. సౌరాష్ట్రము గుజరాతు, సౌవీరముకూడ గుజరాతుభాగమే. కేకయ—బియాస్, సట్లెజ్ నదుల మధ్యదేశమని నందలాల్ దేవన్నాడు. అంగ ఇప్పటి భాగల్పూరు మండలము.

ఈ ప్రకరణమును ముగించుటకు పూర్వము మరొక్క విషయమును స్పృశించి వదలివేయుచున్నాను. రామాయణములో సీతాన్వేషణ నిమిత్తముచే భూగోళపరిజ్ఞానము వెల్లడించినట్లే మహాభారతమందు సభాపర్వములో ధర్మరాజు

యొక్క అశ్వమేధయజ్ఞార్థమై, నలుగురు తమ్ములును నాలుగు దిక్కుల దిగ్విజయముచేయు సందర్భములో, వ్యాసుడు తన కాలమునాటి భూగోళజ్ఞానమును వెల్లడించుకొనినాడు. ఈ రెంటిని పోల్చిచూచిన మరికొన్ని విషయములు స్పష్టపడును. అట్టి తారతమ్యపరీక్ష చేయు నభిలాషులకై యీ సూచనను చేసినాను.

రామాయణమందలి ఉత్తరకాండలో చాలా క్రొత్త దేశాలపేరులు వచ్చును. అశ్మదేశము, వరుణపురము, బలి ఆలయము, రసాతలము, మున్నగు ప్రదేశము లందు కలవు. ఉత్తరకాండచర్చ ప్రత్యేకము చేయదగినది. అందుచేత దాని నిందు తీసుకొనలేదు.

# ౧౦

# వానర రాక్షసతత్త్వము

మన పురాణాలలో సాధారణముగా అన్నింటను రాక్షసులు కానవచ్చుచున్నారు. రామాయణములో రాక్షసులతోపాటు వానరులు కానవచ్చుచున్నారు. ఒక ఎలుగుబంటి, మూడు పక్షులు (గరుడ జటాయు సంపాతులు), తాటకవంటి యక్షిణి, కానవచ్చుచున్నారు. పురాణాలలో పై వారేకాక కిన్నర, గంధర్వ, అప్సర, నాగ, మున్నగు విచిత్రజాతులు వర్ణింపబడినవి. ఈ వర్గములవారు మనుష్యులకు భిన్నించిన వారును, మనుష్యాతీతశక్తి కలవారును, మాయారూపులును, ఆకాశగాములునై యున్నారని తెలిపినారు. హిందువులలో బహుళసంఖ్యాకులు వీటిని నమ్ముచున్నారు. ఈ పేరులు గల జాతు లుండెనని నేను విశ్వసింతును. కాని, వారు మనవంటి మనుష్యులేయనియు, వారికిని మనకును ఏమియు భేదము లేకుండెననియు తలతును. ఆది పౌరాణికులకు వీరి నిజతత్త్వము తెలిసియుండెను. ఆర్యులకు మధ్యఏషియాలోను ఏషియామైనరులోను, హిందూస్థానమందలి దక్షిణాపథమందును, తూర్పున బర్మా మలయాలోను, జవా బోర్నియో బలి సుమిత్రా ద్వీపాలలో తమతో భిన్నించిన ఆచారవ్యవహార విశ్వాసములు కల జాతులుకనిపించినారు. పలుమారు వీరితో ఆర్యులకు సంఘర్షణలుకూడా జరిగెను. అందుచేత తమ కనుకూలురైన వారిని నిందించక మంచివారని వర్ణించిరి. తమకు ప్రతికూలురైనవారికి ఘోరరూపములనిచ్చి వారిని దూషిం

చిరి. తర్వాత పౌరాణికులకిది తెలియక తమ యూహాబలము కొలది వీరిని వర్ణించిరి. వీరికి రెండు చేతులకు మారుగా అనేక హస్తములను ప్రసాదించిరి. ఒకతలకు మారుగా మూడు తలలు, పదితలలు పెట్టిరి. ఒక్కొక్కమారు (కబంధునికివలె) తలనే తీసివేసిరి. మరొకమారు గుజ్జము తలల నతికించిరి. అంతటితో తృప్తినొందక వారికి శిరశ్ఛేదశిక్ష నియ్యక తక్కిన శరీరమునంతయు పాముగానో చేపగానో గుజ్జము గానో చేసివేసిరి.

ఇదంతయు వారు పై వర్గములవారి నిజతత్త్వము తెలియక చేసిన యపరాధ మనవలెను. వానరరాక్షసాదు లెవ్వరై యుండిరో చర్చించుటకు ముందు వారికి సంబంధించిన పర్యాయపదము లేవో అమరసింహుని నిఘంటువునుండి ఎత్తి వ్రాయుచున్నాను.

"విద్యాధరో, ప్సరో, యక్ష, రక్షో, గంధర్వ, కిన్నరాః, పిశాచో, గుహ్యక, స్సిద్ధోభూతో౽మీ దేవయోనయః, "అసురా, దైత్య, దైతేయ, దనుజేంద్రారిదానవాః శుక్రశిష్యా, దితిసుతాః,పూర్వదేవా,స్సురద్విషః,"రాక్షసః, కోణపః, క్రవ్యాత్, క్రవ్యాదో౽స్రప, ఆశరః, రాత్రించరో, రాత్రిచరః, కర్బురో, నికషాత్మజః, యాతుధానః పుణ్యజనో, నైరృతో, యాతు, రక్షసీ."

ఈ పదములేకాక ఇంకను "కిర్మీర" అను పదము కూడ రాక్షసులకు వాడినారు. ఆ పదము మేదినీనిఘంటువులో కలదు. రాక్షసాదులను గురించి విచారించుటకు ముందు వానరులను గురించి తెలుసుకొందము.

వానరులెవరు?

ఈ ప్రశ్న ఇంచుమించు నూరేండ్లనుండి బయలుదేరినది. వానరులు కోతులని అందరికిని తెలియునుకాని రామాయణములోని వానరులు కోతులేనా అని పండితులు సందేహించినారు. వారు అడవిమనుష్యులని, బెత్తెడు పొడవుగల చిన్నతోకలను కలిగియుండిన ఆటవికులనియు, కాదు నిజముగా వారు కోతులేయనియు, అదికాదు తోకలవలె గోచులను పెట్టి కౌపీనములు కట్టిన యాటవికులనియు, ఎవరికి తోచినట్లు వారు వ్రాసినారు. ఈ చర్చ ఇంకను ముగియలేదు. రామాయణవానరులు కోతులుకారనియు, వారు దక్షిణాపథ మందుండిన ఆటవికులనియు, నా అభిప్రాయము. దీనినిగురించి పరిశోధకులిచ్చిన అభిప్రాయములను కొన్నింటిని తెలుపుదును. శ్రీయుత గో. రామదాసు, బి. ఎ. గారు క్రోధన, ఫాల్గుణమందలి భారతి మాసపత్రికలోను, అక్షయ చైత్రభారతిలోను, రామాయణమునందు వానరులెవరు? అని వ్రాసిన వ్యాసములు అత్యుత్తమములైనవి. వారి వాదసారాంశమిది. "వానరులకు రాక్షసులకును సామీప్యతకలదు. వారిరువురును సవర మూండా జాతులవారు. వారి నామములు సవరభాషలోనే అర్థవంతములుగా ఉన్నవి. లంకాపదము సవరభాషలో పెద్దమిట్ట అని యర్థమిచ్చును. జైతాన్ అనగా దిగువ లేక బయటిభూమి. అదే జనస్థానము. జటాయువు సవరజాతివాడు. దాన్ డాన్ అనిన జలముకలది. అదే దండక. ఋశ్యమూకము ఏనుగులకొండ. ఆనెమల అన్నామలై యుండును. సవరలలో అసురులు అను జాతివారు

కలరు. వారిని లంబోలంజియా అని యందురు. వారు కౌపీనము కట్టి తోకవలె క్రిందికి బట్టను వదలుదురు. రామాయణములో వనకోతులకే తోకలున్నట్లు వర్ణించినారు. స్త్రీల కావర్ణనలేదు.'' అభిలాషులు రామదాసుగారి వ్యాసములను పూర్తిగా చదువవలెను.

శరచ్చంద్రరాయ్‌గారు (Mundas and their Country) ముండాజాతిని గురించి ఒక గ్రంథమును వ్రాసినారు. అందలి కొన్ని విషయముల నిందుదాహరించుచున్నాను.

''ముండాలుండు ప్రాంతములోని గట్టులను మందర పహాడ్ అందురు. రావణుడు వానరసైన్యమును చూచినప్పుడు అందు మందరపర్వతమునుండి వచ్చిన ''హరి'' జాతివారున్నారని వినెను. ముండాజాతిలో ''హరో'' అని ఒక జాతికలదు. హరో అనగా మనుష్యుడు అని వారిభాషలో అర్థమిచ్చును, (సంస్కృతములో హరి అనిన కోతి అనియొక అర్థము) ముండాలలో ''ఉరోవన్'' (Uroans) అను శాఖ కలదు. తాము రావణసంతతి వారమని వీరిప్పటికినీ చెప్పుకొనుచున్నారు. ఉరోవనులకును ముండాలకును పూర్వము యుద్ధములు జరిగెనని చెప్పుకొందురు.'' కాల్డ్వెల్ తన ద్రావిడభాషాశాస్త్రములో ఇట్లు వ్రాసినాడు. ''ఇంగ్లీషులోని కొరమాండల్ తీరము అనునది తెనుగువారు చోళమండలమునకు ఇచ్చినపేరునకు ఏర్పడినపదము (హిందూస్థానములోని దక్షిణమునందు) తూర్పుతీరమును తెనుగువారు ఖర

మండలము అనిరి. అనగా ఉష్ణప్రదేశమను నర్థములో ప్రయో
గించిరి."

కాని ప్రాచీనమందు రావణునితమ్ముడగు ఖరుడు రాజ్యముచేసిన దేశమగుటచేత ఖరదేశమని ఆదికాలమందు ప్రఖ్యాతిగాంచి యుండెనో యేమో ?

తిరుచునాపల్లిని పూర్వము త్రిశిరప్పల్లి అనిరి. అనగా త్రిశిరుని పట్టణము. త్రిశిరునిపేర కట్టిన గ్రామమగుటచేత రావణుని వర్గమువారా ప్రాంతములో పాలించిరని ఒకరనిరి. కాని యది విశ్వసనీయ మనవీలులేదు.

బ్రహ్మాండ పురాణమున నిట్లున్నది.—

"అంధ్రవాకా ముద్గరకా అంతర్గిరి బహిర్గిరాః
తతః ప్లవంగ వోజ్ఞయో మలదామలవ ర్తికాః
..........................................................
మల్లామగధ గోనర్దాః ప్రాచ్యాం జనపదాః స్మృతాః."

ఇచ్చట నానా జాతులతోపాటు ప్లవంగజాతి యొకటి పేర్కొనబడినది. తక్కినవన్నీ మనుష్యజాతులైతే ప్లవంగ జాతియు మనుష్యజాతియే. ఆంధ్రాది ప్రాచ్యజాతులలో నిదొకటియన్నారు. కావున రామాయణకాలములోని ప్లవగ జాతియు అనార్యజాతినే తర్వాతి ప్రతి కర్తకారులు ప్లవగ శబ్దమునకు కోతియను నర్థముండుటచే వారుకోతులని భావించి పేరు వ్రాసినారో యేమో ?

వనచర శబ్దమునకు వానర (కోతి) అని అర్థముకలదు. అడవిమనిషి (వనేచరః) అని యర్థముకూడా కలదు. రామా

యణమును పెంచినవారు అడవిమనుష్యులకు మారుగా కోతులనే అర్థమునే స్వీకరించి యుందురు.

యస్. యన్. ప్రధాన్‌గారు (Chronology of ancient India లో) ఇట్లు వ్రాసినారు. "మహాభారతం, ౧3వ పర్వం, ౫3-౨౧ లో మందపాలుడను బ్రాహ్మణుడు శార్ఙ్గి అను శూద్రియందు నలుగురు కుమారులను కనెను. అనార్యులలోని ఇంటిపేరులలో శార్ఙ్గి అనునదొకటి. అనార్యులలో అజ, మర్కట, సర్ప, నాగ, మృగ, మత్స్య అను పేరులుకల జాతులుండెను."

ఈ విధముగా వానరులు అనార్యజాతి వారని వివిధ పండితుల అభిప్రాయము. ఇక రామాయణమే ఏమి తెలుపుచున్నదో కనుగొందము. రావణునికి వానరముఖ్యుల వర్ణించి చెప్పునప్పుడు వారు నర్మదానది, వింధ్య, పారియాత్ర, సహ్య, సుదర్శన, కృష్ణగిరి, సాల్వేయ పర్వతాలనుండి వచ్చినట్లు తెలిపెను. ఒకరిద్దరు హిమాలయ, మేరుప్రాంతాలనుండి వచ్చినట్లు తెలిపినను ఎక్కువ వానరవీరులు దక్షిణాపథమువారే అని విశదమైనది. కృష్ణగిరి నల్లమల యేమో తెలియదు. నీలగిరి కూడా కావచ్చును. సుదర్శన, సాల్వేయగిరు లెచ్చటివో తెలియదు. వానరులకొక భాషయుండెను. వారిలో ముఖ్యులైనవారికి సంస్కృతముకూడ వచ్చియుండెను. హనుమంతుని మొట్టమొదట రాముడు కలసినప్పు డతనిగూర్చి యిట్లనెను. ఇతడు మూడువేదాల నెరిగినవాడుగా కనబడుచున్నాడు" (కి. 3-౨౮) పైగా వ్యాకరణజ్ఞాన మున్నది. (కి. 3-౨౯)

హనుమంతుడు సీతనుజూచినప్పుడు ఆమెతో సంస్కృతములో మాట్లాడుదునా లేక నాభాషలో మాట్లాడుదునా అని వితర్కించుకొనెను. (సు. 30-2) ఇందతిశయోక్తియున్నను వానరులకొక భాషయుండెననియు వారార్యులతో మాట్లాడగలవారై యుండిరనియు ఊహించుకొనవచ్చును. వానరులలో వివాహాచారములలో ఒక విశిష్టతయుండెను. అన్నదమ్ములలో ఎవరైనను గతించిన అతని భార్యను మిగిలిన తమ్ముడు పొందుచుండెను. వాలి తన తమ్ముడగు సుగ్రీవుడు బ్రతికియుండగా తమ్ముని భార్యయగు రుమను పొందెను. ఇది పాపకార్యమని రాముడిట్లు వాలిని దూషించెను.

"అస్య త్వం ధరమాణస్య సుగ్రీవస్య మహాత్మనః
రుమాయాం వర్తసే కామాత్ స్నుషాయాం పాపకర్మకృత్"
(కి. ౧౮-౧౯)

వాలి చనిపోయినప్పుడు అతని శవమునకు రాముడు దహనసంస్కారము చేయించెను. వానరులలో దహనకర్మ లేకుండెనేమో. కాని ఆర్యాచారములను రాముడు వానరులందును, రాక్షసులందును ప్రచారము చేయువాడుగా కనిపించుచున్నాడు. అందుచేతనే కబంధాది రాక్షసులను వారి కోర్కెచేత పూడ్చినవాడైనను రావణునికి దహనసంస్కారమే చేయించెను.

వానరులకు ధనుర్విద్య తెలియదు. రాక్షసులకును ఆవిద్య రాకుండెను. వాలిసుగ్రీవులు కుస్తీపట్టిరి. రాముడు తన బాణముతో వాలిని చంపుదునన్నప్పుడు సుగ్రీవునికి దానిశక్తి తెలియనందున పరీక్ష తీసుకొని తృప్తిపడెను.

సుగ్రీవునికి పట్టాభిషేకము చేసినప్పుడు అతనికి అడవిపంది తోలుతో చేసిన చెప్పులను దొడిగించిరి. ఆర్యరాజులకు జరుగు పద్ధతిగానే పట్టాభిషేకముచేసిరి. బ్రాహ్మణులు వేదమంత్ర ములతో నతనికి పట్టముకట్టిరి. కిష్కింధలో బ్రాహ్మణు లెక్కడినుండి వచ్చిరి ? అప్పటికే ఆర్యులు కొందరు అచ్చట నివసించియుండి రనవలెను. కోతులకు ఇండ్లయవసరము లేదు కదా ! కిష్కింధానగరము మంచినాగరికత పొందినట్టిది. అందు తెల్లని మేడలుండెను (కి. 33-౧౨). వారికి ఇనుము, బంగారు, మున్నగు లోహముల ఉపయోగము తెలిసియుం డెను (కి. 33-౧౬,౧౭). వెండినికూడా వారుపయోగించు చుండిరి. (కి. 33-౧౯). వారు వీణావాద్యసంగీతము నెరిగి యుండిరి (కి. 33-౨౧). కోతియందము మనకు తెలిసినదే ! మరి కిష్కింధా వానరస్త్రీలు 'రూపయౌవనగర్వితలు'. సుగ్రీ వుని సేవకులు ఉత్తమవస్త్రములను కట్టుకొనియుండిరి (కి. 33-౨౩). వానరస్త్రీలు నూపురములు, మొలనూళ్ళు, మున్నగు ఆభరణములు ధరించియుండిరి (కి. 33-౨౪). సుగ్రీవుడును, తారయు బాగా మద్యపానముచేసి మత్తులై యుండిరి (కి. 33-32,४౫). సీతజాడను కనుగొనివచ్చిన వానరులు సుగ్రీవుని మధువనమంతయు ధ్వంసముచేసి చెడ ద్రాగిరి.

వానరులకు రాక్షసులకును అంతగా భేదము లేనట్లు న్నది. రావణుడు సుగ్రీవునికిట్లు చెప్పిపంపెను :

న కశ్చి దర్థ స్తవ నాస్త్యనర్థ స్తథాహి మే భ్రాతృసమో హరీశ !

—యు. ౨౦-౧౧.

"సుగ్రీవా! నీవు సత్కుల ప్రసూతుడవు. ఋక్షర జసుని కుమారుడవైనందున నీవు నాకు తమ్మునితో సమానుడవు." వానరులు వింధ్యకు దక్షిణమునసుండిన అనార్యులనియే నా విశ్వాసము. వారు కోతులుకారు. కళింగములో లాంగుల్యా అనునదికలదు. అచ్చటనే సవర, కోదుజాతుల వారున్నారు. కావున లాంగుల్యా నదీప్రాంతజనులను లాంగూలము కలవారనియు, వారు కోతులనియు తర్వాత రామాయణమును పెంచినవారు భావించియుందురు. శబరి యుండు ప్రాంతమందే సవరులున్నారు. సవరలకు సజాతీయులైన లాంగుల్యానదీ ప్రాంతవాసులగు ఆదిమాటవిక నివాసులు వానరులై యుందురు(లాంగుల్యానది నిప్పుడు నాగావళియందురు).

## హనుమంతుని పెండ్లి

సాధారణముగా హనుమంతుడు నిత్యబ్రహ్మచారియని అందరును భావింతురు. వాల్మీకి రామాయణములో హనుమంతుని పెండ్లి లేదా భార్యముచ్చట లేదని తలచి యీ ప్రవాదము కలిగినదేమో? అట్లైతే, నీలుడు మొదలగు బహువానరవీరుల భార్యలసంగతికూడా తెలుపలేదు. వారందరును నిత్యబ్రహ్మచారులా? హనుమంతుడు బ్రహ్మచారి కాడు. అతడు వివాహితుడు. పైగా బహుభార్యలు కలిగియుండినట్టివాడు. ఏమి ప్రమాణ మందురా? వాల్మీకి రామాయణమే ప్రమాణము. రాముడు అయోధ్యకు వచ్చుచున్నాడని హనుమంతుడు ముందుగాపోయి భరతునితో తెలుపగా అతడు అధికానంద భరితుడై యిట్లనెను.

"ప్రియాఖ్యానస్య తే సౌమ్య దదామి బ్రువతః ప్రియం, సుకుండలా శ్శుభాచారా భార్యాః కన్యాశ్చ షోడశ, హేమ వర్ణా స్సునాసోరూ శశిసౌమ్యాననాః స్త్రియః, సర్వాభరణ సంపన్నాః కులజాతిభిః" యుద్ధ. ౧౨౮-౪౨,౪౪.

"ఓయీ, హనుమంతుడా! ప్రియమైనవార్తను నాకు తెలిపినందులకు నీకు మంచి కుండలములు కలవారును, మంచి ఆచారములు కలవారును, అందమైనవారును, చక్కనిముక్కు, చక్కనితొడలు కలవారును, చందమామవంటి ముఖములు కలవారును, సమస్తభూషణ భూషితలైనవారును, మంచి కులములో పుట్టినవారును, కన్యకలును (పెండ్లికానివారును) అయిన ౧౬ మంది స్త్రీలను భార్యలనుగా ఇచ్చుచున్నాను." అని భరతుడుచెప్పెను. ఈ మాటలకు హనుమంతుడు 'నాకెందుకయ్యా! నేను నిత్యబ్రహ్మచారిని' అని అనలేదు. పాంచరాత్రములో హనుమంతుని భార్యపేరు సువర్చల యని యందురు. అతనికొక కొడుకుండెనందురు. హనుమంతునికి వివాహమయ్యెనో లేదో కాని దీనినిబట్టి యొకసంగతి స్పష్ట మగుచున్నది. ఎంత పెద్దకోతియైనను భరతుడు అతనిని చూచిన వెంటనే మంచిజాతిలో పుట్టిన సుందరస్త్రీలను భార్యలనుగా ఇత్తునని చెప్పునా? హనుమంతుడు యౌవనుడు గను, చూడదగిన మనుష్యుడుగను, ఉండిననేకదా ౧౬ సుందరాంగులైన కన్యలను భార్యలుగా బహూకృతుడగుటకు అర్హుడయ్యెను? ఈ విషయాలన్నింటిని బట్టి వానరులు నాగ రికతపొందిన అనార్యజాతివారనియు, వారు కోతులుకార నియు స్పష్టమగుచున్నది. వీరు సవర, ముండా, జాతులకు

సంబంధించిన వారై యుందురు. హనుమంతుడు నిత్యబ్రహ్మ చారియె యనువారికి రెండాధారము లు కానవస్తున్నవి.

(౧) "అన్యత్ర భీష్మాద్గాంగేయా దన్యత్రచహనూమత:
హరిణీఖురమాత్రేణ చర్మణా మోహితం జగత్"

ప్రపంచములో స్త్రీలచే మోహితులు కానివారిద్దరే యిద్దరట! భీష్మహనుమంతులట!

(౨) హనుమంతునికొక భక్తుడు షోడశనామములిచ్చి స్తుతించెను. అందు బ్రహ్మచారియను బిరుదొకటి.

"అచలోద్ధారకో భీమో బ్రహ్మచారీ మహాబల:"

ఈ రెంటినెవరు ప్రమాణీకరించిరో తెలియదు. వాల్మీకి రామాయణములో నెచ్చటను హనుమంతుడు నిత్యబ్రహ్మ చారియని వర్ణింపలేదు. స్పష్టముగా హనుమంతునికి పెండ్లి యైనట్లును నిదర్శనములులేవు. కాని పైని కనబరచిన కన్యా దానపుముచ్చట మాత్రముకలదు!

జాంబవంతుడు ఎలుగుబంటి కాడు. అతడును అనార్య (వానర) మనుష్యుడే. అందుచేతనే అతడు వానరసేనలో నుండెను. జటాయువు అనార్యుడైన ఆటవికుడు. నమ్మకమైన బంటుగా పంచవటిలో సీతారాముల సేవచేసెను. ఇట్టి వానర జాతిలో సేతువులు నిర్మించు మంచినేర్పరులుండిరి. చికి త్సలుచేయు వైద్యులుండిరి. సకలధర్మము లెరిగిన పెద్దలుం డిరి. వీరివంటి అనార్యజాతివారే అయిన రాక్షసులు మను ష్యులవంటివారే. అయినప్పుడు వీరు మాత్రము కోతులగు కారా! కావున సర్వవిధముల వీరు ఆటవికులైన మనుష్యులే.

అనార్యులలో ఉత్తములైనవారే. కోతులలో ఎలుగుబంట్లను, గద్దలను, కూడా చేర్చియుండుటకు తగినకారణముండవలెను. వానరులు కోతులుకారు. వారు వనేచరులు అనగా అటవికు లని నిర్ణయించినాను. ఋక్షులు ఎలుగుబంట్లుకారు. వారును అడవిమనుష్యులే. వారు ఋక్షవత పర్వతాలలో నివాసము చేసినట్టివారు.

> అన్యేఋక్షవత: ప్రస్థాన వతస్థు స్సహస్రశ:
> అన్యే నానావిధాన్ శైలాన్ భేజిరేకాననానిచ.
>
> — బాల. సర్గ. ౧౭ శ్లో. ౩౦.

కొందరు వనచరులు ఋక్షవత పర్వతాలలో ఉండి పోయిరి. తక్కినవారు వివిధశైలాలలో (అనగా ఋక్షవతము నకు దక్షిణమునగనుండు భాగాలలో నుండనోపు) ఉండిపోయిరి అని వర్ణించినారు.

ఋక్షవతము అనుశబ్దమునుబట్టి ఋక్షులు (ఎలుగులు) ఉంటుతావు అని యర్థమువచ్చును. ఆ పదముయొక్క అర్థము నాశ్రయించి రామాయణమును పెంచినవారు ఋక్ష వతములోని ఆటవిక మనుష్యులను ఎలుగులనుగా చేసివేసిరి.

ఋక్షవత పర్వతమెక్కడున్నది? ఋక్షపర్వతము అను నది వింధ్యయొక్క తూర్పుకొసలోనుండు భాగమునకు పేర నియు ఆ పర్వతము గోండ్వనములోనిదనియు నందలాల్ డే గారు (The Geographical Dictionaryలో) వ్రాసినారు. దీనినిబట్టి ఋక్షులు గోండ్వనములోని వారని తెలుసుకొన

గలిగితిమి. గోండులుండు వనమునకు గోండ్వనమనుట సరి యగువాఖ్య. కావున ఋక్షులే గోండులుఅని యూహించిన తప్పేమియునుండదు. నిర్ణయమైనదేమనగా రాముడు ఋక్ష పర్వతములోను, గోండ్వనములోను నివసించిన గోండులను, గోదావరీ కృష్ణా మధ్యప్రాంతాలలోననుండు వానరులను (వనేచరులను) తన సైన్యముగా నేర్పాటుచేసుకొని తూర్పు తీరమందు గోదావరి సముద్రముతో కలియు ప్రాంతాలలో నుండు అనార్యులను రాక్షసవాచ్యులతో యుద్ధముచేసెనని యూహించిన తప్పుండదని తలతును.

మరి గద్దలెవ్వరు? రామాయణములో ఒక కాకి రెండు గద్దలు వచ్చినవి. కాకికథను గద్దలకథలను పిట్టమ్మ కాకమ్మ కథలనవలెనా? కాకాసురుని కథమాత్రమట్టిది గానే కానవస్తున్నది. కావుందురా దానిని గద్దలలోనేచేర్చి చర్చింతము. ఇక గద్దలనేమి? జటాయువు సంపాతియు సోదరులట. జటాయువు భద్రాచల ప్రాంతమందలి పంచవటి వద్దనుండినవాడు. సంపాతి తూర్పుసముద్ర ప్రాంతమున మహేంద్రగిరికి సమీపాననున్నవాడు. ఒకరిసంగతి యొకరికి తెలియజాలనంత దూరాననుండిరి. అనగా గద్దజాతియొకటి భద్రాచలమునుండి తూర్పు సముద్రతీరము వరకుండెనన వలెను. గద్దజాతివారు మనుష్యులా లేక గద్దపక్షులా యను నది చర్చనీయము. రామాయణ వానరులు కోతులుకారని, ఋక్షులు ఎలుగుబంట్లుకారని, రాక్షసాది పిశాచగణాలు మనుష్యాతీతులుకారని, వీరందరునూ ఆటవికులేయని నిర్ణ యించువారికి రామాయణము గద్దలునూ మనుష్యులేయని

తోంచును. వారును అటవికులై యుందురు. క్రీస్తుశకము ఏడవ శతాబ్దమందు "గుద్దవాది" విషయమనునదుండెను. కోమ రాజు వెంకట లక్ష్మణరావుగారు ప్రకటించిన విష్ణుకుండి మూడవ మాధవవర్మ శాసనములో (భారతి. సం॥ 8-సంగాలో) గుద్దవాదివిషయము వచ్చినది. కోమర్రాజువారును శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారును అది యిప్పటి గోదావరి జిల్లాలోని రామచంద్రపురము తాలూకాయని నిర్ణయించిరి. దానినే పూర్వము గుద్రహారము (గుద్రవాది) అనియు పిలిచినార్నారు. గుద్రశబ్దాన్ని సంస్కృతములో గృధ్రగామార్చి గద్దలనుగా తర్వాత రామాయణాన్ని పెంచినవారు కల్పించినట్లూహింపవలెను.

## రాక్షసులెవరు?

ఇక రాక్షసు లెవ్వరో కనుగొందము. మొదట రామాయణములో వర్ణింపబడిన రాక్షసులనుగురించి తెలుసుకొందము. రాముని కాలములో చిత్రకూటమునుండియే అనార్యులు వ్యాపించుకొనియుండిరి. దానికి దక్షిణమందే తాటకావనముండెను. తాటక రాక్షసికాదట! ఆమె యక్షిణి. ఆమెకు పుట్టిన మారీచుడైతే రాక్షసుడట! మరల యక్షుల మాట యెక్కడకూడా కానరాదు. అమరుడు యక్షరక్షో జనులనుచేర్చి చెప్పినాడు. మన తెనుగుదేశములో జక్కుల వారు అని యిప్పటికినీకలరు. వారే యక్షులు. యక్షజాతితో రాక్షసులు భిన్నించినవారుగా కనబడుచున్నారు. వారు వింధ్యకు దక్షిణముననే యుండియుందురు.

"తయో ర్మధ్యే ప్రవృత్తో౽భూత్ యజ్ఞస్సపురుషోత్తమ,
సహి దేశో నరవ్యాఘ్ర ప్రశస్తో యజ్ఞ కర్మణి (బా. ౩౯-౫)

వింధ్యహిమాచలముల మధ్యప్రదేశము యజ్ఞములకు ప్రశస్తమైనదనియు, సగరుడందే యజ్ఞము చేసెననియు (బాల. ౩౯ సర్గలో) తెలిపినారు.

ఇది తర్వాతికాలపు ప్రక్షిప్తశ్లోకముగా కానవచ్చు చున్నది. రాముని కాలములో ఆర్యావర్తముయొక్క హద్దులు వింధ్యవరకు వ్యాపించియుండలేదని పై తాటకావన వృత్తాంతమే నిరూపించుచున్నది.

వింధ్యనుండి దక్షిణాపథమందంతయు నుండిన అనార్యులలోని ఒక తెగయె రాక్షసుల తెగ. వారు మనుష్యులే కాని కోరలుకలిగి ఆకాశములోఎగిరి ఇష్టము వచ్చినన్ని మాయారూపములను ధరించు విచిత్రశక్తిమంతులు కారు. వారును ఆర్యులవంటివారే. వాతాపియు, ఇల్వలుడును బ్రాహ్మణవేషములను వేసుకొని సంస్కృతము మాట్లాడి ఆర్యులను మోసగించుచుండిరి. (వాతాపి ఉండిన ప్రదేశమే ఇప్పటి "బాదామి" అను ప్రదేశము. "వాతాపి గణపతి" అను ప్రసిద్ధగణపతి క్షేత్రమును చారిత్రకస్థలమును అయినదీస్థలమే) రావణుడుకూడా చక్కని బ్రాహ్మణుని వేషముతోవచ్చినప్పుడు సీత అతడేవర్ణము వాడని విచారింపకయే బ్రాహ్మణుడని గుర్తింపగలిగెను. లంకలో బ్రాహ్మణులుండినట్లు వర్ణింపబడినది. వారికిని దేవాలయములు చైత్యములుండెను. శైవమతము రాక్షసులలో ఎక్కువగా వ్యాపించినట్లు కాన

వచ్చుచున్నది. అనేకరాక్షసులు శివునిగూర్చి తపస్సుచేసి వరములను పొందినట్లు పురాణాలలో వర్ణించినారు. శైవ మతము ఆర్యుల వైదికమతముకన్న చాలా ప్రాచీనమైనది గను శివుడు, శక్తి, నానా రూపములతో దక్షిణాపథమందే కాక హిందూస్థానమునకు పశ్చిమమందున్న అనార్యదేశము లందును పూజింపబడుచున్నట్లు కానవచ్చుచున్నది.

రాక్షసులు మంచినాగరికతను పొందినవారుగా వర్ణింప బడియున్నారు. వారు వాస్తుశాస్త్రప్రకారము సుందరమైనట్టి చక్కని యిండ్లను లంకలో నిర్మించుకొనియుండిరి.

> "సితాభ్రసదృశై శ్చిత్రైః పద్మస్వస్తికసంస్థితైః
> వర్ధమానగృహై శ్చాపి సర్వత స్సువిభూషితా. —సుం. ౪-౮

రాక్షసుల సౌధములు పద్మము, స్వస్తిక, వర్ధమానము, అను పేరులుగల స్వరూపములతో కట్టబడియుండెను. ఈవిధ మగు గృహము లెట్టివో వ్యాఖ్యాత లిట్లు తెలిపియున్నారు.

"చతుశ్శాలా చతుర్ద్వారా సర్వతో భద్రసంజ్ఞితా, పశ్చిమద్వారరహితా మధ్యావర్తా హయాననా, దక్షిణ ద్వారరహితా వర్ధమానా ధనప్రదా, ప్రాగ్ద్వారరహితా స్వస్తికాఖ్యా పుత్రధనప్రదా."

'చతుశ్శాలాభవంతి' అని యిప్పటికిని మనదేశములో కొన్ని యిండ్లను సర్వతో భద్రమని యందురు. అవే రామా యణమందు పైన తెలుపబడిన పద్మము అను గృహములు. తెనుగుదేశములో నిన్న మొన్నటివరకు చతుశ్శాలా భవం తులే ఎక్కువగా కట్టబడుచుండెను. దక్షిణద్వారము లేనిది

వర్ధమానగృహము, తూర్పుదిక్కు ద్వారములేని యిండ్లను స్వస్తికములని యనుచుండిరి.

పూర్వము విమానా లుండెనా?

లంకలో విమానము లుండెనని వర్ణించినారు. అవి ఆకాశములో పోవునట్టివి కావు, వారు ఆర్యులు కనిపెట్టనట్టి ఆకాశవిమానముల కనిపెట్టియుండిరని భ్రమింపరాదు. రావణుడు సీత నెత్తుకొనిపోవుటకు వెళ్ళినప్పుడు గాడిదలతో లాగబడిన రథముపై వెళ్లెనని వర్ణించిరి. హనుమంతుడు లంకలో ఒక పుష్పకవిమానమును మాత్రమే చూడలేదు.

"రథై ర్యానై ర్విమానైశ్చ తథాహయగజై శ్శుభైః" సు. ౪-౨౭

రథములను, యానములను, విమానములను, హయగజములను చూచెను. రావణుని సైన్యమును వర్ణించుచోట ఈ మాటలున్నవి. విమానములు రథభేదములు. యానములెట్లో అట్లే విమానములును ఒక విధమైన రథములు. దక్షిణదేశములో వాస్తుశాస్త్రపరిభాషలో దేవాలయములపై నిర్మింపబడు గోపురములను విమానము లందురు. యానములపై అట్టి గోపురూపమగు కప్పు లుండినట్టివి విమానములై యుండును. అంతేకాని ఆ కాలములో ఆకాశయానము లుండెనని తలచుటకు వీలులేదు. ఆకాశములో విమానములో పోయినవాడు రావణుడొక్కడే. రావణునికి పదితలలలు, లోకాతీతశక్తి, మున్నగు విషయాలెన్నో వర్ణించినప్పుడు అతనికి ఆకాశయానమునుకూడ కల్పించుటలో కవిసృష్టిసామర్థ్యము కానవచ్చుచున్నది. దేవాలయగోపురములు సాధారణముగా

ఏడంతస్తులుకలవిగానుండును. హనుమంతుడు "స నికామం విమానేషు విషణ్ణః కామరూపధృత్, విచచార" (సు.౬-౧) విమానాలలో సీతను వెదకెను అని చెప్పుటలో ఏడంతస్తుల మేడలో వెదకెను అని అర్థముకదా. సాధారణముగా రావణుడు పుష్పకవిమానమునెక్కి సంచరించుచుండెనని చెప్పుదురు. రావణుడు సీతను బలవంతముగా అపహరించుకొని వెళ్ళునప్పుడు సీతతో నిట్లుచెప్పెను.

"యస్య తత్పుష్పకం నామ విమానం కామగం శుభం"
—అర. ౪౮-౬.

"నేను కుబేరుని లంకనుజయించి అతని పుష్పకవిమానమును లాగుకొంటిని. అది ఆకాశములో సంచరించును" అని చెప్పెను. రామాయణాంతమందును రాముడు అదే పుష్పకవిమానములో ఆకాశమార్గములో అయోధ్యకు వెళ్ళె నని వర్ణించినారు. పుష్పక మనునది ఆకాశయానమగు విమానము కాదు. అది తొమ్మిదంస్తుల మేడయైనవిమానము. అది రావణుని సొంతసౌధము. అది మహారాజుది కావున చాలా గొప్పమేడ. హనుమంతుడు చూచిన దామేడనే. అది యర్థ యోజనము వెడల్పు ఒక యోజనము పొడవును కలదై యుండెను.

"పుష్పాహ్వయం నామ విరాజమానం, రత్నప్రభాభిశ్చ వివర్ధమానం,
వేశ్మోత్తమానామపి చోచ్చమానం మహాకపి స్తత్ర మహావిమానం.
యు. ౭-౧౧

పుష్పకమను పేరుగల చాలా గొప్పమేడను చూచెను. ఆ బంగ్లాలో విశాలమైన గదులుండెను. చుట్టును మైదాన

ములు, తోటలు, నానావిధ పుష్పవృక్షములు, ఫలవృక్షము లుండెను. అట్టి పెద్ద బంగ్లానే తర్వాత రామాయణమును పెంచి వ్రాసినవారు ఆకాశములో సంచరించు విమానముగా చేసి దానికి రెక్కలుపెట్టి అందలి చెట్లను చిత్తరువులుగాచేసి వేసినారు. వాల్మీకి రామాయణములోనే ఆదిభాగమం దిట్లున్నది.

"సర్వరత్న సమాకీర్ణాం విమాన గృహశోభితాం"

—బాల. స. ౫, శ్లో. ౧౬.

అయోధ్యానగరము నానారత్నములతో కూడినదియు "విమాన గృహముల" చేత నిండినదియునై యుండెను అని వర్ణించినారు. విమాన గృహమనగా రాజులమేడలు అని యర్థము. "విమానోస్త్రీ దేవయానే సార్వభౌమిక సద్మని" (భాస్కరనిఘంటు) అని వ్యాఖ్యాతలందే నిరూపించినారు. విమానమనిన ఆకాశమును కొలుచునది అనునర్థముకూడా ఇచ్చుటచేత తర్వాతికాలమందు రామాయణమును పెంచిన వారు విమానమునకు ఆకాశయానమని అర్థముచేసి వర్ణించిరి కాని పుష్పకవిమానము అనునది రావణుని యుద్యాన భవన మను వర్ణనలను, రావణుడు గాడిదలతో లాగబడిన రథముపై సీతాపహరణార్థము వెళ్ళెనను వర్ణనలను సమన్వయించుటో లేక వాటిని తుడిచివేయుటయో ఆలోచింపకపోయిరి.

"జనౌ ఘోద్ఘుష్ట సన్నాదో విమానం కంపయన్నివ"

—అయో. ౧-౧౮.

సభ్యులుచేసినధ్వని రాజభవనమగు విమానమును కద లించినట్లుండెను అని వర్ణించినదియు గమనింపదగినది.

(మద్రాసు లా జర్నల్ ప్రెస్సువారు ముద్రించిన నాగరిలిపి రామాయణములో విమానమునకు మాఱుగా "మేదినీం" అని యున్నది.

శబ్దకల్పద్రుమ నిఘంటులో నిట్లు వ్రాసినారు. "విమానః—సార్వభౌమగృహం—తత్తుసప్తభూమిగృహం" విమానమనిన సార్వభౌమ భవనమనుటకు రామాయణము నుండియే మరి రెండుదాహరణముల జూడుడు.

"తపద్రికూటాచలమేఘసన్నిభం
మహావిమానోత్తమవేశ్మ సంఘవత్" (అయో. ౧౫-౨౫)

విమానవేశ్మము అనుమాట గమనింపదగినది.

"ప్రాసాదశృంగైర్విపులైః కైలాసశిఖరోపమైః
ఆవారయద్భిర్గగనం విమానైరివ పాండరైః
వర్ధమాన గృహైశ్చాపి రత్నజాల పరిష్కృతైః
(అయో. ౧౭-౧౨౮)

ఇక్కడ విమానములతోపాటు వర్ధమాన గృహము లనుగూడ వర్ణించినారు. శబ్దకల్పద్రుమ మిట్లున్నది. "వర్ధమానః—ధనినాం గృహవిశేషః—యథాహలాయుధః—స్వస్తికోవర్ధమానశ్చ నంద్యావర్తాదయోపిచ – యథాబృహత్సంహితాయాం—ద్వారాలిందోంతగతః–ప్రదక్షిణోన్యః శుభస్తతశ్చాన్యః–తద్వచ్చ వర్ధమానే ద్వారాస్తున దక్షిణం కుర్యాత్."

ఈ చర్చనుబట్టి వాస్తుశాస్త్ర విద్యాప్రకారము పూర్వము స్వస్తికవరమాన నంద్యావర్త విమానాది భేద

ములుగల సౌధము లుండెననుట స్పష్టము. ఆకాశయాన ముల వర్ణనలీకాలములోనే కాని మరేకాలములోను లేకుండెనని నాభావము.

రాక్షసుల నాగరికతాప్రసక్తిలో విమానచర్చ వచ్చుటచే ఇంతదూరము వ్రాసినాను. రాక్షసస్త్రీలు చాలా అందమైనవారుగాను, వస్త్రభూషణ భూషితలుగాను, చూడదగిన వారుగాను, వర్ణింపబడినారు. వారికి కోరలు, భయంకర వికారరూపములు కానరావు. వారిలో సంగీతకళ చాలా వృద్ధిపొందియుండెను. అంగహారాది నృత్తశాస్త్రపరిపాటి నెరిగిన స్త్రీ లెందరో అందుండిరి. (యు. ౧౦-౩౬) ఆస్త్రీలు వీణవాయించు నేర్పరులు. రాక్షసులు గుమ్మెటు, పటహము, పిల్లనగ్రోవి, విపంచి, మృదంగము, పణవము, డిండిమము, ఆడంబరము, మున్నగునవి యెరిగియుండిరి. (యు. సర్గ ౧౦)

## రావణుడు

రావణునికి సాధారణముగా ౧౦ తలలు ౨౦ చేతులు ఉండినట్లు రామాయణములో అందందు వర్ణించినది నిజమే. కాని అది కల్పన. అతనికి అందరికివలెనే ఒక తల రెండు బాహువులు ఉండెను. హనుమంతుడు మొట్టమొదటిమారు నిద్రించుచున్న రావణుని చూచునప్పుడు అతనికి ఒక తల (సు. ౧౦-౨౮) రెండుచేతులే యుండెను. (సు. ౧౦-౧౫ నుండి ౨౨ వరకు) ఈ శ్లోకాలలో చేతులకు ద్వివచనము ముఖమునకు ఏకవచనమును వాల్మీకి ప్రయోగించెను. అతడు నల్లనివాడు. తెల్లని పాన్పుపై మాషరాశివలె (మినుప కుప్పవలె) నుండెను (సు ౧౦-౨౮). రత్నాలతోపొదిగిన పోగులు

కలిగియుండెను. తెల్లని పట్టుబట్టలను కట్టియుండెను. నానా విధ హారములను ధరించియుండెను. అతడు మహాకాయుడు. అధిక బలాఢ్యుడు. ౧౦౦౦ మంది భార్యలు కలవాడు. రావణునికి నడుములో నల్లని మొలనూలు (శ్రోణిసూత్రము) ఉండెను.

రావణునికి సంస్కృతము బాగా తెలిసియుండెను. హనుమంతుడు సీతతో మాట్లాడుటకు ముందిట్లనుకొనెను "నేను సంస్కృతముతో మాట్లాడితే సీతాదేవి నన్ను రావణుడని భ్రమించును" (సు ౩౦-౧౮). అంతే కాదు. రావణుడు మనకింకా దగ్గఱకు వచ్చుచున్నాడు. అతడు ద్రావిడ భాషలకు ముఖ్యవ్యాకర్తగా వర్ణించినారు. ఆంధ్రవిజ్ఞానసర్వస్వములో ఇట్లు వ్రాసినారు. "అథర్వణకారికలలో ప్రాచీనాంధ్రలక్షణవేత్తలుగా బృహస్పతి, కణ్వుడు, హేమచంద్రుడు, పుష్పదంతుడు, రావణుడు, గౌతముడు, ధర్మరాజు పేర్కొనబడినారు. 'అథ పౌలస్త్య రావణః' అని ౮వ కాండములో పేర్కొన్నారు. 'అనుక్తం సర్వశాస్త్రం తు రావణీయే విలోకయేత్' అని ౭వ కాండములో కలదు. ఈ విషయములిప్పటి ముద్రిత వావిళ్ళ ప్రతిలో లేవు. అందుచేత ఆం. వి. సర్వస్వమును ఉదహరించినాను. దాని ప్రకారము రావణుడు ఆంధ్రుడగుచున్నాడు. "రావణుడు అను పదము బహుశః పేరు కాదేమో! తమిళములో ఇరైవాన్ అనగా దేవుడు, రాజు అని అర్థము. దానినే సంస్కృతీకరించి యుందురు." [1] రో లేక రై అనిన మన తెనుగులో ధనము అని యర్థము.

1. Pergiter—Ancient Ind. Hist. Tradition.

రైవాన్ అనిన ధనవంతుడు లేక రాజు అని యర్థమగును. కావున రైవాన్‌నుండి రావణ పదము వచ్చియుండరాదా? తెనుగు తమిళములకు రావణుని కాలములో భేదము లేకుండె నని ఎట్లు నిర్ణయించినను బాధకములేదు. ఇరైవాన్ నుండి రావణ యేర్పడెనన్న ఊహ సతర్క్యముగా కానవచ్చుచు న్నది. పౌలస్త్యఅనిన అర్థమగునుకాని రావణ అనిన అర్థము కాదు. అందుచేత కష్టపడి దాని కొక అర్థము చెప్పినారు. ఈ పదమునుండి రావణుడు తెనుగువాడో తమిళుడో అని తెలియవచ్చుచున్నది. ప్రాచీనాంధ్రవ్యాకర్తలలో నితడొక డని ప్రతీతి యుండుటచేత ఆంధ్రుడే యైయుండు ననుటకు కొంత యాధార మెక్కువగా నున్నది.

రామాయణములో వర్ణింపబడిన రాక్షసులను గురించి మన మీ విధముగా తెలుసుకొనగలుగుచున్నాము. తద్విరుద్ధముగా వారితో ఆర్యులు పోరాడినప్పుడు వారు నరభక్షకులనియు, కోరలు గలవారనియు మాయావులనియు, నానావిధములుగా వారిపై మనకు అసహ్యము కలుగునట్లుగా వర్ణించినారు. శత్రువులను ఎన్నియో విధములుగా దూషించుట లోకాచారమే.

## రాక్షస వర్గములు

ఇక రాక్షసు లెవ్వరో వారి నిజతత్త్వమెద్దియో విచారింతము. ప్రాచీనార్యులకు వివిధ జాతులవారైన అనార్యులతో సంఘర్షణ లుండెను. హిందూస్థానమునకు పశ్చిమోత్తర ప్రదేశములందు ఈరానీలతో తగవులాడిరి. వారికి

పశ్చిమములోనున్న అసీరియా, బాబిలోనియా, ఖాల్డియా, ఫినికియా, వారితో తగవులో వ్యాపారమో ఏదో యొకటి యుండెను. అటు హిమాలయోత్తరమున హూణులతో ౧౦౦౦ సంవత్సరములవరకు యుద్ధాలుచేసిరి. కాకేసస్ పర్వత ప్రాంతాలలో నున్న శక (సితియన్) జాతితో తగవులాడిరి. హిందూస్థానములో సింధూనదికి తూర్పున మొదట మొదట భిల్లులవంటివారును ఇంకనూ దక్షిణములో యక్షులును, వింధ్యకు దక్షిణములో రాక్షసులును, ఆర్యులతో యుద్ధములు చేయుచుండిరి. కావున ఆర్యులు తమకు భిన్నించినవారిని తమతో వైరమూనినవారిని రాక్షసవర్గములోను అసుర పిశాచవర్గములోను కట్టివేసిరి. తమతో వైరమూనిన జాతుల పేరుల నన్నింటిని తర్వాతి పౌరాణికులు కలగలిపి అసుర రాక్షస పర్యాయ శబ్దములుగా నిర్వచించిరి. అందుచేతనే నేను మొదటే అమరసింహుడిచ్చిన ఆ శబ్దములపట్టిక నుదహరించినాను. అమరసింహుడిచ్చిన శబ్దాలపట్టికలో శుక్రశిష్య, రాత్రించర, సురారి, పూర్వదేవ, వంటి గుణవాచకములను వదలివేయగా మిగిలినజాతులివి. (౧) విద్యాధర, (౨) అప్సర, (3) యక్ష (౪) రాక్షస (౫) కిన్నర (౬) పిశాచ (౭) గుహ్యక (౮) సిద్ధ (౯) భూత (౧౦) అసుర (౧౧) దనుజ (౧౨) కర్బుర (౧3) యాతు (౧౪) పుణ్యజన (౧౫) నైరృత.

ఈ విధముగా మనకు ఇంచుమించు ౧౫ విధములైన అనార్యజాతులవారు కనిపించుచున్నారు. అయితే వీరితో పాటు మనము ఇంకా కొందరిని చేర్చవలెను. వారు (౧) నాగులు (౨) కిర్మిరులు. ఈ లెక్క చొప్పున ౧౭ జాతుల

వారు ఏర్పడుచున్నారు. అమరసింహుడు చూపిన పర్యాయ పదాలలో దైత్య, దైతేయ, దితిసుత అనునవి దానవులకు వర్తించును. దానవ, దనుజ రెండును ఒకటే. అందుచేత ఇవన్నింటికిని దనుజ అను పదమొక్కటే గ్రహించినాను. పూర్వదేవ, సురద్విష, అను నవి అసురశబ్దవాచ్యములే. కోణపక్రవ్యాత్, క్రవ్యాద, అస్రప, అనునవి వారి మాంస భుక్తిని సూచించును. పచ్చిమాంసము తినేవారని అట్లు నిర్దేశించియుందురు. శుక్ర శిష్యులని అసురులు ప్రఖ్యాతులు. ఇక ఈ ౧౭ జాతులను గురించి విచారింతము. వీరిలో విద్యాధరులు, అప్సరలు, యక్షులు, పిశాచులు, గుహ్యకసిద్ధులు, భూతములు, మన చర్చకు సంబంధించినవారు కారు. వారు హిందూస్థానములో నుండిన ఆదిమనివాసులే. విద్యాధర గంధర్వులు గాంధార దేశమువారు. పిశాచులు పైశాచీ ప్రాకృతమును మాట్లాడుచుండిన యీ దేశవాసులు. సిద్ధులును భూతములును వారి భేదముగానే కానవచ్చుచున్నారు. భూతములు తిబ్బెట్ (త్రివిష్టప) దేశములోనివారైయుందురు. దానిసరిహద్దులో హిందూస్థానోత్తరభాగము భూతాన్ దేశము కలదు. భూతాన్ వారిని భోటులనిరి. వారినే భూతములని పౌరాణికులు భావించియుందురు. యక్షులు జక్కులవారని తెలిపినాను.

అయితే యీ జక్కు-అను పదమైనను ఎట్లేర్పడెను? తెనుగు వాఙ్మయములో జక్కులవారిని కొందరుకవులు వర్ణించినారు. దాన్నిబట్టి జక్కులు శక్తిని, శివుని పూజించు వారని యర్థమగును. శివునికి "జక్కులరేడు" అని పేరుకూడ

కలదు. జక్కులపూర్వచరిత్ర మనకేమియు తెలియుటలేదు. అనార్యసంఘములగు అసుర, పిశాచవర్గాలలో నుదాహృతులగుటచేత జక్కులు లేక యక్షులు అనార్యజాతివారనుటలో సందేహములేదు. అయితే వీరు హిందూస్థానమున నుండిన అనార్యులా లేక ఈరాన్, చీనా, ప్రాంతాలలో నుండిన అనార్యులా అనునది విచారింపవలసియుండును. అసుర, పిశాచ, గాంధర్వ, దైత్య, దానవ, కిన్నరాది వర్గాలన్నియు హిందూస్థానములో కాక దానికుత్తర పశ్చిమ దేశాలలోనుండిన అనార్య జాతులగుటచేత వాటితోసహా పఠింపబడిన యక్షులుకూడా బయటివారేయని తలచిన పొరపాటుగా నుండనేరదు. ఇట్టిజాతి యొక్క యునుకుటచేత మన పురాణాలలో వర్ణితమైనది. కాని యదెక్కడిజాతియో పురాణాలను అడ్డాదిడ్డిగా పెంచిన వారికిమాత్రము తెలియును. అందుచేత వారిని "దేవయోనుల"లో జమాకట్టిరి.

పూర్వము యక్షులను ప్రత్యేక మానవజాతి యొకటుండెను. "దేవయోనుల" పుట్టుపూర్వోత్తరాలకై మనము టిబెట్టు, చీనా, ఈరాన్, అసీరియా, ఫణీకియా, ఫ్రిజియా, తార్తరీ, బాబిలోనియా, హట్టి (హిట్టైట్). ఖశ (కస్సైట్) ఆర్మీనియా, మీడియా, దేశాలలో వెదకినచో అవన్నియు సులభముగా వెల్లడికాగలవు.

క్రీస్తుశకమునకు పూర్వము నాలుగైదునూర్ల యేండ్లనుండి తచ్ఛకారంభమువరకు యచీ (yuchi) అనుజాతి హూణజాతితో సమానముగా ప్రబలమైన జాతిగానుండెను.

అది చీనా దేశ చరిత్రలో పై కాలమందు ముఖ్యపాత్ర వహించెను. ఈ యఛీజాతి హూణులవలె మధ్యఏషియాలోని తార్తరీజాతివారు. హూణులతో యుద్ధాలుచేసినవారు. వీరు క్రీ. పూ. ౧౬౫ ప్రాంతములో ఈరానులో యూర్ ఖండ్, కపఘున్, మండలాల నాక్రమించుకొని యచట స్థిరపడిరి. ఆ సమయములోని చీనా చక్రవర్తి యఛీజాతితో సంధిచేసుకొని హూణుల నెదిరించెను. క్రీస్తు శకారంభమున యఛీలు హిందూస్థానములో ప్రవేశించి కాశ్మీరు, పంజాబు దేశాలలో నిలచిపోయిరి. వారు క్రమముగా గూర్జర ప్రాంతానికిని వ్యాపించిరి. వారిలోనివాడే కనిష్క చక్రవర్తియని చారిత్రికులు తేల్చినారు. గూర్జరమునుండి కొందరు క్రీస్తుశకాది నుండి పదవ శతాబ్దమువరకు తెనుగు దేశములోనికి వచ్చియుండిన ఆశ్చర్యము కాదు. కావున ఈ యఛీ జాతివారే యక్షులని యనుకొందును. మన ప్రాచీనశైవము - కాశ్మీర శైవమనియు, ద్రావిడశైవ మనియు రెండు విధాలుగానుండెను. కాశ్మీరము తురకాణముగా మారువరకు కాశ్మీరులు పరమ వీరశైవులు. యఛీలచటనే శైవమును పుచ్చుకొన్నవారై యుందురు. అందుచేతనే జక్కులవారునూ్న శివశక్తుల పూజకులై యున్నారు.

యూరోపుఖండములోని బ్లాక్ సీ (Black sea) అను సముద్రానికి ప్రాచీనకాలమందు యుక్సైన్ (Euxine sea) సముద్రమని పేరుండెను. యుక్సైన ప్రాంతమందుండిన జనులను యక్షులని రేమో అనియు నొక యూహను తెలుపుకొంటున్నారు. అక్షస్ (Oxus) నదీప్రాంతము ... నా... అయి

యుండురు. అక్షస్ పదాన్నిబట్టి యక్షస్ యేర్పడియుండును. ఈ మూడింట నేదైనా ఒకటి మూలమైయుండును.

ఇక కిన్నరు లెవరో తెలుసుకొందము. ప్రాచీన గ్రీకు చరిత్ర కారులు (Kanarii) "కనారియై" అను జాతియొక్కటి ఏషియామైనరులో నుండినట్లు వ్రాసినారు. ఆ జాతి ఏషియా మైనరులో సిరియా మున్నగు దేశాలలో నుండిన ఒక శక (Sematic) జాతియై యుండును.

మన తెనుగు కిన్నర లేక కిన్నెర అనిన ఏకతంత్రీ సమాయుక్తమగు తంబురావంటి యొక వాద్య విశేషము. అయితే చిత్ర మేమన గ్రీకుభాషలోకూడ కిన్నెర అనిన (Lyre) మన తెనుగు కిన్నెరవంటిదే. కిన్నెరనుగూర్చి అడోనిస్ (Adonis) అను గ్రంథములో (Thinker's library) జే.జీ. ఫ్రేజర్ ఇట్లు వ్రాసెను— "సిరియా సముద్రతీర ప్రాంతమును పూర్వము శకరాజగు కినిరాస్ (Cinyras) ఏలెను. అతడు తంత్రీవాద్యమందు నిపుణుడు. కినిరాస్ పదము స్పష్టముగా గ్రీకు కినిరాతో సంబంధము కలదు. కినిరా అన తంత్రీవాద్యము (Lyre). ఆ పదము గ్రీకుభాషలోనికి శకభాషలోని కిన్నర్ (Kinnor) అను పదమునుండి యేర్పడినది. పూర్వ కాలమందు జరుసలెంలో తంత్రీవాద్యము దేవుని సేవలో ప్రధానమైనదిగా కానవస్తున్నది. వాద్యగీతముల ద్వారా దేవుని ప్రసన్నునిగా జేసుకొనుచుండిరి. ఈ వాద్యములందే అచ్చటి పూజారులకు ఒళ్ళు నిండుచుండెను." (పుట. 38)

పై విషయాలనుబట్టి కిన్నరులను జాతి శకజాతివారనియు, వారు గాన వాద్యములందు ముఖ్యముగా కిన్నెర వాద్యమందు ప్రవీణులనియు వారు సిరియా ప్రాంతమందుండిన వారనియు గ్రహింపవచ్చును మన పౌరాణికులును, కిన్నరులును, గాంధర్వులును (గాంధార దేశమువారు) గీతవాద్యములందు ప్రవీణులని వర్ణించిరి.

గ్రీకు పురాణములలో కెంతోరులు (Centaurs) అనువారుండిరి. వారు సగము గుఱ్ఱము సగము మనిషి ఆకారము కలవారు. వారు లాపితులు (Lapiths) అను మానవజాతితో వైరము కలిగి వారి స్త్రీలను బలాత్కరింప తలపెట్టుచుండెడివారగుటచే ఉభయవర్గాలకును నిరంతరయుద్ధములు జరుగుచుండినట్లును గ్రీకుల సంగీతాధిదేవతయగు అపోలో లాపితుల పక్షము వహించి సాయపడినట్లును గ్రీకు పురాణాలు వర్ణించెను. కెంతౌరు పదమే కిన్నర పదమని స్పష్టమగుచున్నది. గ్రీకుల సృష్టిని హిందువులు గ్రహించిరో యేమో?

టిబెటు హిందూస్థానముసరిహద్దుతో కలియుచోట నొక జాతి కలదు. దానిని నేటికిని కిన్నరజాతి యందురు. ఆ జాతివారు సంగీతమునకు ప్రసిద్ధులు—

యక్షజాతియొక్క పుట్టుపూర్వోత్తరాలన్ని సందేహాలతో నిండియుండగా వాటికి మరొక సందేహమునుగూడ జతజేయవలసియున్నది. ఏ. నంది అనువారు "ఇండియన్ ఎత్నాలజీ" అను గ్రంథములో నిట్లు వ్రాసిరి.

"విష్ణుపురాణములో దక్షుని కూతురగు ఖశ అనునది కశ్యపుని భార్యయయ్యెననియు ఆమెకు యక్షులు రాక్షసులు పుట్టిరనియు వ్రాసినారు. ప్రాచీన సంస్కృత రచయితలకు యక్షులు—ఖశజాతివారనియే తెలిసియుండెను. ప్లినీ అను ప్రాచీన గ్రీకు చరిత్రకారుడు యక్షులు నేటి కుమవాన్ (Kumaon) మరియు నేపాలు దేశాలకు పశ్చిమముననుండి నట్టివారని వ్రాసెను."

కాశ్మీరమందు ఇంచుమించు ౧౦౦౦ ఏండ్ల క్రిందట వ్రాసిన పౌరాణిక గాథయగు నీలమత పురాణమందు నికుంభుని నాయకత్వమున కొందరు పిశాచులు హిమాలయోత్తరమునుండి వాలుకార్ణవములో ఆరుయోజనముల పొడవుగల నొక ద్వీపమునకు (దేశమునకు) వెళ్ళిరని వ్రాసినారు. గ్రీర్సన్ పండితుడు దరదులే పిశాచులని అభిప్రాయపడినాడు." హిమాలయోత్తరమందలి వాలుకార్ణవము (ఎడారి) గోబీ యనునది. అది మంగోలియాలో కలదు. కాశ్మీరులోని భాగమును దరద్దేశమని కల్హణుడు వర్ణించినాడు. వీటినిబట్టి కాశ్మీరు, టిబెటు ప్రాంతాలలోని ఆదిమజనులను పిశాచు లనుటలో సందేహములేదు. నైరృత శబ్దము రాక్షస పర్యాయముగా అమరుడు తెలిపినాడు. ఇదికూడ ఒక దేశమందలి జనులను తెలుపును. డి. జి. హోగర్తు (Anciant East) ప్రాచీనప్రాచ్యము అను గ్రంథములో నిట్లు వ్రాసినాడు—

"అసీరియాకుత్తరమున ఖాల్డియా యుండెను. దానినే ఉరర్తుదేశ మనిరి. టైగ్రిసునది పైభాగమును మెసపొటే

మియా పై భాగమును అసీరియావారు పూర్వము నైరీ (Nairi) భూములనిరి." ఆ భూములే నైరృతి భూములై యుండును. అచ్చటి జనులనే మనవారు నైరృతులనియుందురు. అసుర దానవ దైత్యవర్గాలుండు ప్రాంతములందే నైరృతులుండుటయు నీ యూహను బలపరుచును.

ఇక అప్సరులెవరో తెలుసుకొందము. అలెగ్జాండరు మన దేశముపై దండయాత్ర చేసినప్పుడు హిమవత్పర్వత ప్రాంతాలలో అస్పరులు (Asparians) అతనితో ఘోర యుద్ధము చేసిరని చరిత్రకారులు వ్రాయుటలో అప్సరులజాడను తెలిపినారు. వర్ణవ్యత్యయము వ్యాకరణమందును సారూప్య భాషాశాస్త్రము మనబడు ఫిలాలజీలోను అంగీకృతమైనట్టిది. నేటికిని ఆంధ్రులలో కల్హార, బ్రహ్మ, మధ్యాహ్నము, మున్నగునవి ఉత్తరహిందూస్థానాలలో శ, షల కలగలుపు షక్తి, షాస్తర్ [illegible]దాద్యపభ్రంశోచ్చారణము వీటి కుదాహరణములు. కావున అస్పర తొందరగా సులభముగా అప్సర అయ్యెను.

ఇక మిగిలినవారు(౧) రాక్షస,(౨)కిన్నర,(౩)అసుర,(౪) దనుజ, (౫)కర్బుర, (౬)యాతు, (౭)పుణ్యజన, (౮)నాగ,(౯) కిర్మీర—వీ రందరును ఒకే జాతివారు కారు. భిన్నభిన్న జాతుల వారు. నైరృతులు అనగా ఆర్యులకు నైఋతిదిక్కునుండిన వారు. అసురులు రాక్షసులు ఒకే జాతివారనుట సరికాదు. సురలు కానివారు అసురులు అనుటయు సరికాదు. ప్రాచీనములో దేవతలు, అసురులు అను రెండు జాతు లుండెను. ఋగ్వేదములో సురశబ్ద మెచటను కానరాదని తద్జ్ఞులను చున్నారు. అందు దేవశబ్దమే వాడినారు. ప్రాచీన ఈరా

నీలయొక్క జందఅవెస్థా గ్రంథములో దేవ అనిన దుష్టజనుడు, అహుర అనిన మంచి జనుడు. ఆ పదములే ఋగ్వేదములో తలక్రిందైనవి. అందుచేత ఆర్యులు ఈరానీలనుండి వివాదపడినది స్పష్టము. అసీరియాదేశమువారే అసురులు అని పలుపురన్నారు. అయితే అసీరియావారే అసురులని చెప్పజాలము. ముండాజాతిలో ఒక అసురజాతి యిప్పటికినీ కలదు. ‡మొత్తముపై అసురులు రాక్షసులు భిన్నజాతులుగా కనిపించుచున్నారు. దనుజులు అనువారు దనుసంతతివారని స్పష్టమగుచున్నది. దానవులు కకేసస్ పర్వతములకు ఉత్తర భూమిలో నివసించినట్టివారు. కీరోపండితు డిట్లు వ్రాసెను.

"దనుజాతి జోర్డన్‌నుండి వచ్చెను. వారు వ్యాపించిన ప్రదేశములలో తమజాతినామమును స్థిరముగా ముద్రించిపోయిరి. డాన్‌యూబ్, డానిష్టర్, డానిట్జ్, డాన్‌డారి, డాన్‌రిక్‌గట్లు, డాన్‌మార్క్, ఐర్లాండులోని కొన్ని ప్రదేశా

---

"తే అసురా ఆత్తవచసోహే అళవోహే అళవ ఇతివదంతః వరాబభూవుః తస్మాన్న బ్రాహ్మణో మ్లేచ్ఛేత్ అసుర్యాహివిషావాక్"

శతపథ బ్రాహ్మణము ౩-౨-౧౨౩

‡ అసురులు అరయః అని యుచ్ఛరించలేక అలవ అని పరాభూతులైనందున అది మ్లేచ్ఛవాక్కు అని యర్థముకదా. అసురులు మ్లేచ్ఛులు ఛందో భాషనే అపభ్రంశముగా మాట్లాడిరనుటచే వారు ఆర్యులకు సంబంధించి వేరై పోయినవారని యర్థమిచ్చును. పైబ్రాహ్మణ వాక్యాలే మహాభాష్య పశ్పశమందును కలవు.

లున్నూ వారి పేరుతో నిండియున్నవి." [2] కావున దానవులు లేక దనుజులు రాక్షసులతోను అసురులతోను భిన్నించియుండిరి. దానవులు కకేసస్ పర్వతాలకు ఉత్తరసీమలో నిండియుండినవారు, అసురులు ఈరానులోనివారు. దైత్యులను శబ్దమెట్లేర్పడెనో విచారింతము. దితేరపత్యంపుమాన్ దైత్యః, దైతేయః అని పురాణాలపెంచిన మహాశయులు కల్పించుకొనుటచే దితి అను దేవతను సృష్టించిరి. దితి యెప్పుడు పుట్టెనో అదితి యేల పుట్టరాదు ఆమెనుకూడా పుట్టించిరి ఆమెకు సంతాన మిచ్చి వారిని ఆదిత్యులనిరి. మరి దితికి అదితికి భర్త కావలెకదా. కశ్యపు నేర్పాటుచేసిరి. దేవ దానవులను పుట్టించినవాడు సాధారణ మునియగునా. అతడు కశ్యపబ్రహ్మగా మారెను. అతని కింకనూ పలువురు భార్యలను కూర్చిరి. వారికినీ సంతానము కలిగెను. వారే దానవాదిత్య దైత్య యక్ష రాక్షస సురాసురాది దేవయోనులైరి. ఈ కథలన్నియు కల్పితములే.

చారిత్రక దృష్టితో మనము యథార్థమును కనుగొనవలెను. ప్రాచీనార్యులగు మన పూర్వులు ఆఫ్రికాఖండోత్తర

---

2 The tribe Dan came from the land of Jordan. This is borne out by the names they left behind in their northward march such as the Dan-ube, Dan-ister, Dan etz, Dan-dari, Dan-ric Alps, Dan-mark. In Ireland are seen such names as Dan-lough, Dan-sower, and Dan-gan.—

Cheiro's World Predictions PP. 60-64

భాగమందలి బర్బర దేశము నల్ల సముద్రమునకు కాస్పియన్ సముద్రమునకు సమీపమందును దక్షిణముననున్న దేశాలు, తార్తరీ, మంగోలియా, చీనా దేశాలు వాటికి దక్షిణమున నున్న దేశాలు, ఏషియామైనర్ భూభాగ దేశాలు జపాను, ఫిలిప్పైన్ దీవులుతప్ప తక్కిన ఇండోనీషియా దీవులు, మలయా, బర్మా, సయాం దేశాలు ఎరిగియుండిరని గట్టిగా చెప్పవచ్చును. తర్వాత క్రీస్తు శకాదినుండి అయిదారు నూ రేండ్లవరకు పురాణాల పెంచుతూ పెంచుతూవచ్చిన పెద్ద మనుష్యులు సముద్ర ప్రయాణముచేయక విదేశాలకుపోక తమ భారత దేశమే తమకు తెలియక, శబ్దసామ్యాలనుబట్టియే కథ లల్లిరి.

శబ్దసామ్యాలపై కథల పుట్టుకకు కొన్ని నిదర్శనములు చూపింతును. సుగ్రీవుడును వాలియు ఎట్లు పుట్టిరో కనుగొందము. ఒక కోతి నొకనాడు ఇంద్రుడును సూర్యుడును ఒకే మారు చూచి ఒకేమారు మోహాబ్ధిలో మునిగి ఉక్కిరిబిక్కిరి మైరట! దేవతలైనను వారి కింద్రియనిగ్రహము లేకపోయె నట! అదెంతటి అందమైన కోతియో యేమో, వెంటనే ఇంద్రుని సూర్యుని వీర్యములు దాని గ్రీవముపై, వాలముపై పడెనట. పసుటయేతడవు దేవతల వీర్యము వ్యర్థమగునా మరి. సుగ్రీవుడు, వాలియు పుట్టిరట!

ఒకనాడు మనువుదుమ్మిన
వికలుడుగాకతనిఘ్రాణవివరము వెంటన్
ప్రకటయశుం డిక్ష్వాకుం
డకలంకుడు పుట్టె రవికులాధీశుండై.

భాగవతము. నవమస్కంధము. ప. ౧౫౫

మను వంతటివాడు "ఇక్షూ" అని గట్టిగా తుమ్మితే ఆ తుమ్ము వ్యర్థముగా పోవచ్చునా ? పోనీయరాదు. ఇక్ష్వాకుడే పుట్టవలెను.

యువనాశ్వునకు ౧౦౦ మంది భార్యలుండిరట. అందొక్కదానికైన సంతానము కలుగరాదా? ఊహూం, కలుగలేదు. కలరుగదా పుత్రులను పుట్టించు మంత్రాలు చదువువారు. (మన తెనుగువారే మంత్రాలకు మామిడికాయలు రాలునా అను సామెతను పుట్టించి అపచారము చేసినారు) వారు జలములు మంత్రించి రాత్రి యొకచో భద్రపరచి యుంచగా సరిగా ఆ జలాన్నే యువనాశ్వుడు అర్ధరాత్రి దప్పిగొన్నవాడై త్రాగవలెనా? ఆ నీరు త్రాగగానే గర్భము దాల్చెను. ఎవరు ? మగవాడు ! ఆతనికి కొడుకుగూడా పుట్టెను. ఎట్లు పుట్టెను? భావిసంతతివారికి సందేహము కలుగకుండా ఆ పిండము తానే కడుపు ప్రక్కలించుకొని చక్రవర్తి చిహ్నలతో పుట్టనే పుట్టెను. ఇంద్రుడు వచ్చి "మాంధాస్యతు" నా వ్రేలు కుడువుము అని అన్నాడట. అందుచేత ఇంద్రుని వ్రేలుచీకి పెద్దవాడై మాంధాతయను పేరుపొందెను.

(భాగవతము. నవమస్కంధము ప. ౧౬౭)

"పెద్దలైన మునులు పృథివీస్థలికి రాజు
లేమిజూచి నిమికళేబరంబు
దరువ నొకడుపుట్టె తనయుండు వానిని
జనకుడనుచు బలికె జగములెల్ల

మరియు నతండు విదేహుండు కావున వైదేహుం

డనియు మథనజాతుడు. గావున మిథిలుండనియు ననంబరగె."

(భాగవతము. నవమస్కంధము. ౩౭౦-౧)

మగపీనుగనుండి జనించెగాన జనకుండట! ఒక్క నవమస్కంధములోనే యిన్ని కథలు. తుమ్మునుండి, మగవాని కడుపునుండి, మగపీనుగనుండి పిల్లలను పౌరాణికులుతప్ప ప్రపంచమందు మరెవ్వరైన పుట్టించినారా? ఇవి మన పౌరాణికుల ఘోర కల్పనలు!

కావున ఇట్టి కల్పనలలోపల దాగిన మూలవిషయములను విడదీసి తేల్చుట అత్యంత కష్టసాధ్యమగు పనియైపోయినది.

కశ్యపునికి పలువురు భార్యలనియంటిమికదా! కశ్యపుడెవరు? ఆలోచించి పరికించిన కాస్పియన్ సముద్రమే కశ్యప సముద్రము. ఆ సముద్రమునకు భార్యలు దానిలోనికి పారు నదులు. డాన్ నది అందులోనికి పారును. కాన తత్ప్రాంతీయులు దానవులనబరగిరి. దైత్యాక్ అను మరొకనది దానిలోనికి పారును. అందుచేత తత్ప్రాంతీయ జనులు దైత్యులన జెల్లిరి.

రాక్షసులు అను పద మెట్లు వచ్చెనో ఎవ్వరునూ ఊహింపజాలకున్నారు. దైత్య, అసుర, కిమ్మీర, యక్ష, గాంధర్వాది జాతులవలె రాక్షసులును ఒక అనార్యవర్గము వారై ప్రాచీనార్యులకు సన్నిహితులై వారితో తగవులు,

బాంధవ్యాలు చేయుచూవచ్చినవారై యుందురు. వారు ఆఫ్గనిస్థానుకు పశ్చిమోత్తరమందుండియుందురు. ఆప్రాంతములో అరల్ సముద్రము (Sea of Aral) కలదు. దానిలోనికి అరక్షస్ (Araxes) అను నది పారుచున్నది. ర కారము (రేఫ)నకు ముందు అ,ఇ,ఉ, అను నచ్చులుపయోగించి పలుకుట బహుప్రాంతాలలో ముఖ్యముగా ద్రావిడులలో, శకజాతులలో వర్తించు నాచారము. తమిళములోని ఉరల్ మన రోలు. ఇట్టి వనేకముగా కలవు. అరబ్బులు అల్ శబ్దమును పదాలకు చేర్చుదురు. ఇబ్రహిమాన్, ఇబ్రహీం ఇత్యాదులు కలవు. కావున అరక్షస్ అనునదే రక్షస్ అయినది. అరక్షస్ నదీప్రాంతవాసులే రక్షస్సులు—రక్షోగుణమువారు. వేదాలలో రక్షస్‌శబ్దమేకలదుకాని రాక్షసశబ్దములేదని తలతును. రాక్షస శబ్దము పౌరాణికులదిగా కానవస్తున్నది. అదే విధముగా అసుర అనుదానిలో అకారము న ఞర్థములోతీసుకొని దాన్ని తొలగించి సుర శబ్దమును కల్పించినది ఉపనిషత్తులకాలము నుండియే. కావున అరక్షస్ నదీప్రాంతవాసులే రాక్షసులై యుండిరని నా యభిప్రాయము.

రామాయణమందు ప్రారంభమందే "నిషాద"శబ్దము కలదు. దానిపైననే శ్లోకమారంభమయ్యెనందురు. గుహుడు నిషాదరాజు. (అయో. 50-33) రామునికాలమందు నిషాదుల "భక్ష్యభోజ్యపేయ లేహ్యములు" (50-38) రాముని కంగీకారయోగ్యములుగా నుండెను. కాని అమరునికాలము వరకు నిషాదులు చండాలురైరి! నిషాదు లెవ్వరు? వారాటవికులై యుందురు. హిందూకుష్ పర్వతమునే నిషధ పర్వత

మనిరి. పూర్వము దానినే నిషధ లేక నిషాదపర్వత మనిరి. అర్రియన్ అను ప్రాచీన గ్రీకు చరిత్రకారుడు దానిని "నిస" (Nysa) అనెను. టాలమీదానినే పరోప-నిసస్ (Paropa-Nisos) అనెను. అచ్చటి ఆదిమనివాసులే నిషాదులు. గాంధారలోని గాంధర్వులవలెనె నిషధలోని నిషాదులును మంచి గాయకులై యుందురు. అందుచే "నిషాదర్షభగాంధార షడ్జ మధ్యమధైవతాః" అని యమరుడు వ్రాసెను.

ఈ విధముగా వారు భిన్న దేశములందుండగా మూడు జాతులును ఒకటే యని యెట్లు చెప్పవలెను? అసురులకును దేవతలకును ఎల్లప్పుడును యుద్ధము జరుగుచుండెను. సాధారణముగా దేవతలే ఓడిపోవుచుండిరి. బలము తక్కువకలవారికి ఉపాయములు మెండు. దేవతలలో అదే గుణమే కన బడుచున్నది. ఐతరేయ బ్రాహ్మణములో నిట్లు వ్రాసినారు.

"దేవాऽసురావా ఏషు లోకేషు సమయతంత .... తాం స్తతో సురా అజయన్ ... దేవాబ్రువణ సరాజతయా వైనోజయతి రాజానం, కరవామహై ఇతితథేతి"

(౧-౧౪)

అసురులకు రాజులుండిరి. దేవతలకు రాజులు లేకుండిరి. ఓడిపోయిన దేవతలు తామును రాజుల నేర్పాటు చేసికొనిరి. అసురులకును దేవతలకును కల ముఖ్యభేద మిందు కానవచ్చుచున్నది.

దండకారణ్యమందలి ఆదిమవాసులలో ఆర్యుల నెదిరించినవారినికూడా పౌరాణికులు రాక్షసులనిరి. యస్. యస్. ప్రధాన్ గారిట్లు వ్రాసినారు. దశరథుడు 'రాజర్షి'యగు దివో

దాసుని సహాయముగా దండకారణ్యములోని వైజయంత ప్రభువైన శంబరతిమిధ్వజునితోడి యుద్ధములో సహాయ పడెను. (ఈ విషయమును అయోధ్యకాండలో ౯ సర్గలో చూడనగును. అందు దివోదాసునికి మారుగా ఇంద్రుడు అని చెప్పినారు) ఋగ్వేదములో (౪, ౩౦, ౧౪) తిమిధ్వజ శంబరుని పూర్వీకుడు "కులితర" అని చెప్పబడినాడు. శంబరునికి ౧౦౦ నగరా లుండెననియు, వాటిని దివోదాసుడు ధ్వంసము చేసెననియు తెలిపినారు. శివపురాణములో (౬, ౧౩) మయునికి మాయావతి, మండోదరి యను ఇద్దరు కుమార్తెలుండిరని తెలిపినారు. మాయావతి శంబరునికి, మండోదరి రావణునికిని ఇయ్యబడెను. రావణుడు మాయావతిని ఎత్తుకొని పోజూచెను. శంబరుడు వాని నోడించి పట్టుకొనెను. మామయగు మయుని ప్రార్థనపై రావణుని క్షమించి వదలి పెట్టెను"[3] పై విషయములు మనకు కొన్ని సత్యములను బోధించుచున్నవి. రావణుడు దండకారణ్యప్రాంతమందుండెననియు, వాడు దశరథుని సమకాలికుడనియు, రావణుని షడ్డకుడగు శంబరునితో దశరథునికి వైర ముండెననియు, రావణుడు భార్యచెల్లెలినిగూడ బలాత్కరింపబోయిన దుష్ట కాముకుడనియు, రావణుని మర్దించిన శంబరుడే ప్రబలుడనియు, దీనివలన విశద మగుచున్నది. ఇంతవరకు అసుర, దనుజ, (దానవ) రాక్షసులను గురించి తెలిపినాను. ఇక కిన్నర, కర్బుర, కిర్మీరులను గురించి చర్చింతును. కిర్మీరులను

3 S. N Pradhan—Chronology of Ancient India.

కిమ్మెర్యులనియు మనవారు వ్రాసినారు. ఈ మూడు జాతులను ఒకే జాతివారని అనుకొనుచున్నాను.

కర్బుర అనిన ఒక చిత్రవర్ణ మనియు దానికి కిర్మీర అను పదము పర్యాయపదమనియు అమరసింహు డనినాడు.

"చిత్రకిర్మీరకల్మాష శబలైతాశ్చ కర్బురే" (ప్రీ. ధీవర్గ) కిమ్మెరులు అను నొకజాతి బహు ప్రాచీనకాలములో ఇప్పటి క్రిమియాలోను, నల్లసముద్ర (Black Sea) ప్రాంతములోను నివసించియుండిరి. బైబిల్‌లోని పూర్వ నిబంధనములో (Old Testament) వీరిని గోమర్ జాతి అని యనిరి. ప్రాచీనశాసనములలో వీరికే గిమ్మిరై (Gimirrai) అనియు; గ్రీకుల చరిత్రలలో కిమ్మెరులు (Kimmerians) అని యు పేర్కొనిరి.[4] "రష్యాకు దక్షిణభాగములో ఒక సంచారక జాతి (Nomads) నివసించుచుండెను. వారిని గ్రీకులు కిమ్మెరులు అని పేర్కొనిరి. అజోఫ్ (Azoff) సముద్రమును నల్ల సముద్రములో కలుపునట్టి జలసంధిని కిమ్మెరియన్ బాస్పరస్ (Cimmerian Bosphorus) అని పిలుచుచుండిరని హెరొడొటస్ చరిత్రకారుడు వ్రాసెను. పాతాళలోకమున కదే ద్వారమనియు, అచ్చట అంధకార ముండెననియు, గ్రీకులు విశ్వసించిరి. అందుచేత 'కిమ్మెరాంధకారము' అని వారిలో సామెత యయ్యెను."[5]

4. Z A. Ragogin—Assyria.

5. " "

(ఇదే అజాఫ్ సముద్రమువద్దనుండు ద్వీపకల్పము. ఇప్పుడు క్రిమియా అని యందురు. అనగా కిర్మీరుల దేశము అను నర్థమిందు స్ఫురించుచున్నది.)

రాక్షసులకు "పుణ్యాజనులు" అను నదొక పర్యాయ పదము. పుణ్యాజనులుకూడ వేరు జాతివారు నా అభిప్రాయములో ఫనికియా (Phoenicia) దేశజనులనే మన పూర్వీకులు పుణ్యాజనులు అని వ్యవహరించియుందురు. వారిని పూర్వము "పున" (Puna) అని పిలుచుచుండిరి.[6] ఫణికులు నరబలులిచ్చెడివారని యిదివరకే తెలిపియున్నాను. రాక్షసులు నర భక్షకులని మనవారనిరి. "గ్రీకుభాషలో ఫైనోస్ లేక ఫోనస్ (Phoenus) అనిన రక్తవర్ణము. వారు రక్తవర్ణు లగుటచే అట్లు పిలువబడినట్లున్నది."[7] ఫణికులు సూర్యుని "బాల" అను పేరుతో పూజించుచుండిరి. అదే ఋగ్వేదములో "వల" అనగా సూర్యుడు అను నర్థములో (మండలం రసూ. ౧౮ మరియు 33) ప్రయోగింపబడినదని ఒకరు వ్రాసిరి. కాని నాకీ "వల" పదము ఋగ్వేదములో కానరాలేదు.

యాతు, యాతుధానపదములు రాక్షసులకు పర్యాయ పదములుగా ఋగ్వేదములో ప్రయోగించినట్లు కనబడుచున్నది. కాని వారు వేరు జాతిగా కానవచ్చుచున్నారు. హీబ్రూభాషలోని బైబిల్‌లో యాఫ్త్ (Yaphth) అను వాడుండెనని తెలిపినారు. అతడే మన 'యాతు' అయియుండును.

---

6. Z. A. Ragogin —Assyria.

7. R. E. Anderson - The story of the extinct civilization of the East.

అతని సంతతివారే యాతుధానులై యుందురని ఊహించు చున్నాను.

"యః పౌరుషేణ క్రవిషా సం ద క్తేయో అశ్వ్యేన పశునా యాతుధానః"

(ఋగ్వేదము ౧౦-౮౭-౧౬) యాతుధానులు మనుష్యులను చంపుకొని తినువారనియు గుర్రముల మాంసమును తినువారనియు పై మంత్రము తెలుపుచున్నది. శకజాతి వారిలో మధ్యఏషియా తురాణులు, తార్తారులు, హీబ్రూల్సు, అరబ్బులు, చేరినవారే! పూర్వము శకజాతివారు మనుష్యులను తినెడివారు. "వారు గుర్రముమాంసముతిని గుర్రము పాలు త్రాగుచుండిరి" అని అసీరియా చరిత్రలో, రగోజిక్ గారు వ్రాసిరి. "సితియనులు (శకులు) మహాక్రూరులు, ఓడిన శత్రువులను చంపి వండి విందుచేసుకొనుచుండిరి." అని మావర్ (Mavor) (Universal History 1812 A. D) తన్న ప్రపంచ చరిత్రలో వ్రాసెను. కావున శకజాతిభేదమే యాతుధాన వర్గమనుట స్పష్టము.

రామాయణమందలి రాక్షసులు, దానవ, దైత్యాసుర, కిమ్మీర, యాతుధాన పుణ్యజన నైరృతాది వర్గాల వారుకారు. వారు కృష్ణా గోదావరీ ముఖద్వారముల మధ్య ప్రదేశమందుండినవారని నాయభిప్రాయము. జనస్థానము—సవరల "జైతాన్" అనుటయే సమంజసము. జనస్థానము నుండి ఖరదూషణులు విపులసైన్యముతో రాముని నెదుర్కొనుటచేత వారు పంచవటికి సమీపముననుండి యుండవలెను. వారు సముద్రముదాటివచ్చి దాడిచేసినట్లు రామాయణము

చెప్పలేదు. బౌద్ధమత గ్రంథమగు సుత్తనిపాతములో అశ్మక దేశము గోదావరీతీరమున నుండినట్లును "మహాజనపదము" అందుండినట్లును తెలిపినారు. బౌద్ధకాలమందును గోదావరీ ప్రాంతములందు జనస్థానముండినట్లు తెలుపుటచేత రామాయణ జనస్థానముజాడ స్పష్టమైనది. గోదావరి సముద్రము నకు సమీపమందుండిన ప్రాంతమంతయు జనస్థానమనియు, గోదావరి లంకలలోనే లంక యుండెననియు, నిర్ణయించుకొనిన యర్థాన్తమునకు సమీపములో నున్నామను కొనవలయును. ఇక "నాగులు" మిగిలినారు. వారు మనరామాయణములో లేరు. మహాభారతము వారి కథతోనే ప్రారంభమగు చున్నది. అనగా అప్పటికి వారు కనిపించుకొన్నారు. వారు పురాణములలోని తెగవారు.

ఇచ్చటనే మరొక విషయము వ్రాయవలసియున్నది. దైత్యులు దితి సుతులని అమరసింహుడు వర్ణించె నని చెప్పినాను. దైత్యశబ్దమునకు వ్యుత్పత్తి కల్పించినాడు అమరుడు. కాని "దైత్య" అనునదే మూలశబ్దము. దానిని విభజించి సమాసముగా చేయరాదు. "మీడియాను ఆర్మినియా నుండి వేరుపఱచునట్టి ఆరాస్ (Aras) నదిని పూర్వము దైత్యానది యని వ్యవహరించిరి. పార్సీల వేండీదాద్ అను పవిత్ర గ్రంథములో నిట్లున్నది. "అహురమజ్దాను అయిన నేను మంచి యుత్తమదేశమగు ఐర్యాణ వీజ (Airyana Vaeja) అను దేశమును మొట్టమొదట సృజించినాను. అది దైత్యానదీ సమీపమందుకలదు"[౧] ఆరాస్ నదిని అరక్షస్ (Araxes)

---

౧. రసాతల—పుట. ౪.

అనియు వ్యవహరించిరి. కావున ప్రాచీనమందు అరక్షస్ అనగా దైత్యనదీప్రాంత జనులను దైత్యులనిరి. వారే అరక్షస్సులు అనగా రక్షోవర్గమువారు. "దైత్యుల ముఖ్యనగరము హిరణ్యపురమని మన పురాణాలు చెప్పెను. అదే యిప్పటి హిర్కేనియా (Hyrcania). ఆ ప్రాంతమందే కాస్పియా దేశముకలదు. అచ్చటనే హిరణ్య-కశిపు, హిరణ్యాక్షులు రాజ్యముచేసిరి"

నాగులు మనచర్చకు సంబంధించకున్నను వారెవరో తెలిపి యీచర్చముగింతును. వారు హూణులని తెలిపినాను. నందాలాల్ దేగారిట్లు వ్రాసినారు. "సంస్కృతభాషలో సర్పములకిచ్చిన పర్యాయపదములలో హూణులలోని వివిధజాతుల పేరులు సరిపోలుచున్నవి. హింగ్నూ (Hiung nu) అనునది హూణులపేరు. దానినుండి నాగశబ్దము వచ్చినది. సర్ప అనునది సర్తస్ప జాతిపదము. ఉరగ ఊగురుస్ (Uigurs) జాతిపదము. పర్ని, నాగాయ అను రెండు శకజాతులు జక్సార్టిసు నదీప్రాంతాలలో నివసించుచుండిరి. ఆ రెండుజాతుల పదమే పన్నగ అయినది. అజిపదమే అహియైనది. ఫణి యనునది

---

← (ఇచ్చట ఐర్యాణవీజ అనునది నేనింతకుముందు రావ ప్రకరణములో చూపిన ఆర్యాణదేశము. అహురమజ్దాను ఋగ్వేదములో 'అసురమేధాః' అని పేర్కొనినారు. దైత్యులు పూర్వదేవతలు, ఆ నదివద్దనే దేవతల ఆర్యావర్తముండుట గమనింపదగినది.)

౯. రసాతల—పుట. ३०-३३.

ఫనికియాలోని ఫనికుల నుండి ఏర్పడెను.''[10] హూణులకు మొదటిపేరు తలె (Tele) రసా-తల, అ-తల క-తల మున్నగు పేరులు దీనినుండియే వచ్చెను.''[11] సుగ్రీవుడు పశ్చిమదిగ్భాగమందలి దేశములను తెలుపునప్పుడు హిమవత్పర్వత ప్రాంతాలలో అపరతాలపర్వత మున్నదనెను. ఈ పదము తాల (లేక హూణుల) జాతిని సూచించునేమో!

రాక్షసుల పర్యాయపదములను చెప్పుచు అమరసింహుడు వారిని శుక్రశిష్యులని ప్రత్యేకముగా తెలిపియున్నాడు. శుక్రుడు రాక్షసులకు కాదుకాని అసురులకు గురువు. అసురులే జరథుస్త్రమతములోని అహురులు. జరథుస్త్రుడే భృగువని మూడవ ప్రకరణములో తెలిపినాను. శుక్రుడు భార్గవుడు. కావున అసురగురు వయ్యెను.

రాక్షసులు మాయావులని పౌరాణికుల అభిప్రాయము. శుక్రుడు అసురులను బ్రదికించు క్రియల నెరిగియుండెనని వర్ణించినారు. "యాతు" అనునది రాక్షసుల పర్యాయపదము. యాతు అనిన కర్మనాశకుడు అనియు పీడ అనియు అర్థము చెప్పుదురు. సాయణాచార్యులు రాక్షసుడు అని అర్థముచేసిరి. పార్సీభాషలో ఒక పదమిప్పటికిని నిలిచియున్నది. అది "జాదూ" అను పదము. మాయ లేక గారడి అని యర్థములో వాడుదురు. యకారము జకారముగా తకారము దకారముగా మారును. యాతుపదమే జాదూ అయియుండును. ఈచర్చను

౧౦. రసాతల—పుట. ౩౧.

౧౧. రసాతల—పుట. ౯.

బట్టి అసురాది జాతులవారందరు ఒక్క రాక్షసులు మాత్రమే కారనియు, వారందరు వేర్వేరు జాతులవారనియు నా యభిప్రాయము.

రాక్షసుల నాగరికత

మరల నొకటికి వచ్చుచున్నాను. వింధ్యకు దక్షిణ భాగములో రావణపాలితులై యుండిన రాక్షసులు పనికి రానివారు కారు. ఆర్యులకు ప్రబలప్రతిస్పర్థులు. గొప్ప నాగరికత పొందినవారు. వారి నగరము, నగరములోని సౌధములు, సౌధములలోని సుందరాంగులు, సుందరాంగులు నేర్చిన నాట్య సంగీత చిత్రకళలు, వారి యానందములు, ఇవన్నియు వారి నాగరకతను బాగా సూచించుచున్నవి. రావణుడంతటి దుష్టకాముకుడయ్యును సీత నెత్తుకొనిపోయిన తర్వాత ఆమె యంగీకారమెందుకు కోరుచుండెను? అతనికి వేదవతియొక్క శాపముండెనని ఉత్తరకాండలో తెలిపినారు. అది ప్రమాణముకాదు. నిజమైన విషయమేమన రావణుడు సీతకు సమ్మతించుటకు ఒక సంవత్సరము గడువిచ్చెను. అటు తర్వాత ఆమె ఒప్పుకొననిచో ఆమెను బలాత్కరింతునని తెలిపెను. ఒక సంవత్సరమువరకు మాత్రమెందుకు గడువిచ్చెను? అది రాక్షసాచారము. ప్రాచీనకాలములో అష్టవిధ వివాహము లుండెను. అందు రాక్షసవివాహమొకటి నింద్యమైన దుండెను. రాక్షసవివాహ స్వరూపమును మను విట్లు నిరూపించెను.

"హత్వా ఛిత్వా చ భిత్వా చ క్రోశంతీం రుదతీం గృహాత్.
ప్రసహ్య కన్యాహరణం రాక్షసో విధి రుచ్యతే"

ఇట్టి రాక్షసవివాహాలలో ఒల్లని కన్యకలకు ఒక సంవత్సరకాలము గడువిచ్చుచుండినట్లు కానవచ్చుచున్నది. మహాభారతములో రాక్షసముగా కొనిపోబడిన స్త్రీలకు ఒక సంవత్సరపు గడువునిత్తురని తెలిపినారని సి. పి. వైద్యాగారు (Riddle of the Ramayanam) లో వ్రాసినారు. కాని ఆమాట యెచ్చటనున్నదో నిరూపించలేదు. రావణుడును తన కులాచారప్రకారము ఒక సంవత్సరము గడువు నిచ్చినట్లు తోచుచున్నది.

రాక్షసులలో మంచి నాగరికత యుండెనని తెలుపుచు ప్రాసంగికముగా రాక్షస వివాహచర్చ చేయబడెను. రాక్షసులు వైద్యవిద్యను బాగా నెరిగియుండిరి. కుంభకర్ణుడు చనిపోయిన తర్వాత రాక్షసవీరులు కత్తిదెబ్బలను గాయములను మాన్పునట్టి ఔషధములను పూసికొని యుద్ధమునకు వెళ్ళిరి.

"సర్వౌషధీభి ర్గంధైశ్చ సమాలభ్య మహాబలాః"

యుద్ధ. ౬౯-౧౮.

ఈ యౌషధము లెట్టివో వ్యాఖ్యాతలిట్లు తెలిపినారు. "కోష్ఠం, మాంసి, హరిద్రే ద్వే, మురా, శైలేయ, చందనే, త్వచా, చంపక, ముస్తాశ్చ, సర్వౌషధ్యో దశస్మృతాః" కోష్టు, జటామాంసి, పసుపుకొమ్ములు, పెన్నేరుగడ్డ, రాతిపువ్వు, చందనము, లవంగము, సంపెంగ, తుంగముస్త, ఈ ౧౦ యౌషధులు ఆయుధములవలన కలిగిన గాయములను మాన్పును.

రాక్షసులు మనుష్యులను తినువారుగా వర్ణింపబడి నారు. అది నిజమగునా? వ్రాసినదంతయు నిజమే యైనట్లైన ఆర్యులుమాత్రము తక్కువవారా? వారు నరమేధములను చేయుచుండిరని విశ్వసింపవచ్చునా? మహాభౌముడను రాజు ౧౦౦౦౦ నరమేధములను చేయుటచేత 'యః పురుషమేధే పురుషాణా మయుత మానయత్ తత్తస్య అయుతానాయు త్వం' అయుతానాయ అను బిరుదముపొందెనని మహాభారతము (ఆదిపర్వము) చెప్పుచున్నది. హర్షవర్ధనుని కాలములో నరమాంసవిక్రయము జరుగుచుండెనని హర్షచరిత్ర చెప్పుచున్నది. రామాయణములో రాక్షసులు నరమాంసము తినువారని వర్ణించినారు. కాని అట్టి జాడలు రాక్షసులలో కానరావు. ఏషియామైనరులోని కొన్ని అనార్యజాతులలో నరమాంసముతిను నాచారముండెను. దానిని తీసుకొనివచ్చి దక్షిణాపథములోని రాక్షసుల కంటగట్టినారు. శకజాతివారు (Scythians) తమ చేజిక్కిన శత్రువులను చంపి వారి మాంసమును తినుచుండిరి. తమ శత్రువుల పచ్చిరక్తమును త్రాగుచుండిరి. వారిచర్మములను ఒలిచి కత్రచేసి కప్పుకొనుచుండిరి. శత్రువుల పుర్రెలను సారాయిపాత్రలుగా నుపయోగించుచుండిరి.[12] మెస్సాజెటిస్ (Messagetes) అను శకజాతి ముసలివారిని చంపి వారిమాంసమును వండి తినుచుండిరి.[13]

రాక్షసుల రాజనీతినిగురించి యిదివరకే చర్చించియున్నాను. వారిలో మంత్రిసభలు, రాజ్యాంగచర్చలు,

---

12. Mavor Universal History (1812)
13. " " "

రాజ్యనిర్వహణపద్ధతి యుండెను. తర్వాతకాలములో రాక్షసులతో ఆర్యులు బాంధవ్యములు చేసిరి. భీమసేనుడు హిడింబను వివాహమాడెను. రాక్షసులు ఘోరరూపులైన, నరభక్షకులైన, శ్రీకృష్ణుని బావమరిదితో వారికి బాంధవ్యమెట్లు పొసగెను? కావున, రాక్షసులు మంచినాగరకత చెందినవారని తోచుచున్నది. ఆర్యులు రాక్షసులను లోబరచుకొనుటకై ప్రయత్నించిరి. రాక్షసులు ఆత్మస్వాతంత్ర్యమును కాపాడుటకై పోరాడిరి. ఆ సంఘర్షణలలో సీతాపహరణమువంటి ఘట్టములు సంభవించెను. మరి దానికి మూలకారణమేమి? శూర్పణఖకు ముక్కు చెవులు కోయుట. శూర్పణఖ కామచారిణి. అది తప్పా? ఏకాలములో ఏజాతిలో ఏయాచారము లుండెనో ఆదృష్టితోనే విచారింపవలెను. కాని దేశకాలాచారాంతరములచే విమర్శింపరాదు. మహాభారత కాలమునకు ముందుకాలములో ఆర్యస్త్రీలు అనావృతలుగాను, స్వేచ్ఛాచారిణులుగాను ఉండిరని పాండురాజు కుంతితో చెప్పలేదా? దీర్ఘతముడను బ్రాహ్మణుడు కాశీరాజు భార్యలను పొంది సంతానోత్పత్తి కావింపలేదా? శూర్పణఖ చేసిన యాతప్పునకు ముక్కుచెవులు కోసిరి. అది ఆర్యధర్మములో తప్పుకాక పోవచ్చును. రాక్షస వివాహాలలో శత్రువుల స్త్రీలను ఎత్తుకొనిపోవుట ఆర్యధర్మముల ప్రకారము తప్పు. ఈ విధముగా ఆర్యులకును అనార్యరాక్షసులకును నిరంతరము సంఘర్షణలు జరిగెను. మేలైన ఆయుధాలు, ధనుర్విద్య ఆర్యులలో నుండెను. వారే జయించిరి. దక్షిణాపథము ఆర్యులకు దాసోహం అని ఆక్రోశించెను.

# ౧౧

## పరిశిష్టము

రామాయణములో నేను చెప్పదలచిన విషయచర్చ ముగిసినది. అప్పటప్పట వ్రాయవలసియుండిన కొన్ని విషయములు మరచిపోయినందున వాటిని కూర్చి పరిశిష్టమను పేరుతో ఈ ప్రకరణములో వేసి పరిసమాప్తి చేయుచున్నాను.

మహాభారతములో ఈ క్రిందిశ్లోకము లున్నవని ఒక విమర్శకుడు వ్రాసినాడు.

> "శ్లోకశ్చాయం పురా గీతో భార్గవేణ మహాత్మనా
> ఆఖ్యాతే రామచరితే నృపతిం ప్రతి భారత !
> రాజానం ప్రథమం విందేత్ తతో భార్యాం తతో ధనం
> రాజన్య సతి లోకేస్మిన్ కుతో భార్యా కుతో ధనం."

—మ. భా. ౨, ౬౨, ౧౧.

ఈ రెండవశ్లోకము రామాయణములో ఎక్కడ నున్నదో ఏమో. పై శ్లోకములో భార్గవుడనగా వాల్మీకి.

లంక త్రికూటపర్వతముపై కట్టబడియుండెను. రఘువంశములో త్రికూటము అపరాంతములో నున్నట్లు వర్ణింపబడినది.

నాసికవద్ద అంజమేరి అను స్థలమున్నదనియు అచ్చట కొన్ని ప్రాచీన శాసనములు లభించినవనియు అందు పూర్వ త్రికూటవిషయము పేర్కొనబడిన దనియు అందుచేత త్రికూటము నాసిక్ ప్రాంతములోని దనియు ఒక చరిత్రకారుడు

తెలిపినాడు. అట్లైతే రామాయణములో తెలిపిన దక్షిణ మందుండు లంక అబద్ధమగునా ?

రాముని కాలములో చాతుర్మాస్యమును పాటించుచుండిరి. (కి. ౨౭-౪౮) ఆషాఢ శ్రావణమాసాలలో విష్ణువు నిద్రించుచుండెను. (కి. ౨౮-౨౯)

"ఉదీచ్యాశ్చ ప్రతీచ్యాశ్చ దాక్షిణాత్యాశ్చ కేవలాః"

—అయో. ౮౨-౮.

ఇచ్చట కేవలాః అనిన సింహాసనములేనిరాజులు అని అర్థము చెప్పెదురు. అది నిరర్థక పదమనియు, దక్షిణ దేశములో "కేరలులు" ఉండిరికాన కేవలాః అనుటకు మారుగా కేరలాః అని సవరించవలెననియు వాష్‌బరన్ హాప్కిన్సుగారు (Great epic of India లో) వ్రాసినారు. వీరి పాఠమే అర్థవంతముగా ఉన్నది. పైగా గుజరాతులో ముద్రించిన రామాయణములో కేరళాః అను పాఠమే యున్నదని తెలిపినారు. తెలుగుదేశపు పాఠములలో ఈ సవరణను చేసుకొనవలెను.

బాలకాండ సర్గ ౪౫ లో అమృతోద్భవ కథను చెప్పినారు. అదంతయు కల్పితమే. ధన్వంతరి సముద్రమథనములో పుట్టెనట! విష్ణుపురాణములో కాశిరాజగు కాశునికి దీర్ఘతముడు, అతనికి ధన్వంతరి పుట్టెననియు, అతనికి కేతుమానుడు, అతనికి భీమరథుడు, అతనికి దివోదాసుడు పుట్టెనని వ్రాయబడినది. ధన్వంతరి శకకర్తయైన విక్రమాదిత్యుని యాస్థానములోని నవరత్నములలో నొకడని "ధన్వంతరి

క్షపణకామరసింహశంకువేతాళభట్ట ఘటకర్పరకాళిదాసాః"
అను శ్లోకమువల్ల తెలియవచ్చుచున్నది. సముద్రమథనములో సురాపానాధిష్ఠాన దేవతయగు వారుణి పుట్టినదట. సురను సేవించినవారు సురలైరనియు, సురను గ్రోలనివారు అసురులైరనియు వ్రాసినారు. సురశబ్దార్థముపై యీకథ పుట్టినది. ఋగ్వేదములో "సుర" శబ్దము లేదనియు, అసురశబ్దమే యున్నదనియు, సురకు మారుగా దేవశబ్దమే యున్నదనియు, అసురలో నఞ్ కలదని భావించి దానిని తొలగించి తర్వాతివారు సురశబ్దమును సృష్టించిరనియు తెలుసుకొననిచో ఈకథయంతయు కల్పితము, ప్రక్షిప్తము అని ద్యోతకమగును.

రామాయణములో (అయో. ౬౮-౧౮) విష్ణుపాద అనుస్థలమును తెలిపియున్నారు. ఇది బాహ్లీకవద్ది పర్వతము కావచ్చును.

మాల్యవంత పర్వతము బల్లారివద్దనుండు కొప్పల్, ముద్గల్, రాయచూరు ప్రాంతాలలో నున్నదని కొందరు. పంచాప్సర సరస్సు బీరారునకు తూర్పున నున్నదని ఒకరు అనినారు.

ప్రాచ్యదేశము మగధప్రాంతములోని దనియు, దానినే ఋగ్వేదములో కీకట అని పేర్కొనిరనియు భాండార్కరు గారు (Ancient Indian culture) లో వ్రాసినారు.

వారే వానరులనుగూర్చి యిట్లు వ్రాసినారు. "ధార్వాడును పూర్వము పాలించిన రాజులు తాము కిష్కింధను

పాలించినామనియు, తాము వాలివంశమువారనియు చెప్పు కొనిరి. వారిది కపిధ్వజము. వానరులకును పూర్వము కపిధ్వజ ముండినందున వారిని వానరు లనిరేమో?"

ఆర్యులు తమ శత్రువులను ఋగ్వేదములో నానావిధ ములుగా వర్ణించిరి. వారు కృష్ణత్వక్కులనియు, ఘోర దృక్కులనియు, విసిప్రులు (ముక్కులేని వారనియు) మృధ్ర వచు లనియు, అనాసులనియు, శిశ్న దేవులనియు (ఋ. ౮, ౨౧, ౫) క్రవ్యాదులనియు (ఋ. ౧౦, ౮౭, ౨) యాతుధాను లనియు (౧౦, ౮౭, ౫, మరియు ౧, ౩౫, ౧౦) అయజ్వను లనియు, దూషింపబడిరని శరశ్చంద్రరాయి 'ముండాలు' అను గ్రంథములో తెలిపినారు.

అసిరియాపైన ప్రధాన పరిశోధకుడని (Famous assyriologist) పేరు పొందిన సెయస్ (Sayce) గారు హిబ్బర్టు ఉపన్యాసాలలో (1887) ఇట్లన్నారు. "హిందూ స్థానమునకు బాబిలోనియాకును క్రీ. పూ. 3000 ఏండ్లనాడు వ్యాపారము జరుగుచుండెను. ఉర్‌బగస్ రాజు బాబిలోని యాను రాజ్యముచేసిన కాలములో ఈ వ్యాపారము సాగెను. ఊర్ నగర ఖననములలో హిందూదేశపు టేకుకట్టెలు దొరికి నవి. బాబిలోనియనులు బట్టలను "సింధు" అనిరి. ఈపదము జండ్ మాట్లాడు వారిద్వారా వచ్చియుండిన హిందు అయి యుండెడిది" ఈ వాక్యాలను బట్టి ఆర్యులవ్యాప్తి ఎంతటి ప్రాచీనముదో తెలియవచ్చును.

ఇంగ్లీషులో గూస్ (Goose) అనునది ఆంగ్లో సాక్షను భాషలో గాస్ (Gois) అని యుండెను. ప్రాచీన హంగరీ భాషలో దానినే కన్స (Kans) అనిరి. ఇప్పటి జర్మన్ భాషలో గన్స్ (Gans) అందురు. ఆంగ్లోసాక్షన్ భాషలో ఫ, స, థ (f, s, th) ధ్వనులకు ముందుండు "న" కారధ్వని (n) లోపించును. గాథిక్ లో మంత్సు అనునదే మూత్ అయి మౌత్ (నోరు) అయినది. లాటిన్‌లోని డెన్స్ (Dens) టోత్ అయి, తర్వాత టూత్ అయినది.

లాటిన్‌లో ఆన్సర్, సంస్కృతములోని హంస, రష్యనులోని గూస్, బొహీమియన్‌లో హస్, ఇంగ్లీషులో గూస్ అయినది.[1] ఇంగ్లీషులో గూస్ అనిన బాతు. కావున మనపూర్వుల హంసలన్నియు బాతులే!

వసిష్ఠుడు విశ్వామిత్రునికి విందుచేసినప్పుడు (బాల కాండ) చెరుకురసమును కూడా ఇచ్చెను. చెరుకులను హిందూ స్థానమునుండి పూర్వము ఇతరదేశాల కెగుమతి చేయుచుండి రని ప్రాచీనగ్రీకులు వ్రాసినారు.[2] రామాయణములో (అరణ్య కాండ) ఫలములనుండి చెరుకులనుండి ఒకవిధమగు మద్యమును చేయుచుండినట్లు తెలిపినారు.[3]

రామాయణ కవితనుగూర్చి హీరెన్ ఇట్లు వ్రాసెను. 'ఇతరపురాణా లన్నింటికంటే రామాయణకవిత అతి సుంద

---

1. Max Muller & Science of Language, Vol. II, P. 244.
2. Heeren Historical researches Vol. III
3. „ „ III P. 259

రము. ఋశ్యశృంగునికథ హిందూకవితలో అతిమనోహర మైనది."[4]

బ్రహ్మాండ, వాయు, మత్స్య పురాణాలలో ప్రచేత సుని కుమారులు మ్లేచ్ఛ సంతతికి మూలపురుషులైరని తెలిపినారు.

"ప్రచేతసః పుత్రశతం రాజాన స్సర్వ ఏవ తే
మ్లేచ్ఛ రాష్ట్రాధిపా స్సర్వే హ్యుదీచీం దిశ మాశ్రితాః"[5]

"హిందువుల నాలుగుయుగము లిట్లుండెను. మహా భారతయుద్ధముతో ద్వాపరయుగము ముగిసెను. హైహాయు లను సగరుడు ఓడించుటతో మూడవయుగము ముగిసెను. రావణుని రాముడు సంహరించుటతో రెండవయుగము ముగి సెను. పరశురామునితో మొదటియుగము ముగిసెను."[6]

"అహల్యయొక్క భర్తపేరు శరద్వంత గౌతముడు. అహల్య కుమారుడు శతానందుడు. అతడు జనకుని పురో హితుడు. అహల్య పొందినది ఇంద్రునికాదు. ఒక పరపురు షుని పొందెను. ఇట్టి తావులలో పౌరాణికు లింద్రుని తెచ్చి పెట్టుదురు. రాముడు అహల్యయొక్క ఆతిథ్యమును స్వీక రించితే ఆమె తప్పు మాసిపోవునని చెప్పిరి. దీనివలన ఆ కాల ములో పాతివ్రత్యమహిమ ఇంకను వికాసము పొందలేదని ఊహింపవచ్చును."[7]

---

4. Heeren Historical researches III P. 169
5. Pergiter-Ancient Ind. Hist. Tradition
6. Pergiter " "
7. S. N. ప్రధాన్, Chron. of Anc. India

"రాముని సమకాలికుడు భీమసాత్వతుడు. భీమసాత్వతునికి ౧౨ తరములతర్వాత శ్రీకృష్ణుడు పుట్టెను. విదురథుడు దశరథుని సమకాలికుడు. విదురథుని వంశములో ౧౬ వ తరములో అర్జునుడు పుట్టెను. రోమపాదుడు అంగరాజు. దశరథుని సమకాలికుడు. అతనికి ౧౨వ తరములోని అంగరాజుకు కర్ణుడు దత్తుడయ్యెను. కావున మహాభారత కాలముకంటే ౧౫ తరముల ముందు కాలములో దశరథుడుండెను. వాజినేయ భరద్వాజుడు రామునికాలపు ఋషి. అతడే ఋగ్వేదములో గోహత్య నిషేధించినవాడు (ఋ ౬,౨౮,౪) వల్మీక భార్గవుని కుమారుడు ఋక్షు అనువాడు. అతడే వాల్మీకి."[8]

"మహాభారతకాలము ౧౧౫౦ క్రీ. పూర్వము. దివోదాసుడు, దశరథుడు అంతకంటే ౧౩ తరాలకు ముందుండిన వారు. తరమునకు ౨౮ ఏండ్లచొప్పున గుణించినచో రామాయణకాలము క్రీ. పూ. ౧౫౧౪ అని తేలును. రావణుని చంపినప్పుడు రాముని వయస్సు ౪౨ ఏండ్లు కావున లంకాయుద్ధము క్రీ. పూ. ౧౪౫౦ లో జరిగెను. నలచక్రవర్తి క్రీ. పూ. ౧౫౭౫ లో నుండెను."[9]

ముగింపు

[illegible] "వాల్మీకి విరచితమైన శ్రీమద్రామాయణములో నాకు తోచిన విషయములు తెలుపుకొనినాను. ఇది చారిత్రిక

---

8. S. N. [illegible] Chron. of Anc. India
9. " " "

విమర్శ. ఇట్టి విమర్శ పూర్వాచారాభిమానులకు సరిపడదని నే నెరుగుదును. కొందరికి ఆగ్రహముకూడా కలిగియుండును. కాని ఆగ్రహానుగ్రహములకు చారిత్రికవిమర్శలలో తావు లేదు. ఎవరి కేది సత్యమని తోచునో వారు దానిని గట్టిగా ప్రకటించుటలో తప్పుండదు. రామాయణమును గురించి వేదాంతపరముగాను వైష్ణవ సిద్ధాంతపరముగాను పలువురు సంస్కృతములోను దేశభాషలలోను విపులముగా చర్చించి నారు. కాని చారిత్రికముగా సమగ్రముగా తెనుగులో చర్చించినటుల నాకు కానరాలేదు. నేను రామాయణమును చదివినప్పుడు నాకు స్ఫురించినవాటిని గుర్తుపెట్టుకొని యుం టిని. వాటినే యిందు వ్రాసితిని.

నేనుచేసిన చర్చలో,ఇచ్చిన అభిప్రాయములలో విశేష భాగము తప్పులుండవచ్చును. తప్పులు చేయనివారెవరు? వాటిని పండితులు, విమర్శకులు, పరిశోధకులు, సయుక్తిక ముగా ఖండింపవచ్చును. తప్పులుండిన సవరించుకొందును. క్రొత్తసంగతులు తెలిపిన నేర్చుకొందును. శ్రీరామద్రామా యణముపై నాకు అద్వితీయమైన ప్రేమ, భక్తి, కలదని అందలి కవితను అత్యుత్తమమైనదిగా భావించువాడననియు మరొకమారు మనవిచేసుకొనుచు ఈ చర్చను పరిసమాప్తి చేయుచున్నాను.